www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 78
బుధవారం | 3-7-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: ద్వాదశి ఉ. 7.11 తదుపరి త్రయోదశి; నక్షత్రం: రోహిణి తె. 4.07 తదుపరి మృగశిర; వర్జ్యం: రా. 8.18-9.51; దుర్ముహూర్తం: ఉ. 11.53-12.45; అమృతఘడియలు: రా. 12.590-2.33; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.48; సూర్యాస్తమయం: 6.49
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





హత్రాస్ తొక్కిసలాట తర్వాత బస్సులో మృతదేహాలు

దైవ భక్తితో నాలుగు మంచి మాటలు విందామని ప్రవచనానికి వెళ్తే.. అక్కడ జరిగిన తొక్కిసలాటలో 116 మంది ప్రాణాలు పోయాయి! 150 మందికి పైగా గాయపడ్డారు. 5000 మంది మాత్రమే పట్టే చోట.. పదిహేను వేల మందితో కార్యక్రమం నిర్వహించడంతో జరిగిన ఘోరమిది. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లా రతిభాన్‌పూర్ గ్రామంలో భోలే బాబా అనే ఆధ్యాత్మికవేత్త మంగళవారం నిర్వహించిన కార్యక్రమం విషాదాంతమైంది. చనిపోయినవారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్నపిల్లలేనని.. మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.

సత్సంగ్‌లో తొక్కిసలాట.. 116 మంది దుర్మరణం

ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో ఘోరం.. 150 మందికిపైగా గాయాలపాలు

చనిపోయినవారిలో మహిళలు, పిల్లలే ఎక్కువ.. మృతులు పెరిగే ముప్పు

స్థానికంగా పేరొందిన ఆధ్యాత్మిక వేత్త 'భోలేబాబా' సత్సంగ్‌కు వేలాది జనం

కార్యక్రమం ముగిశాక బయటకి వెళ్లే క్రమంలో తోపులాట.. పెనుప్రమాదం

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, అమిత్‌షా, ఖర్గే, రాహుల్ సంతాపం

హత్రాస్, జూలై 2: యూపీలోని కిషన్‌గంజ్ జిల్లాకు చెందిన భోలే బాబా.. గతంలో పోలీసు శాఖ నిఘా విభాగంలో 18 ఏళ్ల పాటు పనిచేసి, ఆ తర్వాత ఉద్యోగం మానేసి ఆధ్యాత్మిక గురువుగా మారారు. స్థానికులు ఆయనను 'నారాయణ సాకార్ హరి'.. 'సాకార్ విశ్వ హరి బాబా' అనే పేర్లతో పిలుచుకుంటారు. ప్రతి మంగళ వారం ఆయన నిర్వహించే సత్సంగానికి ప్రజలు వేలాదిగా

మిగతా 2వ పేజీలో...





ఇసుక అక్రమ, నూతన విధానంపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

జేపీ వెంచర్స్ నోట్‌ఫైల్ గల్లంతు?

'ఆంధ్రజ్యోతి' చెప్పినట్టే ఇసుక కీలక డేటా మాయం

జేపీకి బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలంటూ బ్యాంకులకు నాడు వెంకటరెడ్డి లేఖ.. ఎన్‌వోసీ, నోడ్యూస్ సర్టిఫికెట్

దానిపై నిర్ణయాల సమాచారం కనిపించడం లేదు

తాజాగా గుర్తించిన గనుల అధికారులు

ఫలితాలకు ముందే గనుల శాఖలో ఫైళ్లు గాయబ్

బకాయిల వసూళ్ల పేరిట జేపీ వెంచర్స్‌కు మళ్లీ నోటీసులు ఇవ్వాలని నిర్ణయం

ఆపై వెంకటరెడ్డిపై చర్యలకు అవకాశం!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖలో చీకటి దందాలు సాగుతున్నాయని, అతి ముఖ్యమైన నోట్‌ఫైల్స్‌ను కనబడకుండా చేశారని 'ఆంధ్రజ్యోతి' చెప్పిందే అక్షరసత్యమైంది. ఇసుక టెండర్లకు సంబంధించి జేపీ వెంచర్స్‌తో జరిపిన లావాదేవీలు, బ్యాంకు గ్యారంటీ చెల్లింపు, బకాయిలు లేవని ధ్రువీకరణ ఇవ్వడానికి సంబంధించిన నోట్‌ఫైల్స్ కనిపించడం లేదు. డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారి వరకు పంపిన ఫైల్సే ఉన్నాయి. ఏపీఎండీసీ ఎండీ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన ఉత్తర్వులకు సంబంధించిన నోట్‌ఫైల్స్ కనిపించడం లేదని తాజాగా అధికారులు నిర్ధారించారు. "గనుల ఫైళ్ల గల్లంతు" శీర్షికన గత నెల 21న

మిగతా 12వ పేజీలో...

పేదలకు ఇసుక ఉచితం!

విధివిధానాల తయారీకి సీఎం ఆదేశం.. జగన్ పాలసీతో ప్రజలకు తీవ్రనష్టం

12


ఇప్పటికీ వైసీపీ నేతల చేతుల్లోనే డంప్‌లు.. వాటిని ఇంకా స్వాధీనం చేసుకోలేదా?

గనుల శాఖ డైరెక్టర్‌ను ఆరా తీసిన చంద్రబాబు.. ఎవరైనా ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకోవాల్సిందే: సీఎం

అదానీ కహానీ!

నాడు విపక్షంలో ఉండగా అక్రమాలపై తీవ్ర ఆరోపణలు

నేడు అధికారంలోకి.. ఇప్పుడేం చేస్తారో..



అదానీ నుంచి ఏపీ రక్షణకు పోరాడిన టీడీపీ

ఐదేళ్లూ ప్రత్యక్ష ఉద్యమాలు, న్యాయ పోరాటం

మరిప్పుడు 'గత తప్పులు' దిద్దుతారా?

నాడు అదానీ భోజ్యంలా నడిచిన జగన్ రాజ్యం

అదానీ కన్నుపడిన ప్రతి వనరూ రాసిచ్చేశారు

తిరిగి అదానీ నుంచే అధిక ధరకు కొనే దుస్థితి

మధ్యప్రదేశ్ బొగ్గు బ్లాక్‌లో మునిగిన ఏపీ జెన్కో

ఈ బ్లాక్‌లో అదానీకి రూ.2300కే మెట్రిక్ టన్ను

తిరిగి దాన్నే రూ.15 వేలకు కొంటున్న జెన్కో

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల పేరుతో భూపందేరం

నాటి ఒప్పందాలు సమీక్షించకుంటే ఆర్థిక దివాలే

చంద్రబాబు తీసుకునే చర్యలపైనే సర్వత్రా ఆసక్తి

నేల, నీరు, నింగి.. అదానీకే జీ హుజూరనేలా వైసీపీ ప్రభుత్వం నడిచిందని ప్రతిపక్షంలో ఉండగా టీడీపీ నేతలు ఆరోపించారు. అస్మదీయులకు, అదానీకే అన్ని కాంట్రాక్టులు కట్టబెడుతున్నారన్న ఆవేదనతో గొంతు కలిపారు. రాష్ట్ర సంపదను అదానీ బారి నుంచి కాపాడుకోవాలని ఆందోళనల బాట పట్టారు. విలువైన ఖనిజాలను, పర్యావరణాన్ని పరిరక్షించాలనిసుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయ పోరాటాలు చేశారు. జగన్ అండ చూసుకుని విద్యుత్ సంస్థలను అదానీ గుల్లచేసేశారనీ, గంగవరం పోర్టును గుప్పిట్లో పెట్టుకుని విశాఖ స్టీల్ ప్లాంటును ముంచేయాలని చూస్తున్నారని ఐదేళ్లూ గట్టిగా నినదించారు. మరి ఇప్పుడు టీడీపీ ప్రభుత్వమే రాష్ట్రంలో అధికారంలో ఉంది. మరి అదానీ అక్రమాల కథకు తెర దించుతారా?

(అమరావతి, విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

అడ్డగోలుగా అదానీకి రూ.వేల కోట్ల విలువైన కాంట్రాక్టులను నాడు జగన్ అప్పగించారు. నిబంధనలు తుంగలో తొక్కి వందల ఎకరాల భూములు రాసి ఇచ్చేశారు. ఇంతా చేస్తే.. అదానీ వల్ల రాష్ట్రానికి

మిగతా 12వ పేజీలో...

రైతులకు అన్యాయం

"అనంతపురం జిల్లా రాయదుర్గం మండలంలో అదానీ గ్రూపు ఏర్పాటుచేస్తున్న సోలార్ పవర్ ప్రాజెక్టు కోసం 15 వేల ఎకరాలను భూసమీకరణ పద్ధతిలో ప్రభుత్వం సేకరిస్తోంది. అయితే, ఆ భూములకు సంబంధించి రైతులకు లీజు చెల్లింపుపై మాత్రం జగన్ సర్కారు ఎటువంటి హామీ ఇవ్వడం లేదు"

- అక్టోబరు 28, 2022న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాల్వ శ్రీనివాసులు, అనంతపురం

గంగవరం పోర్టులో క్విడ్‌ప్రోకో

"విశాఖ కాపులుప్పాడలో 89ఎకరాలు, నక్కపల్లిలో 120 ఎకరాలు, చోడవరంలో 100 ఎకరాలు అదానీ డేటా కంపెనీకి విక్రయించడంలో క్విడ్‌ప్రోకో దాగిఉంది. అదానీ గ్రూపు మొదట ఆ భూమి విలువలో 10 శాతం చెల్లించేలా, ఆ తర్వాత మూడు నుంచి ఏడేళ్లలోపు మిగతా మొత్తం ఇచ్చేవిధంగా ఒప్పందం చేసుకోవడం ఏమిటి? జగన్, అదానీ కుమ్మక్కుకు ఇదే నిదర్శనం"

- నవంబరు 27, 2022న బండారు సత్యనారాయణ, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ

ఏపీఎండీసీలో 400 మంది పాగా!

జగన్ అండ్‌కో సిఫారసులతో కాంట్రాక్టు నియామకాలు

11

కీలక స్థానాల్లో పెద్దిరెడ్డి మనుషులు

కొమ్ముకాసేవారికి ఏరికోరి పోస్టింగ్

ఇతర శాఖల నుంచీ తెచ్చి కీలక బాధ్యతలు

జగన్ పత్రిక ఉద్యోగికీ పునరావాసం

ప్రశ్నించిన రెగ్యులర్ ఉద్యోగులు బయటికి

ఆఫీసుకు రావద్దు.. ఇంట్లోనే ఉండాలని హుకుం



10

ఏసీఏ పెత్తందారులపై తిరుగుబాటు

విజయవాడలో సమావేశమైన మెజారిటీ సభ్యులు

మాజీ అధ్యక్షుడు గంగరాజుతో పాటు పలువురు హాజరు

ఆంధ్ర క్రికెట్ సంఘాన్ని గాడిన పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

సెలెక్షన్స్, నిధులు, ఏపీఎల్‌తో సహా అన్నింట్లో అవకతవకలే

జూదం.. కేరాఫ్ ఆన్‌లైన్

ప్రాణాలతో ఆట!



ఆయువు తీస్తున్న గేమింగ్, బెట్టింగ్, లోన్ యాప్‌లు

అన్ని వర్గాల వారినీ జూదంలోకి లాగుతున్న బుకీలు

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో విస్తృత ప్రచారం

బోనస్‌లు, రిఫరల్ ప్రయోజనాల ఆశ చూపి వల

3

దేశంలో, రాష్ట్రంలో నిషేధం ఉన్నా కార్యకలాపాలు

ఈజీ మనీ ఆశతో బెట్టింగ్, గేమింగ్ చేస్తున్న యువత

భారీగా డబ్బు నష్టపోయి.. లోన్ యాప్‌ల్లోనూ అప్పులు

అవి తీర్చే మార్గం లేక ఒత్తిడికి గురై బలవన్మరణాలు

ఉక్కుపాదం మోపకుంటే సమాజానికి తీవ్ర నష్టం

ఆ యువతుల ఆచూకీ కనిపెడతాం

అదృశ్యమైన వారిని గుర్తించేందుకు ప్రత్యేక సెల్: పవన్

30 వేల మంది ఆడపడుచులు మాయమయ్యారని మొత్తుకున్నాం

12

గత ప్రభుత్వం పట్టించుకోలేదు.. 48 గంటల్లో ఓ యువతి కేసు ఛేదించాం





అబద్ధాలు.. పిల్లచేష్టలు!

రాహుల్‌గాంధీపై ప్రధాని ధ్వజం

రిజర్వేషన్లు, అగ్నిపథ్, ఎమ్మెస్పీ సహా అనేక విషయాలపై అసత్య ప్రచారం

హిందువులపై దుష్ప్రచారం ఒక కుట్ర

'నీట్' బాధ్యుల్ని క్షమించేది లేదు: మోదీ

3 రెట్లు వేగంగా పనిచేసేందుకే ప్రజలు మూడోసారి గెలిపించారని వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ దేశంలో అరాచకత్వాన్ని వ్యాపింపజేయాలని చూస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. రిజర్వేషన్లు, రక్షణ నియామకాలు, ఎమ్మెస్పీ సహా అనేక విషయాలపై అసత్యాలు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు మోదీ మంగళవారం సమాధానమిచ్చారు. కాంగ్రెస్ పార్టీపైనా, రాహుల్ గాంధీపైనా విరుచుకుపడ్డారు. అబద్ధాలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దేశం కోరుకుంటోందని స్పీకర్‌కు తెలిపారు. ప్రతిపక్ష నేతలు పిల్లచేష్టలకు పాల్పడుతున్నారంటూ పరోక్షంగా రాహుల్‌పై విమర్శలు

మిగతా 2వ పేజీలో...

రాహుల్‌లా ప్రవర్తించవద్దు

మీడియాకు దూరంగా ఉండండి

2

ఢిల్లీలో స్టింగ్ ఆపరేషన్లు జరుగుతాయ్

ఎన్డీయే ఎంపీలకు ప్రధాని హెచ్చరిక

సరే.. మాట్లాడుకుందాం!

చంద్రబాబు ప్రతిపాదనకు రేవంత్ అంగీకారం

సమావేశానికి రావాలంటూ చంద్రబాబుకు లేఖ

తెలంగాణ, ఏపీ సీఎంల మధ్య 6న సమావేశం

ప్రజా భవన్ వేదికగా మధ్యాహ్నం నుంచి భేటీ

పదేళ్లుగా అపరిష్కృతంగా విభజన సమస్యలు

సీఎంల భేటీతో పరిష్కారమవుతాయన్న ఆశలు



నిఘా అధిపతిగా లడ్డా

కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్రానికి.. ప్రస్తుత చీఫ్ కుమార్ విశ్వజిత్ బదిలీ

సీఎస్ నీరబ్ ఉత్తర్వులు

3

13 జిల్లాలకు కొత్త కలెక్టర్లు

విశాఖపట్నం కలెక్టర్‌గా హరేంధిర ప్రసాద్

కడపకు శివశంకర్.. తిరుపతికి వెంకటేశ్వర్

నెల్లూరు జైలులో రేపు పిన్నెల్లికి జగన్ ఓదార్పు

బెంగళూరు నుంచి తాడేపల్లికి మాజీ సీఎం దంపతులు

11

నీట్‌పై చర్చిద్దాం

మోదీకి రాహుల్ ప్రతిపాదన

2

సభను ఒకరోజు ముందే వాయిదా వేసిన సర్కారు

నీట్‌పై చర్చిద్దామన్న రాహుల్.. లోక్‌సభ నిరవధిక వాయిదా

ప్రధానికి మంగళవారం ఉదయం రాహుల్ లేఖ

షెడ్యూల్‌కు ఒకరోజు ముందే సభ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ, జూలై 2: పార్లమెంటు సమావేశాల చివరి రోజైన బుధవారం నీట్‌పై లోక్‌సభలో చర్చకు అనుమతించాలని ప్రధాని మోదీకి ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రధానికి లేఖ రాశారు. జూన్ 28న అలాగే సోమవారం ఈ అంశంపై చర్చిద్దామని ప్రతిపక్షం కోరగా అనుమతించలేదని అందులో పేర్కొన్నారు. నీట్ సమస్యకు ఒక నిర్మాణాత్మక పరిష్కారం కనుగొనడమే తమ ఉద్దేశమని లేఖలో పేర్కొన్నారు. అయితే, స్పీకర్ ఓంబిర్లా మంగళవారమే(షెడ్యూల్ కంటే ఒకరోజు ముందే) నిరవధిక వాయిదా వేశారు. దీంతో, నీట్‌పై ఎలాంటి చర్చ లేకుండానే లోక్‌సభ నిరవధికంగా వాయిదాపడింది. కాగా, జాతీయ పరీక్ష ఏజెన్సీ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) డైరెక్టర్‌ని మార్చడం, ఇతర పరీక్షలను వాయిదా వేయడం వల్ల ఉపయోగం లేదని, అవి మన పరీక్షల విధానంలో ఉన్న తీవ్రమైన లోపాలను కప్పిపుచ్చే చర్యలు మాత్రమేనని రాహుల్ మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఉన్నత విద్యా వ్యవస్థలో నెలకొన్న తీవ్రమైన లోపాలు నీట్ ద్వారా బయటపడ్డాయన్నారు. లక్షలాది కుటుంబాలు తమ పిల్లల కోసం ఎన్నో త్యాగాలు చేశాయని, పేపర్ లీక్‌లు వారి కలలను కల్లలు చేశాయన్నారు. నీట్‌పై వారిలో నమ్మకం కలిగించడానికి పార్లమెంటులో చర్చే తొలి మెట్టు అన్నారు. ఈ అంశం ప్రాధాన్యత దృష్ట్యా బుధవారమే లోక్‌సభలో చర్చ చేపట్టాలన్నారు. అయితే మంగళవారమే సభ నిరవధిక వాయిదా పడింది.



రాహుల్ 'హిందూ' వ్యాఖ్యల తొలగింపు

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో రాహుల్ చేసిన ప్రసంగం నుంచి కొన్ని భాగాలను తొలగించారు. స్పీకర్ ఓం బిర్లా ఆదేశాల మేరకు రాహుల్ ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించినట్లు మంగళవారం అధికారులు తెలిపారు. హిందువులు, ప్రధాని మోదీ, బీజేపీ, ఆరెస్సెస్‌లపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు సహా మరికొన్నింటిని తొలగించినట్లు వెల్లడించారు. దీనిపై రాహుల్ గాంధీ స్పీకర్‌కు లేఖ రాశారు. తన ప్రసంగంలో నుంచి 'ఎంపిక చేసిన వ్యాఖ్యల'ను మాత్రమే తొలగించారని ఆరోపించారు. ఇది పార్లమెంటు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తెలిపారు. 'రికార్డుల నుంచి తొలగించిన నా వ్యాఖ్యలను పునరుద్ధరించాలని కోరుతున్నా' అని రాహుల్ స్పీకర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. తాను చెప్పినవన్నీ నిజాలని రాహుల్ విలేకరులతో చెప్పారు.

లోకం తీరు



ఆగస్టు మధ్యలో నీట్ పీజీ పరీక్ష?

» ఎగ్జామ్‌కు 2 గంటల ముందు ప్రశ్నపత్రం తయారీ!

న్యూఢిల్లీ, జూలై 4: వాయిదా పడ్డ నీట్-పీజీ పరీక్షను.. ఆగస్టు మధ్యలో నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. అలాగే.. ఈ పరీక్ష ప్రశ్నపత్రాన్ని కూడా ఎగ్జామ్ నిర్వహించడానికి 2గంటల ముందు రూపొందించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. కేంద్ర హోంశాఖ సోమవారం నిర్వహించిన భేటీకి ఆరోగ్య శాఖ, ఎన్‌బీఈఎంఎస్, నీట్-పీజీ నిర్వహణకు సంబంధించి సాంకేతిక భాగస్వామి టీసీఎస్, సైబర్ సెల్ అధికారులు, ప్రతినిధులు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణ సన్నద్ధతపై చర్చించారు.

నిస్పృహతోనే సభలో రచ్చ!

» హుందాగా ఉండండి.. రాహుల్‌లా ప్రవర్తించవద్దు

» ఎన్డీయే ఎంపీలకు ప్రధాని హెచ్చరిక

న్యూఢిల్లీ, జూలై 2: ఓ చాయ్‌వాలా వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికవడాన్ని విపక్ష కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని ప్రధాని మోదీ అన్నారు. నెహ్రూ తర్వాత ఎవరూ ఈ ఘనత సాధించలేదని.. అది మింగుడుపడకే నిస్పృహతో పార్లమెంటులో ఆ పార్టీ రచ్చ చేస్తోందని మండిపడ్డారు. మంగళవారం పార్లమెంటు ప్రాంగణంలో ఎన్డీయే ఎంపీల సమావేశంలో ఆయన ప్రసంగించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే గెలుపు, వాటికి ముందు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయాలను విపక్షాలు తట్టుకోలేకపోతున్నాయని మోదీ తెలిపారు. 'దేశ సేవ కోసమే ప్రతి ఎంపీ ఇక్కడకు వచ్చారు. పార్లమెంటు సభ్యులందరూ దేశాభివృద్ధికి కృషిచేయాలి. సోమవారం సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలా కాకుండా మీరంతా పార్లమెంటరీ నిబంధనలకు అనుగుణంగా హుందాగా వ్యవహరించాలి. సంబంధిత సబ్జెక్టులపై పట్టు సాధించాలి. పార్లమెంటులో సాధికారికంగా మాట్లాడాలి. కాంగ్రెస్ హయాంలో ప్రధానిని రిమోట్ కంట్రోల్‌తో నడపడం మనం చూశాం' అని గుర్తుచేశారు. నియోజకవర్గ ప్రజలు ఎంపీలను గమనిస్తుంటారని.. సభలో ప్రశ్న అడిగినా.. ముఖ్యమైన అంశం లేవనెత్తినా మెచ్చుకుంటారని చెప్పారు. పార్లమెంటు సమావేశాలు జరిగేటప్పుడు ఎన్డీయే ఎంపీలు క్రమం తప్పకుండా భేటీ అవ్వాలన్నారు. మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. విలేకరులతో అనవసరంగా మాట్లాడొద్దని చెప్పారు. దళారులతో జాగ్రత్తగా ఉండాలని, ఢిల్లీలో స్టింగ్ ఆపరేషన్ల ప్రమాదం ఉందని హెచ్చరించారు. మీడియాతో ఏదైనా అంశంపై మాట్లాడేముందు అధ్యయనం చేయాలని మోదీ సూచించారు.

యూపీలో సీట్లన్నీ మాకే వచ్చినా.. ఈవీఎంలను విశ్వసించం: అఖిలేశ్

న్యూఢిల్లీ, జూలై 2: ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ మరోసారి ఈవీఎంలపై అపనమ్మకం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తమకు 80కి 80 లోక్‌సభ సీట్లు వచ్చినా ఈవీఎంలపై తమ అభిప్రాయం మారదని, అనుమానాలు తొలగవని స్పష్టం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరుగుతున్న చర్చలో భాగంగా మంగళవారం ఆయన లోక్‌సభలో మాట్లాడారు. 'నేను ఈవీఎంలను నిన్న నమ్మలేదు. నేడూ నమ్మడం లేదు. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం స్థానాలన్నీ మేమే గెలిచినా కూడా నమ్మను' అని పేర్కొన్నారు. ఈవీఎంలతో జరిగిన ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చినా సరే వాటికి స్వస్తి పలుకుతామని తెలిపారు.

ప్రధాని ప్రసంగానికి ప్రతిపక్షాల అంతరాయం

» మణిపూర్ ఎంపీకి అవకాశం ఇవ్వాలని ఆందోళన

» ఈ వైఖరిని ఖండిస్తూ అధికార పక్షం తీర్మానం

న్యూఢిల్లీ, జూలై 2: ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించే సమయంలో ప్రతిపక్షాలు అంతరాయం కలిగించడాన్ని ఖండిస్తూ మంగళవారం లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించింది. 18వ లోక్‌సభ తొలి సమావేశాల చివరి రోజున రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు ప్రధాని సిద్ధం కాగా విపక్షాలు అడ్డుకున్నాయి. ప్రధాని మాట్లాడానికి ముందు మణిపూర్ ఎంపీకి అవకాశం ఇవ్వాలని కోరాయి. ఇప్పటికే ఆ రాష్ట్రానికి చెందిన ఒక ఎంపీకి అవకాశం ఇచ్చామని, మరో ఎంపీకి అవకాశం ఇవ్వలేమని స్పీకర్ ఓం బిర్లా చెప్పారు. ఇందుకు నిరసన తెలుపుతూ మణిపూర్‌కు చెందిన ఇద్దరు ఎంపీలు, కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ వెల్‌లోకి వెళ్లి ఆందోళన చేశారు. వారికి మరికొంతమంది కాంగ్రెస్, తృణమూల్ సభ్యులు తోడయ్యారు. మణిపూర్‌కు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ప్రతిపక్ష సభ్యుల చర్యను ఖండిస్తూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. హోంమంత్రి అమిత్ షా సమర్థించారు. ఈ తీర్మానాన్ని సభ మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. స్పీకర్ ఓంబిర్లా మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యులను వెల్‌లోకి పంపిస్తున్నారంటూ విపక్ష నేత రాహుల్ గాంధీనిను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాహుల్‌కు 90 నిమిషాల సమయం ఇచ్చామని, కానీ ఆయన ప్రవర్తన పార్లమెంటరీ సంప్రదాయాలకు అనుగుణంగా లేదని అన్నారు.

103% ఉత్పాదకత సాధించిన లోక్‌సభ

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. 34గంటల పాటు ఏడు సిట్టింగ్‌లు జరిగాయని, 103 శాతం ఉత్పాదకత సాధించిందని స్పీకర్ ప్రకటించారు. ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై 18గంటల పాటు చర్చ జరగగా 68మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇచ్చారు.

ఏపీ సమగ్రాభివృద్ధికి సహకరించండి

» కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌కు ఎంపీ దగ్గుమళ్ల విజ్ఞప్తి



కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చిత్తూరు టీడీపీ ఎంపీ దగ్గుమళ్ల

న్యూఢిల్లీ, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సహకరించాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొన్న ప్రసాదరావు, కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీలో నెలకొన్న పరిస్థితుల గురించి వివరించారు. పరిశ్రమల స్థాపనకు చేయూతనివ్వాలని కోరారు. ఏపీలో ఎంఎస్‌ఎంఈల స్థాపన, ఆత్మనిర్భర్ పథకం అమలుకు సహకారం అందించాలని కోరారు.

జర్నలిస్టులకు టోల్ మినహాయించండి

» కేంద్ర మంత్రి గడ్కరీకి కలిశెట్టి విజ్ఞప్తి

ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టులందరికీ టోల్ ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర హైవేలు, రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీకి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం, మంత్రి గడ్కరీతో భేటీ అయిన కలిశెట్టి ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు.

అబద్ధాలు.. పిల్లచేష్టలు!

(మొదటి పేజీ తరువాయి)

గుప్పించారు. గతంలో కౌగిలించుకోవడం, కన్నుగీటడం వంటి పనులకు పాల్పడ్డారని.. ఇప్పుడు దేవుళ్లను కూడా తమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. హిందూ ఉగ్రవాదం వంటి పదాలను వాడడం, మతాన్ని డెంగీ, మలేరియాతో పోల్చడం సరికాదని, దేశం ఇలాంటి వాటిని క్షమించదని చెప్పారు. హిందువులకు వ్యతిరేకంగా తప్పుడు ప్రకటనలు చేయడాన్ని తీవ్రమైన కుట్రగా అభివర్ణించారు. పదేళ్లలో తమ ప్రభుత్వ పనితీరు చూసిన ప్రజలు.. మరింత బాగా పనిచేసేందుకే మూడోసారి గెలిపించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. గతంలో కంటే మూడు రెట్లు వేగంగా పనిచేస్తామన్నారు. అభివృద్ధిని మరో స్థాయికి తీసుకెళ్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఎన్డీయేకు ప్రజలు మెజారిటీ సీట్లు కట్టబెట్టారంటూ ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏపీలో ఎన్డీయేకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. దేశంలో సుస్థిరతకు, నిరంతర సుపరిపాలనకు అవకాశం కల్పించారని అన్నారు.

విచ్ఛిన్నకర రాజకీయాలు..

అవినీతి కేసుల్లో రాహుల్ బెయిల్‌పై ఉన్నారని, పలు పరువునష్టం కేసులను ఎదుర్కొంటున్నారని, ఓబీసీలను అవమానపరిచినందుకు ఆయనకు శిక్ష పడిందని మోదీ గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ముందు క్షమాపణ చెప్పుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఆర్థిక విధానాల ద్వారా అరాచకత్వాన్ని వ్యాపింపజేస్తున్నారని ఆరోపించారు. కులాలు, మతాలతో విచ్ఛిన్నకర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను నెహ్రూ అవమానించారని, ఎన్నికల్లో ఓడించారని, జగ్జీవన్ రామ్ ప్రధాని కాకుండా ఇందిరా గాంధీ అడ్డుపడ్డారని, రాజీవ్ గాంధీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో మాట్లాడారని ఆయన గుర్తు చేశారు. తాము జమ్మూకశ్మీరులో 370 అధికరణను రద్దు చేశామని, ఒకప్పుడు రాళ్లు రువ్విన ప్రజలు ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని అనుభవిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ మాదిరి బుజ్జగింపు రాజకీయాలు కాకుండా అందరికీ న్యాయం చేయడమే తమ లక్ష్యమని మోదీ స్పష్టం చేశారు. అవినీతిని సహించబోమన్నారు. 25 కోట్లమంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేసినందుకే తాము మూడోసారి గెలిచామని తెలిపారు. అగ్నిపథ్ పథకంపై కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అబద్ధాలు ప్రచారం చేస్తోందని మోదీ మండిపడ్డారు. యువత సైన్యంలో చేరకుండా ఉండేలా తప్పుడు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. ఇందులో కుట్ర కోణం దాగి ఉందన్నారు. రక్షణ రంగాన్ని బలహీనం చేయాలన్న కుట్రతోనే అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆరోపించారు.



భారత సాయుధ బలగాలు బలోపేతమవ్వాలని కాంగ్రెస్ ఎన్నడూ కోరుకోదన్నారు. గతంలో అవసరమైన మేరకు సంస్కరణలు చేయకపోవడం వల్లే సాయుధ బలగాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నాయని చెప్పారు. దేశ రక్షణకు సంబంధించిన విషయాలు బహిరంగంగా చెప్పకూడదన్నారు. అందుకే తాను స్పందించలేదని చెప్పారు. ఇక రఫేల్ యుద్ధ విమానాల విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారం చేసిందని విమర్శించారు. మన బలగాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండేలా చూస్తున్నామని, అందులో భాగంగానే సంస్కరణలు అమలు చేస్తున్నామని చెప్పారు. కాగా నీట్ ప్రశ్నపత్రాల లీక్ గురించి ప్రధాని మాట్లాడుతూ.. నేరస్థులెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అక్రమార్కులు ఎక్కడున్నా, ఎంత మంది ఉన్నా శిక్షించి తీరతామని, విద్యార్థులకు తగిన న్యాయం చేస్తామని చెప్పారు.

ప్రతిపక్షాల నినాదాల నడుమే..

ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతున్నంత సేపూ ప్రతిపక్ష నేతలు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. మణిపూర్‌పై మాట్లాడాలంటూ డిమాండ్ చేశారు. గందరగోళం మధ్యనే ప్రధాని తన ప్రసంగం ప్రారంభించి ముగించారు. ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకోవాలని సభ్యులను రెచ్చగొడుతున్నందుకు స్పీకర్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని పలుసార్లు మందలించారు.

100కి 99 కాదు.. 543కు 99

కాంగ్రెస్ పార్టీ గత మూడు ఎన్నికల్లో వంద సీట్లు కూడా సాధించలేకపోయిందని మోదీ గుర్తుచేశారు. అయినా తాము గెలిచామన్న సంబరం వారిలో కనిపించడం విడ్డూరంగా ఉందన్నారు. చిన్నపిల్లవాడు సైకిల్ తొక్కుతూ కింద పడిపోతే అతని దృష్టి మళ్లించేందుకు అదిగో చీమ చనిపోయిందని సంతోషపెట్టే ప్రయత్నం చేస్తారని, కాంగ్రెస్ నేతలు కూడా రాహుల్‌ను అలాగే సంతోషపెడుతున్నారని వ్యాఖ్యానించారు. ఒక విద్యార్థికి 100కి 99 మార్కులు వస్తే అందరూ అభినందిస్తారని, కానీ.. అతనికి 543కి 99 మార్కులు వచ్చిన విషయం అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. అంతేగాక కాంగ్రెస్‌ను ఇతర పార్టీలపై ఆధారపడిన పరాన్న జీవిగా మోదీ అభివర్ణించారు. ముఖాముఖి పోరులో కాంగ్రెస్ విజయం సాధించలేదని, మిత్రపక్షాల భుజాలపై ఎక్కి కొన్ని సీట్లు గెలుచుకుందని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్‌ను ప్రతిపక్షంలో కూర్చోమని తీర్పు ఇచ్చారన్నారు. ఆ విషయాన్ని ఇప్పటికైనా గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

టీడీపీ ఊతకర్ర కాదు... కత్తి

» పార్లమెంటులో టీఎంసీ ఎంపీకి టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి కౌంటర్

» రాష్ట్రానికి చేయూతనివ్వండి

» కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి



న్యూఢిల్లీ, జూలై 2(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ ఊతకర్ర కాదు... కత్తి' అని టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం జరిగిన చర్చలో ఆమె పాల్గొన్నారు. 'ప్రభుత్వాన్ని నడపడానికి ప్రధాని మోదీ రెండు ఊతకర్రలు... టీడీపీ, జేడీయూలను ఉపయోగిస్తున్నారు' అని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ చేసిన వ్యాఖ్య పై శబరి తీవ్రంగా స్పందించారు. 'గుర్తు పెట్టుకోండి. మీరు ఏదైతే ఊతకర్ర అని మాట్లాడుతున్నారో అది ఊతకర్ర కాదు..కత్తి' అన్నారు. చంద్రబాబుని ఈడీ అరెస్టు చేసిందంటూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. 'చంద్రబాబును నా స్వంత నియోజకవర్గం నంద్యాలలో ఏపీ సీఐడీ అరెస్టు చేసింది' అని వివరించారు. రాష్ట్ర పరిస్థితిపై మాట్లాడుతూ... ' ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏపీ వెనుకబడి పోయింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఏపీకి చేయూతనివ్వండి' అని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఆంధ్ర మాత్రమేనని అన్నారు. రాజధానిగా అమరావతి నిర్మాణానికి ప్రధాని మోదీ, అప్పటి సీఎం చంద్రబాబు పునాది వేశారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చినా ఒక్క ఇటుక కూడా వేయలేదని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంపై వివరణాత్మక విమర్శ చేసిన ఆమె ఆ కాలంలో అన్ని వర్గాలు తీవ్ర నిస్పృహలోకి జారుకున్నాయని, రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని వివరించారు.

ఖర్గే స్థానంలో జైరాం ఉండడం ఉత్తమం

» రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్

» కుల ప్రస్తావన తెస్తున్నారంటూ ఖర్గే ఆగ్రహం



న్యూఢిల్లీ, జూలై 2 :రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మధ్య మంగళవారం మాటల యుద్ధం జరిగింది. సభ సజావుగా సాగేందుకు ప్రయత్నించే క్రమంలో ఖర్గే బదులుగా జైరాం రమేశ్ ప్రతిపక్ష నేత స్థానంలో ఉంటే బాగుండేదంటూ ఛైర్మన్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు వాగ్యుద్ధానికి కారణమయ్యాయి. ఈ క్రమంలో రాజ్యసభ ఛైర్మన్ కుల వివక్ష చూపిస్తున్నారంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించగా ధన్‌ఖడ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిజానికి, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై కాంగ్రెస్ సభ్యుడు ప్రమోద్ తివారీ రాజ్యసభలో మాట్లాడుతుండగా జోక్యం చేసుకున్న ఛైర్మన్ ధన్‌ఖడ్.. నిజనిర్ధారణ చేసుకోకుండా సభలో ఏ అంశాన్ని ప్రస్తావించవద్దని సూచించారు. ఇందుకు స్పందించిన జైరాం రమేశ్ ఛైర్మన్ సూచనను పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. దీంతో ఛైర్మన్ మాట్లాడుతూ.. "సీనియర్ నాయకుడు(ఖర్గే) ఇక్కడే ఉన్నారు. మీరు(జైరాం రమేశ్) ఆయన(ఖర్గే) స్థానాన్ని భర్తీ చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. మీరు(జైరాం) చాలా తెలివైన వారు, ప్రతిభావంతులు. మీరు వెంటనే ఖర్గే స్థానంలో కూర్చోవడం ఉత్తమం. ఎందుకంటే ఆయన పని కూడా మీరే చేస్తున్నారు" అని అన్నారు. ఛైర్మన్ వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించిన ఖర్గే.. కుల ప్రస్తావన తీసుకురావద్దని, కులం వల్లే రమేష్ చాలా తెలివైన వ్యక్తి అని అంటున్నారని, తనని తక్కువ చేస్తున్నారని ఆరోపించారు. ఖర్గే వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన ధన్‌ఖడ్.. తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. పార్లమెంట్ చరిత్రలోనే ఛైర్మన్ స్థానాన్ని ఇలా ఎవరూ అవమానించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సత్సంగ్‌లో తొక్కిసలాట.. 116 మంది దుర్మరణం



(మొదటి పేజీ తరువాయి)

హాజరవుతుంటారు. యూపీ నుంచే కాక.. హరియాణా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి కూడా వస్తుంటారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు కూడా భోలే బాబా సత్సంగాలకు రావడం కద్దు. ఫేస్‌బుక్‌లోనే ఆయనకు 3 లక్షల మంది ఫాలోయర్లు ఉన్నారు. ఈ క్రమంలోనే.. మంగళవారం హత్రా‌స్‌లో ఆయన నిర్వహించిన సత్సంగానికి ప్రజలు పెద్దఎత్తున వచ్చారు. కార్యక్రమం ముగిసిన తర్వాత.. బయటకు వెళ్లే సమయంలో తోపులాట జరిగినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. లోపల వాతావరణమంతా ఉక్కగా ఉండడంతో అంతా త్వరగా బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారని.. కానీ ఆ ద్వారం చిన్నగా ఉండడంతో తొక్కిసలాట జరిగి ఇంత మంది ప్రాణాలు కోల్పోయారని వారు వివరించారు. మరికొందరేమో..కార్యక్రమం చివర్లో భక్తులు భోలేబాబాను దగ్గర్నుంచీ చూడడానికి, ఆయన పాద ధూళిని తీసుకోవడానికి ప్రయత్నించే క్రమంలో ఈ ఘోరం జరిగినట్టు చెబుతున్నారు.



భోలే బాబా

ప్రముఖుల సంతాపం..

ఈ ప్రమాదవార్త తెలిసే సమయానికి ప్రధాని మోదీ లోక్‌సభలో ఉన్నారు. వెంటనే ఆయన సభకు ఈ విషయాన్ని తెలియజేసి.. చనిపోయిన వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు యూపీ సర్కారుతో సంప్రదింపులు జరుపుతూ అన్ని రకాల సహాయసహకారాలూ అందిస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం.. హత్రాస్ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున.. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి పరిహారం ఇవ్వనున్నట్టు ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, యూపీ మాజీ ముఖ్యమంత్రులు మాయావతి, అఖిలేశ్ యాదవ్ తదితరులు జరిగిన ఘోరం పట్ల సంతాపం తెలిపారు. అమిత్ షా.. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యోగి కూడా మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వెలు చొప్పున పరిహారం ప్రకటించారు. జరిగిన ఘటనపై దర్యాప్తునకు.. ఆగ్రా అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, అలీగఢ్ డివిజనల్ కమిషనర్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, 24 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బుధవారం ఆయన ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించనున్నట్టు సమాచారం. ఇక.. హత్రాస్ దుర్ఘటన తన మనసునెంతో బాధించిందని.. అక్కడి హృదయాలు తన హృదయాన్ని కలచివేశాయని పేర్కొంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ట్వీట్ చేశారు. ఈ ఘటనలో గాయపడ్డవారికి, బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా సాయం చేయాలని రాహుల్, ప్రియాంక డిమాండ్ చేశారు.



తొక్కిసలాటకు ముందు

వలంటీర్లను ఏం చేద్దాం!

మూడేళ్ల కాల పరిమితి?

వలంటీర్లు.. గ్రామ సేవక్, వార్డ్ సేవక్!

ఒక్కొక్కరికి 100 ఇళ్ల బాధ్యత

ప్రభుత్వ వర్గాల కసరత్తు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వలంటీర్ల ఉద్యోగాన్ని నిర్దిష్ట కాలానికి పరిమితం చేయాలన్న ప్రతిపాదనపై ప్రభుత్వ వర్గాలు కసరత్తు చేస్తున్నాయి. ఈ వ్యవస్థలో ఎటువంటి మార్పుచేర్పులు చేయాలన్న అంశంపై కీలక ప్రతిపాదనలను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. వలంటీర్ల కొనసాగింపుపై సానుకూలత ఉన్నా వారి పనితీరులో అనేక మార్పులు తేవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మూడేళ్లకు మించి వలంటీర్లను కొనసాగించరాదని, ప్రతి మూడేళ్లకు కొత్తవారిని నియమించాలని ప్రతిపాదన వచ్చింది. ఈ కాలంలోనే ఏదో ఒక వృత్తిపరమైన శిక్షణ ఇచ్చి ఇతర ఉద్యోగాలు సంపాదించుకొనే మార్గం చూపించాలని అందులో సూచించారు. ఈ వ్యవస్థలో తీసుకురానున్న మార్పుచేర్పులపై ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలు పరిశీలించి తుది నిర్ణయానికి రావాలని యోచిస్తున్నట్లు సమాచారం.

పరిశీలనలో ఉన్న కొన్ని ప్రతిపాదనలివీ

వలంటీర్ల పేరు మార్చి గ్రామ సేవక్, వార్డు సేవక్‌గా మార్చాలి. ఇకపై వారిని స్థానిక సంస్థల పరిధిలోకి తీసుకువచ్చి ఆ పనులు అప్పగించాలి. పథకాల కింద లబ్ధిదారులకు చేసే డబ్బు పంపిణీతో వలంటీర్లకు సంబంధం లేకుండా చేయాలి. వలంటీర్ల వేతనం రూ.పది వేలకు పెంచుతామని టీడీపీ కూటమి నేతలు ఎన్నికల ముందు ప్రకటించారు. ఆ ప్రకారం వీరికి వేతనం పెంచే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ప్రస్తుతం 50 ఇళ్లకు ఒక వలంటీర్ ఉన్నారు. ఇకపై ప్రతి వంద ఇళ్ల బాధ్యతలు ఒకరికి అప్పగించే అవకాశం ఉంది.

సరే.. మాట్లాడుకుందాం!

హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య విభజన సమస్యల పరిష్కారానికి ఎట్టకేలకు ఓ ప్రయత్నం జరుగుతోంది. సుహృద్భావ వాతావరణంలో, పరస్పర ఆమోదంతో సమస్యలను పరిష్కరించుకునే దిశగా 2 తెలుగు రాష్ట్రాలు కదులుతున్నాయి. తెలంగాణ సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు ఈ నెల 6న సమావేశం కావాలని నిర్ణయించారు. విభజన సమస్యలపై చంద్రబాబు రాసిన లేఖ పట్ల రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. చంద్రబాబు చేసిన ప్రతిపాదనకు అంగీకరిస్తూ బేగంపేటలోని ప్రజాభవన్‌లో సమావేశమవుదామంటూ సమాచారమిచ్చారు. సమావేశానికి రావాల్సిందిగా చంద్రబాబును ఆహ్వానించారు. ఈ భేటీలో చర్చించాల్సిన ఎజెండా, విధివిధానాల ఖరారుపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సమావేశమయ్యారు. కాగా, ఏపీ సీఎం చంద్రబాబు రాసిన లేఖపై సానుకూలంగా స్పందిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి లేఖ రాశారు. "విభజన సమస్యలను కలిసి పరిష్కరించుకుందాం. తెలుగు రాష్ట్రాల పరస్పర సహకారానికి ముఖాముఖి చర్చలు అవసరం. మీ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నా" అని లేఖలో రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇదిలావుంటే, చంద్రబాబుతో జరిగే సమావేశంలో.. గతంలో ఏపీలో కలిపిన తెలంగాణకు చెందిన ఏడు మండలాలను తిరిగి రాబట్టే అంశంపై పట్టుబట్టాలని రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. 'ప్రస్తుతం బాబుపైనే కేంద్రంలోని బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వం ఆధారపడి ఉంది. ఇవాళ ఆయన శక్తిమంతుడు. కాబట్టి ఆయనపై ఒత్తిడి తెచ్చి ఏడు మండలాలు, లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్టు తెలంగాణకు కేంద్రం ఇచ్చేలా కృషి చేయాలి' అని పేర్కొన్నారు.

తొలి భేటీలో సరళమైన అంశాలే!

» ఏపీ అధికారుల కసరత్తు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తెలుగురాష్ట్రాల సీఎంలు ఈనెల 6న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై సీఎంవో అధికారులు కసరత్తు చేస్తున్నారు. వీటిలో ఆస్తుల పంపకాలు, బకాయిల చెల్లింపులు, ఉద్యోగుల సమస్యలు తదితర అంశాలున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో లేక్‌వ్యూ బిల్డింగ్, హెర్మిటేజ్ బిల్డింగ్ తప్ప మిగిలినవన్నీ తెలంగాణకే అప్పజెప్పారు. 9, 10వ షెడ్యూల్‌లోని అంశాలు, ఆర్టీసీ విభజనకు సంబంధించినవి, ఉద్యోగుల బదిలీలు, విద్యుత్ బకాయిలు, కార్పొరేషన్ల ఆస్తుల పంపకాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో రెండు రాష్ట్రాలకు ఎలాంటి అభ్యంతరాలూ లేనివి, కోర్టుల్లో లేని అంశాలపై మొదటి సమావేశంలో చర్చించనున్నారు.



బెట్టింగ్, గేమింగ్, ట్రేడింగ్.. పేరు ఏదైతేనేం అంతా జూదమే.. ప్రాణాలతో చెలగాటమే..! ఒకప్పుడు బెట్టింగ్ అంటే పెద్ద నగరాలకే పరిమితమయ్యేది. కానీ.. ఇది టెక్నాలజీ యుగం. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ స్మార్ట్ ఫోన్‌లు వాడుతున్నారు. దీంతో బెట్టింగ్, గేమింగ్ కంపెనీల రూటు కూడా ఆన్‌లైన్‌కు మళ్లింది. పరిబాచ్.. 1ఎక్స్‌బెట్, మెగాపారి, 10క్రిక్, 22బెట్, ఫన్88, మెల్‌బెట్.. ఇలా వందలాది బెట్టింగ్ యాప్‌లు, గేమింగ్ యాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. యాప్ డౌన్‌లోడ్ చేసుకుని గేమ్ ఆడితే చాలు లక్షల్లో డబ్బులు.. బెట్టింగ్ పెడితే చాలు కోట్లు కొల్లగొట్టే చాన్స్..! మీ వద్ద డబ్బుల్లేకపోయినా పర్లేదు.. మేమే అప్పులిస్తాం తీసుకోండి.. అంటూ వల విసురుతున్నాయి. దీంతో విద్యార్థులు, యువత, మహిళలు.. ఇలా అన్ని వర్గాల ప్రజలూ ఈ యాప్‌ల ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. అప్పులు తెచ్చిమరీ భారీగా నష్టపోతున్నారు. ఆ అప్పులు తీర్చే మార్గం లేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటూ.. ఆన్‌లైన్ జూదానికి బలవుతున్నారు.

ప్రాణాలతో 'ఆట'!

జూదం.. కేరాఫ్ ఆన్‌లైన్.. ఆయువు తీస్తున్న గేమింగ్, బెట్టింగ్, లోన్ యాప్‌లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

నాలుగైదేళ్ల క్రితం బెట్టింగ్ అంటే ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాలు, పెద్ద పట్టణాలకే పరిమితమై ఉండేది. బార్లు, పబ్‌లు, ఇళ్లు, ఫామ్‌హౌస్‌లలో.. ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, టీవీలు ఏర్పాటు చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా కార్యకలాపాలు సాగించేవారు. కానీ.. ఇప్పుడు టెక్నాలజీ పెరిగి స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ అందరికీ అందుబాటులోకి రావడంతో బెట్టింగ్ అరచేతిలోకి వచ్చిపడింది. ట్విటర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం కల్పిస్తూ.. బెట్టింగ్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకునేలా ఆయా కంపెనీలు ప్రోత్సహిస్తున్నాయి. యువత, విద్యార్థులు టార్గెట్‌గా.. బోనస్‌లు, రిఫరెన్స్ ప్రయోజనాలు ఆశచూపి వీలైనంత ఎక్కువ మంది డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రయత్నిస్తున్నాయి.

నిషేధం ఉన్నా ఎలా సాధ్యం..?

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ సంస్థలను కట్టడి చేయడానికి కేంద్రం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దేశంలో అనేక యాప్‌లను నిషేధించింది. ఏపీ, తెలంగాణలోనూ ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లపై నిషేధం విధించారు. ఈ రాష్ట్రాలకు చెందినవారికి బెట్టింగ్, గేమింగ్ సాధ్యం కాదన్నమాట. ఒకవేళ వారు ఆ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అవ్వాలని చూసినా... ఆ యాప్‌లు నిరాకరించాలి. కానీ.. తెలుగు రాష్ట్రాల నుంచి అనేకమంది ఆన్‌లైన్ యాప్‌లద్వారా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిషేధం ఉన్నప్పుడు వాళ్లంతా ఎలా బెట్టింగ్ చేస్తున్నారు..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే.. చాలామంది ఫేక్‌లొకేషన్, తప్పుడు సమాచారం ఇచ్చి లాగిన్ అవుతున్నారని అంటున్నారు. ప్రభుత్వాలు ఈ తరహా యాప్‌లు, వైబ్‌సైట్లపై కఠిన చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి ఉండదని నిపుణులు చెబుతున్నారు. భారత్‌లో మహాదేవ్, పరిమ్యాచ్, ఫెయిర్‌ప్లే, 1ఎక్స్‌బెట్, లోటస్ 365, డాఫాబెట్, బెట్‌వే.. వంటి బెట్టింగ్, గేమింగ్ యాప్‌లు ఉన్నాయి. గత డిసెంబరులో భారత్‌లో చట్ట విరుద్ధంగా నడుస్తున్న 581 యాప్‌లను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. వాటిలో 174 బెట్టింగ్, గేమింగ్ యాప్‌లు, 87 లోన్ యాప్‌లు కూడా ఉన్నాయి. భారత్‌లో నిషేధం ఉండడంతో చాలా కంపెనీలు చైనా, సింగపూర్ వంటి దేశాల నుంచి తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. దీంతో భారత పౌరులు ఆయా యాప్‌లు, సైట్లలో బెట్టింగ్‌లు పెడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అనేక మందిని మోసం చేసిన చైనా నియంత్రిత బెట్టింగ్, లోన్‌యాప్‌లపై ఈడీ దాడులు చేసింది. ముంబై, చెన్నై, కొచ్చిలో సోదాలు చేసి రూ.123 కోట్ల విలువైన బ్యాంకు డిపాజిట్లను ఫ్రీజ్ చేసింది.

సోషల్ మీడియా 'ఇన్‌ఫ్లుయెన్స్'

ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో ఒక విష సంస్కృతి నడుస్తోంది. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్లు ఎక్కువయ్యాయి. యూట్యూబ్‌లో బాగా తెలిసిన ఇన్‌ఫ్లుయెన్సర్లు ఏదో ఒక బెట్టిం గ్ యాప్‌ను ప్రమోట్ చేస్తూ కనిపిస్తున్నారు. ఇలా ప్రమోషన్ చేసినందుకు ఆయా బెట్టింగ్ యాప్‌ల నుంచి వారు రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. అయితే.. ఇది నిజమేనని నమ్మి అనేక మంది యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని గేమ్‌లు ఆడి నష్టపోతున్నారు. సదరు యూట్యూబర్ ప్రమోషన్ల ద్వారా లక్షలు సంపాదిస్తుంటే.. వీళ్లేమో అప్పుల్లో కూరుకుపోయి.. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ఐపీఎల్, టీ20 వరల్డ్‌కప్ ఫీవర్..

ఇటీవల ఐపీఎల్, ఆ తర్వాతే టీ20 వరల్డ్‌కప్ నేపథ్యంలో బెట్టింగ్‌లు ఊపందుకున్నాయి. క్రికెట్ ప్రియులే లక్ష్యంగా బెట్టింగ్ యాప్స్ అత్యాశ వల విసురుతూ నగర, పట్టణ, గ్రామాల్లోని యువతను దోచేస్తున్నాయి. మన దేశంలోనే సుమారు 45 కోట్ల మందిని ఆకర్షిస్తోన్న క్రికెట్.. అందులో సగం మందిని బెట్టింగ్‌ల వైపు లాక్కెళ్తోందని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ఒకప్పుడు మన జట్టు గెలుపు కోసమో.. అభిమాన క్రికెటర్ ఆట కోసమో మ్యాచ్‌లు చూస్తే.. ఇప్పుడు చాలామంది ఆన్‌లైన్ జూదం కోసమే మ్యాచ్‌లు ఫాలో అవుతున్నారు. టాస్ ఎవరు గెలిచారు.. తుది జట్టులో ఎవరెవరున్నారు.. పవర్ ప్లేలో ఎన్ని పరుగులొస్తాయి, ఎన్ని వికెట్లు పడతాయి.. తర్వాతి బాల్ ఫోరా, సిక్సా.. వికెట్టా.. ఈ మ్యాచ్ ఎవరు గెలుస్తారు..? ఇలా ప్రతి దానిపైనా బెట్టింగే. ఈజీగా డబ్బులు సంపాదించాలనే అత్యాసతో భారీగా పందేలు పెట్టి నిలువునా మునిగిపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్‌ల బారిన పడి ప్రాణాలు తీసుకొంటున్న వారిని చూస్తే విద్యార్థులు, యువకులే కాదు.. రైతులు, గృహిణులు, ఉపాధ్యాయులు కూడా ఉండటం ఆందోళన కలిగించే అంశం. నెల్లూరు జిల్లాలో బీ ఫార్మసీ విద్యార్థిని.. కాలేజీ ఫీజు కోసం ఇచ్చిన డబ్బులు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ పెట్టి పోగొట్టుకుంది. అది చాలదన్నట్లు అప్పులు చేసి లక్షల్లో పోగొట్టుకుని దిక్కు తోచక ఆత్మహత్యకు పాల్పడింది. అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఒక రైతు క్రికెట్ బెట్టింగ్ బారిన పడి పొలంలో పురుగు మందు తాగి ప్రాణాలు వదిలాడు. బెట్టింగ్ హైదరాబాద్‌లో ఒక గృహిణి ప్రాణం తీసింది. ప్రాణాలు కోల్పోతున్న వారిలో కొందరివి మాత్రమే వెలుగులోకి వస్తుంటే ఆస్తులు, డబ్బులు పోగొట్టుకుంటున్న వేలాది మంది బాధలు బయటి ప్రపంచానికి తెలియడంలేదు.

మ్యాచ్ ముగిస్తే.. డబ్బు పోయినట్లే..

బెట్టింగ్ నిర్వాహకుల నుంచి మ్యాచ్ ముగిసిన తర్వాత డబ్బు రికవరీ చేయడం దాదాపు అసాధ్యం అంటున్నారు సైబర్ పోలీసులు. క్రికెట్ మ్యాచ్ ప్రారంభానికి ముందు నుంచి ప్రారంభమయ్యే వ్యవహారం రెండు ఇన్నింగ్ కొనసాగుతున్నంత సేపూ ఉంటుంది. చివరి బాల్ పూర్తవగానే బుకీలు డబ్బులు డిపాజిట్ చేయాల్సిందేనని ఒత్తిడి తీసుకొస్తారు. ఆలస్యం చేస్తే డీలర్ షిప్ రద్దు చేసి బ్లాక్ లిస్ట్‌లో పెట్టేస్తారు. ఈ భయంతో డీలర్లు బెట్టింగ్ రాయుళ్లతో ఫోన్‌పే, గూగుల్‌పే చేయించుకుని ఆ డబ్బుని వెంటనే బుకీ యాప్‌లో డిపాజిట్ చేస్తారని, ఆ వివరాలు మనకు ఎక్కడా కనిపించవని పోలీసులు చెబుతున్నారు. బాధితులు ఫిర్యాదు చేసినా బాధ్యుల్ని పట్టుకోవడం, రికవరీ చేయడం పది శాతం కూడా సాధ్యం కాదంటున్నారు. ఎందుకంటే ప్రధాన బుకీలు ఇతర రాష్ట్రాల్లోనూ, విదేశాల్లోనో ఉంటారని చెబుతున్నారు.

పోలీసు ఉన్నతాధికారులకు లేఖలు

టీ20 వరల్డ్ కప్ నేపథ్యంలో "మా పిల్లల్ని కాపాడండి. క్రికెట్ బెట్టింగ్‌లకు భానిసలై అప్పుల పాలతున్నారు. రొంపిచర్లలో క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నాయి. పిల్లల్ని మందలిస్తూనే ఉన్నాం. కానీ పందేల నిర్వాహకులు ప్రలోభపెడుతున్నారు. మా ప్రాంతంలో బెట్టింగ్‌లు అరికట్టండి" అని కోరుతూ పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలంలో కొందరు పోలీసు ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో చాలా సార్లు ఫిర్యాదు చేసినా వారు ఎటువంటి చర్యలూ తీసుకోలేదని పేర్కొన్నారు. బెట్టింగ్‌లు నిర్వహించే వారి పేర్లు, ఫోన్ నంబర్లు కూడా పోలీసు శాఖకు అందజేశారు. ఈ మండలంలో ఇటీవలి కాలంలో ఇద్దరు యువకులు ఆత్మహత్యకు పాల్పడంతో ఈ మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ప్రాణాలు పోతున్నాయ్..!

- విశాఖ పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌కు చెందిన 23 ఏళ్ల యువకుడు బెట్టింగ్‌ల కోసం భారీగా అప్పులు చేశాడు. అవి తీర్చేందుకు లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్నాడు. యాప్ నిర్వాహకుల వేధింపులతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.
- విజయవాడకు చెందిన 19ఏళ్ల యువకుడు ఇంటర్నెట్ కేఫ్‌లో పనిచేసేవాడు. క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటుపడిన ఆ యువకుడు ఆన్‌లైన్ యాప్‌ల్లో అప్పులు చేయడం మొదలుపెట్టాడు. ఈ అప్పులు పెరిగి, ఆత్మహత్య చేసుకున్నాడు.
- విజయవాడకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి తల్లిదండ్రులు ఇస్తున్న డబ్బులు సరిపోక.. ఆన్‌లైన్ యాప్‌ల్లో అప్పులు చేశాడు. వాటిని తీర్చాలని ఒత్తిడి పెరగడంతో కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.
- విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన రిటైర్డ్ ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ అధికారి సి.కృష్ణారావు, పక్కి గ్రామానికి చెందిన జి.భార్గవ్ అనే ప్రభుత్వ సివిల్ ఇంజనీర్ ఇటీవల మోసపూరిత యాప్‌ల వలలో పడి రూ.67 లక్షలు పోగొట్టుకున్నారు.
- విజయనగరం జిల్లా రాజాంలో ఓ బంగారు వర్తకుడు బెట్టింగులు కాసి అప్పులపాలై చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీకాకుళం జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు సైబర్ నేరగాళ్ల బారినపడి ఉద్యోగులు, విద్యార్థులు ఆరు నెలల్లో రూ.3 కోట్లకుపైగా నష్టపోయారు.
- అనకాపల్లిలో ఒక ప్రముఖ బ్యాంకు బ్రాంచి మేనేజర్ ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌కు అలవాటు పడి అప్పుల పాలయ్యారు. దీంతో తాను పనిచేస్తున్న బ్యాంకులో సొమ్మును కూడా బెట్టింగ్‌లో పెట్టేశారు. బ్యాంకు ఆడిట్ విభాగం విచారణలో మేనేజర్ ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగుల్లో పెట్టినట్టు తేలడంతో సస్పెండ్ అయ్యారు.

బెట్టింగ్ యాప్‌లకు గేట్‌వే మూసేయాలి..



"బెట్టింగ్ యాప్‌లు, లోన్‌యాప్‌లు ఒకదానికొకటి అనుసంధానమైనట్టు అనుమానాలున్నాయి. యువత ఈ యాప్‌ల జోలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను గమనిస్తుండాలి. కేసులు నమోదైనప్పుడు కొన్ని యాప్‌లను మూసివేయిస్తున్నాం. అయినా ప్లేస్టోర్‌లోకి కొత్త యాప్‌లు వస్తున్నాయి. వాటికి గేట్‌వే లేకుండా చేస్తే చాలా వరకు కట్టడి చేయొచ్చు. ఈ పని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ చేయాలి. పోలీసు కమిషనరేట్ పరిధిలో మూడు అంశాలపై దృష్టి పెట్టాం. డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్‌ల్లో అప్పులు తీసుకోవడం వంటి వాటికి దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి విద్యాసంస్థలోనూ నిపుణులతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం."

- ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ



శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మంగళవారం దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డిగ్రీ కౌన్సెలింగ్‌కు హడావుడి షెడ్యూలు!

- కాలేజీలకు అఫిలియేషన్లు లేకుండానే అడ్మిషన్లకు సిద్ధం

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): కాలేజీలకు అనుమతులు, అఫిలియేషన్లు మంజూరు చేయకుండానే డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూలు హడావిడిగా ప్రకటించారు. వీసీలు, రిజిస్ట్రార్ల రాజీనామాల నేపథ్యంలో ఇప్పటివరకూ ఒక్క కాలేజీకి అఫిలియేషన్లు పునరుద్ధరించలేదు. అద్దె భవనాల్లో ఉన్న దాదాపు వెయ్యి కాలేజీలకు అనుమతుల మంజూరుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ ఏడాది నుంచి బీసీఏ, బీబీఏ, బీఎంఎస్ కోర్సులకు ఏఐసీటీఈనే అనుమతులు మంజూరు చేస్తోంది. ఆయా కోర్సుల కోసం కాలేజీలు దరఖాస్తు చేసుకునే గడువు 15 వరకు ఉంది. తాజా షెడ్యూలు ప్రకారం 15 నాటికి విద్యార్థులు ఏ కాలేజీలో చేరాలనే దానిపై ఆప్షన్లు ఇచ్చుకునే ప్రక్రియ పూర్తవుతుంది. ఆ తర్వాత వచ్చే బీసీఏ, బీబీఏ, బీఎంఎస్ సీట్లకు విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చుకోవడం సాధ్యం కాదు. ఈ విషయాన్ని ఏఐసీటీఈ పది రోజుల కిందటే ప్రకటించింది. అయినా అధికారులు షెడ్యూలు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇవే అంశాలపై కాలేజీల యాజమాన్యాలు మంగళవారం ఉన్నత విద్యాశాఖ అధికారులను కలిశారు. విద్యార్థుల దరఖాస్తులకు 15 వరకు అవకాశం ఇస్తామని, ఆ తర్వాతే ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ఉంటుందని అధికారులు సమాధానమిచ్చారు. ఒక్కరోజులోనే తేదీలు మార్చుకునే పరిస్థితి రావడంపై యాజమాన్యాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఉన్నత విద్యామండలిలో అందరూ వైసీపీ నియమించిన అధికారులే ఉన్నారు. ఒకవేళ వారే ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించినా ఉన్నత విద్యాశాఖ అధికారులు అనుమతులు, అఫిలియేషన్ల అంశాన్ని ఎందుకు పరిశీలించలేదనేది అనుమానంగా మారింది.

13 జిల్లాలకు కొత్త కలెక్టర్లు

- విశాఖపట్నం కలెక్టర్‌గా హరేంధిర ప్రసాద్
- కడపకు శివశంకర్.. తిరుపతికి వెంకటేశ్వర్
- 9 మంది పాత కలెక్టర్లు బదిలీ.. పోస్టింగ్ నిలుపుదల

అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 13 జిల్లాలకు ప్రభుత్వం కొత్త కలెక్టర్లను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఉన్న కలెక్టర్లలో ఎక్కువ మందికి పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వం నిలుపుదల చేసింది. విశాఖపట్నం కలెక్టర్‌గా అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను నియమించింది. విశాఖ కలెక్టర్‌గా ఉన్న డా.మల్లిఖార్జునను గతవారమే బదిలీ చేసిన ప్రభుత్వం జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌ను శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా నియమించింది. ఎన్నికల అనంతరం ఎన్నికల కమిషన్ ద్వారా బదిలీకి గురైన శివశంకర్ లోతేటిని కడప జిల్లా కలెక్టర్‌గా నియమించింది. తిరుపతి కలెక్టర్‌గా డా.వెంకటేశ్వర్‌ను నియమించింది. ప్రస్తుత కలెక్టర్లలో మంజీర్ జిలానీ (శ్రీకాకుళం), నిశాంత్ కుమార్ (పార్వతీపురం మన్యం), పట్నంశెట్టి రవి సుభాష్ (అనకాపల్లి), హిమాన్షు శుక్లా (కోనసీమ), శ్రీకేశ్ బాలాజీ (పల్నాడు), హరినారాయణ (నెల్లూరు), అభిషిక్త్ కిశోర్ (అన్నమయ్య), విజయరామరాజు (కడప), కె శ్రీనివాసులు (నంద్యాల) బదిలీ చేసిన ప్రభుత్వం వీరందరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా, అదనపు ఎన్నికల ప్రధానాధికారిగా ఉన్న హరేంధిర ప్రసాద్‌ను బదిలీ చేయడంతో పి.కోటేశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మరో జీవో విడుదల చేసింది.

కొత్త కలెక్టర్లు వీరే...

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన జిల్లా
ఎంఎన్ హరేంధిర ప్రసాద్	అదనపు ప్రధాన ఎన్నికల అధికారి	విశాఖపట్నం
స్వప్నిల్ దినకర్	మున్సిపల్ కమిషనర్, విజయవాడ	శ్రీకాకుళం
ఎ శ్యామ్ ప్రసాద్	జాయింట్ కలెక్టర్, పల్నాడు	పార్వతీపురం మన్యం
విజయ కె	సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్	అనకాపల్లి
ఆర్ మహేశ్ కుమార్	ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, సెక్రటరీ	అంబేద్కర్ కోనసీమ
పి అరుణ్ బాబు	సత్యసాయి జిల్లా కలెక్టర్	పల్నాడు
ఓ ఆనంద్	జాయింట్ కలెక్టర్, విశాఖపట్నం	నెల్లూరు
డా.వెంకటేశ్వర్.ఎస్	సెకండరీ హెల్త్ డైరెక్టర్	తిరుపతి
శ్రీధర్ చెమకూరి	జాయింట్ కలెక్టర్, బాపట్ల	అన్నమయ్య
శివశంకర్ లోతేటి	పోస్టింగ్ కోసం వెయిటింగ్	కడప
టీఎస్ చేతన్	బెవరేజెస్ కార్పొరేషన్, ఎండీ	సత్యసాయి
బి.రాజకుమారి	జాయింట్ కలెక్టర్, గుంటూరు	నంద్యాల
జే వెంకట మురళీ	ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్	బాపట్ల

రాష్ట్ర నిఘా చీఫ్‌గా మహేశ్‌చంద్ర లడ్డా

అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నిఘా విభాగం చీఫ్‌గా 1998 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి మహేశ్‌చంద్ర లడ్డాను ప్రభుత్వం నియమించింది. ఐదేళ్లుగా కేంద్ర సర్వీసుల్లో ఉన్న ఆయన్ను రాష్ట్రప్రభుత్వం విన్నపం మేరకు కేంద్రం ఏపీకి పంపించింది. మంగళవారం ఉదయం ఆయన జీఏడీలో రిపోర్టు చేశారు. ఆయన్ను నిఘా అదనపు డీజీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్ రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఒకట్రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కళ్లు, చెవులైన కీలక నిఘా విభాగంలో నిజాయితీపరుడు, సమర్థుడైన లడ్డాను నియమిస్తారని గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు ఆయన సీఆర్‌పీఎఫ్ ఐజీగా ఉన్నారు. కాగా.. జగన్ సర్కారుతో అంటకాగిన నాటి నిఘా అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులును ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఎన్నికల కమిషన్ బదిలీచేసి.. ఆయన స్థానంలో అదనపు డీజీ ర్యాంకు అధికారి కుమార్ విశ్వజిత్‌ను నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన్ను బదిలీ చేసిన ప్రభుత్వం.. త్వరలో పోస్టింగ్ ఇవ్వనుంది.

రోడ్డు ప్రమాదంలో ఏబీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జడ్సన్ మృతి

టంగుటూరు: అగ్రిగోల్డ్ బాధితుల పోరాట సంఘం (ఏబీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గద్దె జడ్సన్(59) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ప్రకాశం జిల్లా టంగుటూరు పోలీసుల కథనం మేరకు.. మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరుకు చెందిన జడ్సన్ సోమవారం టంగుటూరు నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరారు. సూరారెడ్డిపాలెం ఫ్లైఓవర్‌పై వాహనం అదుపుతప్పి జడ్సన్ కింద పడిపోగా తలకు తీవ్రగాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందారు.


కాలినడకన శబరిమలకు వెళుతున్న స్వాములు

అభిమానమంత.. యాత్ర!

- బాబు సీఎం కావడంతో శబరిమలకు కాలినడక

చంద్రబాబుపై అభిమానం యాత్ర రూపం దాల్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై, చంద్రబాబు సీఎం అయితే శబరిమల అయ్యప్ప దేవస్థానానికి కాలినడకన వస్తామని ఆయన అభిమానులు మొక్కుకున్నారు. దీంతో విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పీకే పాలవలసకు చెందిన గురుస్వామి వి. శ్రీరాములునాయుడు, మీసాల మోహన్, జి. కృష్ణ గతనెల 26న దీక్ష చేపట్టి, అదే రోజు కాలినడకన శబరిమలకు బయలుదేరారు. మంగళవారం అనకాపల్లి జిల్లా నక్కపల్లి చేరుకున్న వారికి ఉపమాక గురుభవానీ పీఠం ప్రతినిధులు స్వాగతం పలికి, భోజనం ఏర్పాటు చేశారు.

- నక్కపల్లి(విజయనగరం)

కలెక్టర్ మెచ్చుకున్నారు.. ఆపై ఎత్తుకున్నారు!

- శతాధిక గిరిజన నేతకు వినూత్న అభినందన

అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ మంగళవారం పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల సరిహద్దుల్లో పర్యటించారు. పెదబయలు మండలం జామిగూడ గిరిజనులతో మాట్లాడుతున్నప్పుడు వందేళ్లు నిండిన మాజీ ఎంపీపీ జర్సింగి బాలంనాయుడు గురించి తెలుసుకున్నారు. సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ఎంపీపీగా అందించిన సేవలను స్థానికులు తెలిపారు. దీంతో బాలంనాయుడును మెచ్చుకున్న కలెక్టర్ అనంతరం ఒక్కసారిగా ఆయన్ను ఎత్తుకుని అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు.


జర్సింగి బాలంనాయుడును ఎత్తుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

- పాడేరు/ఆంధ్రజ్యోతి


విజిలెన్సు అధికారులకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు


టీటీడీలో అక్రమాలపై విచారణ చేపట్టండి

- వైసీపీ మంత్రుల దర్శనాల చిట్టా బయటకు తీయండి
- విజిలెన్సు అధికారులకు జనసేన ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), జూలై 2: గత ఐదేళ్లలో టీటీడీలో జరిగిన అవినీతి, అక్రమాలపై తక్షణం విచారణ చేపట్టి అక్రమార్కుల నిగ్గు తేల్చాలని జనసేన నాయకులు కోరారు. తిరుపతి నియోజకవర్గ జనసేన నాయకులు కిరణ్‌రాయల్, సుభాషిణి, మనోజ్.. తిరుపతి విజిలెన్సు డీఎస్పీని మంగళవారం కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం కిరణ్‌రాయల్ మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో తిరుమలను వైసీపీ సొంత జాగీరు లాగా చేసుకుని విచ్చలవిడిగా సేవా టికెట్లు వేలాది రూపాయలకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఏపీటీడీసీ చైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడే రోజా టికెట్లు అమ్ముకుని అవినీతికి పాల్పడ్డారన్నారు. తర్వాత మంత్రిగా ఆమె చేసిన అవినీతి అక్రమాలు అన్నీఇన్నీ కావన్నారు. జగన్ తర్వాత షాడో సీఎంగా చెప్పుకున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రోజుకు ఒక టికెట్‌పై 60 నుంచి 70 మందికి సిఫారసు చేసి కొండ మొత్తం అవినీతిమయం చేశారన్నారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కొండ మొత్తం దోచేశాడని దుయ్యబట్టారు. శ్రీవాణి ట్రస్టు పేరుతో వసూలైన నిధులు, ఖజానాకు ఎంత జమయ్యాయి.. జగన్‌కు ఎంత పంపారనే విషయాలు విజిలెన్సు విచారణలో బయటకు రావాలని డిమాండ్ చేశారు. శ్రీవాణి ట్రస్టు నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని గతంలో పవన్‌కల్యాణ్, చంద్రబాబు డిమాండ్ చేసిన విషయాన్ని కిరణ్ రాయల్ గుర్తుచేశారు. 2019 నుంచి 2024 వరకు మంత్రులకు రోజుకు ఎన్ని సేవా టికెట్లు మంజూరు చేశారు, ఒక్కో టికెట్‌పై ఎంతమందిని అనుమతించారో సమగ్ర దర్యాప్తు జరిపి అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని కోరారు.

నైతికంగా మోదీ ఓటమి

- ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పారు: నారాయణ
- విశాఖలో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు ప్రారంభం



విశాఖపట్నం, జూలై 2: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బొటాబొటీ మెజారిటీకి పరిమితం చేసి నరేంద్రమోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. విశాఖలో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న నారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 400 పైగా ఎంపీ స్థానాలు వస్తాయని గొప్పలకు పోయిన ప్రధాని మోదీకి ప్రజలు 240 స్థానాలు మాత్రమే ఇచ్చారన్నారు. భారతీయ జనతా పార్టీకి ఓట్లు, సీట్లు తగ్గాయన్న విషయం గుర్తించాల్సిన అవసరముందన్నారు. ఈసారి ఎన్నికల్లో నరేంద్రమోదీ నైతికంగా ఓడిపోయి, సాంకేతికంగా గెలిచారన్నారు. రామ మందిరాన్ని నిర్మించిన అయోధ్యలోనే ఆ పార్టీ ఓటమి పాలైందని గుర్తుచేశారు. ఎన్డీఏ ప్రభుత్వం గడిచిన పదేళ్లలో 16 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను మాఫీ చేసి, దేశ ప్రజల ధనాన్ని నేరుగా బడాబాబులకు కట్టబెట్టిందని విమర్శించారు. గతంలో ప్రతిపక్షాన్ని వెలుపలకు పంపి పార్లమెంటులో ఆమోదించిన కొత్త క్రిమినల్ చట్టాలను జూలై ఒకటో తేదీ నుంచి అమలులోకి తెచ్చారన్నారు. ఈ చట్టాల్లో కార్మిక వర్గాలకు కఠిన శిక్షలు, యాజమాన్యాలపై అతి తక్కువ చర్యలు ఉన్నట్టు పేర్కొన్నారు. జరిమానాలు, జైలుశిక్షలు పెంచారని వ్యాఖ్యానించారు. ఇక, ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, అప్రజాస్వామిక పాలన, కక్ష సాధింపు చర్యలతోనే వైసీపీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంచి రాజనీతిజ్ఞుడి పాత్ర పోషించారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ఎం.నాగేశ్వరరావు, జె.వి.సత్యనారాయణమూర్తి, కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. ఈ సమావేశాలు ఈ నెల 3వ తేదీన ముగియనున్నాయి.

2029 తర్వాత రాహుల్ ప్రధాని అవుతారు

- చంద్రబాబు, నితీశ్ కాదనుకుంటే కేంద్రంలో ఏమైనా జరగొచ్చు: రఘువీరా

మడకశిర టౌన్, జూలై 2: కాంగ్రెస్ పార్టీకి మూడు రాష్ట్రాల్లో బలం లేకపోవడం వల్లే రాహుల్ గాంధీ ప్రధాని కాలేకపోయారని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. 2029 ఎన్నికల తరువాత రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడితే తాము కూడా సహకారం అందిస్తామని తెలిపారు. చంద్రబాబు, నితీశ్‌కుమార్ మద్దతు బీజేపీకి లేకపోతే కేంద్రంలో ఏం జరుగుతుందో చెప్పలేమని అన్నారు. బీజేపీకి, ప్రధాని మోదీకి రాజ్యాంగం మీద, చట్టాల మీద నమ్మకం లేదని అన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ప్రజలు తెలివిగా వ్యవహరించారని అన్నారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో జరిగే సమావేశంలో ఆంధ్రప్రదేశ్ హక్కుల సాధనలో ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సంచలన సభాపర్వం

ఊహించినట్టుగానే రాహుల్ గాంధీ ఘాటు ప్రసంగానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గట్టి జవాబు ఇచ్చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై జరిగేచర్చలో రాహుల్ గాంధీ సోమవారం నాడు మాట్లాడారు. ప్రతిపక్ష నేతగా ఆయన మొదటి ప్రసంగం ఇది. తీవ్రమైన విమర్శలలో, కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలను కూడా జోడించి, రాహుల్ చేసిన వేడి వేడి ప్రసంగానికి మిశ్రమ ప్రతిస్పందనలు లభించాయి. ప్రతిపక్షాలన్నిటి తరఫున మాట్లాడుతూ, ఆత్మవిశ్వాసాన్ని, పరిపక్వతను ప్రదర్శించారని అభిమానులు సంతోషిస్తే, అనుభవ రాహిత్యంతో చాపల్యాన్ని ప్రదర్శించారని విమర్శకులు మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా, రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత స్థాయికి తగినట్టు పెద్దరికాన్ని చూపలేదని విమర్శించారు. చర్చకు సమాధానం ఇస్తూ, మోదీ మంగళవారం నాడు రాహుల్‌ను బాలకుడు, బాలకుడు అంటూ పదేపదే ఎద్దేవా చేశారు. అయితే, చిన్నపిల్లవాడిగా వ్యవహరించాడని తేలికగా తీసుకోగూడదని, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల వెనుక ప్రమాదకరమైన ఉద్దేశ్యాలున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. హిందూ సమాజాన్ని హింసావాదులుగా నిందించడాన్ని కోట్లాది మంది ప్రజలు మరచిపోరని హెచ్చరించారు. జనాదేశం తమకే అనుకూలంగా ఉన్నదని, పూర్తి సాధికారతతో తాము పాలిస్తామని, ఈ నినాదాలకు, విమర్శలకు లొంగి తగ్గబోమని మోదీ స్పష్టం చేశారు.

ఎన్నికల ఫలితాలకు తగ్గట్టు, పద్ధెనిమిదో లోక్‌సభ సంచలనశీలంగా, ఉద్రిక్తంగా, సంవాదభరితంగా మొదలయ్యింది. మున్ముందు సభా కాలం అంతా ఇదే విధంగా కొనసాగుతుందన్న సూచనలు కనిపిస్తున్నాయి. మునుపటి సభలలో మాదిరిగా, నూతన సభలో ప్రభుత్వ, ప్రతిపక్ష కూటముల మధ్య అంతరం భారీగా లేదు. అధికార కూటమిలో ప్రధాన పార్టీ బీజేపీకి స్వయంగా మెజారిటీ లేదు. కాంగ్రెస్ సొంత సంఖ్య వంద దాటనప్పటికీ, మునుపటి కంటె 90 శాతం పెరిగింది, దాని మిత్రపక్షాల బలమూ గణనీయంగా పెరిగింది. ఆ ఉత్సాహం సభలో వ్యక్తమవుతోంది. ఇటీవలి సాధారణ ఎన్నికల ప్రచారాన్ని వేడెక్కించిన అంశాలు, రాష్ట్రపతి ప్రసంగంపై జరిగిన చర్చలో కూడా ప్రతిధ్వనించడం చూడవచ్చు. వాటికి తోడు, ఎన్నికల అనంతరం ముందుకు వచ్చిన 'నీట్' వంటి సమస్యలు చర్చలో ప్రముఖంగా ముందుకు వచ్చాయి. చర్చకు ప్రధాని సమాధానం ఇచ్చే రోజునే 'నీట్' ఆందోళనకారులు పార్లమెంటు ముట్టడిని చేపట్టడం విశేషం. ప్రధాని ప్రసంగిస్తున్నంత సేపు, ప్రతిపక్ష బెంచ్‌ల నుంచి ఎడతెగకుండా నినాదాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇంతకాలం విస్మరణకు గురిఅయిన మణిపూర్, మంగళవారం నాడు, ప్రజాప్రతినిధుల ప్రసంగాల్లో, నినాదాల్లో మారుమోగింది.

అత్యవసర పరిస్థితికి 49 ఏళ్లు నిండిన సమయంలో, అధికారపక్షం ప్రారంభించిన ఉధృత విమర్శలు, సభలోనూ కొనసాగాయి. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని ఎన్నికల ప్రచారంలో చేసిన విమర్శలను తిప్పికొట్టడానికి బీజేపీ ఎమర్జెన్సీ యాభై ఏట ప్రవేశించిన సందర్భం అనువుగా అందివచ్చింది. జగ్జీవన్ రామ్ ప్రధాని అయ్యే అవకాశం వచ్చినప్పుడు దాన్ని ఇందిరాగాంధీ అడ్డుకున్నదని, మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా సభలో రాజీవ్ గాంధీ సుదీర్ఘ ప్రసంగం చేశారని మోదీ ప్రస్తావించడం, కాంగ్రెస్‌ను సామాజిక న్యాయానికి వ్యతిరేకిగా నిలబెట్టడానికే. అయితే, బీజేపీపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు వర్తమానానికి సంబంధించినవి కాగా, బీజేపీ ఎదురుదాడి, గతంలోని కాంగ్రెస్ వైఖరుల మీద గురిపెట్టినవి.

గత సభ కంటె అదనంగా లభించిన విజయాలను చూసి కాంగ్రెస్ అతిగా ఆనందిస్తున్నదని, ఆ పార్టీకి అంత ఉత్సాహం అవసరం లేదని బీజేపీ చెబుతోంది. అట్లాగే, తాము బలహీనపడ్డామని, ప్రజలు తమను నిరాకరించారని భావించవద్దని, ప్రజాదరణ తమకు తగ్గలేదని, మూడోసారి అధికారానికి ప్రజలే పంపారని, తమది కొనసాగింపే తప్ప, మార్పేమీ లేదని మోదీ పదే పదే చెబుతున్నారు. ఒకరిలో అతిశయాన్ని, మరొకరిలో న్యూనభావాన్ని ఈ వైఖరులు ప్రతిబింబిస్తున్నాయి. ప్రతిపక్షం అతిచురుకుగా ఉండేందుకు, ప్రభుత్వపక్షం యథాపూర్వం కొనసాగేందుకు చేసే ప్రయత్నాలు చట్టసభలలోను, పరిపాలనలోను, ప్రజారంగంలోను అనేక విశేష సన్నివేశాలను కల్పించవచ్చు. సభను నిర్వహించడంలో స్పీకర్ ఓం బిర్లా పడుతున్న ఇబ్బంది, పరిస్థితిలోని జటిలతను సూచిస్తోంది.

సభలో గమనించదగిన విశేషం, ప్రతిపక్ష కూటమిలో అనేక గొంతులు దృఢంగా వినిపించడం. మంగళవారం నాడు అఖిలేశ్ యాదవ్ మాట్లాడిన తీరు కూడా అందరి దృష్టిని ఆకర్షించింది. మణిపూర్ ఎంపీ బిమోల్ అకోయిజమ్ ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. డీఎంకే, ఆర్జేడీ, ఠాక్రే శివసేన ఎంపీలనూ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కులగణన కోరే స్వరాలకు పార్లమెంటులో కొత్త బలం వచ్చినట్టు అనిపించింది. రాష్ట్రపతి ప్రసంగంపై జరిగిన చర్చలో బీజేపీ సభ్యులు చురుకుగా పాల్గొనగా, మిత్రపక్షాల నుంచి ఆ స్థాయిలో భాగస్వామ్యం కనిపించలేదు. బడ్జెట్ సమయంలో ప్రభుత్వం ఇంకా అనేక సమస్యలు ఎదుర్కొనే అవకాశం కనిపిస్తోంది.

ఈ చట్టాలతో ప్రజలకు న్యాయం చేరువవుతుందా?



akbar


■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

బ్రిటిష్ వారు నిష్క్రమించి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మన ఊరు హెడ్ కానిస్టేబుల్ మారతాడా అన్న అనుమానం కన్యాశుల్కం నాటకంలో ఒక జట్కా బండి వాడు వ్యక్తం చేశాడు. దేశంలో ఎవరు అధికారంలోకి వచ్చినా వ్యవస్థల స్వభావం మారదనే చారిత్రక సత్యం ఈ వాక్యాల్లో ప్రస్ఫుటమయింది. న్యాయవ్యవస్థ పలుకుబడి గల వారికి అనుకూలంగా మారడం, సాక్ష్యాలను తారుమారు చేయడం గురించి వందేళ్ల క్రితమే గురజాడ తన కన్యాశుల్కం నాటకంలో చెప్పారు. సమాజంలో శక్తిమంతులే చివరకు గెలుపు సాధిస్తారని ఆయన స్పష్టం చేశారు. కన్యాశుల్కం రాయడానికి ముందే 1825లో మెకాలే తొలి భారతీయ శిక్షా స్మృతిని రూపొందించారు. 1872లో జేమ్స్ స్టీఫెన్ భారతీయ సాక్ష్యాధార చట్టాన్ని లిఖించారు. రాజ్యాంగాన్ని లిఖించుకున్న ఏడు దశాబ్దాల తర్వాత స్వతంత్ర భారతంలో తొలిసారి మనం రూపొందించుకున్న కొత్త నేర చట్టాలు ఎంత వరకు ఆధునిక నాగరిక సమాజానికి, ప్రజాస్వామ్య ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నాయన్న విషయంపై ఇప్పుడు సర్వత్రా చర్చలు జరుగుతున్నాయి.

జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన ఈ నేర చట్టాల ప్రధాన లక్ష్యం పారదర్శకత, జవాబుదారీ విధానం, సమర్థత, ఆధునికీకరణను ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలకు న్యాయాన్ని చేరువగా చేర్చడమే అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ప్రజలను శిక్షించడానికి తాము ప్రాధాన్యతనీయడం లేదని, వారికి న్యాయం అందించడమే తమ ప్రాధాన్యత అని ఆయన అన్నారు. అయితే ఈ చట్టాల ఉద్దేశాలు మాత్రం వలసవాద మనోభావాలనే ప్రతిఫలిస్తున్నాయని, చాల చోట్ల భాషను మార్చారు కాని సారాన్ని మార్చలేదని అనేకమంది న్యాయ, రాజ్యాంగ నిపుణుల నుంచి వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

స్వాతంత్ర్య పూర్వం మహాత్మాగాంధీ, లోకమాన్య తిలక్ వంటి స్వాతంత్ర్య సమర యోధుల్ని ఐపీసీలోని సెక్షన్ 124 ఏ ప్రకారం రాజద్రోహ నేరం క్రింద అరెస్టు చేసి నిర్బంధించారు. 'నేటి కాలానికి అనుగుణంగా లేని అలాంటి వలసవాద చట్టాలు మనకు అవసరమా?' అని రెండేళ్ల క్రితం అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ప్రశ్నించడమే కాదు, సెక్షన్ 124ఏ అమలును నిలిపివేస్తూ చరిత్రాత్మక తీర్పును వెలువరించారు. అప్పటి నుంచీ దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఈ సెక్షన్‌ను అమలు చేయడం ఆగిపోయింది. జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన భారతీయ న్యాయసంహితలో సెక్షన్ 124ఏను అయితే తొలగించారు కాని దాని స్థానంలో సెక్షన్ 152ను ప్రవేశపెట్టారని, ఈ సెక్షన్‌లో గతంలోని రాజద్రోహ క్లాజు కంటే ఎక్కువ కఠినమైన, ప్రమాదకరమైన నిబంధనలున్నాయని, పైగా శిక్షను మూడేళ్లనుంచి ఏడేళ్లకు పెంచారని పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) తెలిపింది. కొత్త నేరచట్టాల్లో వలసవాదం కాలం నాటి కంటే ఎక్కువ క్రూరమైన, ప్రజా వ్యతిరేకమైన నిబంధనలను చేర్చారని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇవాళ రాజద్రోహం అన్న పదానికి అర్థం లేకపోయినా దేశ ద్రోహాన్ని మాత్రం తీవ్రంగా పట్టించుకోవాలని, దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమికతకు ఎవరు నష్టం కలిగించినా చర్యలు తీసుకోవాల్సిందేనని కేంద్రం వాదించవచ్చు కాని సెక్షన్ 124ఏను దుర్వినియోగపరిచినట్లే, సెక్షన్ 152ను కూడా దుర్వినియోగపరచరన్న హామీ ఎవరు ఇవ్వగలరు? గతంలో ముఖ్యమంత్రి ఇంటి ముందు హనుమాన్ చాలీసాను పఠించడాన్ని కూడా రాజద్రోహం క్రింద పరిగణించినట్లు ప్రజలు వ్యక్తం చేసే ఏ నిరసనను అయినా దేశ ద్రోహం క్రింద పరిగణించరన్న గ్యారంటీ ఉన్నదా? 'దేశ భద్రతా ప్రయోజనాలు, సమగ్రత గురించి మాత్రమే కాదు, ప్రజల పౌర హక్కుల గురించి కూడా న్యాయస్థానానికి అవగాహన ఉన్నది. ఈ రెండింటి మధ్యా సమతుల్యం పాటించడం అవసరం. అది చాలా క్లిష్టమైన పని' అని జస్టిస్ రమణ తన తీర్పులో కొన్ని ముఖ్యమైన వ్యాఖ్యలు చేశారు. ఈ సమతుల్యం పాటించగలిగిన పరిపక్వత మన వ్యవస్థలకు ఉన్నదా అన్నదే చర్చనీయాంశం.

> కొత్త నేర చట్టాలను పార్లమెంట్ ఆమోదించినప్పుడు ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాలను బహిష్కరించినందువల్ల పెద్దగా చర్చలు జరగలేదు. ఇప్పుడైనా వాటిపై క్షుణ్ణంగా చర్చ జరపాల్సి ఉన్నది. కీలక రాజ్యాంగ అంశాలపై విశ్లేషించి, వ్యాఖ్యానించే అధికారాన్ని రాజ్యాంగం న్యాయవ్యవస్థకు ఇచ్చింది. చట్టసభలు, న్యాయవ్యవస్థ రెండూ తమ కర్తవ్యాలను నెరవేర్చి నేర చట్టాలను, మానవ హక్కులను అంతర్జాతీయ నాగరిక సమాజానికి అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసినప్పుడే మనం నిజమైన విశ్వగురువు స్థానాన్ని పొందగలుగుతాము.

కొత్త నేర చట్టాల్లో రాజద్రోహం తన పేరును, సెక్షన్‌ను మార్చుకుని ప్రవేశించడం, ఊపా, మోకా వంటి ఉగ్రవాద చట్టాలు వేరుగా కాకుండా తొలిసారి ఐపీసీలో భాగం కావడం, ఎన్‌కౌంటర్ మరణాలను, కస్టడీ మరణాలను నిర్వచించక పోవడం, పోలీసులకు జవాబుదారీ విధానం, బాధ్యతను నిర్ణయించకుండా, వారు అధికార దుర్వినియోగానికి విచ్చలవిడిగా పాల్పడేందుకు మరింత వీలు కల్పించడం, సెక్షన్ 187 క్రింద పోలీసు కస్టడీ రిమాండ్ కాలాన్ని 15 రోజుల నుంచి 90రోజుల వరకు పెంచే అవకాశం ఉండడం విమర్శలకు తావిస్తున్నాయి. సెక్షన్ 113 క్రింద టెర్రరిస్టు చట్టం పోలీసులకు ఊపా కంటే విచ్చలవిడి అధికారాలను కల్పిస్తోందని న్యాయనిపుణులు అంటున్నారు. జస్టిస్ మాలిమత్ నుంచి మాజీ హోం సెక్రటరీ పద్మనాభయ్య వరకు ఎందరో సూచించిన పోలీసు సంస్కరణలను కొత్త నేర చట్టాల విషయంలో పరిగణనలోకి తీసుకున్నట్లు దాఖలాలు లేవు. ఊపా క్రింద అనేకమంది మేధావులు, విద్యార్థులు, ఆదివాసీలు, ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారందర్నీ ఏళ్లతరబడి విచారణ లేకుండా జైలులో బంధించడం, చివరకు 3శాతం మందికి కూడా శిక్ష పడకపోవడం గురించి మానవ హక్కుల సంఘాలు అనేక సందర్భాల్లో ప్రస్తావించాయి. కొత్త నేరాల చట్టాల్లో కూడా నిర్విచక్షణగా అరెస్టులు చేయకుండా పోలీసు అధికారులపై ఆంక్షలు విధించే నిబంధనలు ఏమీ లేవు. ఒక ఖైదీ జైలు శిక్షను తగ్గించాలంటే కేంద్ర ప్రభుత్వ ఆమోదం ఉండాల్సిందేనన్న సెక్షన్ చేర్చడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కనిపిస్తోంది. విద్వేష నేరాలు, మూక ఊచకోత అన్న పదాలకు ఈ చట్టాల్లో తావివ్వక పోవడం కూడా విమర్శలకు తావిస్తోంది. 'బెయిల్ అనేది నిబంధన కావాలి, జెయిల్ అనేది మినహాయింపు కావాలి, నేరం రుజువుకానంతవరకూ ఎవరైనా అమాయకుడే' అన్న కనీస మౌలిక సూత్రాలకు కొత్త నేర చట్టాలు కూడా తిలోదకలిచ్చాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అయినప్పటికీ కొత్త నేర చట్టాల్లో చెప్పుకోదగ్గ మార్పులు లేకపోలేదు. మహిళలు, పిల్లల సంరక్షణకు సంబంధించి ఎన్నో చర్యల్ని చేపట్టారు. చిన్న చిన్న నేరాలు చేసిన వారితో జైళ్లను నింపకుండా కమ్యూనిటీ సేవను ఒక శిక్షగా చేర్చారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు నేర విచారణలో కీలక పాత్రను పోషించారు. డిజిటల్, ఎలెక్ట్రానిక్ సాక్ష్యాలకు ప్రాధాన్యత కల్పించారు. ఫోరెన్సిక్ సైన్స్‌కు ప్రాధాన్యతనిచ్చారు. ఖైదీల పరివర్తన, పునరావాసానికి వీలు కల్పించారు. సాక్షులకు భద్రత కల్పించాలని పేర్కొన్నారు. కాని వీటన్నింటినీ ఎలా చేయాలో మాత్రం వివరించలేదు. పోలీసు కస్టడీలో హింసించకుండా టెక్నాలజీ ద్వారా నేర విచారణ జరిపించాలంటే పోలీసులకు శిక్షణ అవసరం. వారికే కాదు, న్యాయవాదులకూ, ప్రాసిక్యూటర్లకూ ఆధునిక టెక్నాలజీ వినియోగంలో శిక్షణ నీయాల్సిన అవసరం ఉన్నది. భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను ఒక పోలీసు కానిస్టేబుల్‌ను దృష్టిలో ఉంచుకుని రూపొందించారని, హక్కులను ఇచ్చినట్లే ఇచ్చి ప్రతి అధికరణలోనూ దాన్ని వెనక్కి తీసుకునే అవకాశం కల్పించారని రాజ్యాంగ అసెంబ్లీ సభ్యుడు సోమనాథ లాహిరి వ్యక్తం చేసిన అభిప్రాయం కొత్త నేర చట్టాల విషయంలో కూడా ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపించడం లేదు.

మానవ హక్కుల విషయంలో భారత దేశం చాలా వెనుకబడి ఉన్నదన్న విషయంలో సందేహం లేదు. 1948లో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటనను రూపొందించింది. 1966లో పౌర, రాజకీయ హక్కులపై ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పద్దులపై ఐక్యరాజ్యసమితి రెండు ఒడంబడికలను రూపొందించింది. అయినప్పటికీ 1993లో పివి నరసింహారావు హయాంలో కాని మన దేశంలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేయలేదు. మనుషులను హింసించడం, క్రూరంగా, అమానుషంగా వ్యవహరించడానికి వ్యతిరేకంగా 1997లో ఐక్యరాజ్యసమితి ఏర్పర్చిన సదస్సులో భారతదేశం కూడా పాల్గొని సంతకాలు చేసింది. కాని ఇంతవరకూ దాన్ని మనం భారతదేశంలో అమలు చేయలేకపోతున్నాం. ఐక్యరాజ్యసమితి వరకు ఎందుకు? మన రాజ్యాంగంలో పేర్కొన్న కీలకమైన హక్కులనే మన ప్రభుత్వాలు కాలానుగుణంగా విస్మరిస్తూ చట్టాలు చేయడం మొదలుపెట్టాయి 1950లో ప్రవేశపెట్టిన పీడీ చట్టం నుంచి ఊపా వరకు ఎన్నో ఉదాహరణలు మనం పేర్కొనవచ్చు. ఇలాంటి చట్టాల విషయంలో కాంగ్రెస్ పార్టీకి, బీజేపీకి పెద్ద తేడా లేదు. జాతీయ మానవ హక్కుల కమిషన్ స్థాయిని క్రమక్రమంగా తగ్గించడమే కాని పెంచేందుకు పూనుకున్న దాఖలాలు లేవు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిని ఛైర్మన్‌గా నియమించడానికి బదులుగా ప్రభుత్వానికి అనుగుణంగా ఉండే మాజీ న్యాయమూర్తినైనా నియమించుకునే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టి ఈ సంస్థను పేపర్ టైగర్‌గా మార్చివేశారు. దళితులు, ఆదివాసీలు, స్త్రీలకోసం ఏర్పర్చిన ప్రత్యేక కమిషన్లు కూడా అస్మదీయ సంస్థలుగా మారాయి. కొత్త నేర చట్టాలను పార్లమెంట్ ఆమోదించినప్పుడు పార్లమెంట్‌లో ప్రతిపక్షాలను బహిష్కరించినందువల్ల పెద్దగా చర్చలు జరగలేదు. ఇప్పుడైనా మరోసారి వీటిపై క్షుణ్ణంగా చర్చ జరపాల్సి ఉన్నది. రాజ్యాంగం న్యాయవ్యవస్థకు కీలక రాజ్యాంగ అంశాలపై విశ్లేషించి, వ్యాఖ్యానించే (జ్యుడిషియల్ ఇంటర్‌ప్రిటేషన్) అధికారం ఇచ్చింది. కేశవానంద భారతి కేసు నుంచి ఇటీవల ఎన్నికల బాండ్ల కేసు వరకూ సుప్రీం కోర్టు ఇలాంటి ఎన్నో కీలకమైన వ్యాఖ్యానాలు చేసింది. చట్టసభలు, న్యాయవ్యవస్థ రెండూ తమ కర్తవ్యాలను నెరవేర్చి నేర చట్టాలను, మానవ హక్కులను అంతర్జాతీయ నాగరిక సమాజానికి అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసినప్పుడే మనం నిజమైన విశ్వగురువు స్థానాన్ని పొందగలుగుతాము.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ప్రస్తుత ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడం ఎలా?

ఆంధ్రప్రదేశ్‌లో నవశకం ప్రారంభమైందని మనమంతా సంబరాలు చేసుకుంటున్నాం. అయితే ఇప్పటికే ప్రభుత్వం సుమారు 12 లక్షల కోట్ల రూపాయల అప్పుల ఊబిలో ఉంది. దీనికితోడు ఎన్నికల ముందు గత ప్రభుత్వం సంక్షేమం పేరిట అమలు చేసిన పథకాలు, వాటికి అదనంగా చంద్రబాబు నాయుడు ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలంటే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మరింత భారీ స్థాయిలో అప్పులు చేయాలి. దీనివల్ల రాబోయే ఐదేళ్లలో ఋణాల భారం తగ్గక పోగా, మరింత పెరిగి 20 లక్షల కోట్లు దాటవచ్చు. ఇంత భారీ ఋణాల భారాన్ని మోసే ప్రభుత్వం ప్రజలు, పరిశ్రమలు, వ్యాపారవేత్తలపై పన్నులు పెంచక తప్పని పరిస్థితి ఏర్పడితే పారిశ్రామికంగా రాష్ట్రం పురోగమించే అవకాశాలు ఉండవు.

ప్రస్తుత ఆర్థిక దుస్థితిని అధిగమించాలంటే ఆదాయాలు పెంచే మార్గాలను అన్వేషించడంతో పాటు నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలి. వీలైన మేరకు వివిధ స్థాయిల్లో పొదుపు పాటించడం అవసరం. ఇది ముఖ్యమంత్రి, మంత్రులు, శాసన సభ్యులు, ఉన్నతాధికారుల నుంచి ప్రారంభం కావాలి. గత ప్రభుత్వ నేతలు, అధికారులు జరిపిన ఘోర అవినీతి, అక్రమాలను తేటతెల్లం చేస్తూ, ఆ పాలన నుంచి తమ కొత్త ప్రభుత్వానికి అందిన కష్టనష్టాలను శాఖల వారీగా వివరిస్తూ శ్వేతపత్రాలను వెంటనే విడుదల చేయాలి. దాంతో కొత్త పాలకుల కష్టసుఖాలు, ఇబ్బందులు ప్రజలకు తెలిసి వారు తమ ఆశలు, అంచనాలను స్వచ్ఛందంగా నియంత్రించుకోగలుగుతారు.

పొదుపు విషయంలో కొన్ని సూచనలు– 1) అధికారులు, మంత్రులు, శాసన సభ్యులు స్వచ్ఛందంగా తమ సౌకర్యాలను తగ్గించుకోవాలి. మంత్రులు కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను వీలైనంత తగ్గించుకోవాలి. 2) రాష్ట్రం, జిల్లా, రెవిన్యూ డివిజన్ స్థాయిలో ప్రభుత్వ వాహనాలలో 80–90 శాతం వాహనాలను వెహికల్ పూల్‌లో ఉంచాలి. కేంద్రీకృత వాహన వ్యవస్థను జాయింట్ కలెక్టర్ స్థాయి, డివిజన్ స్థాయిలో ఆర్డీవో వంటి అధికారుల నేతృత్వంలోకి తేవాలి. సొంత పనులకు వాహనాలు వాడకుండా చర్యలు తీసుకోవాలి. కొత్త వాహనాలు కొనుగోలు చేయకుండా మంచి నిబంధనలతో ప్రైవేటు వాహనాల వినియోగం వైపు మొగ్గు చూపాలి. 3) ప్రభుత్వం ఉపాధిని ఏర్పాటుచేసే వ్యవస్థ మాత్రమేనని, ఉద్యోగాలు ఇచ్చే యజమాని కాదని ప్రజలకు వివరించి, ఒప్పించాలి. పారిశ్రామికీకరణ, వ్యాపారాభివృద్ధి ద్వారా నిరుద్యోగులకు ఉపాధిని పెంచడానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి. 4) అవినీతి నిరోధక శాఖ, రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలను బలోపేతం చేసి, ఇప్పటివరకు అవినీతి నేతలు, అధికారులు, భూకబ్జాదారులు, పన్ను ఎగవేతదారులు దిగమింగిన ప్రజాధనాన్ని, దాచిన ఆస్తులను త్వరగా స్వాధీనం చేసుకునేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి. 5) ప్రభుత్వ సలహాదారులకు అవసరానికి మించి చెల్లించిన వేతనాలు, న్యాయవాదులకు, న్యాయ సలహాదారులకు, కంట్రాక్టర్లకు పరిధి దాటి చెల్లించిన అదనపు మొత్తాలను చట్ట పరిధి అతిక్రమించకుండా రాబట్టే అవకాశాలను పరిశీలించాలి. 6) 75 శాతానికి మించి పనులు పూర్తయిన అన్ని భవనాలను యుద్ధ ప్రాతిపదికన వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తేగలిగితే, ఇప్పటివరకు అద్దె భవనాలకు చెల్లిస్తున్న కోట్లాది రూపాయలు ఆదా అవుతాయి. ప్రస్తుత నిర్మాణాలన్నీ పూర్తయ్యే వరకు కొత్త ప్రాజెక్టులను చేపట్టకూడదు. 7) ప్రభుత్వ వేడుకలు, విందులను నిరాడంబరంగా నిర్వహించాలి. ప్రభుత్వ కార్యాలయ భవనాలలో దుబారాగా వినియోగిస్తున్న విద్యుత్‌పై నియంత్రణ ఉండాలి. 8) ముందుచూపు, ప్రణాళిక లేకుండా అత్యవసరం అనే నెపంతో రూల్సు పాటించకుండా జరిపే కొనుగోళ్లు, సేవలపై నియంత్రణ అవసరం. 9) నిరర్థకంగా, నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు, భవనాలు, ఇతర ఆస్తుల నుంచి అదనపు ఆదాయాలను పొందే అవకాశాలు పరిశీలించాలి. 10) ప్రజలపై పన్ను భారాన్ని పెంచే ముందు, ఇప్పటికే పన్ను ఎగవేస్తున్న వారి నుంచి బకాయిలు రాబట్టే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. 11) నష్టాలతో నడుస్తున్న కార్పొరేషన్లు, ప్రభుత్వరంగ వ్యాపారాలపై ప్రత్యేకంగా అధ్యయనాలు జరిపి, ఇక కోలుకోలేని స్థాయికి చేరిన వాటిని మూసివేయాలి. 12) ఎర్రచందనం, ఇసుక, ఖనిజాలు, మద్యం వంటి లావాదేవీలలో జరుగుతున్న పన్ను ఎగవేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇందుకు చిత్తశుద్ధితో పనిచేసే అధికారులు, అవసరమైతే విశ్రాంత అధికారుల సేవలు వాడుకోవాలి. 13) నాలుగు దశాబ్దాల కింద మార్కెట్లో బియ్యం ధర నాలుగు రూపాయలు, రోజు కూలి పది రూపాయలు ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన కిలో రెండు రూపాయల బియ్యం ధరను హేతుబద్ధంగా సవరించాలి. వాస్తవానికి ఈ సబ్సిడీ బియ్యం వల్ల స్మగ్లర్లు, అవినీతి అధికారులు మాత్రమే కుబేరులయ్యారు. చాలామంది లబ్ధిదారులు ఈ బియ్యాన్ని వినియోగించడంలేదు. అలాగే అన్న క్యాంటీన్లలో పదార్థాలు, భోజనం ధరలను ఖర్చులకు అనుగుణంగా హేతుబద్ధీకరించాలి. వీటితో చాలావరకు ఆర్థిక భారం తగ్గుతుంది. 14) సంక్షేమం పేరిట అసంబద్ధంగా ప్రవేశపెట్టిన కొన్ని ఉచితాలు, రాయితీలను కేవలం అవసరమైన వారికి అందేలా చర్యలు తీసుకోవాలి. ఇందుకు వివిధ రాజకీయ పార్టీల సహకారం పొందాలి. 15) పోలవరం ప్రాజెక్టును, దాని అనుబంధ కాల్వల వ్యవస్థను వేగంగా పూర్తి చేయగలిగితే, రైతుల ఆదాయాలు, వారి ద్రవ్య వినియోగశక్తి పెరిగి వివిధ పన్నుల ద్వారా ప్రభుత్వ ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయి. 16) కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలోని టీడీపీ, జనసేన అవసరం ఉంది కాబట్టి పోలవరానికి అదనపు నిధులు, ప్రత్యేక హోదా వంటివి పొందడానికి అవకాశం ఉపయోగించుకోవాలి. అలాగే గత పాలకులు వివిధ మార్గాలలో విదేశాలకు తరలించిన అక్రమార్జనను తిరిగి రాష్ట్ర ఖజానాకు తరలించేలా కేంద్రం సాయం కోరాలి. ఆలస్యమైతే అవన్నీ చేతులు మారే అవకాశం ఉంది.



> ప్రస్తుత ఆర్థిక దుస్థితిని అధిగమించాలంటే ఆదాయాలు పెంచే మార్గాలను అన్వేషించడంతో పాటు నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలి. వీలైన మేరకు వివిధ స్థాయిల్లో పొదుపు పాటించడం అవసరం. ఇది ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారుల నుంచి ప్రారంభం కావాలి.

తెలంగాణలో వెలుగు చూసిన వివిధ స్కామ్‌లపై అధ్యయనాలు చేసి అటువంటివి పునరావృతం కాకుండా పటిష్ఠమైన విధానాలు అమలుచేయాలి. ప్రకటించిన వివిధ సంక్షేమ పథకాలపై వ్యయభారాలను వ్యూహాత్మకంగా ప్రజలను ఒప్పించి ఖజానాపై భారాన్ని తగ్గించడంలో శ్రద్ధ వహించాలి.

● యం.వి.జి. అహోబలరావు

ఈసారి అవకాశవాదం అచ్చిరాలేదు!

ఇటీవల్ని ఎన్నికల్లో జాతీయ స్థాయిలో బీజేపీ నాయకత్వాన ఎన్డీఏ, కాంగ్రెస్ నాయకత్వాన ఇండియా కూటములు హోరాహోరీగా పోరాడాయి. అధికార పార్టీకి మోదీ నాయకత్వం వహించి దేశం మొత్తం సుడిగాలి పర్యటన చేశారు. ఈ పర్యటనలో సహజంగా చర్చకు రావాల్సిన రాజకీయ, సాంఘిక, ఆర్థిక అంశాలను మోదీ పక్కకుపెట్టేశారు. అందుకు కారణం తాను గతంలో ప్రధానమంత్రి పదవికి పోటీలో ఉన్నప్పుడు చేసిన హామీలు ఆయన నెరవేర్చలేకపోవడమే. ఆ హామీల ఊసెత్తకుండా రాజకీయేతర విభేదాలపై దృష్టి కేంద్రీకరించారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలకే వ్యతిరేకంగా మాట్లాడారు. చివరకు ఆయన పార్టీ 303 స్థానాల నుండి 240కి పడిపోయింది.

ఇందుకు భిన్నంగా– ఏ పార్టీ, ఏ నాయకులు రాజకీయ స్పష్టతతో ఉన్నారో వారికి సానుకూలమైన రాజకీయ ఫలితాలొచ్చాయి. ఏ పార్టీ, లేదా వ్యక్తి రాజకీయ స్పష్టత లేకుండా అవకాశవాద తటస్థత పాటించారో వారందరికీ సరైన రాజకీయ ఫలితాలు దక్కలేదు. భారతదేశంలో ఏ పార్టీ అయినా ఆదర్శంగా తీసుకోవాల్సింది తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీని. డీఎంకే అధినేత స్టాలిన్ అతిచిన్న పార్టీని కూడా వదలకుండా డీఎంకే కూటమిలో ఇముడ్చుకున్నారు. అందుకే నూటికి నూరు శాతం రాజకీయ విజయం సాధించారు. బీజేపీని నిలవరించారు. ఆ విధానాన్ని కాంగ్రెస్ పార్టీ అనుసరించలేకపోయింది. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాలలో సంకుచిత వైఖరిని ప్రదర్శించింది. బీజేపీని ఆమూలాగ్రం వ్యతిరేకించే రాజకీయ పార్టీలను కలుపుకోలేకపోయింది. దానికి తగిన మూల్యం చెల్లించుకున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్, ఒడిస్సాలో నవీన్ పట్నాయక్, బీఎస్పీ అధినేత్రి మాయావతి వీరంతా తటస్థ వైఖరిని అవలంబించి వైఫల్యం మూటగట్టుకున్నారు. జమ్మూకశ్మీర్‌లో గులాంనబీ ఆజాద్ సైతం తటస్థ వైఖరితోనే లోయలో మునిగిపోయారు. బిహార్‌లో చిరాగ్ పాశ్వాన్, ఆంధ్రప్రదేశ్‌లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ స్పష్టతతోనే విజయం సాధించారు. దీన్నిబట్టి మంచో చెడో స్పష్టతతో ఉంటేనే రాజకీయంగా తగిన ఫలితాలొస్తాయి. అతి తెలివితో, లోపలొకలా బైటొకలా ప్రవర్తించే కపట రాజకీయ నాయకులకు ఫలితాలు రావని పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి.

– డాక్టర్ కె.నారాయణ, సీపీఐ జాతీయ కార్యదర్శి

అంబేద్కర్ చేసిన 'తిరుగుబాటు హెచ్చరిక'

భారత రాజ్యాంగం ఒక్కరోజులో తయారైంది కాదు. దాదాపు మూడొందల మంది మూడేళ్ళకు పైగా భారీ కసరత్తు చేసి రూపొందించిన రాజ్యాంగం మనది. మొదట్లో అయితే దాదాపు నాలుగు వందల మంది సభ్యులు ఉండేవారు.

ఆనాడు మనది వలసదేశం. వ్యవసాయిక దేశం. వెనుకబడిన దేశం. సాంఘిక రంగంలో క్రూరమైన భూస్వామ్య భావజాలం బలంగా ఉన్న దేశం. మెరుగైన సమాజం కోసం ప్రజలు తాపత్రయం పడుతున్న కాలం అది.

అప్పటికి రాజ్యాంగ సభ ముందున్న ప్రధాన ప్రత్యామ్నాయం రాజకీయ రంగంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. ఆర్థిక రంగంలో పెట్టుబడీదారీ వ్యవస్థ. ఈ రెండు విభాగాల్లో యూరప్, అమెరికా దేశాలు చాలా ముందున్నాయి. అనేక దేశాల నుండి, అనేకమంది ఆలోచనాపరుల నుండి అనేక ఆదర్శాలను భారత రాజ్యాంగం స్వీకరించింది. సాంకేతిక పరిజ్ఞానంలో కొత్త ఆవిష్కరణల్ని విదేశాల నుండి స్వీకరించినట్టు సామాజిక, రాజకీయ సిద్ధాంతాలను కూడా స్వీకరించడం ఒక చారిత్రక అవసరమే.

జాన్ లాక్, రూసో, థామస్ జెఫర్సన్, అబ్రహం లింకన్, ఫ్రెంచ్ రివల్యూషన్... ఇలా చెప్పుకుంటూ పోతే ఈ జాబితా చాలా పెద్దది అయిపోతుంది. జర్మనీకి చెందిన వెయిమర్ (Weimar) రాజ్యాంగం కూడ ఇందులో ఉంది. వాటన్నింటి వివరాల్లోకి వెళితే అదో పెద్ద గ్రంథం అవుతుంది. అయితే, భారత రాజ్యాంగ నిర్మాతలు పూర్తిగా విదేశీ సిద్ధాంతాల ప్రభావంలో పడిపోయి దేశీయ సాంప్రదాయాలను పక్కన పెట్టేశారు అనే విమర్శ కూడా ఒకటి వున్నది. ఈ విమర్శను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) చాలా బలంగా ఎక్కుపెట్టింది.

సంఘపరివారం దృష్టిలో దేశీయ పౌర సాంప్రదాయం అంటే మనుస్మృతి. మనుస్మృతినే భారత రాజ్యాంగంగా ప్రకటించాలని వాళ్ళు చాలా కాలంగా చాలా స్పష్టంగా చెపుతున్నారు. చాలా బలంగా ఒత్తిడి పెంచుతున్నారు. ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని విమర్శిస్తూ, మనువును కొనియాడుతూ ఆరెస్సెస్ పత్రిక 'ఆర్గనైజర్' అనేక వ్యాసాలు రాసింది, రాస్తున్నది.

కేవలం రాజ్యాంగ రచనా కమిటీకి ఛైర్మన్‌గా మాత్రమే గాక దాని రూపశిల్పిగానూ వ్యవహరించింది బాబాసాహెబ్ అంబేద్కర్. రాజ్యాంగంలో ప్రజాస్వామిక ఆత్మను ఆయన చాలా జాగ్రత్తగా అమర్చాడు. అదే భారత రాజ్యాంగానికి ప్రాణం. మనువాదులకు ప్రజాస్వామ్యం అంటే పడదు. అంబేద్కర్‌కు మనుస్మృతి అంటే పడదు. దేశ సామాన్య ప్రజల మీద మనువు సాంస్కృతిక ఆధిపత్యాన్ని నిలువరించడానికే ప్రజాస్వామిక రాజ్యాంగ రచన సాగింది. రాజ్యాంగ రచనలో ఇది ప్రధాన అంశం. ప్రజాస్వామిక రాజ్యాంగం అమల్లోనికి వచ్చింది. ఇక మనువు ఆధిపత్యం అంతం అవుతుందని అంబేద్కర్ స్వయంగా ప్రకటించాడు.

భారత రాజ్యాంగం దేశీయ సాంప్రదాయాలను అస్సలు పట్టించుకోలేదు అనడం కూడా నిజం కాదు. ఆయన దేశీయ సాంప్రదాయాలు రెండింటిని గట్టిగా పట్టించుకున్నాడు. ఒకదాని గురించి స్పష్టంగా చెప్పాడు. మరోదాని గురించి నేరుగా చెప్ప లేదు గానీ అర్థం చేసుకోవడం కష్టం ఏమీకాదు. తాను బుద్ధుని బోధనల నుంచి ఉత్తేజాన్ని పొంది రాజ్యాంగ రచన సాగించినట్టు అంబేద్కర్ చెప్పుకున్నాడు. రాజ్యాంగ ప్రధాన ఆదర్శాలైన స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలను తాను బుద్ధుని నుంచి స్వీకరించినట్టు ఒక సందర్భంలో వివరించాడు. అయితే రాజ్యాంగం మీద అంబేద్కర్ చెప్పని ప్రభావం కూడ మరొకటి ఉంది. అది సాయుధ పోరాటం.

> బుద్ధుని బోధనల నుంచి ఉత్తేజాన్ని పొంది రాజ్యాంగ రచన సాగించినట్టు అంబేద్కర్ చెప్పుకున్నాడు. రాజ్యాంగ ప్రధాన ఆదర్శాలైన స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలను తాను బుద్ధుని నుంచి స్వీకరించినట్టు ఒక సందర్భంలో వివరించాడు. అయితే రాజ్యాంగం మీద అంబేద్కర్ చెప్పని ప్రభావం కూడ మరొకటి ఉంది. అది సాయుధ పోరాటం.



1946లో రాజ్యాంగ సభ ఏర్పడే నాటికే నిజాం సంస్థానంలోని తెలంగాణ ప్రాంతపు రెండు మూడు జిల్లాల్లో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో రైతు–కూలీ రాజ్యం కోసం సాయుధ పోరాటం కొనసాగుతోంది. 1948 ఫిబ్రవరిలో భారత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఒక కీలక నిర్ణయాన్ని తీసుకుంది. తాము స్వాతంత్ర్యంగా భావిస్తున్నది నిజానికి అధికార మార్పిడి మాత్రమేనని నిర్ధారించింది. దేశంలోని పీడిత ప్రజలు తమ విముక్తి కోసం సాయుధులై పోరాడాలని పిలుపిచ్చింది. తెలంగాణలో ప్రధానంగానూ, దేశంలోని మరో రెండు మూడు ప్రాంతాల్లో స్వల్పంగానూ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కొన్నాళ్ళు సాయుధ పోరాటాలు కొనసాగాయి. అయితే 1948 సెప్టెంబరు నెలలో కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని విరమించింది. తరువాత పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను చేపట్టింది.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను చేపట్టినప్పటికీ, దేశంలో సాయుధ పోరాట ముప్పు పూర్తిగా తప్పిపోయినట్టు కాదని అంబేద్కర్ భావించాడు. దేశంలో ప్రజాస్వామిక పాలన విఫలం అయితే ప్రజలు సాయుధులై తిరగబడతారని స్పష్టంగా గుర్తించాడు. కమ్యూనిస్టు పార్టీ పేరును నేరుగా ప్రస్తావించలేదు గానీ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పొంచి వున్న సాయుధ పోరాట ముప్పు గురించి మాత్రం రాజ్యాంగ సభలోనే చాలా స్పష్టంగా చెప్పాడు. రాజ్యాంగ సభలో 1949 నవంబరు 25న చేసిన చివరి ప్రసంగంలో అంబేద్కర్ ఈ హెచ్చరిక చేశాడు:

'మూడేళ్ళు కష్టపడి ఒక గొప్ప ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని రూపొందించాం. సమానత్వం మన సిద్ధాంతం; సోదరభావం మన లక్ష్యం. మన రాజ్యాంగం ప్రస్తుతానికి రాజకీయ రంగంలో సమానత్వాన్ని సాధించింది. యుక్త వయస్సు వచ్చిన ప్రతి మనిషికి ఓటు హక్కు కల్పించాం. ప్రతి ఓటుకూ సమాన విలువ ఇచ్చాం. సంపూర్ణ సమానత్వ సాధన దిశగా ఇది తొలి అడుగు. అయితే, రాజకీయరంగంలో సమానత్వాన్ని సాధించినంత మాత్రాన సరిపోదు. సాంఘిక, ఆర్థిక రంగాల్లోనూ సమానత్వాన్ని సాధించాలి. ఈ రాజ్యాంగం ఆధారంగా రేపు ఏర్పడబోయే ప్రభుత్వాలు ఈ రెండు లక్ష్యాలను ప్రథమ కర్తవ్యాలుగా భావించి సాకారం చేయాలి. ఈ కర్తవ్యాలను ప్రభుత్వాధినేతలు నిర్లక్ష్యం చేస్తే, సాంఘిక, ఆర్థిక రంగాల్లో అసమానత్వానికి బాధితులైన ప్రజలు తిరగబడతారు. అంతిమంగా, మనం ఇన్నేళ్ళు కష్టపడి నిర్మించిన ఈ ప్రజాస్వామిక భవనాన్ని పేల్చిపడేస్తారు' అని హెచ్చరించాడు. (అంబేద్కర్ ప్రసంగ భాగానికి ఇది యథాతథ అనువాదం కాకపోయినా సారాంశం మాత్రం అదే).


ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాట పంథాను వదిలి పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను చేపట్టిన తరువాత కూడ దేశంలో సాయుధ తిరుగుబాట్లు జరిగాయి. ఈ అంశాన్ని అంబేద్కర్ సరిగ్గానే అంచనా వేశాడు. ఇప్పుడు సాగుతున్న మణిపూర్ పరిణామాలు అలాంటివే.

ప్రజాస్వామ్యానికీ, సాయుధ పోరాటానికీ మధ్య ఒక విలోమానుపాత సంబంధం వుంటుంది. దేశాధినేతలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుంటే సాయుధపోరాటాలు వెనక్కు తగ్గుతాయి. దేశాధినేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తే సాయుధ పోరాటాలు తలెత్తుతాయి. సాయుధ పోరాటాలు తలెత్తితే ఆ తప్పు ప్రజలది కాదు; ప్రభుత్వాధినేతలది. 'అప్పుడు మరొకర్ని నిందించే అవకాశం కూడ వుండదు; మనల్ని మనమే నిందించుకోవడంతప్ప', (If things go wrong, we will have nobody to blame except ourselves) అంటూ అంబేద్కర్ ఆ ప్రసంగాన్నిముగించాడు.

దేశంలో ఒక వైపు మనుస్మృతిని అభావం చేయడం, మరో వైపు భవిష్యత్తులో తలెత్తే సాయుధ పోరాటాలను నివారించడం అనే లక్ష్యాలతో ప్రజాస్వామిక రాజ్యాంగ రచన సాగింది. దీని అర్థం ఏమంటే, ప్రజాస్వామ్యం బలహీనపడితే ఒకవైపు మనుస్మృతి, మరో వైపు సాయుధ పోరాటాలు బలపడతాయి.


ఇక్కడో కిటుకు ఉంది. మనుస్మృతిని పునరుద్ధరించాలనుకునే వారు ఉద్దేశ్యపూర్వకంగానే, ప్రణాళికబద్ధంగానే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయవచ్చు. ప్రజాస్వామిక ఎన్నికల ద్వారా పాలనాధికారాన్ని దక్కించుకున్నవారు రాజ్యాంగ ఆదర్శాలను, విలువలను తుంగలో తొక్కి నిరంకుశ పోకడలకు పోయినప్పుడు సహజంగానే రాజ్యాంగానికి ఉన్న ఆమోదాంశం సంక్షోభంలో పడుతుంది. అప్పుడు సాయుధ పోరాటాలు తలెత్తే అవకాశాలు పెరుగుతాయి.

■ డానీ
సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు



ఎల్‌నినో కారణంగా వర్షాలు కురవలేదు. సాధారణ వర్షపాతం ఎక్కడా నమోదు కాలేదు. జలాశయాలు నిండలేదు. ఫలితంగా వ్యవసాయానికి సరిపడ సాగునీరు అందలేదు. రెండో పంటకు నీరు ఇవ్వలేమని అధికారులు కరాఖండిగా చెప్పేశారు. గడచిన నీటి సంవత్సరంలో పరిస్థితి ఇది. ఎల్‌నినో వెళ్లిపోయి లానినో వచ్చింది. అయినా ఆశించినంత స్థాయిలో వర్షాలు కురవడం లేదు. ఇప్పుడు కొత్త నీటి సంవత్సరం మొదలైంది. కృష్ణా డెల్టాకు జూన్ నెలలో సాగునీటిని విడుదల చేయాల్సి ఉంది. జూన్ నెల ముగిసి జూలై నెల వస్తోంది. సాగునీటిని విడుదల చేసే పరిస్థితి ఇప్పట్లో కనిపించడం లేదు. జలవనరుల శాఖ ఈ ఏడాది విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఉన్న నిల్వల నుంచి నీటిని విడుదల చేస్తే జలాశయాలు ఖాళీ అయ్యే పరిస్థితి వస్తుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాదీ నీటి తిప్పలే!



సాగునీటి విడుదల ఇప్పట్లో కష్టమే

- జలాశయాల్లో తగ్గుతున్న నిల్వలు
- పులిచింతలలో ప్రస్తుత నీటి నిల్వ 4 టీఎంసీలు
- ప్రకాశం బ్యారేజీలో రెండు టీఎంసీల నిల్వ

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ప్రకాశం బ్యారేజీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలు. దీనికి ఎగువన ఉన్న పులిచింత ప్రాజెక్టు నీటి సామర్థ్యం 45.72 టీఎంసీలు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీలో ఉన్న నీటి నిల్వ రెండు టీఎంసీలు. ఇంకా 1.07 టీఎంసీల నీటి కొరత ఉంది. పులిచింతల ప్రాజెక్టులో 45.66 టీఎంసీల నీటి కొరత ఉంది. ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నిండిన తర్వాత నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీటిని వదులుతారు. సాగర్ గేట్లు ఎత్తిన తర్వాత పులిచింతలకు కృష్ణమ్మ పరుగులు తీస్తుంది. పులిచింతల నుంచి నీరు విడుదలైతేనే ప్రకాశం బ్యారేజ్ నిండుకుంటుంది. ఈ పరిస్థితి గడచిన నీటి సంవత్సరంలో కనిపించలేదు. ఇప్పుడూ అదే పరిస్థితి కొనసాగుతోంది. కనీసం పట్టిసీమ నుంచి అయినా నీటిని తీసుకుని సాగు నీటిని విడుదల చేద్దామని అధికారులు భావిస్తున్నారు. ఇక్కడున్న పరిస్థితే అక్కడా కనిపిస్తోంది. గోదావరికి 10 వేల క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి వస్తోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 14 అడుగుల దాటిన తర్వాత పట్టిసీమ పంపులకు పని చెప్పే పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 13.4 అడుగులు ఉంది. దీంతో ఇక్కడి నుంచి నీటిని తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది.

ఇటు కృష్ణా తూర్పుడెల్టాకు, అటు పశ్చిమ డెల్టాకు నీటిని విడుదల చేయడానికి రెండు ప్రధాన మార్గాలు ఉన్నాయి. ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేయడం ఒక మార్గం. పట్టిసీమ నుంచి గోదావరి నీటిని తరలించి విడుదల చేయడం రెండో మార్గం. తూర్పు, పశ్చిమ డెల్టాలు సస్యశ్యామలంగా ఉండడానికి ఈ రెండు మార్గాలు కీలకం. వాటితో సంబంధంలేని మరో మార్గం మూసీ. హైదరాబాద్‌లో విస్తారంగా వర్షాలు కురిస్తే మూసీ నది నుంచి నీరు వస్తుంది. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా వికారాబాద్ మండలం

మూసీ ముందుకొస్తేనే...

అనంతగిరి అడవుల్లో పుట్టిన మూసీ నది హైదరాబాద్ నగరం మధ్య నుంచి ప్రవహించి నల్లగొండ జిల్లాకు చేరుకుంటుంది. పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ భాగాన కృష్ణా నదిలో కలుస్తుంది. వికారాబాద్, హైదరాబాద్‌లో కురిసిన వర్షం నీరు ఈ మూసీ నది ద్వారా కృష్ణాలోకి చేరుతుంది. ఇది కాకుండా పాలేరు, కట్టలేరు, వైరా వాగుల నుంచి వచ్చిన నీరు కీసర వద్ద నదిలో కలుస్తాయి. హైదరాబాద్‌తోపాటు వరంగల్, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసినా నీటి లభ్యత ఉండేదని అధికారులు చెబుతున్నారు.



ఆస్పత్రిలో పెన్షన్ అందుకుంటున్న లబ్ధిదారు



పోచంపల్లికి చెందిన వెంకటరమణకు పెన్షన్ అందిస్తున్న ఏవో ప్రసన్నకుమార్

మేమున్నామని...

- నిన్నటి వరకు కుటుంబానికి భారంగా ఉన్నామని ఆవేదన
- నేడు .. భరోసాతో జీవితంపై పెరిగిన ఆశలు
- మంచంపై జీవనం సాగిస్తున్న వారికి ఉమ్మడి జిల్లాలో రూ.15 వేల పెన్షన్
- ఎన్టీఆర్ జిల్లాలో 99.06 శాతం...
- కృష్ణా జిల్లాలో 99.04 శాతం పెన్షన్ పంపిణీ

మంచంలో ఉన్న వారికి పెన్షన్లు

మంచంలోనే కదల్లేని స్థితిలో జీవించాల్సిన దుర్భర పరిస్థితుల్లో .. కుటుంబంలో తాము భారంగా మారామని.. ఎందుకు బతికి ఉన్నామా? అని అనుక్షణం బాధపడుతూ కుంగిపోయే వారికి టీడీపీ ప్రభుత్వం భరోసా నింపింది. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అమాంతం రూ.15 వేలు ఇవ్వటంతో వారి కంట ఆనంద భాష్పాలు రాలాయి. కదల్లేని స్థితిలో ఉన్న తాము కుటుంబానికి భారం కాదని సంబరపడ్డారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో సచివాలయ ఉద్యోగులు మంచంలో ఉన్న వారి చెంతకే వెళ్లి పెన్షన్లు అందించారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి జిల్లాలో విధి వంచితులుగా మారి మంచం మీదే జీవించాల్సిన పరిస్థితిలో ఉన్నవారు ఉన్నారు. అర్హత ప్రాతిపదికన ఉమ్మడి జిల్లాలో వెయ్యి మందికి రూ.15 వేల పెన్షన్ మంజూరైంది. క్రానికల్ వ్యాధుల బారిన పడిన వారు, కండరాలు చచ్చుపడిపోయిన వారు, పక్షవాతం వచ్చి మంచాన పడిన వారికి పెంచిన పింఛను కొండంత అండగా మారింది. అలాగే వీల్ చైర్‌కే పరిమితమైన వారికి కూడా ఎంతో భరోసానిచ్చింది. మంగళవారం రెండు జిల్లాల్లో సచివాలయ ఉద్యోగులు హాస్పిటల్స్‌లో వైద్యసేవలు పొందుతున్న వారికి, ఇంట్లో మంచాలపై ఉన్న వారికి పెన్షన్లు అందించారు.

దాదాపు నూరు శాతం పెన్షన్ పంపిణీ

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ రెండో రోజున.. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 99.06 శతం, కృష్ణాజిల్లా వ్యాప్తంగా 99.04 శాతం మేర పింఛన్ల పంపిణీ చేశారు. చనిపోయిన వారికి మినహా దాదాపుగా నూరు శాతం పింఛన్లు అందినట్టుగానే భావించాల్సి ఉంటుంది. ఒక్క మైలవరంలో ఏడుగురు పింఛన్లను వీఆర్‌వో మల్లంపల్లి తరుణ్ వాడేసుకోవటంతో ఎన్టీఆర్ జిల్లాలో స్వల్ప ఇబ్బంది ఎదురైంది. ఆ వీఆర్‌వోపై స్థానిక ఎండీవో కేసు పెట్టడం ద్వారా రికవరీ చేయించి పెన్షన్లు పంపిణీ చేయించినట్టుగా తెలుస్తోంది. రెండో రోజు రాత్రి 8 గంటల నాటికి ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 2,35,477 మంది పెన్షనర్లకుగాను 2,33,257 మందికి అందించారు. వీరికి రూ.160.53 కోట్ల మేర చెల్లించాల్సి ఉండగా.. రూ.159.28 కోట్లు మేర చెల్లించారు. కృష్ణాజిల్లాలో మొత్తం 2,42,321 మందికి పెన్షన్లు చెల్లించాల్సి ఉండగా.. మంగళవారం రాత్రి 8 గంటల నాటికి 2,39,999 మందికి పెన్షన్లు అందించారు. వీరికి రూ.162.49 కోట్ల మేర చెల్లింపులు చేయాల్సి ఉండగా.. రూ.161 కోట్లు చెల్లించారు.

అవినీతి శాంతిపై వేటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రెండ్రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం

కృష్ణాజిల్లా దేవదాయశాఖ అధికారిణి కె.శాంతిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు మంగళవారం దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారమే ఈమెను ఎన్టీఆర్ జిల్లా దేవదాయశాఖ అధికారిణిగా బాధ్యతల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు వెలువడగా తాజాగా ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం. కృష్ణా జిల్లా దేవదాయశాఖ అధికారిణిగా ఎన్.సంధ్యకు అదనపు బాధ్యతల అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈమె ప్రస్తుతం ఏలూరు జిల్లాలోని శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ ఈవోగా ఉన్నారు.

సస్పెండ్ చేసిన దేవదాయశాఖ కమిషనర్

- సస్పెన్షన్ ఉత్తర్వుల్లో ఆంధ్రజ్యోతి కథనాల్లోని ప్రతి అంశం ప్రస్తావన
- కృష్ణాజిల్లా దేవదాయశాఖ అధికారిణిగా ఎన్.సంధ్యకు



అధికారిణి శాంతి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల దేవదాయశాఖ అధికారిణిగా శాంతి 2021లో బాధ్యతలు తీసుకున్నారు. వైసీపీ నేత విజయసాయి రెడ్డి అండతో ఆమె విధుల్లో చేరిన నాటి నుంచే చెలరేగిపోయారు. ప్రతి పనికీ ఓ రేటు కట్టి మరీ అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చాయి. ఉద్యోగులను సైతం వేధింపులకు గురి చేయడంతో ఆమె తీరుపై ఒక దశలో ఉద్యోగులు ఆందోళనకు సైతం సిద్ధమయ్యారు. శాంతి తీరుపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించింది. మరోవైపు రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోవడం.. విజయసాయి రెడ్డి హవాకు చెక్ పడటంతో ఎట్టకేలకు కొత్త ప్రభుత్వం శాంతి అక్రమాలపై దృష్టి పెట్టింది. ఆంధ్రజ్యోతి కథనాలపై రాజమహేంద్రవరం ఆర్‌జేసీ సుబ్బారావును విచారణాధికారిగా నియమించింది. ఈ విచారణలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలన్నీ అక్షర సత్యాలని నిరూపితం కావడంతో ఎట్టకేలకు శాంతిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. చివరి నిమిషం వరకు శాంతి తన సస్పెన్షన్ ఉత్తర్వులను ఆపించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. కానీ దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణించడంతో ఎట్టకేలకు ఆమెపై వేటు వేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

దేవదాయ శాఖ ఆస్తి ధ్వంసం కేసులో లంచం

విజయవాడ బ్రాహ్మణ వీధిలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి ప్రకాశం రోడ్డులోని అట్టా రత్తయ్య వీధిలో 8 దుకాణాల సముదాయం ఉంది. అందులో ఓ షాపును లీజుదారుడు కూలగొట్టారు. దీనిపై 2023 డిసెంబరు 30న విజయవాడ గవర్నర్‌పేట పోలీసుస్టేషన్‌లో ఈవో శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. షాపు పైభాగంతో ఎలాంటి సంబంధం లేకపోయినా దాన్ని కూలగొట్టినట్లు ఆ ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు. అక్రమంగా దేవదాయ ఆస్తులను కూలగొట్టడం నేరమని నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. అయితే వారం రోజులకే సీను మారిపోయింది. జిల్లా ఉన్నతాధికారిణితో సదరు లీజుదారుడికి బేరం కుదరడంతో ఈవో ఆ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలూ తీసుకోవద్దని కోరుతూ 2024 జనవరి 6న లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. జిల్లా దేవదాయశాఖ అధికారిణి సైతం పూర్తిగా లీజుదారుడికి కొమ్ముకాసే విధంగా నివేదికను ఇచ్చారు. సదరు షాపు దురదృష్టవశాత్తు మాత్రమే కూలిపోయిందని, దీనికి లీజుదారుడికి ఎటువంటి సంబంధం లేదని, కూలగొట్టిన షాపు తాలుకా శిథిలాలను దేవదాయశాఖ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా తొలగించడం మాత్రమే జరిగిందని ఆ రిపోర్టులో పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని ముందస్తుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకుండా అవినీతికి ఆస్కారం ఇచ్చేలా వ్యవహరించారని సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆలయ ఆస్తిని పక్కదారి పట్టించి..

కృష్ణా జిల్లా ఉయ్యూరులోని సోమేశ్వరస్వామి ఆలయానికి ఏడాదికి రూ.70 లక్షల వరకు ఆదాయం వస్తుంది. దేవదాయశాఖ నిబంధనల ప్రకారం వార్షికాదాయం రూ.25 లక్షలు దాటిన ఆలయాన్ని 6ఏలోకి చేర్చాలి. కానీ ఈ విషయాన్ని జిల్లా దేవదాయశాఖ అధికారిణి హోదాలో తొక్కిపెట్టి ఆ ఆదాయాన్ని ఆమె పక్కదారి పట్టించారు. ఇదే విషయాన్ని సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

- వన్‌టౌన్ కెనాల్ రోడ్డులో ఉన్న బావాజీ మఠానికి సుమారు రూ.55 లక్షలకు పైగా అద్దె బకాయిలు ఉన్నప్పటికీ అద్దెదారుల నుంచి వసూలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనికి శాంతి అవినీతే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే అంశాన్ని సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సస్పెన్షన్ ఉత్తర్వులో ఆంధ్రజ్యోతి కథనాల ప్రస్తావన

సత్యనారాయణపురం శివాలయం కల్యాణ మండపాన్ని స్వాధీనం చేసుకోమ్మని కోర్టు ఆదేశం ఉన్నప్పటికీ ఆ అధికారిణి స్వాధీనం చేసుకోకుండా ఆక్రమణదారులతో కుమ్మక్కయినట్టు ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురాగా ఇదే విషయాన్ని సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరోవైపు ఈమెను ఎన్టీఆర్ జిల్లా దేవదాయశాఖ అధికారిణిగా బాధ్యతల నుంచి తొలగించిన వెంటనే కల్యాణమండపాన్ని స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

- పాత శివాలయం ప్రాంగణంలో ఉన్న రమా సహిత విఘ్నేశ్వర స్వామివార్ల దేవస్థానానికి గవర్నరుపేటలో 9 షాపులు, 2 గోదాములు, ఏడు రూంల లాడ్జీ ఉన్నాయి. ఈ షాపు యజమానుల నుంచి 24 నెలలుగా అద్దె వసూలు చేయలేదు. దీంతో సుమారు రూ.42,48,000 ఆదాయాన్ని దేవదాయశాఖ కోల్పోయినట్లయింది. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురాగా సస్పెన్షన్ ఉత్తర్వుల్లోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించారు.
- రెండు జిల్లాలకు అధికారిణిగా ఉన్న శాంతి తాడేపల్లిలో ఏకంగా ఓ విల్లానే నిర్మిస్తున్నారన్న విషయాన్నీ సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతోపాటు యాన్యువల్ ప్రాపర్టీ రిటర్న్‌లు దాఖలు చేయడంలోనూ శాంతి నిర్లక్ష్యంగా వ్యవహరించారని సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉద్యోగుల్లో ఆనందం

శాంతిపై సస్పెన్షన్ వేటు పడిందన్న సమాచారంతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని దేవదాయశాఖ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఆమె సస్పెన్షన్ ఉత్తర్వులను ఒకరికొకరు గ్రూపుల్లో షేర్ చేసుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఎట్టకేలకు ఆమెపై సస్పెన్షన్ వేటు పడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పట్టిసీమ వస్తుందహో..



పట్టిసీమ ఎత్తిపోతల పథకం (ఫైల్)

- నేడు నీటిని విడుదల చేయనున్న మంత్రి నిమ్మల
- ఐదేళ్ల తర్వాత మళ్లీ కళకళ

పోలవరం, జూలై 2 : ఐదేళ్ల తర్వాత పట్టిసీమ ఎత్తిపోతల పథకం మళ్లీ కళకళలాడనుంది. గత ప్రభుత్వ పాలనలో పూర్తిగా పడకేసి రైతులకు సాగు నీటి కష్టాలను మిగిల్చింది. ఈ పథకం ద్వారా రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు బుధవారం ఉదయం 7.27 గంటలకు నీటిని విడుదల చేయనున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేలోగా రైతులు సాగు నీటి కోసం ఇబ్బందులు పడకూడదనే దృక్పథంతో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు రూ.1,600 కోట్లతో ఏడాది వ్యవధిలోనే పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. దీని నుంచి 1800 క్యూసెక్కుల జలాలు పంపిణీ జరిగేది. దీని ద్వారా ఏటా నాలుగు లక్షల ఎకరాల్లో సాగు చేసేవారు. టీడీపీ ప్రభుత్వం పట్టిసీమ ఆరంభం నుంచి 2019 రబీ సీజన్ వరకూ 305.07 టీఎంసీల నీటిని కృష్ణా, రాయలసీమ, ఉమ్మడి పశ్చిమ డెల్టాలకు పంపిణీ చేసింది. తర్వాత వైసీపీ పాలనలో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని నాలుగేళ్లు పడకేయించి రైతుల ఉసురు పోసుకుంది. 2020లో 4.5424 టీఎంసీలు, 2021లో 1.6417 టీఎంసీలు పంపిణీ చేసింది. నాలుగేళ్లలో 58.7421 టీఎంసీలు మాత్రమే ఇచ్చింది. దీనివల్ల రైతులకు సాగు నీరందక, పంటలు నష్టపోయి విరామం పాటించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది పంటలకు సాగు నీటి కోసం ఎదురు చూస్తున్న రైతులకు పట్టిసీమ నేటి నుంచి జీవధార కానుందని రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ కట్టడం: కూల్చివేతపై హైడ్రామా!

- కూల్చివేసేందుకు సిద్ధమైన ఎమ్మెల్యే
- అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత
- చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చిన తహసీల్దార్

6లో..

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ బదిలీ



చిట్టినగర్, జూలై 2 : విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శ్రీకాకుళం కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 2022లో వీఎంసీ కమిషనర్‌గా నగరానికి వచ్చిన ఆయన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వీఎంసీకి పలు అవార్డులు తీసుకొచ్చారు. నగరాభివృద్ధితోపాటు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దారు. నగరంలో పార్కులతోపాటు రహదారుల సుందరీకరణలో ప్రత్యేక చొరవ తీసుకొని అభివృద్ధి చేశారు. స్వరాజ్ మైదానంలో డాక్టర్ అంబేడ్కర్ స్మృతివనం, ఎయిర్‌పోర్టు కారిడార్, కృష్ణానది వెంబడి కృష్ణలంక వారధి నుంచి రామలింగేశ్వర నగర్ వరకు రివర్ ఫ్రంట్ పార్కు, జాతీయ రహదారి 65 వెంబడి శిథిలావస్థలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కును అభివృద్ధి చేశారు. స్వప్నిల్ హయాంలోనే జాతీయ స్థాయిలో పరిశుభ్రత విభాగంలో నగరం ఫైవ్ స్టార్ రేటింగ్ పొందింది.



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న మిర్చి బాధిత రైతులు

జాతీయ రహదారిపై మిర్చి రైతుల నిరసన

- నిలిచిపోయిన వాహనాలు..

పెనుగంచిప్రోలు, జూలై 2 : తోటచర్ల క్రాస్ రోడ్డు వద్ద 65 నెంబర్ జాతీయ రహదారిపై మండలంలోని కొల్లికొల్ల, వెంకటాపురం గ్రామాలకు చెందిన మిర్చి రైతులు మంగళవారం నిరసన తెలియజేశారు. దీంతో రహదారిపై వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కొల్లికొల్ల, వెంకటాపురం గ్రామాలకు చెందిన సుమారు 70 మంది రైతులు కంచికచర్లకు చెందిన నరసింహారావు అనే వ్యాపారికి ఈ సీజన్‌లో రూ.96 లక్షల విలువ చేసే మిరపకాయలను అదే గ్రామానికి చెందిన బ్రోకర్ ద్వారా విక్రయిరు. ఎంతకీ డబ్బు చెల్లించకపోవటంతో నరసింహారావుపై రైతులు పెనుగంచిప్రోలు స్టేషన్‌లో కేసు పెట్టారు. నరసింహారావు పారిపోయి నోటీసును పంపించడంతో ఐపీ కేసును పోలీసులు నమోదు చేశారు. బాధిత రైతులంతా సన్న, చిన్న కారు రైతులు. రూపాయి కూడా రాకపోవటంతో దిక్కుతోచని స్థితిలో మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో బాధిత రైతులు ఎడ్లబండ్లతో తోటచర్ల వద్ద నిరసనకు దిగటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ పి.రాంబాబుతోపాటు నందిగామ సబ్ డివిజన్ పరిధిలోని పలువురు ఎస్ఐలు, సీఐలు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు సర్ది చెప్పి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఆనకట్ట మరమ్మతులకు నిధులివ్వండి

- సీఎం చంద్రబాబును కలిసిన తాతయ్య, జనార్దన్

జగ్గయ్యపేట, జూలై 2 : పోలంపల్లి వద్ద ఉన్న మునేరు ఆనకట్ట తాత్కాలిక మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని, తెలంగాణాలో కాల్వకు పడిన గండి పూడ్చేందుకు ఆ ప్రభుత్వంతో మాట్లాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్‌తో కలిసి కోరారు. మంగళవారం వారు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఖరీఫ్ సీజన్‌లో మునేరు ఆనకట్ట కింద ఉన్న 20వేల ఎకరాల ఆయకట్టును పరిరక్షించేందుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాల్సి ఉందని, తెలంగాణాలో ప్రధాన కాల్వకు పడిన గండిని పూడ్చటం, అక్కడ ముంపుకు గురైతున్న రైతుల సమస్యల పరిష్కారానికి తెలంగాణా యంత్రాంగం చొరవ చూపేలా చూడాలని కోరారు. కాగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను ఈ అంశంపై ఖమ్మం జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని చంద్రబాబు ఆదేశించారు.



సీఎంకు వినతి పత్రం ఇస్తున్న తాతయ్య, తొండెపు జనార్దన్

చౌక డిపోపై అధికారుల దాడి.. సీజ్

మచిలీపట్నం టౌన్, జూలై 2 : వైసీపీ నాయకుల అండదండలతో ఒక చౌక డిపో డీలరు బదులు మరో డీలరు రెండేళ్ల పాటు చౌక డిపో నడిపారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. కొల్లు రవీంద్ర మంత్రి అయిన తరువాత ఒక్కొక్క అక్రమం వెలుగులోకి వస్తోంది. మచిలీపట్నం ఈడేపల్లిలో 0681027 నెంబరు గల చౌక డిపో సుజాత పేరుతో ఉంది. 2022లో ఆమె తన కుమార్తె కాన్పుకు సహాయం చేసేందుకు రెండు నెలల పాటు పెట్టారు. ఆ సమయంలో ఆ ప్రాంతానికి చెందిన పల్లి నాగమణికి తాత్కాలికంగా డిపో నడిపేందుకు అనుమతి ఇచ్చారు. రెండు నెలల సెలవు అనంతరం నాగమణి డిపోను సుజాతకు అందించలేదు. సుజాత రెండేళ్ల నుంచి తన డిపో కోసం పోరాడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో స్థానికులు జిల్లా పౌర సరఫరాల శాఖాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పురస్కరించుకుని మంగళవారం సివిల్ సప్లయిస్ డిటి సుభాన్‌బీ, 47వ సచివాలయ వీఆర్వో నాగబాబుకు పల్లి నాగమణి నిర్వహిస్తున్న డిపోపై దాడి చేశారు. విచారణ జరిపారు. విచారణలో డిపో సుజాతదని తెలిసింది. అంతే కాకుండా డిపోలో బియ్యం నిల్వలు 70 కిలోలు తక్కువ ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా డిపోను ముందుగా సీజ్ చేశారు. వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు 23వ రేషన్ షాపు డీలరు నాగేశ్వరరావుకు స్వాధీన పరిచారు. అయితే ఈ సందర్భంగా తగాదా ఏర్పడటంతో పోలీసులు రంగంలోకి దిగారు.





పుల్లేరు గట్టున రేవు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న పొట్లూరి రవికుమార్

తాగునీటి రేవులు ప్రారంభం

గుడ్లవల్లేరు, జూలై 2 : గ్రామంలోని నీలకంటేశ్వరపురం, మూడవవార్డుల్లో పుల్లేటి గట్టున స్థానిక ప్రజలు నీరు తెచ్చుకొనేందుకు మూడు కాంక్రీట్ రేవులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వెనిగండ్ల ఫౌండేషన్ ద్వారా నిర్మించి ప్రజలకు అంకితమిచ్చారు. రేవులను మంగళవారం ప్రారంభించారు. నీలకంటేశ్వరపురంలో రేవులను మాజీ సర్పంచ్ పళ్లెం నరసింహారావు, వెనిగళ్ల నాగేశ్వరరావు, సూరపనేని పరందామయ్యలు, మూడోవార్డు మామిడికోళ్ల రోడ్డులో రేవును గుడ్లవల్లేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు పొట్లూరి రవికుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో వల్లభనేని రంగబాబు, చాపరాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

పేటలో పెరిగిన డయేరియా కేసులు

- ఆసుపత్రిలో 10 మంది చేరిక

జగ్గయ్యపేట, జూలై 2 : జగ్గయ్యపేటలో మంగళవారం కొత్తగా 10 మంది డయేరియా లక్షణాలతో ఆసుపత్రిలో చేరారు. వీరిలో ఐదేళ్లలోపు ఐదుగురు చిన్నారులు ఉన్నారు. వత్సవాయి మండలం లింగాలకు చెందిన ఇ.నాగరాజు (3), షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన ఎస్.వీరకృష్ణ (1.5), కే.ధనుశ్రీ (2), జగ్గయ్యపేట పట్టణంలో దుర్గాపురంకు చెందిన టి.ప్రధాన్ (4), తొర్రగుంటపాలేనికి చెందిన కే.మధు (3) ఆసుపత్రిలో చేరగా ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం విజయవాడ రిఫర్ చేశారు. వత్సవాయి మండలం ఇందుగపల్లి గ్రామానికి చెందిన ఎస్.ఉమా, మంగోల్లు గ్రామానికి చెందిన ఎస్‌కే సనా (12), జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామానికి చెందిన బి.వీరేశ్వరి (22), నందిగామ మండలం మాగల్లు గ్రామానికి చెందిన డి.సంజన (14) చికిత్స పొందుతున్నారు. మంగళవారం డయేరియా నుంచి కోలుకున్న ఐదుగురిని డిశ్చార్జ్ చేసినట్టు సూపరింటెండెంట్ హరీష్ తెలిపారు. డయేరియా కేసులను గుర్తించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లతో నిమిత్తం లేకుండా నేరుగా డయేరియా బాధితులు ఆసుపత్రులకు వస్తే చర్యలు తీసుకుంటామని బూచవరం పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ హెచ్చరించారు.

అక్రమ కట్టడం కూల్చివేతపై హైడ్రామా!

- కూల్చివేసేందుకు సిద్ధమైన ఎమ్మెల్యే
- అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత
- చర్యలు తీసుకొంటామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చిన తహసీల్దార్



ఎక్స్‌కవేటర్‌తో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

ఎ.కొండూరు, జూలై 2 : తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చెప్పిన సమయానికే కంభంపాడు గ్రామం చేరుకుని ఎంపీపీ భర్త అక్రమంగా నిర్మిస్తున్న 2 ఫ్లస్‌జీ భవన కూల్చివేత పనులకు శ్రీకారం చుట్టారు. భారీగా టీడీపీ, జనసేన శ్రేణులు అక్కడకు చేరుకోవడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాస్త ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎ.కొండూరు ఎంపీపీ భర్త కాలసాని చెన్నారావు వైసీపీ పాలనలో అధికారం అడ్డు పెట్టుకొని కంభంపాడు మెయిన్ సెంటర్‌లో విలువైన స్థలాన్ని కబ్జాచేసి అక్రమ నిర్మాణం చేపట్టారు. దీనిపై గ్రామస్థుల నుంచి అనేక ఫిర్యాదులు రావడంతో, స్వయంగా ఎమ్మెల్యే రంగంలోకి దిగారు. పక్కనే నివాసం ఉంటున్న షేక్ తహర్ ఉనీసా బేగం తన ఇంటికి దారి లేకుండా చేసి తీవ్ర ఇబ్బందికి గురిచేస్తున్నరని ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే భవనాన్ని పరిశీలించి, స్థానిక పంచాయతీ, రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అక్రమ నిర్మాణాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు కూల్చివేస్తామని ఎమ్మెల్యే ఫేస్ బుక్‌లో పోస్టు చేశారు. దీంతో ముందస్తుగా మైలవరం ఏసీపీ ఎస్.కృష్ణమోహన్, తిరువూరు సీఐ అబ్దుల్ నబీ గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు నిర్మాణం వద్ద ఉన్న వైసీపీ వర్గీయులను బయటకు పంపివేశారు. కొద్ది సేపటికి ఎమ్మెల్యే కొలికపూడి కంభంపాడు చేరుకోగా పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు వచ్చారు. అక్రమ నిర్మాణంపై రెవెన్యూ అధికారుల స్పందన కోసం రెండు గంటలు వేచిచూశారు. అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో స్వయంగా ఎమ్మెల్యే ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేతకు సిద్ధం కాగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులకు టీడీపీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. ఎక్స్‌కవేటర్‌తో నిర్మాణాన్ని కూల్చివేస్తుండగా, తహసీల్దార్ షేక్ రియాజ్ హుస్సేన్, మైలవరం ఏసీపీ కృష్ణమోహన్ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో మాట్లాడారు. తక్షణం అక్రమ నిర్మాణాన్ని స్వాధీనం చేసుకొని 144 సెక్షన్ విధిస్తామని, నిర్మాణంపై పూర్తి స్థాయి విచారణ చేసి చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే, టీడీపీ నేతలు శాంతించారు. ముస్లిం మహిళకు దారి సౌకర్యం కల్పించారు. సుమారు మూడు గంటల పాటు హైడ్రామా నడిచింది. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

- వసతి గృహాల విద్యార్థులను ఉజ్వల కెరీర్ దిశగా నడిపించాలి
- ప్రణాళిక ప్రకారం 'ప్రత్యేక' పాఠ్య కార్యక్రమాల అమలు
- అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన ఆదేశం
- వైద్య, ఆరోగ్య శాఖ కార్యకలాపాలపై సమీక్ష



విజయవాడ లీగల్, జూలై 2 : వసతి గృహాల్లో వుండి చదువుకొంటున్న విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందేలా చూడటంతో పాటు భవిష్యత్తులో ఉన్నత కెరీర్‌ను సొంతం చేసుకొనే దిశగా వారిని నడిపించాలని, ఇందుకు షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక సహ పాఠ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో బీసీ, ఎస్సీ, గిరిజన, మైనార్టీ సంక్షేమశాఖలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాస్థాయిలో ఈ శాఖల కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో ప్రవేశాలు జరిగేలా చూసి నాణ్యమైన విద్యతో పాటు భవిష్యత్తులో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదం చేసే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందుకు ఆయా విభాగాల్లో నిపుణులను ఆహ్వానించాలని సూచించారు. ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని, విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, విలువలతో బయటకు వచ్చినపుడే వసతి గృహాల లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. సైకలాజికల్ కౌన్సెలింగ్, మోటివేషన్ క్లాసులు వంటివి నిర్వహించాలన్నారు. సబ్జెక్టు నిపుణులు, ట్యూటర్లతో ప్రత్యేక శిక్షణ ఇప్పించడం, విద్యార్థులు ఏ అంశాల్లో వెనుకబడివున్నారో ఆయా అంశాలపై పట్టు సాధించేలా చూడాలన్నారు. అకడమిక్, నాన్ అకడమిక్ పరంగా అవసరమైన అంశాలకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇ.కిరణ్మయి, సాంఘిక సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత, మైనార్టీ సంక్షేమ అధికారి షంషున్నీసా బేగం, బీసీ కార్పొరేషన్ ఈడీ కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష

కలెక్టర్ సృజన, జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాల అమలు పురోగతిపై చర్చించారు. ఆసుపత్రుల్లో అందుబాటులో వున్న వనరులను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ప్రజలకు ఆరోగ్య సేవలందించాలన్నారు.

గర్భిణులకు సంబంధించి మొదటి త్రైమాసికంలో 100 శాతం నమోదు తప్పనిసరని, ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో గర్భిణులకు అవసరమైన వైద్యసేవలు అందించడంతో పాటు కాన్పులు జరిగేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఆరోగ్య కేంద్రం పనిచేయాలని, జిల్లాలో మాతా, శిశుమరణాల నివారణకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ బీసీకే నాయక్, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ జె.సుమన్, డీఎల్ఏటీఓ జె.ఉషారాణి, డీఐవో అమృత తదితరులు పాల్గొన్నారు.

పోతేపల్లి డ్రెయిన్ సమస్య పరిష్కరిస్తాం

- కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, జూలై 2(ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మండలం పోతేపల్లి గ్రామంలో డ్రెయిన్ సమస్యకు శాశ్వతపరిష్కారం చూపుతామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. పోతేపల్లివద్ద రైల్వే ట్రాక్ డబ్లింగ్‌లో భాగంగా డ్రెయిన్ పూడుకుపోవడంతో గ్రామస్తులు ఇటీవల మంత్రి కొల్లు రవీంద్రకు విషయం తెలియజేశారు. భారీవర్షాలు కురిసిన సమయంలో గ్రామపరిధిలోని పంటపొలాలు మునిగిపోవడంతోపాటు, గ్రామంలో నీరు రోజులతరబడి నిల్వ ఉండి పోతోందని గ్రామస్తులు మంత్రికి తెలియజేశారు. ఈ ప్రాంతాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు ఈనేపథ్యంలో కలెక్టర్, రైల్వే విభాగం అధికారులు, ఆర్‌డీవో ఈ ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. రైల్వేట్రాక్ రెండువైపులా ప్రాంతాలను పరిశీలించి రైల్వేట్రాక్‌కు ఇబ్బంది లేకుండా డ్రెయిన్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రైల్వేవిభాగం డీఈ కిరణ్, సెక్షన్ ఇంజనీర్ ఆర్ వెంకటేశ్వర్లుకు సూచించారు. ఆర్డీవో ఎం వాణి, పోతేపల్లి గ్రామస్తులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ఐదుగురికి కారుణ్య నియాకాలు

ప్రభుత్వ శాఖలలో పనిచేస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన ఐదుగురు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కలెక్టర్ మంగళవారం తన ఛాంబరలో కారుణ్య నియామకపత్రాలను అందజేశారు. నూతనంగా ఉద్యోగం పొందినవారు అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఆయన సూచించారు. ఆడిట్ విభాగంలో, రవాణాశాఖలో, విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో, రెవెన్యూ విభాగంలో ఉద్యోగాలు పొందినవారికి నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు.



పోతేపల్లి డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

లైంగిక వేధింపుల ఆట కట్టిస్తా..

- స్త్రీశిశు సంక్షేమ, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

మచిలీపట్నం, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మహిళలు వివిధ ప్రదేశాల్లో పనిచేస్తున్నారని, వారు పనిచేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపులకు గురికాకుండా అందరూ కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టర్ చాంబర్ నుంచి స్త్రీశిశు సంక్షేమ, నోడల్ అధికారులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అధికారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, సంఘటిత, అసంఘటిత రంగాలలో సగంమందికి పైగా మహిళలు పనిచేస్తున్నారని ఆయన అన్నారు. మహిళలు పనిచేసే ప్రాంతాల్లో వారిని మాటలరూపంలో వేధించడం, భౌతికంగా హింసకు గురిచేయడం, చేతలరూపంలో అసభ్యకరంగా ప్రవర్తిస్తే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీ సభ్యులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ అంతర్గత కమిటీలు సక్రమంగా పనిచేస్తున్నదీ, లేనిదీ నోడల్ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఐసీడీఎస్, బాలలహక్కుల పరిరక్షణఫౌండేషన్ ప్రోగ్రాం అధికారి, న్యాయవిభాగంలో ఒక అధికారి, సామాజిక కార్యకర్త ఒకరు సభ్యులుగా ప్రత్యేకకమిటీలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఎక్కడైనా మహిళలు వేధింపులకు గురైతే స్థానిక అంతర్గతకమిటీ సభ్యులు నోడల్ అధికారుల ద్వారా జిల్లా కమిటీకి ఫిర్యాదు చేయవచ్చన్నారు. మహిళలను వేధిస్తే వారికి అండగా ఉండేందుకు మహిళల వేధింపుల నిరోధకచట్టం ఉందనే అంశంపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులు కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఐసీఈఎస్ పీడీ సువర్ణ, సఖీకేంద్రం పరిపాలనా అధికారి అర్చన తదితరులు పాల్గొన్నారు.

పెద్దవరంలో ఆగని మట్టి మాఫియా!

- యథేచ్ఛగా అటవీ సంపద దోచేస్తున్న అక్రమార్కులు
- మామూళ్ల మత్తులో రెవెన్యూ అధికారులు



అటవీ సంపద దోపిడీ

నందిగామ : అధికారం మారినా మట్టి మాఫియా తీరు మారలేదు. అవినీతికి అలవాటు పడిన అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు అదే తీరును కొనసాగిస్తున్నాయి. అవినీతి అధికారులను మామూళ్ల మత్తులో ముంచిన అక్రమార్కులు యథేశ్చగా మట్టి దోపిడీ కొనసాగిస్తున్నారు. మండలంలోని పెద్దవరం అటవీ ప్రాంతం నుంచి ఐదేళ్లుగా కోట్లాది రూపాయల మట్టిని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. కనీసం గొర్రెలు, మేకల కాపరులను కూడా అడవీ భూములలోకి అనుమతించని అధికారులు మట్టి దొంగలకు మాత్రం రెడ్‌కార్పెట్ వేస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా, సెంట పట్టా భూముల నుంచి కాంట్రాక్టర్లకు అవసరమైన మట్టిని ఈ మాఫియానే సమకూర్చింది. పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు మామూళ్ల చెల్లిస్తూ అటవీ సంపదను సొమ్ము చేసుకున్నారు. పెద్దవరం అటవీ ప్రాంతంలో ఎస్కవేటర్ సహాయంతో పెద్ద ఎత్తున ట్రాక్టర్ల ద్వారా మట్టిని పరిసర గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. కొన్నిచోట్ల ఏర్పాటు చేస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్లకు కాంట్రాక్ట్ తీసుకొని మరీ మట్టిని రవాణా చేస్తున్నారు. అధికారులెవరూ అడ్డు తగలకుండా మాఫియా సభ్యులు ట్రాక్టర్లను అనుకరిస్తూ గమ్యానికి చేరుస్తున్నారు. రాష్ట్రంలో అధికారం మారినా అక్రమార్జనకు అలవాటు పడిన మాఫియా దోపిడీని కొనసాగిస్తున్నది. అన్యాక్రాంతమౌతున్న అటవీ సంపద పరిరక్షణకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. అక్రమార్కులకు సహకరిస్తున్న స్థానిక అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమార్కులను పట్టుకొని అన్యాక్రాంతమైన సొమ్మును రికవరీ చేయాల్సి ఉంది. తక్షణమే పెద్దవరం అటవీ ప్రాంతంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అటవీ ప్రాంతంలోకి ప్రవేశించే మార్గాలన్నింటికీ గండ్లు పెట్టాలని కోరుతున్నారు.

ఆదాయ పన్ను ఉద్యోగుల విధి

- అవగాహన కార్యక్రమంలో డీఆర్ఎం



రైల్వేస్టేషన్, జూలై 2 : సమయానికి ఆదాయపు పన్ను చెల్లించడం ఉద్యోగుల విధి అని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ (డీఆర్ఎం) నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. విజయవాడ డివిజన్ ఆడిటోరియంలో మంగళవారం దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్, ఆదాయపు పన్ను శాఖ సంయుక్తంగా ఉద్యోగులు, అధికారులకు ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ, పన్ను చెల్లింపు రిటర్నులు దాఖలు చేయడానికి చాలామంది ఇతరులపై ఆధారపడుతున్నారన్నారు. రిటర్నులు దాఖలు చేయడం కష్టమేమి కాదని అర్థం చేసుకుంటే చాలా సులువైన పని అని ఆయన వివరించారు. ఇంట్లోని కుటుంబసభ్యులు, పిల్లలకు కూడా రిటర్న్ దాఖలు చేయడంపై అవగాహన కల్పించాలన్నారు. దీనివలన కుటుంబసభ్యులకు కూడా ఆర్థిక పరమైన అంశాలు అర్థం చేసుకోగలుగుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలు చెల్లించే పన్నులపైనే నడుస్తుందని ప్రతి ఒక్క ఉద్యోగి ఆదాయపు పన్నును చెల్లించడం విధిగా భావించాలని పేర్కొన్నారు. పన్ను ఎగవేతకు పాల్పడకూడదని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఆదాయ పన్ను శాఖ సంయుక్త కమిషనర్ ఎస్.అభినయ మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో పన్నులు కీలకమని పేర్కొన్నారు. రిటర్నులను ఫైల్ చేయడం చాలా సులభమని ఆమె పేర్కొన్నారు. అనంతరం అధికారుల బృందం రిటర్నులను దాఖలు చేయడంలో ఉన్న అన్ని అంశాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఉద్యోగులు అడిగిన పలు సందేహాలకు ఐటీ అధికారులు సమాధానాలు ఇచ్చారు. అదనపు డీఆర్ఎం కె.శ్రీనివాస్, సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ ఇ.శివరామకృష్ణ, సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి కట్టా ఆనంద్, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఆఫీసర్ రవికుమార్, ఆదాయపు పన్ను అధికారులు డి.విజయ్‌బాబు, ఆర్.చాముండేశ్వరిలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకారం..



వన్‌టౌన్, జూలై 2 : ఎన్టీఆర్ జిల్లా దేవదాయశాఖ సహాయ ఇన్‌చార్జి కమిషనర్‌గా పీవీకే సీతారావమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ప్రస్తుతం గుంటుపల్లిలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిణి (ఈవో)గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు సహాయ కమిషనర్ ఇన్‌చార్జిగా కె.శాంతి బాధ్యతలు నిర్వహించారు. ఆమెపై అవినీతి ఆరోపణలు రావడంతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన దేవదాయ కమిషనర్ సత్యనారాయణ విచారణకు ఆదేశించారు. ఆమె అవినీతి నిర్ధారణ కావడంతో కమిషనర్ సస్పెండ్ చేశారు. గుంటుపల్లిలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా ఉన్న సీతారావమ్మను జిల్లా దేవదాయ శాఖ సహాయ ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు.

ముద్దాయి ఆచూకీ చెప్పండి

గుడివాడ : గుడివాడ ఒన్‌టౌన్ స్టేషన్‌లో నమోదైన కేసు నెం. 137/2014, సి.సి నెం. 205/2015 కేసులో హైదరాబాద్ చత్రినాక ప్రాంతానికి చెందిన ముద్దాయి బాష్కోని రాములు గత కొంతకాలంగా మచిలీపట్నం 1వ ఏడీఎం కోర్టుకు హాజరుకావడం లేదని, దీంతో ముద్దాయికి అరెస్టు వారెంట్ జారీ చేయడం జరిగిందని ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ముద్దాయి ఆచూకీ తెలిసిన వారు ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గానీ, మచిలీపట్నం 1వ ఏడీఎం కోర్టుకు సమాచారం అందించాలని కోరారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, జూలై 2 : భోజన సమయంలో కూర విషయంలో తండ్రితో గొడవ పడిన ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన వైనమిది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ ఇబ్రహీంపట్నం బీపీసీఎల్ బంక్ ఎదురుగా నివాసం ఉంటున్న కన్నా శ్రీనివాసరావు చిన్న కుమారుడు సాయి కిరణ్ (22) గత నెల 29న రాత్రి 9.30 గంటలకు ఇంటి వచ్చి భోజనం చేస్తూ కూర విషయంలో తండ్రితో గొడవ పడి తన రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఎంత పిలిచినా బయటకు రాకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉండటాన్ని గమనించి తలుపులు బద్దలు కొట్టి చూడగా అప్పటికే మరణించినట్టు మృతుడు తండ్రి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ఎం.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మత్స్యశాఖ సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహనరావు

మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలి

కృష్ణలంక, జూలై 2 : మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా ఆలోచన చేయాలని సహకార శిక్షణ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహనరావు అన్నారు. మత్స్యకార సంఘాల బలోపేతంపై మంగళవారం గవర్నరుపేటలోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్స్య ఉత్పత్తిదారులు వ్యాపార కార్యకలాపాలతో బలోపేతం అవుతాయన్నారు. ఉత్పత్తిదారులు ప్రతి ఒక్కరు సంఘ సభ్యులుగా నమోదై సంఘాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వి.పెద్దిబాబు మాట్లాడుతూ, ఫిష్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎఫ్‌పీఓ)లు ఏర్పాటు చేయడం ద్వారా సంఘానికి వ్యాపారాలు వివిధ రకాలుగా చేయడానికి ఈక్విటీ సొమ్మును ఎన్‌సీడీసీ జాతీయ కో-ఆపరేటివ్ అభివృద్ధి సంస్థ అందించడం జరుగుతుందన్నారు. మత్స్య సహకార సంఘాలు, మత్స్య రైతు ఉత్పత్తిదారుల సంఘాలు లాభాల బాటలో పయనించేలా ఎన్‌సీడీసీ సహకారం అందిస్తుందన్నారు. ఈ సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు జీవన విధానాన్ని ఆర్థిక స్థితిగతులను మెరుగు పరుచుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పెద్దిబాబు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయ సంచాలకులు సి.ఎస్.చక్రపాణి, ఎఫ్‌డీవోలు కె.నాగభద్రరావు, పి.అఖిల, ఏఐఎఫ్ బి.శ్యామ్ లెనిన్‌బాబు, మత్స్యశాఖ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విజయవాడ
● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

ధర్మపథం వేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన



వన్‌టౌన్, జూలై 2: దుర్గగుడిలో ధర్మపథం వేదికపై మంగళవారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. విజయవాడకు చెందిన ప్రణవం నృత్యాలయ నిర్వాహకురాలు ఎం ప్రణతి శిష్య బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. హావ భావ ప్రదర్శనలో కళాకారులు తమ కౌశల్యాన్ని ప్రదర్శించారు. ఆహూతుల నుంచి హర్షధ్వానాలు అందుకున్నారు.

విద్యుత్ చౌర్యం -సామాజిక నేరం

● ఈఈ బీవీ సుధాకర్



తనిఖీ చేస్తున్న ఏఈఈ

అజిత్‌సింగ్‌నగర్, జూలై 2 : విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యం చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని విద్యుత్ శాఖ ఈఈ బీవీ సుధాకర్ అన్నారు. నగరంలోని పలు చోట్ల విద్యుత్ శాఖ సెక్షన్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు జరిగాయి. నగర వ్యాప్తంగా 32 బృందాలుగా ఏర్పడిన అధికారులు, సిబ్బంది పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధిక లోడ్ వినియోగిస్తున్న 78 మంది వినియోగదారులకు రూ. 4 లక్షల 15 వేలు అపరాధ రుసుము విధించారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే 9440812084 నెంబరుకు తెలియజేయాలని వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు ఆయన తెలిపారు.

కార్పొరేటర్ భర్తపై దాడి

భవానీపురం, జూలై 2 : స్థానిక వైసీపీ కార్పొరేటర్ రత్నకుమారి భర్త మైలవరపు దుర్గారావుపై టీడీపీ,జనసేన కార్యకర్తలు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. 44వ డివిజన్ చెరువుసెంటర్‌లోని వంగావీటి రంగా విగ్రహం సమీపంలో వైసీపీ జెండా దిమ్మను ఎందుకు పగలకొట్టారని ప్రశ్నించిన దుర్గారావుపై దాడి చేశారు. స్థానికంగా కొద్దికాలం ఇక్కడ పార్టీల్లోని నేతల మధ్య ఘర్షణ వాతావరణం ఉంది. ఈ కారణంగానే దుర్గారావుపై దాడి చేసి ఉండవచ్చునని తెలుస్తోంది. దుర్గారావు, కార్పొరేటర్ రత్నకుమారిలు ఈ మేరకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.



కమర్షియల్ టాకీస్ కాలనీ పార్కు వెనుక రోడ్డులో



శ్రీ రామచంద్రనగర్ కాలనీ వినాయకుడి గుడి రోడ్డులో



విజయలక్ష్మి కాలనీ మెయిన్ రోడ్డులో



శ్రీనివాస్ నగర్ బ్యాంక్ కాలనీ అంతర్గత రోడ్డులో.



భారతీనగర్ నగర్ 4వ రోడ్డులో పేరుకుపోయిన చెత్త

ఖాళీస్థలాలు.. దోమలకు నిలయాలు

● మురుగు, పచ్చగడ్డి, పిచ్చి మొక్కలు, చెత్తతో పేరుకుపోయిన వైనం ● ఆందోళనలో స్థానికులు
●పట్టించుకోని స్థల యజమానులు, సంబంధిత అధికారులు

భారతీనగర్, జూలై 2: నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 3, 4 డివిజన్లలోని భారతీనగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, సీటీవో కాలనీ, శ్రీ రామచంద్రనగర్ కాలనీ, విజయలక్ష్మీ కాలనీ, గణేష్ నగర్, కనకదుర్గనగర్ తదితర కాలనీల్లోని అంతర్గత రోడ్లలో నివాసాల మధ్య అక్కడక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలు రోడ్డుకు తక్కువ ఎత్తులో ఉండడంతో మురుగు నీరు, పచ్చగడ్డి, పిచ్చి మొక్కలు, చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ ఖాళీ స్థలాల్లో మురుగు, పచ్చగడ్డి వలన దోమలు బాగా వృద్ధి చెందుతున్నాయని స్థానికులు అంటున్నారు. ఈ దోమల వలన చిన్నారులు, వృద్ధులు ఎక్కడ అనారోగ్యానికి గురవుతారోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, మురుగునీరు చేరడంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల గురించి స్థల యజమానులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు తమ నివాసాలలో చెత్త, ఇతర వ్యర్థాలను పడవేయడంతో మినీ డంపింగ్ యార్డ్‌లా మారుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే వర్షాకాలంలో ఆ ఖాళీ స్థలాల్లో వర్షం నీరు చేరి చెరువులా మారి ప్రమాదకరంగా ఉంటాయని భయపడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సామూహిక అక్షరాభ్యాసం

సత్యనారాయణపురం, జూలై 2: సత్యనారాయణపురం శివాలయం వీధిలోని నెల్లూరు రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి శైలజ, జీఎం.శివారెడ్డి, ఏజీఎం. కేశవరాజు, ప్రిన్సిపాల్ మీనాక్షి శైలజలు విద్యార్థులకు పలకా బలపాలు అందజేసి ఆశీర్వదించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు



ధర్నా చేస్తున్న కార్మికులు, సీపీఎం నాయకులు

చిట్టినగర్, జూలై 2: వీఎంసీ కార్మికులకు హెల్త్ అలవెన్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన కార్మికులను పెంచాలని, వారికి యూనిఫాం, సబ్బులు తదితర వాటిని అందించాలన్నారు. వీఎంసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం చిట్టినగర్ సర్కిల్-1 కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు స్పందిం,చి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రం చేస్తామన్నారు. కార్మికులు లక్ష్మి, రాజు, శ్రీను, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకులపై అవాకులు,చెవాకులు పేలితే సహించం

● పోతిన మహేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన విజయలక్ష్మి

భవానీపురం, జూలై 2 :

కూటమి నాయకులపై వైసీపీలోని కొత్త బిచ్చగాడు అయిన పోతిన మహేష్ అవాకులు, చెవాకులు పెలితే సహించేది లేదని జనసేన కృష్ణా-పెన్నా మహిళా కో-ఆర్డినేటర్ మల్లెపు విజయలక్ష్మి హెచ్చరించారు. విద్యాధరపురంలోని డివిజన్ జనసేన కార్యాలయంలో ఆమె మంగవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని జగన్ గంజాయ్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని తీవ్రంగా విమర్శించారు. పవన్ కల్యాణ్‌పై దుష్ప్రచారాలు చేస్తున్న పోతిన మహేష్ ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే సహించేది లేదన్నారు.

పాతశివాలయంలో నందీశ్వరుడికి నేడు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం

వన్‌టౌన్, జూలై 2: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్ల (పాతశివాలయం) ఆలయంలో బుధవారం జ్యేష్ఠ బహుళ త్రయోదశి సందర్భంగా సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఆలయంలో ఉన్న నందీశ్వర స్వామి విగ్రహానికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవస్థానం ఈవో మంగళవారం ఒక ప్రకటన చేశారు.

మహిళ ఆత్మహత్య

పాయకాపురం, జూలై 2 : ఉరేసుకుని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం పాయకాపురం వడ్డెర కాలనీలో జరిగింది. వివరాల ప్రకారం వేముల గురవమ్మ(32) కూలి పనులకు వెళ్తుంటుంది. భర్త వేముల జనార్ధన్, 12 ఏళ్ల కుమారుడు ఇంట్లో ఉంటున్నారు. భర్త జనార్ధన్ తరచూ మద్యం తాగి ఇంటికి వస్తున్న విషయమై కొంత కాలంగా భార్య విభేదిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో భార్యా, భర్తల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం కూడా దంపతుల మధ్య గొడవ జరిగింది. భర్త నిద్రిస్తూ ఉండగా గురవమ్మ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని భర్త ఆలస్యంగా గమనించడంతో ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనులపై సీఎం ఆప్యాయత చూపడం హర్షణీయం

భవానీపురం, జూలై 2 : గిరిజనులతో సీఎం చంద్రబాబు మమేకమై ఆప్యాయతలు, అనురాగాలు చూపడం హర్షణీయమని ఏపీ గిరిజన ఆత్మ గౌరవ సేవా సంఘం అధ్యక్షుడు మద్దిల రామకృష్ణ అన్నారు. స్థానికంగా మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పింఛన్ పంపిణీలో గిరిజనులను చంద్రబాబు అక్కున చేర్చుకోవడం ముదావహమని, గిరిజనులకు అవసరమైన యూనివర్సిటీలను త్వరలో పూర్తి చేయాలని, ఎస్టీ కార్పొరేషన్ సబ్సిడీ లోన్‌లు విరివిగా వారికి అందించి వార్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. మీరు అభివృద్ధి చేస్తున్న అమరావతి రాజధాని విషయంలోను గిరిజనులకు భాగస్వామ్యం చేయాలని రామకృష్ణ కోరారు.

ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలి

● డాక్టర్ డి. సమరం



మాట్లాడుతున్న సమరం

పటమట, జూలై 2 : ప్రజలం దరికీ ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత అని, ఆరోగ్యం ప్రజల హక్కు కావాలని డాక్టర్ జి.సమరం తెలిపారు. వాస్యవ నర్సింగ్ హోమ్‌లో బీసీరాయ్ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం జరిగిన ఆరోగ్య సదస్సులో సమరం మాట్లాడారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యశ్రీ వల్ల కొంత మేరకు సేవలు అందుతున్నప్పటికీ, ప్రభుత్వం ఆసుపత్రులకు ఇవ్వాల్సిన పారితోషికం సరైన సమయంలో ఇవ్వకపోవటంతో అనేక ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలను నిలుపుదల చేసి పేదలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ప్రభుత్వాసుపత్రులను అన్ని రకాల వసతులతో బలోపేతం చేయాలన్నారు. గ్రామీణస్థాయి నుంచి ప్రభుత్వ వైద్యసేవలను బలోపేతం చేయాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లో కనీసం 15 శాతం కేటాయించాలన్నారు. సభకు డాక్టర్ మారు అధ్యక్షత వహించారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

గన్నవరం, జూలై 2 : పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం అందరూ సమ ష్టిగా కృషి చేయాలని కృష్ణాజిల్లా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కె.రాజేంద్ర వరప్రసాద్, కార్యదర్శి ఆశీర్వాదం అన్నారు. స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో మంగళవారం అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభు త్వాన్ని కోరారు. అధ్యక్షుడిగా ఎ.మోహనరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా కెవి పాపా రావు, ఎన్.బసవేశ్వరరావు జనరల్ సెక్రటరిగా ఎస్‌కె వల్లి సాహెబ్, ఉపాధ్యక్షులుగా సుబ్బారావు, రామచంద్రరావు, రత్నరాజు, కోశాధికారిగా బి.కృష్ణారావు, కార్యదర్శులు విజయకుమారి, నాగేంద్రరావు, అప్పారావు, చంద్ర శేఖర్ తదితరులు ఎన్నికయ్యారు.

ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ పై నుంచి పడి విద్యార్థి మృతి

వన్‌టౌన్, జూలై 2: ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. వన్‌టౌన్‌లోని రాజా రంగయ్యప్పారావు వీధికి చెందిన మహావీర్‌జైన్‌కు ఇద్దరు కుమారులు. ఎస్ఎస్ఎం స్కూల్‌లో పెద్ద కుమారుడు సంభవ్ పదవ తరగతి, చిన్న కుమారుడు అరిహ్లా ఏడవ తరగతి చదువుతున్నారు. సంభవ్ స్కూల్ నుంచి రాగానే ప్రతిరోజూ అపార్ట్‌మెంట్ మొదటి అంతస్థులో క్రికెట్ ఆడేందుకు వెళతాడు. ఇదే క్రమంలో సోమవారం సాయంత్రం 5.30కు సంభవ్ ఇంటికి వచ్చి పై అంతస్థుకు వెళ్ళాడు. కొంతసేపటికి ఇంటి ఎదురుగా ఉన్న నితేష్ జైన్ పెద్దగా అరుస్తూ వచ్చి సంభవ్ కింద పడి పోయినట్లుగా చెప్పాడు. దీంతో మహావీర్ జైన్, కుటుంబ సభ్యులు కిందకు వెళికల చూడగా సంభవ్ అప్పటికే అపస్మారకంలో ఉన్నాడు. అతనిని ఒక కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. సంభవ్ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 9.30 ప్రాంతంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మహావీర్‌జైన్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ రమ్య శ్రీ సత్య కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రి ఎదుట అపరిశుభ్ర వాతావరణం

● దుర్వాసనతో అవస్థలు



పాయకాపురం, జూలై 2 : పాయకాపురం కండ్రిక కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురు అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఆసుపత్రి గేటు ఎదురు ప్రహరీని ఆనుకుని చెత్త చెదారంతో పాటు గుర్రపుడెక్క పేరుకుపోవడంతో దోమలు విపరీతంగా వ్యాపిస్తున్నాయి. దుర్వాసనతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ సిబ్బంది సైతం సేకరించిన చెత్తను తెచ్చి ఆసుపత్రి గేటు వద్దే పడేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గుర్రపుడెక్కను తొలగిస్తున్న మలేరియా సిబ్బంది సైతం ఆసుపత్రి వద్దే గుర్రపుడెక్కను కుప్పలుగా పడేస్తుండటం అపరిశుభ్ర వాతావరణానికి కారణమవుతోంది. ఆసుపత్రి సమీపంలో పశువులు కట్టేయడంతో దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయి. ప్రస్తుతం శానిటరీ అధికారులు స్పందించి పశువుల పెంపకందారులను కట్టడి చేయాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గొయ్యి



భారతీనగర్, జూలై 2: రమేష్ ఆస్పత్రి నుంచి గురునానక్ కాలనీ వైపు వెళ్లే దారిలో కేఎఫ్‌సీ వైపు రోడ్డులో వాహనాల రద్దీతో గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతలు పూడ్చడంలో అధికారులు అలసత్వం వహించడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచిపోయి, వాహనాల రద్దీకి గుంతలు పెద్దవి కావడంతో ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 3 జూలై 2024
cinema@andhrajyothy.com



కష్టంతోనే అదృష్టం


మన వంతు కష్ట పడాలి, అప్పుడే అదృష్టం కూడా కలసి వస్తుంది అని నమ్ముతాను అన్నారు రష్మిక మందన్న. సినిమా జయాపజయాలపై తన ఆలోచనా ధోరణి గురించి చెబుతూ 'టీంలో ప్రతి ఒక్కరూ శ్రమిస్తేనే మంచి అవుట్‌పుట్ వస్తుంది. అప్పుడే సినిమా పెద్ద హిట్ అవుతుంది. హీరో, హీరోయిన్ దర్శకుడు... ఇలా నటీనటులు మొదలుకొని ప్రతి టెక్నీషియన్ సినిమా కోసం ముందస్తుగా సన్నద్ధమయ్యేందుకు చాలా కష్టపడతారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ చాలా ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎంత కష్టపడినా కొన్ని సార్లు అపజయం తప్పదు. అలాంటప్పుడు ఇంత కష్టపడినా ఇలా జరిగిందేంటి అని బాధపడకూడదు. కష్టాన్ని నమ్ముకొని ముందుకెళ్లాలి, అప్పుడే విజయాలు మన సొంతమవుతాయి' అని రష్మిక చెప్పారు. ప్రస్తుతం ఆమె తెలుగులో ధనుష్, నాగార్జున మల్టీస్టారర్ 'కుబేర'లో కథానాయికగా నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. రష్మిక లుక్‌ను ఈ నెల 5న విడుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మా మధ్య అసూయ లేదు



తమిళ నటులు రజనీకాంత్, కమల్‌హాసన్ వెండితెరపై కలసి నటిస్తే చూడాలని కోరుకోని అభిమాని లేడంటే అతిశయోక్తి కాదు. ఈ నెల 12న విడుదలవుతున్న 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో ఉన్న కమల్‌ను.. ఓ ఆంగ్ల మీడియా విలేఖరి 'ఇండియన్ సినిమా చరిత్రలోనే అత్యంత పాపులర్ నటులయిన మీ ఇద్దరూ కలసి నటించి ఎన్నో ఏళ్లు అవుతోంది. మళ్లీ విమ్మల్ని ఒకే తెరపై చూసే అవకాశం ఉందా.. ఒకరి సినిమాల్లో ఒకరు కనిపించే ఆలోచనలు ఉన్నాయా?' అని ప్రశ్నించారు. దీనికి కమల్ సమాధానమిస్తూ 'మాది కొత్త కాంబినేషన్ అయితే కాదు. కెరీర్ కొత్తలో మేమిద్దరం ఎన్నో సినిమాల్లో కలసి నటించాం. ఆ సమయంలోనే ఇక కలసి ఒకే సినిమాలో కనిపించకూడదని నిర్ణయించుకున్నాం. మేం ఇద్దరం ఏ విషయంలో పోటీపడలేదు, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోలేదు. అప్పుడూ.. ఇప్పుడూ. ఎందుకంటే మేం ఇద్దరం ఒకే గురువు కె.బాలచందర్ దగ్గర శిక్షణ పొందాం. మా మధ్య అసూయకు తావు లేదు. ఒకరి ఎదుగుదలను ఇంకొకరం స్పోర్టివ్‌గా తీసుకుని ముందుకు సాగుతున్నాం. ఇదే మా మధ్య ఉన్న బలమైన అనుబంధానికి నిదర్శనం. మాకు 20 ఏళ్లు ఉన్నప్పటి నుంచే ఇలాంటి అవగాహనతో కెరీర్‌లో ముందుకు సాగుతున్నాం' అని రజనీతో ఉన్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. కాగా, కమల్,రజనీ కలసి దాదాపు 16 చిత్రాల్లో నటించారు. ఆఖరిగా, 1985లో తెరకెక్కిన అమితాబ్ బచ్చన్ చిత్రం 'గిరఫ్తార్'లో స్క్రీన్ షేర్ చేసుకున్నారు.

షారుక్ ఖాన్‌కు అరుదైన గౌరవం



బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌కు అరుదైన గౌరవం లభించింది. స్విట్జర్లాండ్‌లోని లోకర్నో ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించే అక్కడి జ్యూరీ సభ్యులు.. షారుక్ ఖాన్‌ను ఈ ఏడాది జరిగే ఫిల్మ్ ఫెస్టివల్‌లో సత్కరించనున్నారు. షారుక్‌కు 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రకటించింది. అంతే కాకుండా.. ఆయన సినిమాల్లో క్లాసికల్ హిట్‌గా మిగిలిన 'దేవదాసు' సినిమాను కూడా ఆ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్క్రీనింగ్‌కు ఎంపిక చేసింది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 2003లో రిలీజైన ఈ సినిమా విమర్శకులు ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ అవార్డుకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో ప్రకటించిన ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వాహకులు.. షారుక్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. 'షారుక్ లాంటి దిగ్గజ నటుడ్ని మా ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఆహ్వానించాలనే కోరిక ఈ 77వ ఎడిషన్ ఫిల్మ్ ఫెస్టివల్‌తో తీరింది. నిర్మాతగా, నటుడిగా భారతీయ సినిమా ఇండస్ట్రీపై తనదైన ముద్ర వేసిన ఆయన్ని సత్కరించడం మా గౌరవం'. కాగా, ఈ ఫిల్మ్ ఫెస్టివల్ స్విట్జర్లాండ్‌లో వచ్చే నెల 7 నుంచి 17వ తేదీ వరకు జరుగుతుంది. ఈ అవార్డును షారుక్ ఆగస్టు 10న అందుకోనున్నారు.

విరాజి టైటిల్‌తో వరుణ్ సందేశ్



ఇటీవలే విడుదలైన 'నింద' చిత్రంతో హీరోగా చక్కటి విజయాన్ని సొంతం చేసుకున్నారు వరుణ్ సందేశ్. త్వరలో తన కొత్త చిత్రం 'విరాజి'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆద్యంత్ హర్ష దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎమ్ 3 మీడియా బేనర్‌పై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. మంగళవారం చిత్రబృందం టైటిల్ అనౌన్స్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ ' 'నింద' సక్సెస్ నాకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చింది. హర్ష చెప్పిన కథ బాగా నచ్చింది. ఆయనకు మంచి భవిష్యత్ ఉంది. నా 17 ఏళ్ల కెరీర్‌లో చేయని ఒక డిఫరెంట్ మూవీ ఇది. ఇందులో నా పాత్ర సరికొత్తగా ఉంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'త్వరలో ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తాం. 'విరాజి' వరుణ్ సందేశ్‌కు పేరు తెస్తుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ "విరాజి' చిత్రంలో వరుణ్ సందేశ్‌ను కొత్త అవతారంలో చూపించబోతున్నాం. సినిమా చాలా బాగా వచ్చింది. ఆగస్టు 2న విడుదల చేయాలనుకుంటున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఎబినేజర్ పాల్. సినిమాటోగ్రఫీ: జీవీ అజయ్‌కుమార్. ఎడిటర్: రామ్ తూము

లవ్వు.. నవ్వు.. జీవితం



ప్రియదర్శి, నభా నటేశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'డార్లింగ్' నుంచి సెకండ్ సింగిల్ విడుదల చేశారు. 'రాహి రే' అంటూ సాగే ఈ పాటను గీత రచయిత కాసర్ల శ్యామ్ రాయగా, కపిల్ కపిలన్ పాడారు. ఇండియాలోని వివిధ ప్రదేశాలను సందర్శిస్తూ పాడుకొనే పాట ఇది. ఆమె జర్నీని సినిమాటోగ్రాఫర్ నరేశ్ రామదురై అందంగా చిత్రీకరించారు. వివేక్ సాగర్ స్వరాలు అందించారు. అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఈ నెల 19న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, శ్రీమతి చైతన్య చెప్పారు. 'ఎంజాయ్‌బుల్ మెలోడీ ఇది. తొలి పాటలానే ఇది కూడా ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. ప్రేమ, నవ్వు, జీవితం.. ఈ అంశాలతో రూపుదిద్దుకున్న సినిమా ఇది. అనన్య నాగళ్ల మరో కీలక పాత్ర పోషిస్తున్నారు' అని తెలిపారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు: హేమంత్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: సీతారామ్ వై.


రాజ్‌తరుణ్ మాస్ హీరోగా నిలబడతాడు




ఇంతవరకూ వినోదభరితమైన పాత్రలతో అందరినీ నవ్వించిన యువ కథానాయకుడు రాజ్ తరుణ్ ఇప్పుడు పవర్‌ఫుల్ యాక్షన్ చిత్రం 'తిరగబడరా సామీ' తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మాల్వీ మల్హోత్రా కథానాయికగా నటించారు. ఎ.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'అందరం ప్రాణం పెట్టి ఈ సినిమా చేశాం. ముఖ్యంగా డీవోపీ జవహర్‌రెడ్డి అద్భుతంగా చిత్రాన్ని తీర్చిదిద్దారు. సినిమాలో ఇంత యాక్షన్ పార్ట్ చేయడం నాకు కొత్త. అయినా దర్శకుడి ప్రోత్సాహంతో ఈజీగా చేశాను. ఇందులో ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ కూడా బాగుంటాయి. ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన నిర్మాత శివకుమార్‌కు నా ధన్యవాదాలు' అని చెప్పారు. 'నేను దర్శకత్వం వహించిన 'యజ్ఞం' చిత్రం ఇదే రోజున విడుదలై నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. అదే ఈ రోజున 'తిరగబడరా సామీ' ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. రాజ్‌తరుణ్ ఈ సినిమాతో మాస్ హీరోగా నిలబడతాడు. నిర్మాత చాలా గ్రాండ్‌గా సినిమాని తీశారు. అందరినీ ఆకట్టుకొనే చిత్రమిది' అని చెప్పారు రవికుమార్.

'ఇందులో బాలకృష్ణ అభిమానిగా నటించా. చాలా బ్యూటిఫుల్ కథ ఇది. సినిమాలో ఓ ఫైట్ కూడా చేశా. ఈ చిత్రంతో తెలుగులో పరిచయం కావడం ఆనందంగా ఉంది' అన్నారు హీరోయిన్ మాల్వి. నిర్మాత శివకుమార్ మాట్లాడుతూ 'రవికుమార్ చెప్పిన కథ బాగా నచ్చింది. ఇందులో రాజ్‌తరుణ్ హీరోగా నటిస్తే బాగుంటుందని ఆయన్ని అడిగితే వెంటనే అంగీకరించారు. యాక్షన్ పాత్రలో ఆయన కొత్తగా కనిపిస్తారు. ప్రతి సినిమాతో నేను కొత్తవారిని పరిచయం చేస్తుంటాను. ఈ సినిమాతో హీరోయిన్ మాల్వి పరిచయమవుతోంది. త్వరలో సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

జాకీ భగ్నానికి అండగా అక్షయ్ కుమార్





రకుల్ ప్రీత్‌సింగ్ భర్త, నిర్మాత జాకీ భగ్నానికి బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ అండగా నిలిచారు. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో రూ.350 కోట్ల రూపాయలతో 'బడేమియా చోటేమియా' సినిమాను జాకీ భగ్నాని, ఆయన తండ్రి వాసు భగ్నానీ నిర్మించారు. అక్షయ్‌కుమార్, జాకీ ష్రాఫ్, మానుషి చిల్లర్, ఆలయా.ఎఫ్ నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కేవలం రూ.110 కోట్ల రూపాయలు రాబట్టి దారుణ పరాజయంగా మిగిలింది. దీంతో సినిమాకు పని చేసిన వారెవ్వరికీ నిర్మాతలు పూర్తి పారితోషికాన్ని చెల్లించలేకపోయారు. ఈ విషయం బీటౌన్‌లో పెద్ద వివాదంగా మారింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అక్షయ్‌కుమార్ తమకు అండగా నిలిచారని జాకీ భగ్నానీ తెలిపారు. ఈ సినిమాకు పనిచేసినవారందరికీ డబ్బులు చెల్లింపులు పూర్తి చేశాకే తనకు ఇవ్వండని.. అలాగే ఈ సంస్థ నిర్మాణంలో మరోసారి అక్షయ్ నటిస్తానని మాటిచ్చినట్లు జాకీ అన్నారు. అక్షయ్‌కు పెద్ద మొత్తం ఇవ్వాల్సి ఉండడంతో.. దానికి కొన్ని సమయం దక్కడంతో ఊపిరి పీల్చుకునే వెసులుబాటు దక్కిందని నిర్మాత జాకీ భగ్నానీ భావిస్తున్నారు. ఈ సందర్భాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసుకుని అక్షయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రష్యన్ యువతి తెలుగు చిత్రం



రష్యాలో పుట్టి పెరిగిన లియుబా పామ్ గాయని, నిర్మాత కూడా. 'సేవ్ ది చిల్డ్రన్' పేరుతో ఓ డాక్యుమెంటరీ తీశారు. 'లవ్ ఓవర్ ఈవిల్' టీవీ సిరీస్‌కు రచయిత్రి, ప్రస్తుతం 'నిన్ను వదలను' పేరుతో రూపుదిద్దుకుంటున్న హారర్ సస్పెన్స్ చిత్రంలో లియుబా నటిస్తున్నారు. షిరాజ్ మెహది దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కుష్బూ జైన్ కూడా మరో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. గోవా, హైదరాబాద్ ప్రాంతాల్లో ఈ చిత్రం షూటింగ్ జరుగుతుంది. గంగాధర్, వైజాగ్ షరీఫ్, రవితేజ, అజయ్, అనంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ప్రవీణ్ కొమరి, ఎడిటింగ్: కె.ప్రభు, సహ నిర్మాత: దేవేంద్ర నెగి, నిర్మాత: అశోక్ కుల్లర్.

15 రోజుల షూట్‌తో పూర్తి





శంకర్

'గేమ్ ఛేంజర్' చిత్రం మరో 15 రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉంది. 'భారతీయుడు 2' రిలీజవ్వగానే పెండింగ్ పార్ట్‌ను పూర్తి చేస్తాను. 'గేమ్‌ఛేంజర్', 'భారతీయుడు' చిత్రాల మధ్య పోలిక లేదు. అవి రెండూ పూర్తిగా వేటికవే భిన్నమైనవి. సీక్వెల్ చేయడానికి అవసరమైన మలుపులు 'గేమ్ ఛేంజర్' కథలో లేవు కాబట్టి అలాంటి ప్రయత్నమేదీ చేయడం లేదు' అని దర్శకుడు శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా నటించిన 'భారతీయుడు 2' చిత్రం ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శంకర్ మీడియాతో ముచ్చటించారు.

- 'భారతీయుడు' చిత్రానికి మూడో పార్ట్ కూడా ఉంది. మరో ఆరునెలల్లో దాన్ని కూడా విడుదల చేస్తాం. పలు రాష్ట్రాల్లో జరిగే కథ కావడంతో నిడివి పెరిగింది. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను కట్టి పడేస్తుంది. ఎడిటింగ్‌లో ఒక్క సన్నివేశం కూడా తీసేయడానికి నా మనసు ఒప్పుకోలేదు. అందుకనే 'భారతీయుడు 3' ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం.
- భవిష్యత్‌లో జేమ్స్‌బాండ్ తరహా చిత్రాలు చేయాలనుకుంటున్నాను. అలాగే చారిత్రక, సైన్స్ ఫిక్షన్ కథాంశాలతో సినిమాలు చేసే ఆలోచన ఉంది. వీఎఫ్ఎక్స్‌ను ఉపయోగించుకొని మంచి చిత్రాలు తెరకెక్కించే ఆలోచన ఉంది. ఆ సినిమాలు అందరినీ ఆశ్చర్యపరిచే స్థాయిలో ఉంటాయి.
- శంకర్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేయాలనే ఆలోచన వచ్చింది. దాని గురించి నా స్నేహితులు, సహాయ దర్శకులు, కుటుంబ సభ్యులకు చెప్పినప్పుడు ఎవ్వరూ పెద్దగా ఎగ్జైట్ అవ్వలేదు. దాంతో ఆ ఆలోచన విరమించుకున్నాను. రజనీకాంత్, కమల్‌హాసన్‌తో మల్టీస్టారర్ ప్లాన్ చేశా. కానీ కమల్ హాసన్ బిజీగా ఉండడంతో కుదరలేదు.
- ఇప్పుడు సినిమాల్లో టెక్నాలజీ బాగా ఎక్కువైంది. దాంతో అద్భుతాలు సృష్టించవచ్చు. కానీ నా దృష్టిలో ఏఐ కన్నా మనిషి ఆలోచనలే శక్తిమంతమైనవి. ఇప్పుడే కాదు ఎప్పటికీ ఏఐ కన్నా మనిషి ఆలోచనలే ముందుంటాయి.
- తప్పకుండా షారూఖ్‌ఖాన్‌తో సినిమా చేస్తాను. మంచి స్క్రిప్ట్ కుదరాలి. అట్లీ, లోకేశ్ కనగరాజ్ లాంటి దర్శకులు సృజనాత్మకంగా చిత్రాలను తెరకెక్కిస్తున్నారు. 'ట్వల్త్ ఫెయిల్' చిత్రం నాకు బాగా నచ్చింది.

అపరిచితుడు రీమేక్‌ను పక్కనపెట్టాం



రణ్‌వీర్‌సింగ్‌తో హిందీలో 'అపరిచితుడు' రీమేక్ చిత్రం లేనట్టే. ప్రస్తుతానికి ఆ చిత్రాన్ని పక్కనపెట్టినట్లు బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శంకర్ చెప్పారు. ఆ చిత్ర నిర్మాత జయంతిలాల్ గడ నాతో 'అపరిచితుడు' రీమేక్ కన్నా మరింత భారీ చిత్రం తీయాలనుకోవడమే దానికి కారణమని శంకర్ తెలిపారు. 'ఈ రీమేక్‌ను ప్రకటించాక కొత్త కాన్సెప్ట్‌లతో పలు పాన్ ఇండియా చిత్రాలు వచ్చాయి, మంచి విజయాన్ని అందుకొన్నాయి. దాంతో మా నిర్మాత మనసు మార్చుకున్నారు. ప్రస్తుతానికైతే 'అపరిచితుడు' రీమేక్‌ను పక్కనపెట్టినట్లే. చేతిలో ఉన్న సినిమాలు పూర్తి చేశాక దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటాం' అని శంకర్ చెప్పారు.

నువ్వో యోధురాలివి



కేన్సర్ బారిన పడి చికిత్స తీసుకుంటున్న బాలీవుడ్ నటి హీనాఖాన్‌కు టాలీవుడ్ హీరోయిన్ సమంత ధైర్యం చెప్పారు. మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో హీనాఖాన్ వీడియోను పోస్ట్ చేశారు సమంత. 'నువ్వో యోధురాలివి. త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను... ధైర్యంగా ఉండు' అని సమంత పేర్కొన్నారు. దీంతో హీనాఖాన్ సమంతకు ధన్యవాదాలు తెలిపారు. 'జీవితంలో ఎదురయ్యే సవాళ్లను మీరు ఎదుర్కొనే తీరు అద్భుతం. తెరపైనే కాదు నిజ జీవితంలోనూ మీరు స్టారే. నాకు స్ఫూర్తిగా నిలిచారు. మీరు నాపై చూపిన ప్రేమకు ధన్యవాదాలు' అని సంతోషం వ్యక్తం చేశారు. తాను రొమ్ము కేన్సర్ బారిన పడినట్లు కొన్ని రోజుల క్రితం హీనాఖాన్ తెలిపారు. సమంత కూడా మయోసైటిస్ అనే వ్యాధి బారినపడి చికిత్స తీసుకుంటున్నారు.



భారతీయ సినిమాకు అవార్డుల పంట



సుచి తలాటి దర్శకత్వంలో బాలీవుడ్ నటి రిచా చద్దా, ఫయాజ్ అలీ నిర్మించిన 'గర్ల్స్ విల్ బి గర్ల్స్' చిత్రం రిలీజ్‌కు ముందే సంచలనాలు సృష్టిస్తోంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులు గెలుచుకున్న ఈ చిత్రం ఇప్పుడు మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ లాస్ ఏంజిల్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గ్రాండ్ జ్యూరీ అవార్డును సాధించి చరిత్ర సృష్టించింది. ఈ సినిమా ఇప్పటికే రొమేనియాలోని ట్రాన్సిల్వేనియా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ఫ్రాన్స్‌లోని బియారిట్జ్‌లోని ఫిల్మ్ ఫెస్టివల్స్‌లోనూ గ్రాండ్ జ్యూరీ అవార్డులను కైవసం చేసుకుంది. ఇలా వరుసగా మూడు గ్రాండ్ జ్యూరీ అవార్డులు సాధించి హ్యాట్రిక్ సాధించింది. ఈ సందర్భంగా నిర్మాతలు రిచా చద్దా, ఫయాజ్ అలీ మాట్లాడుతూ 'ఇలా ఒక నెలలోనే ఈ సినిమాకు మూడు గ్రాండ్ జ్యూరీ పురస్కారాలు దక్కడంతో చాలా ఆనందంగా ఉంది. ఇది మా కష్టానికి దక్కిన గౌరవం. మా హృదయాలకు చేరువైన ఈ సినిమా.. ఇంతటి ఘనమైన ప్రదర్శన చేస్తుండడం జీవితాంతం మర్చిపోలేని విషయం. ఒక నిర్మాతగా మొదటి సినిమాకే ఇంత ఖ్యాతి రావడం మా అదృష్టం' అని చెప్పారు. కాగా, 16 ఏళ్ల అమ్మాయి జీవితంలో జరిగే సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రీతి పాణిగ్రహి ప్రధాన పాత్రలో నటించారు.

అరకు కాఫీ అంటే తనకున్న ఇష్టాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమాల వేదికగా వెలిబుచ్చిన సంగతి తెలిసిందే. అందుకు సమాధానంగా 'కాఫీ తోటల సాగు వెనుక లెక్కకు మించి గిరిజన మహిళల శ్రమ దాగుంద'ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ట్వీట్ చేసిన సందర్భంలో... అరకు కాఫీ మరోకసారి చర్చలోకి వచ్చింది. గిరిజన మహిళా రైతులకు అండగా నిలిచి... లోయ కాఫీ రుచులను ఖండాంతరాలకు చేరవేస్తోంది 'నాంది ఫౌండేషన్'. ఆ విశేషాలను ఫౌండేషన్ జాతీయ ప్రతినిధి **రోహిణి ముఖర్జీ** 'నవ్య'తో పంచుకున్నారు.

"అరకు కాఫీకి దేశవిదేశాల్లో అభిమానులు కొల్లలు. ఒకటి రెండు కాదు... ఏకంగా పన్నెండు దేశాలకు అరకు కాఫీ పొడి ఎగుమతి అవుతోంది. జీ20 సదస్సుకు వచ్చిన ప్రపంచ దేశాల ప్రముఖులకు ప్రతిష్టాత్మకమైన స్వదేశీ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వస్తువులతో పాటు అరకు కాఫీ పొడిని కూడా బహూకరించింది కేంద్ర ప్రభుత్వం. అంతటి ప్రఖ్యాతి పొందిన అరకు కాఫీ రుచుల వెనుక బోలెడన్ని కష్టాలు, లెక్కకుమించిన గాథలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా 'నాంది ఫౌండేషన్' ఇరవై ఏళ్లుగా కాఫీ సాగు దారులతో కలిసి ప్రత్యేకంగా పని చేస్తోంది. అరకు లోయలో మాతా శిశు మరణాల రేటు ఎక్కువ ఉండటంతో, వాటిని నిలువరించడానికి మొదట మా ఫౌండేషన్ 2000 నుంచి ఆ ప్రాంతంలో పని చేయడం ప్రారంభించింది. ముందు సురక్షితంగా ప్రసవాలు చేసేలా కొన్ని గ్రామాల్లో వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాం. దాంతో పాటు నిరంతరం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాం. మన్యం ప్రాంతంలో 98 శాతంమంది రైతులు ఉంటే, వారంతా వరి, కాఫీ తోటలు లాంటివి పండిస్తుంటారు. అందులోనూ మహిళల భాగస్వామ్యం అధికం. భార్యా భర్త కలిసి పని చేస్తేనే ఆ ఇల్లు గడుస్తుంది. అంతేకాదు... ఐదేళ్ల లోపు పిల్లల్లో పౌష్టికాహార లోపం లాంటి సమస్యలను గుర్తించాం. పని పిల్లలకు వంద గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లాగా సంరక్షణ కేంద్రాలు నెలకొల్పి, వారికి సరైన ఆహారం అందించాం. ఒకపూట

> **పరస్పర సహకారం...**
> కాఫీ చెట్లకు పురుగు తొలచడంలాంటి సమస్యలు వస్తుంటాయి. వాటి నివారణగా రసాయన ఎరువులు, పురుగు మందులు లాంటివి రైతులు అస్సలు వినియోగించరు. అరకులోని గిరిజనులు కాఫీని పూర్తిగా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తారు. తెగులు సోకిన చెట్టును కాండంతో సహా పీకి... తోటకు దూరంగా కాల్చేయడం లేదా పారేయడం చేస్తారు. మా ఫౌండేషన్ పంపిణీ చేసిన సీ100, బ్లాక్100 లాంటి రకరకాల సేంద్రియ ద్రావణాలను మాత్రమే వాడతారు. కాఫీ మొక్కలు నాటడం దగ్గర నుంచి ప్రతి విషయంలో మా వాలంటీర్లు రైతులకు అండగా ఉంటూ, వారికి తగిన సలహాలు సూచనలు ఇస్తుంటారు. ఒకరి తోటల్లో మరొకరు పని చేస్తూ, పరస్పరం సహకరించుకొంటారు.

కూడా ఒక ప్రధాన కారణం.

మహిళల శ్రమ అధికం...

కాఫీ సాగులో మహిళల కష్టం వెలకట్టలేనిది. కాఫీ మొక్కలు నాటడానికి నెల ముందు గోతులు తవ్వడం దగ్గర నుంచి ప్రతి పనిలో ఆడవారి భాగస్వామ్యం ఉంటుంది. కలుపు ఒక పెద్ద సమస్య. ఎప్పటికప్పుడు కలుపు తీయడం, ద్రావణాలు మొక్కలపై పిచికారీ చేయడం, ఎరువు వేయడంలాంటి





మహిళా రైతుల సాధికారతకు 'నాంది'

ఆలనాపాలనా చూసేందుకు కార్యకర్తలను నియమించాం. ఆ క్రమంలోనే రైతుల దయనీయ స్థితి మాకు అర్థమైంది. కష్టపడి పండించిన పంటను లాభసాటిగా అమ్ముకోలేకపోవడాన్ని గమనించిన 'నాంది ఫౌండేషన్' సీఈవో మనోజ్‌కుమార్... కాఫీ సాగుదారుల కోసం ప్రత్యేకంగా పని చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఆయన చొరవతో 2005 నుంచి అరకు లోయలోని ఏడు మండలాల రైతులతో నాంది ప్రయాణం మొదలైంది. కాఫీ సాగుదారుల ఆదాయ వనరులను పెంపొందించడమే లక్ష్యంగా నాటి నుంచి పని చేస్తున్నాం.

సేంద్రియ సాగు...

అప్పటి వరకు తమకు తెలిసిన పద్ధతుల్లో కాఫీ సాగు చేస్తున్న రైతులకు నిపుణులతో నిరంతరం అవగాహన తరగతులు నిర్వహించాం. అంతర్జాతీయ స్థాయిలో కాఫీ సాగుపై సాధికారత కలిగిన ప్రముఖులను అరకు తీసుకొచ్చి వారి సలహాలు, సూచనలను రైతులకు తెలియజేశాం. సాధారణంగా మిరియాలు, సిల్వర్ ఓక్స్ చెట్ల మధ్య కాఫీ తోటలు పెంచడం ఆనవాయితీ. అలా కాకుండా స్థానిక వాతావరణానికి అనుగుణంగా మామిడి, సపోట, నేరేడు, సీతాఫలం తదితర పండ్ల చెట్లతో పాటు టేకు లాంటి 19 రకాల చెట్లను పెంచవచ్చని పరిశోధకులు సూచించారు. దాన్ని విస్తృతంగా రైతుల్లోకి తీసుకెళ్లాం. తద్వారా వారికి రాబడి సమకూరుతుందన్నది మా ఆలోచన. దాంతోపాటు నాలుగు కోట్లకు పైగా మొక్కలు పంచాం. కాఫీ మొక్కలు మొదలు అవి నాటిన తర్వాత చీడపీడల నుంచి సంరక్షణకు సేంద్రియ ద్రావణాలు, కంపోస్టు ఎరువు, ఆర్గానిక్ ఇన్‌పుట్స్ లాంటివి ఏటా రైతులకు ఉచితంగా ఇస్తున్నాం. దానివల్ల కాఫీ సాగు మొత్తం సేంద్రియ పద్ధతిలోనే సాగడానికి మా వంతుగా ప్రయత్నిస్తున్నాం. ఇది సత్ఫలితాలనిచ్చింది. దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ అరకు కాఫీకి అంతటి గుర్తింపు రావడానికి అది

> **దేశవిదేశాల్లో ...**
> అరకులో అరబికాతో పాటు కొత్తగా చంద్రగిరి, ఎస్-5 అనే మూడు రకాల కాఫీ మొక్కలను సాగు చేస్తున్నారు. మన్యంలో కాఫీ సాగుకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. అయితే, మా ఫౌండేషన్ రైతులకు సేంద్రియ సాగు విధానాన్ని పరిచయం చేయడంతో పాటు దాని మార్కెటింగ్ విషయంలోనూ మద్దతునిస్తోంది. తద్వారా అరకు కాఫీ బ్రాండ్‌కు విదేశాల్లో సైతం మంచి గుర్తింపు రావడానికి తోడ్పడింది. బెంగళూరు, ముంబయి నగరాల్లో అరకు కెఫేలున్నాయి. అరకు గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ ఏడేళ్ల కిందట ఫ్రాన్స్‌లోని పారిస్‌లో కాఫీ షాపు ప్రారంభించింది. మరుసటి ఏడాది ప్రిక్స్ ఎపిక్యురెస్ పోటీల్లో అరకు కాఫీ గోల్డ్ మెడల్ గెలుచుకుంది. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా... మన్యంలో పండిన కాఫీ గింజలు అంతర్జాతీయ మార్కెట్‌లో పేరు రావడమంటే సాధారణ విషయం కాదు.

పనులన్నీ మహిళా రైతులే చేస్తారు. ఒకసారి తోట వేస్తే మూడేళ్లకు పంట చేతికి వస్తుంది. ఆ తోట ఇరవై ఏళ్లవరకు ఫలాలు ఇస్తుంది. ఏటా డిసెంబరు- ఫిబ్రవరి మధ్య కాఫీ తోటల్లోని పండ్లను మహిళా రైతులు సేకరిస్తారు. కాఫీ పండించే రైతులంతా కలిసి 'స్మాల్ అండ్ మార్జినల్ ట్రైబల్ ఫార్మర్స్ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కోపరేటివ్ సొసైటీ' నెలకొల్పారు. దాని ఎగ్జిక్యూటివ్ కమిటీలో యాభై శాతంమంది మహిళలున్నారు. కాఫీ సాగులో మహిళల భాగస్వామ్యం చాలా కీలకమైనదనడానికి ఇది ఒక ఉదాహరణ. కొందరు చెర్రీ

> **అందుకే ప్రత్యేక రుచి...**
> కోతకు వచ్చిన కాఫీ పండ్లను చెర్రీలంటారు. కాఫీ నారు పోసిన తర్వాత ఏడాది వరకు చిన్న బుట్టల్లో నీరు పోసి పెంచుతారు. మొక్కలు అయ్యాక వాటిని తీసిన గొయ్యిలో పాతుతారు. అలా నాటిన తర్వాత మూడేళ్లకు పంట చేతికి వస్తుంది. ఏపుగా పెరిగిన చెట్ల మధ్యలో కాఫీ తోటలు వేస్తారు. అరకు లోయలోని వాతావరణం... ఈ కాఫీకి ప్రత్యేకమైన రుచి రావడానికి కారణమని నిపుణులు చెబుతుంటారు.

పండ్లను అమ్మితే, మరికొందరు పల్పింగ్ మిషన్ ద్వారా పై తొక్కను తీయించి.. మిగిలిన పిక్కను ఎండబెట్టి, దాన్ని అమ్ముతారు. అయితే తొక్క తీసిన గింజలను ఆరబెట్టడంలాంటివి చేస్తుంటారు. ఇంటిల్లిపాదికీ కాఫీ కలిపి ఇవ్వడమే కాదు, ఆ కాఫీ గింజలను పండించడంలోనూ మహిళలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు.

అది రైతుల ఇష్టం...

అరకులో ప్రాసెసింగ్ యూనిట్ కూడా ప్రారంభించాం. మా ఫౌండేషన్‌కు అనుబంధంగా 'అరకు ఒరిజినల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ' ఒకటి ఉంది. అది రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తుంది. అవిగాక 'గిరిజన కో-పరేషన్ లిమిటెడ్'తో పాటు 'ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్' తదితర సంస్థల్లో ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. కొందరు రైతులు సొంతంగా పల్పింగ్ మిషన్ల లాంటివి నడుపుతూ సొంతంగా కాఫీ పొడి తయారు చేసి మార్కెట్లో అమ్ముతుంటారు. 'నాంది ఫౌండేషన్' రైతులకు మొక్కలు మొదలు సేంద్రియ ఎరువుల వరకు అన్నీ ఉచితంగా ఇస్తుంది. కనుక, 'మా దగ్గరే ప్రాసెస్ చేయించుకోవాలి' లాంటి షరతులు అస్సలు ఉండవు. అమ్మకాలు, కొనుగోళ్ల వ్యవహారాల్లోనూ మేం జోక్యం చేసుకోం. అది పూర్తిగా రైతుల ఇష్టం. గిరిజనుల జీవితాల్లో ఆనందాన్ని చూడటమే మా అంతిమ లక్ష్యం. దాని కోసమే వారితో కొన్నేళ్లుగా కలిసి పనిచేస్తున్నాం.

• సాంత్వన్



నావికాదళం నారీమణులదే!

నౌకా దళం అనగానే ఆ రంగం పురుషులకే పరిమితం అనుకుంటాం. కానీ దాన్లో మహిళలకు అంతులేని అవకాశాలున్నాయంటున్నారు హైదరాబాద్‌కు చెందిన మాజీ లెఫ్టినెంట్ కమాండర్ ఐశ్వర్య బొడ్డపాటి. గతంలో ఎనిమిది నెలల పాటు సెయిలింగ్ బోట్‌లో ప్రపంచ జలాలను చుట్టి వచ్చిన ఆమె, నావికాదళంలో మహిళల ఉద్యోగావకాశాల గురించీ, తన స్వీయ అనుభవాల గురించీ 'నవ్య'తో ఇలా పంచుకున్నారు.

మెటల్లర్జీలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత నా చదువుతో సంబంధం ఉన్న ఇంటర్న్‌షిప్ చేయాలనే ఉద్దేశంతో డీఆర్‌డీఎల్‌లో చేరిపోయాను. అదే సమయంలో ఉద్యోగావకాశాల కోసం వెతుకుతూ దినపత్రికలను తిరగేస్తున్నప్పుడు నేవీ ప్రకటన నా కంట పడింది. అది టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగం. ఆ వృత్తిలో నా పని, ఓడలను డిజైన్ చేసి, రూపొందించడం. ఆ ఉద్యోగానికీ, సముద్రయానానికీ ఏమాత్రం సంబంధం లేదు. అయినా ఆ వృత్తి మీద ఆసక్తితో 2011లో అండమాన్‌లోని పోర్ట్ బ్లెయిర్‌లో నేవీలోకి అడుగుపెట్టాను. అక్కడున్న నేవల్ షిప్‌యార్డ్‌లో ఉన్న యుద్ధనౌకల మరమ్మతుల నిర్వహణ బాధ్యతలను నిర్వహించాను. ఆ సమయంలోనే గాలితో నడిచే పడవలో సముద్రజలాల్లో ప్రయాణిస్తూ, విశ్వాన్ని చుట్టి వచ్చే ఒక బృహత్తరమైన సాహసయాత్రలో పాల్గొనే అవకాశం వచ్చింది. దాంతో పోర్ట్ బ్లెయిర్ నుంచి గోవా చేరుకుని, అక్కడ రెండేళ్ల పాటు శిక్షణ తీసుకున్నాను.

నాకు సముద్రమంటే భయం

ఎవరెస్ట్ పర్వతాన్ని ఎక్కడమనేది అత్యంత సవాలుతో కూడుకున్న భూఆధారిత సాహసయాత్ర అయితే, అంతరిక్షంలోకి ప్రయాణించడమనేది అత్యంత సవాలుతో కూడుకున్న వాయు ఆధారిత సాహసయాత్ర. ఈ రెండిటిలాగే సముద్రజలాల మీద విశ్వాన్ని చుట్టి రావడమనేది కూడా సవాళ్లతో కూడుకున్న జల ఆధారిత సాహసయాత్రే! ఆరుగురు అమ్మాయిలం, మొట్టమొదటిసారిగా, తెరచాప పడవలో విశ్వాన్ని చుట్టి వచ్చే సాహసయాత్రకు ఎంపికైనప్పుడు, సహజంగానే అందరూ భయపడ్డారు. నేవీలోకి అడుగు పెడతాననీ, సముద్రంలో సాహసయాత్ర చేస్తాననీ నేను కలలో కూడా అనుకోలేదు. నిజం చెప్పాలంటే నాకు చిన్నప్పటి నుంచీ సముద్రమంటే విపరీతమైన భయం ఉండేది. ఆ భయాన్ని జయించడం కోసమైనా నేవీలో చేరాలని కాలేజీలో ఉన్నప్పుడు అనుకునేదాన్ని. అయితే సముద్రమంటే భయం పోవడానికి నేవీలోనే చేరవలసిన అవసరం లేదనీ, నీటిసంబంధ క్రీడలు, కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా కూడా ఆ భయాన్ని జయించవచ్చనీ నేవీలో చేరిన తర్వాత తెలిసింది.

అలా నేను బంజీ జంపింగ్, రివర్ రాఫ్టింగ్, స్కూబా డైవింగ్ క్రీడల్లో పాల్గొనడం మొదలుపెట్టాను. వీటికి విలువైనది ఏదైనా ఉందా అని ఆలోచిస్తున్న సమయంలో ప్రపంచాన్ని చుట్టి వచ్చే ఆరుగురు మహిళల భారతీయ నావికాదళ సాహసయాత్రలో పాల్గొనే అవకాశం తలుపు తట్టింది. కానీ దాన్లో పాల్గొనాలనే నిర్ణయం తీసుకోడానికి నేనెంతో ఆలోచించవలసి వచ్చింది. అప్పట్లో నావికాదళంలోని మహిళా అధికారులు ఓడల్లో ప్రయాణించే వృత్తుల్లో లేరు. పైగా అదే సమయంలో మా పేరెంట్స్ నాకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. 'బేస్‌లో ఉంటావని పెళ్లి సంబంధాలు చూస్తున్నాం. నువ్విప్పుడు సముద్ర ప్రయాణం చేస్తానంటే, నిన్ను చేసుకోడానికి ఎవరు ముందుకొస్తారు?' అని అమ్మా నాన్న అన్నారు. కానీ ఆ తర్వాత వాళ్లే నన్ను భుజం తట్టి ప్రోత్సహించారు. అలా రెండేళ్ల పాటు శిక్షణ పూర్తి చేసుకుని 2017లో సాహసయాత్రలో పాల్గొన్నాను.



> **మా బాబు పుట్టడం, నేవీలో నా కెరీర్ ముగిసిపోవడం ఒకేసారి జరిగింది. దాంతో పదేళ్ల నేవీ వృత్తి జీవితం నుంచి సెలవు తీసుకుని, డైవర్సిటీ హైరింగ్‌లో భాగంగా వెల్స్‌ఫార్గో సంస్థలో చేరిపోయాను. మా వారు రాజశేఖర్ సిడబ్ల్యుసిలో పని చేస్తారు. నాలుగేళ్ల బాబు నీల్ అనంత్ ఎల్‌కెజిలో ఉన్నాడు. అమ్మానాన్నలది, గుంటూరు, విజయవాడ.**

సవాళ్లను ఎదుర్కొని...

ప్రాథమిక సర్కమ్‌నావిగేషన్ నియమం ఏంటంటే, మూడు మహాఖండాల దిగువ నుంచి మాత్రమే ప్రయాణించాలి. జలసంధుల గుండా ప్రయాణించడం తేలిక కాబట్టి, సముద్రయానాన్ని క్లిష్టతరం చేయడం కోసమే ఈ నియమాన్ని ఏర్పాటు చేశారు. బహిరంగ మహాసముద్రంలో ప్రయాణించడం పలు సవాళ్లతో కూడుకుని ఉంటుంది. మేం ఆరుగురం మహిళలం తరచూ ఆగుతూ, పడవలో ఆహారం, నీళ్లనూ భర్తీ చేసుకుంటూ ప్రయాణించాలి. అందుకోసం మేం గోవాలో మా ప్రయాణాన్ని మొదలుపెట్టి మొదటి మజిలీలో భాగంగా ఆస్ట్రేలియాకు చేరుకున్నాం. అక్కడి నుంచి న్యూజిలాండ్, పసిఫిక్ మహాసముద్రాన్ని దాటి ఫాక్‌ల్యాండ్ దీవులకు చేరుకుని, అక్కడి నుంచి కేప్‌టౌన్ వెళ్లి, తిరిగి గోవాకు తిరుగు ప్రయాణమయ్యాం. అప్పటివరకూ సజావుగా సాగిన మా ప్రయాణానికి తిరుగు ప్రయాణంలో బ్రేక్ పడింది. మారిషస్ దగ్గర మా పడవకున్న స్టీరింగ్ సిస్టమ్ అయిన రడ్డర్ ఊడిపోయింది. అది సముద్రంలో పడిపోయే సమయానికి దాన్ని తాడుతో కట్టి, పడవను దారి మళ్లించి మారిషస్‌కు చేరుకున్నాం. అక్కడ రిపేరు చేయించుకుని సురక్షితంగా భారత దేశానికి చేరుకున్నాం.

ఆ ప్రయాణం అసాంతం ఎన్నో సవాళ్లతో సాగింది. తాగునీరు లేక వర్షపు నీళ్ల మీద ఆధారపడిన సందర్భాలున్నాయి. ఒక సందర్భంలో హాయిగా బేస్‌లోనే ఉండి, ఓడలను రిపేర్ చేసుకుంటూ ఉండిపోతే బాగుండేది కదా అని కూడా అనిపించింది. కానీ సముద్రయానం అనుభవంతో కొత్త విషయాలు నేర్చుకున్నాను. సముద్రంలో ట్రాఫిక్, పొల్యూషన్‌లు ఉండవు. నెట్‌వర్క్ ఉండదు. దాంతో మన గురించి మనం తెలుసుకోగలిగే సమయం చిక్కుతుంది. సవాళ్లతో కూడుకున్న సమయాలు ఎదురైనప్పటికీ, ఆహ్లాదకరమైన సమయాలను గడిపిన సందర్భాలు కూడా ఉన్నాయి.

మహిళలకు సురక్షితమే!

నావికాదళం మహిళలకు సురక్షితమైన రంగమేనా? అనే అనుమానాలు ఎంతో మందికి ఉంటాయి. నిజం చెప్పాలంటే నేలా, నింగికి సంబంధించిన రంగాల కంటే ఈ రంగమే సురక్షితమైనది. ఇంటి నుంచి ఆఫీసుకు బయల్దేరి వెళ్తే తిరిగి సురక్షితంగా ఇళ్లకు చేరతామనే నమ్మకం లేదు. కానీ సముద్రంలో కేవలం వాతావరణానికి సంబంధించిన సవాళ్లనే ఎదుర్కోవలసి వస్తుంది. నైపుణ్యం, అనుభవాలతో వాటిని తేలికగానే అధిగమించవచ్చు. పైగా దేశసేవకు ఆస్కారం ఉన్న రంగమిది. క్రమశిక్షణ, వ్యక్తిత్వ నిర్మాణాలకు కూడా ఈ రంగం తోడ్పడుతుంది. కానీ నేవీనే కెరీర్‌గా ఎంచుకోవచ్చనే విషయం కూడా చాలా మంది మహిళలకు తెలియదు. కాబట్టే నేను బడులు, కాలేజీలలో ప్రసంగించేటప్పుడు నేవీలో మహిళల కెరీర్ అవకాశాల గురించి అవగాహన కల్పిస్తూ ఉంటాను. అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్టాఫ్, ఎడ్యుకేషన్, టీచింగ్, నావిగేషన్... ఇలా ఎన్నో విభాగాల్లో మహిళలకు తగిన ఉద్యోగాలుంటాయి.

• గోగుమళ్ల కవిత

అవకాశాలు అందుకుంటే విజయమే

తన చుట్టు ఉన్న పరిస్థితులను గమనించి వాటిని అనుకూలంగా మలుచుకోగలిగితే సాధికారత దానంతట అదే వస్తుంది. ఈ సూత్రాన్ని నమ్మారు కేరళకు చెందిన సుమిలా జయరాజ్ అనే గృహిణి. కొబ్బరిలో తనకు అవకాశం ఉందని గ్రహించారు.. ఇప్పుడు కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారు...



సుమిలా పుట్టింది కేరళలో ఎంగడియూర్ అనే చిన్న పట్టణంలో. చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలనుకుంది. పరిస్థితులు అనుకూలించకపోవటంతో డిగ్రీతో చదువు ముగించింది. పెళ్లి చేసుకొని ముంబైకి వెళ్లిపోయింది. భర్త ఉద్యోగ నిమిత్తం దుబాయ్ వెళ్లటంతో సుమిలా మళ్లీ తన స్వస్థలానికి వచ్చేసింది. పిల్లలు స్కూలుకి వెళ్లిపోయిన తర్వాత అంతా ఖాళీనే! దాంతో ఏం చేయాలో తెలియక- కొబ్బరినూనెను ఎగుమతి చేసే ఒక కంపెనీలో చేరింది. సుమిలాకు ఇంగ్లీషు బాగా వచ్చు. దాంతో ఆమెను అంతర్జాతీయ క్లయింట్స్‌తో మాట్లాడే పని అప్పచెప్పారు. పదేళ్ల పాటు ఆ కంపెనీలో పనిచేయటం వల్ల- అంతర్జాతీయ మార్కెట్‌లో కొబ్బరికి ఉన్న డిమాండ్ ఆమెకు అర్థమయింది. స్వయంగా తానే ఎగుమతులు చేయాలనే ఉద్దేశంతో గ్రీన్ ఆరా అనే ఒక కంపెనీని ప్రారంభించింది. కొబ్బరిపాలు, కొబ్బరినూనెతో పాటు చట్నీ, ఊరగాయలు, వెనిగర్ లాంటి ఉత్పత్తులు ఎగుమతి చేయటం మొదలుపెట్టింది. "ఇదంత సులభమైన ప్రయాణం కాదు. ప్రతి అడుగు కష్టమైనదే! ఒక మహిళ వ్యాపారం మొదలుపెడితే ఎదురయ్యే సవాళ్లెన్నో! అయినా అన్నింటికీ తట్టుకున్నా.." అంటారు సుమిలా. ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే తపనే తనను ముందుకు నడిపించిందంటారు సుమిలా. "డబ్బుల కోసం చిన్నప్పుడు నాన్న మీద.. పెద్దయిన తర్వాత భర్త మీద ఆధారపడటం నాకు నచ్చలేదు. ఆర్థికంగా స్వాలంబన సాధించాలనే కోరికే నన్ను ముందుకు నడిపించింది" అంటారు సుమిలా. ఆమె కంపెనీ ఉత్పత్తులు ఇప్పటికి ఏడెనిమిది దేశాల్లో దొరుకుతున్నాయి. "ప్రపంచమంతా నా ఉత్పత్తులు లభించాలి.. అదే నా కోరిక" అనే సువిలా ఆశ నెరవేరాలని కోరుకుందాం. •



ప్రొటీన్‌కు ఈ నాలుగు!

మన శరీరానికి అత్యంత అవసరమైన వాటిలో ప్రొటీను ఒకటి. ఈ ప్రొటీను లభించే ఈ కింది నాలుగు పదార్థాలను మన ఆహారంలో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.

శనగలు: ప్రతి అరకప్పు శనగల్లో 8 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. వీటిలో ప్రొటీన్ మాత్రమే కాకుండా- ఫైబర్, కొవ్వు కూడా ఉంటాయి. గుండె జబ్బులు ఉన్నవారు తప్పనిసరిగా తీసుకోవాల్సిన ఆహారమిది.

పప్పు ధాన్యాలు: పప్పు ధాన్యాల్లో ప్రొటీన్‌తో పాటుగా ఫైబర్, పొటాషియం, ఫోలేట్ మొదలైనవి ఉంటాయి. ఒక అరకప్పు పప్పు ధాన్యాల్లో సుమారు 8 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. వీటిలో ఉండే పొటాషియం కొలస్ట్రాల్, బీపీలను తగ్గిస్తుంది.

గుమ్మిడి గింజలు: చిన్నగా కనిపించే ఈ గుమ్మిడి గింజలకు అనేక శుభలక్షణాలు ఉన్నాయి. దీనిలో ప్రొటీన్‌లతో పాటుగా యాంటీ ఆక్సిడెంట్స్ కూడా ఎక్కువగా ఉంటాయి.

క్వినోవా: క్వినోవాలో కూడా ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది. దీనిలో ఉండే గ్లుటెన్ ఫ్రీ కార్బోహైడ్రేట్స్ వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి.



ఫ్యాషన్

జిప్సీ జోరు

కాస్త డిఫరెంట్‌గా, మరికాస్త ప్రత్యేకంగా కనిపించాలంటే జిప్సీ స్టైల్స్ ఫాలో కావాలి. స్కర్ట్స్, లాంగ్ ఫ్రాక్స్, లేయర్ ఫ్రాక్స్... ఇలా జిప్సీలో బోలెడన్ని డ్రస్‌లు ఉన్నాయి. అవే ఇవి!

జామెట్రీ, ఫ్లవర్, ఈజిప్షియన్... ఇలా ఎన్నో రకాల ప్రింటులు జిప్సీ స్కర్ట్స్ సొంతం. ఈ డిజైన్లన్నీ దగ్గర దగ్గరగా ఇరికించినట్టు ఉండడం జిప్సీ స్టైల్ ప్రత్యేకత! ఈ డిజైన్లన్నీ ముదురు రంగుల్లో, ఓ క్రమం లేకుండా డ్రస్‌లో ఒదిగిపోయి ఉండడమే ఈ దుస్తులకు ఉన్న ఎట్రాక్షన్!

పెన్సిల్ హీల్స్, బూట్స్, వెడ్జెస్, ఫ్లాట్స్... వీటిలో ఎలాంటి చెప్పులైనా జిప్సీ దుస్తులతో మ్యాచ్ అవుతాయి. అలాగే పెద్ద సైజు ఇయర్ హ్యాంగింగ్స్, బ్యాంగిల్స్, హెడ్ బ్యాండ్స్ ఈ దుస్తులకు మ్యాచ్ అయినంతగా మరే డ్రస్‌కూ మ్యాచ్ అవవు!

క్రాప్ టాప్స్, స్లీవ్‌లెస్, షర్ట్... ఇలా ఎలాంటి టాప్స్ అయినా జిప్సీలో చెల్లుబాటు అవుతాయి. డిజైన్ పరంగా టాప్, బాటమ్ మ్యాచ్ కావాలనే నియమం కూడా ఉండదు. కాబట్టే జిప్సీ డ్రెస్సింగ్ స్టైల్ సర్వత్రా ఆదరణ పొందుతోంది.



అదానీ షేర్ల షార్ట్ సెల్లింగ్‌లో కోటక్ మహీంద్రా బ్యాంక్ హస్తం

ఎఫ్‌పీఐ ద్వారా క్లయింట్ షార్ట్ పొజిషన్.. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మరో బాంబు పేల్చింది. ఈసారి ఏకంగా ఉదయ్ కోటక్ ప్రమోట్ చేసిన ప్రముఖ బ్యాంక్.. కోటక్ మహీంద్రా బ్యాంక్ పేరును రోడ్డు కీడ్చింది. అదానీ గ్రూప్ దందాపై తమ నివేదిక వివరాలను ముందే తెలుసుకున్న కింగ్‌డమ్ క్యాపిటల్ అనే తమ క్లయింట్.. అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) కంపెనీ షేర్లలో షార్ట్ పొజిషన్ తీసుకుని రూ.183.24 కోట్ల (2.23 కోట్ల డాలర్లు) మేర లాభం పొందినట్టు తెలిపింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ అనుబంధ సంస్థ.. కోటక్ మహీంద్రా ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ (కేఎంఐఎల్) విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌పీఐ) విభాగమైన కే-ఇండియా ఆపర్చునిటీస్ ఫండ్ లిమిటెడ్ (కేఐఓఎఫ్‌ఎల్) ద్వారా కింగ్‌డమ్ క్యాపిటల్ ఈ షార్ట్ పొజిషన్ తీసుకున్నట్టు తెలిపింది.

అంతా అబద్ధం

కోటక్ మహీంద్రా బ్యాంక్ అనుబంధ సంస్థ కేఎంఐఎల్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఎప్పుడూ తమ అనుబంధ సంస్థ కేఐఓఎఫ్‌ఎల్ క్లయింట్ కాదని తెలిపింది. తమ పెట్టుబడులన్నీ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిబంధనలకు అనుగుణంగానే ఉంటాయని స్పష్టం చేసింది. తమ క్లయింట్లు ఎవరూ ఇతరుల తరఫున పెట్టుబడులు పెట్టడాన్నీ తాము అనుమతించమని స్పష్టం చేసింది. కేవైసీ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతే తాము ఏ సంస్థనైనా క్లయింట్‌గా చేర్చుకుంటామని తెలిపింది.

కోటక్ బ్యాంక్ షేరు డౌన్

ఈ వార్తలతో మంగళవారం కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరు నష్టాలబాటపట్టింది. బీఎస్ఈలో ఈ షేరు 2.16 శాతం నష్టంతో రూ.1,769.60 వద్ద ముగిసింది. దీంతో బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.7,777.33 కోట్లు తుడిచి పెట్టుకుపోయింది. ఇంట్రాడేలో కోటక్ బ్యాంక్ షేరు ఒక దశలో 3.98 శాతం నష్టంతో రూ.1,736.65 కనిష్ఠ స్థాయిని తాకింది.



హిండెన్‌బర్గ్‌కు సెబీ షోకాజ్ నోటీసులు

ఈ ఆరోపణల నేపథ్యంలో సెబీ.. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థకు 46 పేజీల షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపైనా హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మండిపడింది. కనీసం కోటక్ మహీంద్రా పేరును కూడా ప్రస్తావించకుండా.. తమకు నోటీసులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించింది. ఉదయ్ కోటక్ ప్రముఖ వ్యక్తి కాబట్టే, సూచనప్రాయంగా కూడా సెబీ ఆయన పేరు ప్రస్తావించలేదని ఆరోపించింది. ఈ విషయంలోనూ సెబీ ప్రముఖ వ్యాపారవేత్తల కొమ్ముకాస్తోందని ఆరోపించింది. అదానీ గ్రూప్ షేర్ల దందాపైనా, తాము సమగ్ర వివరాలు ఇచ్చినా సెబీ తూతూమంత్రంగా దర్యాప్తు జరిపి అదానీ గ్రూప్‌ను ఒడ్డున పడేసిందని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. దేశంలో శక్తివంతులైన వ్యక్తుల అవినీతి, మోసాలపై ఎవరూ నోరు మెదపకుండా భయపెట్టేలా సెబీ షోకాజ్ నోటీసు ఉందని దుయ్యబట్టింది.

ŠKODA | VOLKSWAGEN
ŠKODA AUTO Volkswagen India Private Limited

ఫోక్స్‌వ్యాగన్ ఇండియాలో వాటా విక్రయం!

కొనుగోలుకు మహీంద్రా ఆసక్తి

న్యూఢిల్లీ: ప్రపంచంలో అతిపెద్ద ఆటోమొబైల్ కంపెనీ ఫోక్స్‌వ్యాగన్ తన భారత వ్యాపార అనుబంధ విభాగమైన స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఏవీడబ్ల్యూఐపీఎల్)లో వాటా విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలిసింది. కాగా, ఈ కంపెనీలో వాటా కొనుగోలుకు దేశీయ వాహన సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. "భారత మార్కెట్లో 20 ఏళ్లుగా కార్యకలాపాలు సాగిస్తున్నాం. ఇప్పటికీ మా వ్యాపారాన్ని గాడిన పెట్టలేకపోయాం. అందుకే, కొత్త వ్యూహాన్ని ఎంచుకోవాలనుకుంటున్నాం. సరైన స్థానిక భాగస్వామి లభిస్తే, వారి ద్వారా నేర్చుకోవడంతో పాటు ఒకరి ద్వారా మరొకరం లబ్ధి పొందే అవకాశం ఉంటుంద"ని స్కోడా ఆటో గ్లోబల్ సీఈఓ క్లాస్ జెల్మర్ అన్నారు. ఫోక్స్‌వ్యాగన్ భారత కార్యకలాపాలను ప్రస్తుతం ఈయనే పర్యవేక్షిస్తున్నారు. ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ భారత మార్కెట్లో వ్యాపార విస్తరణ కోసం ఇప్పటివరకు 200 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు పెట్టడంతో పాటు పలు మోడళ్లను విడుదల చేసింది. అయినప్పటికీ, ఇక్కడి మార్కెట్లో కంపెనీ విజయం సాధించలేకపోయింది. ప్రస్తుతం ఈ గ్రూప్ భారత్‌లో ఫోక్స్‌వ్యాగన్, స్కోడా బ్రాండ్ కార్లను విక్రయిస్తోంది. ఇతర బ్రాండ్లతో పోలిస్తే తన కార్ల ధర అధికం కావడంతో ఈ కంపెనీ సగటు భారత కస్టమర్‌కు చేరువ కాలేకపోయింది.

విద్యార్థుల కోసం ఐసీఐసీఐ సఫీరో ఫారెక్స్ కార్డ్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని ఐసీఐసీఐ బ్యాంక్.. విదేశాల్లో ఉన్నత విద్యకు వెళ్తున్న విద్యార్థుల కోసం సఫీరో ప్రీపెయిడ్ ఫారెక్స్ కార్డ్‌ను ప్రత్యేకంగా విడుదల చేసింది. వీసా నిర్వహణలోని ఈ కార్డు విద్యార్థుల విద్యా సంబంధిత లావాదేవీలు నిర్వహించేందుకు ఇది సహాయకారిగా ఉంటుంది. అడ్మిషన్ ఫీజు, కోర్సు సంబంధిత ఫీజులు; ప్రయాణం, ఆహారం, నిత్యావసరాలు సహా రోజువారీ ఖర్చులను విద్యార్థులు ఈ కార్డు ద్వారా చెల్లించవచ్చు. ఎలాంటి క్రాస్ కరెన్సీ మార్క్ అప్ చార్జీలు లేకుండా 15 కరెన్సీల్లో లావాదేవీలు నిర్వహించుకునే వెసులుబాటు ఈ కార్డు ద్వారా లభిస్తుంది.

మాస్‌చిప్‌తో సీ-డాక్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): పూర్తి దేశీయ పరిజ్ఞానంతో పనిచేసే హై పెర్‌ఫార్మెన్స్ కంప్యూటర్ల అభివృద్ధికి సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ కంప్యూటింగ్ (సీ-డాక్) సిద్ధమైంది. ఈ కంప్యూటర్లకు అవసరమైన ఏయూఎం ఆధారిత ప్రాసెసర్ల డిజైన్, డెవలప్‌మెంట్ కోసం హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మాస్‌చిప్ టెక్నాలజీస్, జపాన్ కేంద్రంగా పనిచేసే సోషియోనెక్స్ట్ ఇంక్ అనే కంపెనీతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎంసీ) తయారు చేసే 5ఎంఎం చిప్ టెక్నాలజీ ఆధారంగా ఈ ప్రాసెసర్లను అభివృద్ధి చేస్తారు.

డ్యూట్జ్ ఏజీతో టాఫే మోటార్స్ జట్టు

చెన్నై: జర్మనీకి చెందిన ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ల తయారీ సంస్థ డ్యూట్జ్ ఏజీతో టాఫే మోటార్స్ అండ్ ట్రాక్టర్స్ లిమిటెడ్ దీర్ఘకాలిక సహకార ఒప్పందం కుదుర్చుకుంది. అందులో భాగంగా ఈ రెండు కంపెనీలు సంయుక్తంగా డ్యూట్జ్‌కు చెందిన పలు శ్రేణి ఇంజన్లను భారత్‌లో తయారు చేయనున్నాయి. 50-75 హెచ్‌పీ, 75-100 హెచ్‌పీ శ్రేణులకు చెందిన 30,000 యూనిట్ల డ్యూట్జ్ ఇంజన్లను టాఫే మోటార్స్‌కు రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఉన్న ప్లాంట్‌లో తయారు చేయనున్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ట్రాక్టర్ల తయారీ సంస్థ టాఫే లిమిటెడ్ భారత అనుబంధ విభాగమే టాఫే మోటార్స్ అండ్ ట్రాక్టర్స్ లిమిటెడ్.

20-21 తేదీల్లో అమెజాన్ ప్రైమ్ డే సేల్స్

న్యూఢిల్లీ: ఈ నెల 20-21 తేదీల్లో ప్రైమ్ డే సేల్‌ను నిర్వహించనున్నట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. ఈ సందర్భంగా అమెజాన్ ప్రైమ్ సభ్యులకు అన్ని వస్తువులపై ప్రత్యేక డిస్కౌంట్‌లు, ఆఫర్లు ఉంటాయని తెలిపింది. ప్రైమ్ ఖాతాదారులు 450 బ్రాండ్స్‌కు చెందిన వేలాది వస్తువులను ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్లలో కొనుగోలు చేయవచ్చు. ఈ వస్తువులు అదే రోజు లేదా మరుసటి రోజు ప్రైమ్ సభ్యులకు డెలివరీ చేస్తారు. కాగా దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు కూడా అదే రోజు లేదా మరుసటి రోజున డెలివరీ చేయాలని చూస్తున్నట్లు తెలిపింది.

ఫినోమ్ చేతికి టైడీ

వచ్చే ఏడాది కాలంలో 1,000 నియామకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హ్యూమన్ రీసోర్సెస్ (హెచ్ఆర్) టెక్నాలజీ సంస్థ ఫినోమ్.. మానవ వనరుల విభాగంలోని స్టార్టప్ టైడీని కొనుగోలు చేసింది. అయితే డీల్ విలువను మాత్రం కంపెనీ వెల్లడించలేదు. ఈ రెండు సంస్థలు అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. కాగా ఫినోమ్.. అమెరికాతో పాటు హైదరాబాద్, విశాఖపట్నంలో కార్యాలయాలను నిర్వహిస్తుండగా టైడీ బెంగళూరు కేంద్రంగా సెంటర్‌ను నిర్వహిస్తోంది. ఈ కొనుగోలుతో హెచ్ఆర్ కార్యకలాపాలను మరింత సులభతరం చేయటంతో పాటు నైపుణ్యం కలిగిన ఉద్యోగులను ఎంపిక చేసుకునేందుకు అవసరమైన టెక్నాలజీలను అందించే వీలు కలుగుతుందని ఫినోమ్ సీఈఓ మహీ బైరెడ్డి తెలిపారు. ప్రస్తుతం కంపెనీ ఉద్యోగుల సంఖ్య 1,600గా ఉందని, ఒక్క హైదరాబాద్ సెంటర్‌లోనే 900 ఉద్యోగులు పనిచేస్తుండగా విశాఖలో 150 వరకు ఉద్యోగులు ఉన్నారని ఫినోమ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివానంద్ ఆకెళ్ల తెలిపారు. కాగా వచ్చే ఏడాది కాలంలో కొత్తగా మరో 1,000 మందిని నియమించుకోవాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీకి 700కు పైగా క్లయింట్లు ఉన్నారని తెలిపారు.

సరికొత్త గరిష్ఠాల నుంచి స్వల్ప నష్టాల్లోకి..

సెన్సెక్స్ 35 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఆరంభ ట్రేడింగ్‌లో సరికొత్త జీవితకాల గరిష్ఠాలను తాకినప్పటికీ.. చివరికి స్వల్ప నష్టాలతో సరిపెట్టుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్ ట్రేడింగ్ ఆరంభంలోనే 379.68 పాయింట్ల లాభంతో 79,855.87 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. కానీ, ఆరంభ లాభాలను ఎక్కువ సేపు నిలబెట్టుకోలేకపోయింది. రోజంతా లాభనష్టాల మధ్య తీవ్ర ఊగిసలాటలకు లోనైన సూచీ చివరికి 34.74 పాయింట్ల నష్టంతో 79,441.45 వద్ద ముగిసింది. ఆరంభంలో 94.4 పాయింట్లు ఎగబాకి 24,236.35 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసిన నిఫ్టీ.. చివరికి 18.10 పాయింట్ల నష్టంతో 24,123.85 వద్ద స్థిరపడింది.

బ్రోకింగ్ షేర్లు ఢమాల్

స్టాక్ బ్రోకింగ్ సేవలందించే కంపెనీల షేర్లన్నీ భారీగా పతనమయ్యాయి. ఏంజిల్ వన్ షేరు 8.72 శాతం క్షీణించగా.. జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 6.83 శాతం, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 4.19 శాతం, ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ 2.81 శాతం, దౌలత్ ఆల్గోటెక్ 2.28 శాతం నష్టపోయాయి. స్టాక్ ఎక్స్ఛేంజీలు, స్టాక్ బ్రోకింగ్ కంపెనీలతో పాటు మిగతా మార్కెట్ మౌలిక సదుపాయాల సంస్థలు ఇకపై తమ సభ్యుల నుంచి ట్రేడింగ్ వాల్యూమ్ లేదా కార్యకలాపాల ఆధారంగా భిన్న చార్జీలకు బదులు ఏకరీతి, సమాన రుసుమును వసూలు చేయాలని సెబీ ఆదేశించడం ఇందుకు కారణమైంది. దాంతో మార్కెట్లో బ్రోకింగ్ డిస్కౌంట్లకు తెరపడినట్లైంది.

ఆఫీసర్స్ చాయిస్ షేరు తొలిరోజు 13% అప్

ఆఫీసర్ చాయిస్ విస్కీ బ్రాండ్ తయారీ సంస్థ అలైడ్ బ్లెండర్స్ తన షేర్లను మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.281తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 13.20 శాతం ప్రీమియంతో రూ.318.10 వద్ద లిస్టయింది. ఒకదశలో 15.44 శాతం వరకు పెరిగినప్పటికీ, చివరికి 13.11 శాతం లాభంతో రూ.317.85 వద్ద ముగిసింది. గతవారంలో ముగిసిన ఐపీఓకు 23.49 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

డివైన్ పవర్ 284 శాతం ప్రీమియంతో లిస్టింగ్

ఇన్సులేటెడ్ వైర్లు, స్ట్రిప్స్ తయారీదారు డివైన్ పవర్ ఎనర్జీ లిస్టింగ్‌కు అపూర్వ స్పందన లభించింది. కంపెనీ తన షేర్లను ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.40తో పోలిస్తే, కంపెనీ షేరు 287.50 శాతం ప్రీమియంతో రూ.155 వద్ద లిస్టయింది. తొలి రోజు ట్రేడింగ్ నిలిచే సరికి, 284 శాతం లాభంతో రూ.150 వద్ద ముగిసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,380 ▲	66,350 ▲	95,500 ▲
ముంబై	71,692 ▼	65,670 ▼	88,015 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	535
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	118
వరంగల్	107	గుంటూరు	118
కరీంనగర్	107	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	120
కర్నూలు	107	నెల్లూరు	120
విశాఖపట్నం	119	అనంతపురం	118
గోదావరి	118		

జింబాబ్వే టూర్‌కు జితేష్, సుదర్శన్, హర్షిత్

తొలి రెండు టీ20లకు దూబే, జైస్వాల్, శాంసన్ దూరం

న్యూఢిల్లీ: జింబాబ్వే టూర్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో మరో మూడు మార్పులు చోటు చేసుకొన్నాయి. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగే తొలి రెండు మ్యాచ్‌లకు ఇదివరకే జట్టుకు ఎంపికైనా సంజూ శాంసన్, శివమ్ దూబే, యశస్వి జైస్వాల్ స్థానంలో సాయి సుదర్శన్, జితేష్ శర్మ, హర్షిత్ రాణాలను ఎంపిక చేశారు. టీ20 వరల్డ్‌కప్ విన్నింగ్ జట్టులో శాంసన్, దూబే, జైస్వాల్ సభ్యులు. వీరు నేరుగా జింబాబ్వే వెళ్లి జట్టుతో కలవాల్సి ఉన్నా.. బార్బడోస్‌లో హరికేన్ కారణంగా అక్కడే ఉండిపోయారు. దీంతో మిగతా ఆటగాళ్లతో కలసి ఈ ముగ్గురు కూడా ప్రత్యేక విమానంలో బుధవారం భారత్ రానున్నారు. ఆ తర్వాత విశ్వ విజేతలను ప్రధాని నరేంద్ర మోదీ సత్కరించే కార్యక్రమంలో ఈ ముగ్గురు కూడా పాల్గొంటారు. ఆ తర్వాతే వీరు జింబాబ్వే సిరీస్ కోసం హరారే వెళతారు. ఈ నేపథ్యంలో వీరి స్థానంలో తొలి రెండు మ్యాచ్‌లకు సుదర్శన్, జితేష్, హర్షిత్‌లను ఎంపిక చేశారు. ఇక.. రింకూ, ఖలీల్ అహ్మద్ కూడా టీమిండియాతోనే ఉన్నా.. వారి స్థానాలను మాత్రం భర్తీ చేయలేదు. కాగా, ఈనెల 6 నుంచి జరిగే సిరీస్ కోసం భారత యువ జట్టు మంగళవారం జింబాబ్వే బయల్దేరింది. ఇక, జింబాబ్వే సిరీస్‌కు జట్టు కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్ అమెరికాలో జట్టుతో కలువనున్నాడు.

గైక్వాడ్‌ను ఆదుకోండి!

బీసీసీఐకి పాటిల్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన భారత జట్టుకు రూ.125 కోట్ల నజరానాను బీసీసీఐ ప్రకటించడంపై మాజీ ఆటగాడు సందీప్ పాటిల్ హర్షం వ్యక్తం చేశాడు. అదే సమయంలో టీమిండియా మాజీ కోచ్ అన్షుమన్ గైక్వాడ్ చికిత్సకు సాయం చేయాల్సిందిగా పాటిల్ కోరాడు. ఏడాది కాలంగా గైక్వాడ్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని తెలిపాడు. లండన్‌లో చికిత్స చేయించుకొంటున్న గైక్వాడ్ నిధులలేమితో ఇబ్బందులుపడుతున్నాడనీ, అతడిని బీసీసీఐ ఆదుకోవాల్సిన అవసరం ఉందని అన్నాడు. భారత్ తరఫున 40 టెస్ట్‌లు, 15 వన్డేలు ఆడిన 71 ఏళ్ల గైక్వాడ్.. సచిన్ కెప్టెన్సీ సమయంలో జట్టు కోచ్‌గానూ పనిచేశాడు.



ఏసీఏ పెత్తందారులపై తిరుగుబాటు

- విజయవాడలో సమావేశమైన మెజారిటీ సభ్యులు
- మాజీ అధ్యక్షుడు గంగరాజుతో పాటు పలువురు హాజరు
- ఆంధ్ర క్రికెట్ సంఘాన్ని గాడిన పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



లిక్కర్ స్కామ్ నిందితులు, క్రిమినల్ కేసులున్న పారిశ్రామిక వేత్తలు, అన్నదమ్ముల పెత్తనంతో కుటుంబ సంఘంగా మారిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) పెత్తందారుల కూటమిపై తిరుగుబాటు మొదలైంది. విజయసాయిరెడ్డి గ్యాంగ్ ఆగడాలను భరించలేక, ఏసీఏ సభ్యుల్లోని మెజారిటీ వర్గం ఇప్పుడు ఒక్కతాటిపైకి వచ్చింది. గోపీనాథ్ రెడ్డి అండ్ కో పోకడలను భరించలేక ఆంధ్ర జట్టును వీడిన క్రికెటర్లను తిరిగి సొంత గూటికి రప్పించేందుకు ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించినట్లు తెలుస్తోంది.

ఒకప్పుడు ఏసీఏలో క్రికెట్ నైపుణ్యం, పరిజ్ఞానమున్న వాళ్లు, టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించే నాయకత్వం ఉండేది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో ఒక పంచాయతీ పెట్టి కార్యదర్శి దుర్గాప్రసాద్‌ను తప్ప మిగిలిన వారందరినీ సాగనంపారు. ఆ తర్వాత దుర్గాప్రసాద్‌ను పక్కకు పెట్టి ఏసీఏను పూర్తిగా తమ చేతుల్లో పెట్టుకుంది 'వీ' గ్యాంగ్. అప్పటి నుంచి రాష్ట్రంలో క్రికెట్‌కు గ్రహణం పట్టుకుంది.

విజయవాడ భేటీలో తీర్మానం..

ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి దాష్టీకాలకు విసిగిపోయిన సభ్యులు విజయవాడలో తాజాగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో క్రికెట్ మనుగడ సాధించాలంటే తక్షణమే 'వీ' గ్యాంగ్‌ను గద్దె నుంచి దింపి, ప్రజాస్వామ్యబద్ధంగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని ఈ భేటీకి హాజరైన మాజీ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు సహా 25 మంది సభ్యులు తీర్మానించారని సమాచారం. ఈ సందేశాన్ని శరత్‌చంద్రారెడ్డి వర్గానికి పంపగా, వారు మరో ఏడాది పదవి కాలం ఉండడంతో అప్పటిదాకా తమను కొనసాగనివ్వాల్సిందిగా కోరినట్టు తెలుస్తోంది. దీనికి అంగీకరించని మెజారిటీ ఏసీఏ సభ్యులు.. గత పాలకుల అక్రమాలపై న్యాయ పోరాటం చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఏసీఏను గాడిన పెట్టాలని కోరుతున్నారు.

ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లోనూ కుట్రలే..

వర్ధమాన క్రికెటర్లకు ఒక వేదిక కల్పిస్తామన్న ప్రచారంతో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)ను ప్రారంభించిన కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి, అందులోని 6 జట్లలో 4 జట్లు రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, వైజాగ్ వారియర్స్‌ను వైసీపీ నాయకులకు కట్టబెట్టారన్న విమర్శలొచ్చాయి. టీమ్ యజమానులు, వారి కంపెనీలపైన ఎలాంటి క్రిమినల్ కేసులు ఉండకూడదనే షరతులు ఉన్నాయి. కానీ, ఇవేమీ పట్టించుకోని గోపీనాథ్ రెడ్డి.. అమెరికాలో క్రిమినల్ కేసులున్న ఒమిక్స్ అనే కంపెనీకి ఓ ఫ్రాంచైజీని కట్టబెట్టారన్న ఆరోపణలున్నాయి. లీగ్ ప్రారంభంలో ఫ్రాంచైజీ హక్కులను మూడేళ్లకు ఇచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో దొడ్డిదారిన యాజమాన్య హక్కుల కాల పరిమితిని మూడేళ్ల నుంచి పదేళ్లకు పెంచాలనే ఆలోచనలో ఉన్నారట.

దొడ్డిదారిన క్లబ్‌లకు గుర్తింపు

తిరుపతి, కడప, ఆమదాలవలస, అనంతపురంలో నాలుగు క్లబ్‌లకు దొడ్డిదారిన కొత్తగా సభ్యత్వం ఇచ్చారు. ఇందులో మూడు క్లబ్‌లు గోపీనాథ్ రెడ్డి, మాజీ సీఈఓ శివారెడ్డితో పాటు, వైసీపీ నాయకుల అనుచరులకు ఇచ్చినట్టు సమాచారం. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఒంగోలు, చిత్తూరు జిల్లా సంఘాలను రద్దు చేసి, స్థానిక వైసీపీ నాయకుల అనుచరగణంతో అడ్‌హక్ బాడీలను ఏర్పాటు చేశారు.

ఎక్స్‌లెన్స్ అకాడమీలకు పాతర..

ఈసారి ఐపీఎల్‌లో ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డు అందుకున్న నితీశ్ రెడ్డి ఒకప్పటి ఏసీఏ ఎక్స్‌లెన్స్ అకాడమీ తయారు చేసిన క్రికెటరే. నితీష్ 12 ఏళ్ల వయస్సులో కడపలోని ఏసీఏ సౌత్ జోన్ అకాడమీ నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాడు. ఒకప్పుడు రాష్ట్రంలో నాలుగు ఎక్స్‌లెన్స్ అకాడమీలు ఉండేవి. కడపలో సౌత్‌జోన్, మంగళగిరిలో సెంట్రల్ జోన్, విజయనగరంలో నార్త్‌జోన్, గుంటూరులో మహిళల కోసం ప్రత్యేకంగా అకాడమీలను నెలకొల్పారు. సాయిరెడ్డి బృందం వచ్చాక ఈ అకాడమీలకు మంగళం పాడారు. దీంతో ప్రతిభావంతులైన నిరుపేద క్రికెటర్లకు ఆసరా పోయింది.

కడపకు నిధుల ప్రవాహం

ఏసీఏ చీఫ్ శరత్‌చంద్రా రెడ్డి తన వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా అప్పటి సీఎం వైఎస్ జగన్‌ను ప్రసన్నం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారన్న విమర్శలున్నాయి. కడపలో వైఎస్ రాజారెడ్డి పేరిట ఒక స్టేడియం ఉండగా.. పులివెందులలో దాదాపు రూ.15 కోట్లతో మరో స్టేడియం నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇక, కడప స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుకే రూ.9 కోట్లు మంజూరు చేశారట. కాగా.. శ్రీకాకుళం, ఉమ్మడి గోదావరి జిల్లాలు, నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలో ఏసీఏకి ఒక్క సొంత మైదానం కూడా లేకపోవడం గమనార్హం. ఇకనైనా, ఏసీఏ అక్రమాలపై విచారణ జరిపి క్రికెటర్లకు న్యాయం చేయాలని నూతన ప్రభుత్వాన్ని క్రీడారంగ అభిమానులు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా సెలెక్షన్ కమిటీలు

సెలెక్షన్స్ కమిటీల విషయంలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఏసీఏ పురుషుల సీనియర్ సెలెక్షన్ కమిటీలో తక్కువ మ్యాచ్‌లాడిన శ్రీహరిరావును చైర్మన్‌గా నియమించి, ఎక్కువ మ్యాచ్‌లాడిన అనుభవమున్న వారిని మెంబర్లుగా పరిమితం చేశారు. జూనియర్ సెలెక్షన్ కమిటీలోనూ ఇదేతంతు అన్న విమర్శలున్నాయి.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)

పారిస్ ఒలింపిక్స్‌కు జ్యోతి!



న్యూఢిల్లీ: తెలుగు అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ పారిస్ ఒలింపిక్స్‌కు ఎంపికవడం ఖాయమైనట్లే. ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య మంగళవారం ప్రకటించిన వరల్డ్ ర్యాంకింగ్స్ కటాఫ్ ప్రకారం 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి, షాట్‌పుట్‌లో అభా ఖతువా భారత్ నుంచి విశ్వక్రీడలకు అర్హత సాధించిన అథ్లెట్ల జాబితాలో నిలిచారు. పారిస్‌లో మొత్తం 40 మంది అథ్లెట్లు పోటీపడే తన ఈవెంట్‌లో జ్యోతికి ర్యాంకింగ్స్ కటాఫ్‌లో 34వ స్థానం దక్కింది. పారిస్ క్రీడలకు ఎంపికైన అథ్లెట్ల తుది జాబితాను ఈనెల 7న అధికారికంగా ప్రకటిస్తారు. ఇదే జరిగితే, ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో పోటీపడనున్న భారత అథ్లెట్‌గా జ్యోతి రికార్డుకెక్కనుంది.

వింబుల్డన్

చాంపియన్ అవుట్



- వొంద్రుసోవాకు జెస్సికా షాక్
- రుబ్లెవ్ ఇంటిబాట
- జొకోవిచ్, రిబకినా శుభారంభం

లండన్: గ్రాస్‌కోర్టు గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్‌లో ఆరంభంలోనే సంచలనం నమోదైంది. మహిళల డిఫెండింగ్ చాంపియన్ మార్కెటా వొంద్రుసోవా తొలిరౌండ్లోనే వెనుదిరిగింది. స్పెయిన్‌కు చెందిన 21 ఏళ్ల జెస్సికా బొజాస్ మనెరో 6-4, 6-2తో 6వ సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్)కు షాకిచ్చి సంచలనం సృష్టించింది. 2019 ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్, టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత వొంద్రుసోవా.. గంటా ఏడు నిమిషాల పాటు సాగిన ఏకపక్ష పోరులో యువ కెరటం జెస్సికా ధాటికి ఏ దశలోనూ పోటీ ఇవ్వలేక వరుససెట్లలో ఓటమిపాలైంది. గతేడాది అన్‌సీడెడ్ హోదాలో ఇక్కడ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిన 25 ఏళ్ల వొంద్రుసోవా.. ఈ పరాజయంతో చెత్త రికార్డును మూటగట్టుకుంది. ఓపెన్ ఎరాలో స్టెఫీగ్రాఫ్ (1994లో) తర్వాత ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో తొలిరౌండ్లోనే ఓడిన డిఫెండింగ్ చాంప్‌గా వొంద్రుసోవా నిలిచింది. ఇక, కెరీర్‌లో మూడోసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తలపడుతున్న83వ ర్యాంకర్ జెస్సికాకు టాప్-10 క్రీడాకారిణిపై గెలవడం ఇదే తొలిసారి కావడం విశేషం. మిగతా స్టార్ క్రీడాకారిణుల్లో యూఎస్ ఓపెన్ విజేత, రెండోసీడ్ కోకో గాఫ్ 6-1, 6-2తో కరోలిన్ డోలెహైడ్‌పై, 4వ సీడ్ రిబకినా 6-3, 6-1తో ఎలెనా గాబ్రియెల్ రూస్‌పై, 5వ సీడ్ జెస్సికా పెగులా 6-2, 6-0తో అష్లిన్ క్రూగర్‌పై గెలిచి రెండోరౌండ్‌కు దూసుకెళ్లారు.

జొకోవిచ్ అలవోకగా: పురుషుల సింగిల్స్‌లో ఏడుసార్లు చాంపియన్ జొకోవిచ్ వింబుల్డన్‌ను గ్రాండ్‌గా శుభారంభం చేయగా.. 6వ సీడ్ ఆండ్రీ రుబ్లెవ్ ఆదిలోనే ఇంటిబాట పట్టాడు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో ఉన్న 2వ సీడ్ జొకోవిచ్ 6-1, 6-2, 6-2తో క్వాలిఫయర్ విట్ కోప్రివాను అలవోకగా ఓడించి రెండోరౌండ్ చేరాడు. ఇక, తొలిసారి గ్రాండ్‌స్లామ్ మ్యాచ్ ఆడుతున్న ఫ్రాన్సిస్కో కొమెసన (అర్జెంటీనా) 6-4, 5-7, 6-2, 7-6(5)తో రష్యాకు చెందిన 6వ సీడ్ ఆండ్రీ రుబ్లెవ్‌కు ఝలకిచ్చి రెండో రౌండ్‌లో అడుగుపెట్టాడు. ఈ మ్యాచ్‌లో రుబ్లెవ్ అసహనంతో పలుమార్లు రాకెట్‌ను నేలకేసి కొట్టడం గమనార్హం.

వెంకన్న సేవలో స్మృతీ మంధాన

తిరుమల (ఆంధ్రజ్యోతి): భారత మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతీ మంధాన మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. కుటుంబసమేతంగా వచ్చిన ఆమె స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసింది.

భళా.. కోస్టా

'యూరో' క్వార్టర్స్‌కు పోర్చుగల్

షూటౌట్‌లో స్లోవేనియాపై గెలుపు



ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ): గోల్ కీపర్ డీగో కోస్టా అద్భుత ప్రదర్శనతో పోర్చుగల్ యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ క్వార్టర్స్‌కు చేరుకొంది. సోమవారం రాత్రి జరిగిన రౌండ్-16 పోరులో పోర్చుగల్ 0-0 (3-0)తో స్లొవేనియాపై షూటౌట్‌లో గెలిచింది. నిర్ణీత, అదనపు సమయంలో ఇరు జట్లూ గోల్ చేయలేకపోవడంతో.. ఫలితం షూటౌట్‌కు దారి తీసింది. ఇందులో పోర్చుగల్ తొలి మూడు కిక్‌లను గోల్స్‌గా మలచగా.. స్లొవేనియా ప్లేయర్లు కొట్టిన మూడు కిక్‌లను కీపర్ కోస్టా అద్భుతంగా అడ్డుకొన్నాడు. తమకంటే బలహీనమైన స్లొవేకియాపై పోర్చుగల్ ఒక్క గోల్ కూడా చేయక పోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. స్టార్ ప్లేయర్ రొనాల్డో ఏకంగా స్పాట్ కిక్‌ను మిస్ చేశాడు. ఈ నేపథ్యంలో అతడు ఫ్యాన్స్‌ను క్షమించాలని వేడుకున్నాడు. ఇక, మ్యాచ్ ముగిసిన తర్వాత ఇదే తన ఆఖరి యూరో కప్ అని రొనాల్డో ప్రకటించాడు. మరో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 3-0తో రొమేనియాను చిత్తుచేసి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది.



విద్యుత్ ప్రమాణాలు తప్పనిసరి

» విద్యుత్ భద్రతా విభాగ డైరెక్టర్ విజయలక్ష్మి



విజయవాడ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 15 మీటర్ల ఎత్తు ఉన్న బహుళ అంతస్తుల భవనాలు, విమానాశ్రయాలు, హోటళ్లు, స్టేడియంలు, విద్యాలయాల్లో 2023 సీఈఏ రెగ్యులేషన్స్ ప్రకారం విద్యుత్ ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని విద్యుత్ భద్రతా విభాగ డైరెక్టర్ విజయలక్ష్మి సూచించారు. ఆసుపత్రులు, వినోద స్థలాలు, ప్రార్థన స్థలాలు, సాంస్కృతిక కేంద్రాలు, పరీక్షల్యాబ్‌లు, పారిశ్రమలు, రైల్వేస్టేషన్లలో పాటించాల్సిన నిబంధనలను మంగళవారం ఆమె ఒక ప్రకటనలో వివరించారు. దీనిపై మల్టీప్లెక్స్‌లు, ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, రెడ్‌ఎఫ్‌ఎం చానళ్లలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

- విద్యుత్ భద్రతా ప్రమాణాలు ఇలా..
- అత్యవసర పరిస్థితుల్లో భవనానికి విద్యుత్ సరఫరాను పూర్తిగా వేరు చేయడానికి కటౌట్ లేక బ్రేకర్‌తో తగిన ఐసోలేటింగ్ పరికరం ఏర్పాటు చేసుకోవాలి.
- పవర్ కేబుల్ వేయడానికి ఏర్పాటు చేసిన నాలాల ద్వారా ఇతర పైపులు, కేబుల్స్‌ను పంపకూడదు. ప్రతి అంతస్తు క్రాసింగ్‌లో డక్ట్లకు ఫైర్ బారియర్స్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఫైర్ రిటార్డెంట్ తక్కువ పొగ, తక్కువ హాలోజన్ పవర్ కేబుళ్లను ఉపయోగించాలి.
- హాలోజన్ లేని ఫేమ్ రిటార్డెంట్, పవర్ కేబుల్స్ భవనం ఎత్తుతో సంబంధం లేకుండా విమానాశ్రయాలు, ఆసుపత్రులు, హోటళ్లలో ఉండాలి.
- బస్‌బార్ ట్రంకింగ్ వ్యవస్థను ఉపయోగించి అంతస్తులకు విద్యుత్ పంపిణీ చేయాలి.
- ప్రతి భవనానికీ లైటింగ్ స్పైక్ ఏర్పాటు చేయాలి.
- మెట్ల మార్గంలో విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయకూడదు.
- న్యూట్రల్ కండక్టర్ ఎర్త్ చేయాలి.
- రెసిడెన్సియల్, కమర్షియల్ భవనాల్లో కాకుండా ఇండోర్‌లో ఏర్పాటు చేసిన చమురుతో నిండిన ట్రాన్స్‌ఫార్మర్లు గ్రౌండ్‌ఫ్లోర్‌లో గానీ, మొదటి బేస్‌మెంట్‌కు దిగువన గానీ లేవని నిర్ధారించుకోవాలి.

ఇక నో హై సెక్యూరిటీ జోన్!

» జగన్ నివాసం వద్ద టైర్ కిల్లర్లు తొలగింపు



ఆటోమేటిక్ పిల్లర్లు తొలగిస్తున్న కార్మికులు

అమరావతి-ఆంధ్రజ్యోతి/తాడేపల్లి టౌన్‌జూలై 2: 'ఎంత ముఖ్యమంత్రి అయితే మాత్రం మా ఇంటికి మమ్మల్ని వెళ్లనివ్వరా..? నిత్యం తిరిగే వాళ్లమైనా.. ధ్రువీకరణ పత్రాలు చూపించి ఆ మార్గంలో ప్రయాణించాలా? అదేమని ప్రశ్నిస్తే సీఎం నివాసం.. హై సెక్యూరిటీ జోన్ అంటారా' అని తాడేపల్లిలో ఐదేళ్లు నరకయాతన అనుభవించిన స్థానిక ప్రజలు ఇప్పుడు టీడీపీ ప్రభుత్వ రాకతో ఊపిరి పీల్చుకున్నారు. కొద్ది రోజుల క్రితం జగన్ నివాసం మీదుగా ఎవరైనా ప్రయాణించే విధంగా చర్యలు తీసుకున్నారు. తొలుత ,రోడ్డుకు అడ్డంగా కట్టిన అడ్డుగోడను తొలగించడంతో ఆ మార్గంలో రోజూ ప్రయాణించే విద్యార్థులు, రైతు కూలీలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా హైసెక్యూరిటీ జోన్ వ్యవస్థలో భాగమైన ఆటోమేటిక్ పరికరాలను తొలగించారు. ఎవరైనా అనుమతి లేకుండా వెళ్తే ఆ వాహనాలను ఆపడానికి జగన్ ఇంటి చుట్టూ గతంలో రెండు టైర్ కిల్లర్లు, నాలుగు హైడ్రాలిక్ బులెట్లు ఏర్పాటు చేశారు. ఇవి కరెంటుతో ఆటోమేటిక్ విధానంలో పని చేస్తాయి. గత ప్రభుత్వ హయాంలో ఆ నివాసం చుట్టూ సామాన్యులు ఎవరూ వెళ్లకుండా ఆంక్షలు విధించి ఇబ్బందులకు గురి చేశారు. ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లే రావడంతో జగన్ మాజీ అయ్యారు. అంతేకాదు.. ప్రతిపక్ష నేత హోదా కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఆ మార్గంలోని అడ్డంకులను ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారు. సోమవారం రాత్రి ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన భద్రత టెంట్లను తొలగించారు. మంగళవారం టైర్ కిల్లర్లు, హైడ్రాలిక్ బులెట్లను క్రేన్ సాయంతో తొలగించారు. రోడ్డుపై వేసిన రెయిన్ ప్రూఫ్ టెంట్లు, ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వైపు ఉన్న పోలీసు చెక్‌పోస్టులను సైతం ఎత్తివేశారు. తొలగించిన సామగ్రిని లారీలో తరలించారు. రహదారి వెంట నివాస కంటైనర్లు ఇంకా అలాగే ఉన్నాయి.

భద్రతాసిబ్బంది కోసం పక్కాగృహాలు

జగన్ ఇంటి ప్రహరీ గోడను ఆనుకుని భద్రతా సిబ్బంది కోసం ఏకంగా పక్కా గృహాలే కట్టేశారు. వీటికి తాడేపల్లి-మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతులు తీసుకోలేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్ లోటస్ పాండ్ వద్ద కూడా ఇదే తరహాలో జగన్ సెక్యూరిటీ కోసం శాశ్వత కట్టడాలను నిర్మించారు. వాటిని అక్కడి అధికారులు తొలగించారు. అదే తరహాలో తాడేపల్లి నివాసం వద్ద భద్రతా సిబ్బందికి కట్టిన అక్రమ నిర్మాణాలను కూడా తీసివేయాలని సమీప గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

నెల్లూరు జైలులో రేపు పిన్నెల్లికి జగన్ ఓదార్పు

» బెంగళూరు నుంచి తాడేపల్లికి మాజీ సీఎం దంపతులు

అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారంనాడు నెల్లూరు కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఓదార్చనున్నారు. ఈవీఎం ధ్వంసం, టీడీపీ ఏజెంటు, మహిళపై దాడి, కారంపూడి సీఐపై హత్యాయత్నం కేసుల్లో ఆయన అరెస్టవడం, మాచర్ల కోర్టు 14 రోజులు విధించి నెల్లూరు సెంట్రల్ జైలుకు పంపిన సంగతి తెలిసిందే. కాగా.. జగన్ సతీసమేతంగా మంగళవారం బెంగళూరు నుంచి తాడేపల్లి నివాసానికి చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయంలో వారికి మాజీ మంత్రులు వెలంపల్లి శ్రీనివాస్, పేర్ని నాని స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలు ఈ సందర్భంగా సీఎం అంటూ నినాదాలు చేశారు. జగన్ బుధవారం పార్టీ నేతలతో సమావేశమవుతారు. ఇంకోవైపు ఆయన బెంగళూరు నుంచి వచ్చినా ఆయన తాడేపల్లి నివాసం వద్దా ఎలాంటి కోలాహలమూ లేదు. స్వాగత సన్నాహాలూ, హంగూ ఆర్బాటాలూ కనిపించలేదు.

నవంబరు నుంచి పోలవరం పనులు!



పోలవరం మట్టి నమూనాలను పరిశీలిస్తున్న విదేశీ నిపుణుల బృందం

ఎంత త్వరగా నిర్మిస్తే రాష్ట్ర ప్రజలకు అంత మేలు
అంతర్జాతీయ నిపుణులకు తెలిపిన మంత్రి నిమ్మల

» డిజైన్లు, నిర్మాణాలను అధ్యయనం చేస్తామన్న నిపుణులు

» మూడోరోజు మట్టి నమూనాల పరిశీలన, ఇంజనీర్లతో సమీక్ష

» రోజంతా నిర్మాణ సంస్థల నుంచి అభిప్రాయాల సేకరణ

» నేడు ప్రాథమిక అభిప్రాయాన్ని వెల్లడించనున్న నిపుణులు?

» అత్యంత కీలకమైన రోజుగా భావిస్తున్న జల వనరుల శాఖ

అమరావతి-ఆంధ్రజ్యోతి/పోలవరం, జూలై 2: 'మీరు అనుమతులు ఇస్తే పోలవరం నిర్మాణ పనులు ఈ ఏడాది నవంబరు నుంచి ప్రారంభించాలని భావిస్తున్నాం' అని అంతర్జాతీయ నిపుణులకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 'ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి. దీన్ని ఎంత త్వరగా నిర్మిస్తే.. ప్రజలకు అంత మేలు జరుగుతుంది. ముఖ్యంగా గోదావరి జిల్లాల ప్రజలు ధవళేశ్వరం ఆనకట్టను నిర్మించిన సర్ ఆర్థర్ కాటన్‌ను దేవుడిగా కొలుస్తారు. ఇప్పుడు అమెరికా, కెనడాల నుంచి వచ్చిన విమ్మల్ని కూడా అదే రీతిన గుర్తుంచుకుంటాం' అన్నారు. అంతర్జాతీయ నిపుణులు మూడో రోజైన మంగళవారం.. దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్, సీపేజీకి గురైన ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, వైబ్రో కంప్రెషన్ తదితర అంశాలపై రోజంతా సమీక్షించారు. మధ్యాహ్నం పోలవరం ప్రాజెక్టు క్షేత్రానికి వచ్చిన మంత్రి నిమ్మల.. ఇక్కడ ప్రాజెక్టు నిర్మాణ సంస్థలతో సమీక్షిస్తున్న అంతర్జాతీయ నిపుణులను పలకరించారు. రాష్ట్రం అదృష్టం బాగుండి వారు నాలుగు రోజుల ముందే వచ్చారని, లేకపోతే వరద వస్తున్నందున క్షేత్రస్థాయి అధ్యయనం సాధ్యమయ్యేది కాదని వ్యాఖ్యానించారు. మూడు రోజుల అధ్యయనంలో సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి బుధవారం ప్రాథమికంగా ఒక అభిప్రాయాన్ని వెల్లడించాలని నిపుణులను అభ్యర్థించారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారు. సాధ్యమైనంత వరకూ మంగళవారం రాత్రి నిర్మాణ సంస్థల నుంచి సేకరించిన సమాచారం, క్షేత్రస్థాయిలో గుర్తించిన కట్టడాల లోపాలు అధ్యయనం చేస్తామని వెల్లడించారు.

బావర్, కెల్లర్, మేఘాతో నిపుణుల సమీక్ష..

డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మిచిన బావర్, కెల్లర్ సంస్థలతోపాటు మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులతో నిపుణులు సమీక్షించారు. నిర్మాణ సంస్థలు వెల్లడించిన అభిప్రాయాలు, ఇచ్చిన నివేదికలపై క్షుణ్ణంగా అధ్యయనం చేశాక వాటిపై బుధవారం ప్రాథమికంగా ఒక అభిప్రాయాన్ని నిపుణులు వెల్లడించనున్నారు. కేంద్ర జల సంఘానికి ప్రాథమిక నివేదికనూ ఇస్తారని జల వనరుల శాఖ భావిస్తోంది. అయితే,పోలవరం ప్రాజెక్టు వద్ద నాలుగు రోజుల పాటు జరిపిన సమీక్షలు, చేసిన అధ్యయనంపై ప్రాథమిక నివేదికను సీడబ్ల్యూసీకి ఇవ్వడానికి తమకు మరింత సమయం కావాలని అంతర్జాతీయ నిపుణులు కోరితే పరిస్థితి ఏమిటన్న ఆందోళన జలవనరుల శాఖలో నెలకొంది. దీంతో బుధవారం చాలా ముఖ్యమైన రోజుగా అధికారులు చెబుతున్నారు.

పోలవరం మట్టి నమూనాల పరిశీలన

ఎగువ కాఫర్ డ్యాం వద్ద సేకరించిన మట్టి నమూనాలను మంగళవారం అమెరికా, కెనడా నిపుణులు జియాన్ ఫ్రాంకో డి సిక్కో, సీన్ హించ్ బెర్గర్, డేవిడ్ బి పాల్, రిచర్డ్ డొనెల్లీ ల్యాబ్ వద్ద పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఎగువ కాఫర్ డ్యాం సీపేజీ, డయా ఫ్రం వాల్ పునర్నిర్మాణం తదితర అంశాలపై, గతంలో దశల వారీగా జరిగిన పనులు, ఎదురైన అవాంతరాలు, సవాళ్లను ఎదుర్కొనడానికి, సమస్యలను పరిష్కరించడానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, ఎస్‌ఈ నరసింహమూర్తి, సీడబ్ల్యూసీ డిప్యూటీ డైరెక్టర్ అశ్విన్‌కుమార్, సీఎస్ఎంఆర్ఎస్ సైంటిస్ట్ మనీశ్ గుప్తా, పీపీఏ సీఈ రాజేశ్‌కుమార్, ప్రపంచబ్యాంకు, ఆఫ్రి, ఫ్రుగ్యో కన్సల్టెన్సీల ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టిసీమ నీటి విడుదల

» తాటిపూడి, పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల నుంచి కూడా..

» రాయలసీమ, కృష్ణా డెల్టాలకు పంపిణీ

అమరావతి-ఆంధ్రజ్యోతి/పోలవరం, జూన్ 2: రాయలసీమ, కృష్ణా డెల్టాలకు సాగు, తాగు నీరందించేందుకు బుధవారం ఉదయం పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేయనున్నట్టు రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. మంగళవారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పట్టిసీమ నుంచి 7000 క్యూసెక్కులు, తాడిపూడి ఎత్తిపోతల నుంచి 870, పురుషోత్తపట్నం ఎత్తిపోతల నుంచి 3500, పుష్కర నుంచి 1225 క్యూసెక్కుల జలాలు విడుదల చేయనున్నాం. ఎగువన కర్ణాటకలో వానలు లేక ఆల్మట్టి డ్యామ్ నుంచి కృష్ణా జలాలను కిందకువదల్లేదు. దీంతో రాష్ట్రంలోని కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటాయి. రైతాంగానికి ఖరీఫ్‌సాగుతోపాటు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తాయి. సీఎం ఆదేశాలతో 4 ఎత్తిపోతల పథకాల నుంచి గోదావరి జలాలను విడుదల చేస్తున్నాం. ప్రస్తుతం 30 లక్షల ఎకరాలకు సాగు, తాగు నీరు కృష్ణా డెల్టాకు అందిస్తున్నాం' అని చెప్పారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే.. 'పోలవరం పూర్తయ్యేలోపు సాగు, తాగునీటికి ఇబ్బందులు పడకూడదనే చంద్రబాబు పట్టిసీమ నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగు నీరిస్తే పట్టిసీమను వట్టిసీమ అని అసెంబ్లీ సాక్షిగా జగన్ విమర్శించారు. ఇప్పుడు అదే పట్టిసీమ రాయలసీమ, కృష్ణా డెల్టాలకు సాగు, తాగునీటికి ఆధారంగా మారింది. జగన్ హయాంలోనూ 2022, 2023, 2024లో పట్టిసీమ నుంచి కృష్ణాడెల్టాకు తాగునీరు, సాగునీరందించారు. రాష్ట్రంలో ఇతర రిజర్వాయర్లు నిండితేనే ఆగస్టులో నీరు వస్తుంది. అలాంటి పరిస్థితిని పట్టిసీమ ద్వారా జూన్, జూలై నెలల్లోనే నీరందించగలుగుతున్నాం. పులిచింతలలో సాధారణంగా 30 నుంచి 35 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కేవలం అర టీఎంసీ నీరు ఉంది. పోలవరం ప్రాజెక్టులో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి విదేశీ నిపుణుల బృందం విస్తృత పరిశీలనలు చేస్తోంది. త్వరలోనే ప్రాజెక్టుకు సంబంధించి మంచి సలహాలు సూచనలు నివేదిక రూపంలో కేంద్రానికి అందిస్తాం' అని వివరించారు.

'స్మార్ట్'గా ఇక దొంగలకు చెక్!

» రాష్ట్రంలో పోలీస్‌శాఖకు పూర్వ వైభవం

» 2019కి ముందు టెక్నాలజీలో దూకుడు

» 2017లో రష్యా నుంచి పరికరాలు

» జగన్ ప్రభుత్వంలో అన్నీ నిర్వీర్యం

» చంద్రబాబు రాగానే వాటికి ప్రాణం

» రాష్ట్రానికి వస్తున్న రష్యాసంస్థ ప్రతినిధులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దొంగలు, నేరస్థులకు చేదువార్త! తప్పుచేసేవారి పూర్తి వివరాలు గుర్తించే ఫింగర్ ప్రింట్ లైవ్ స్కానర్లను పోలీసు శాఖ రాష్ట్రంలో తిరిగి అందుబాటులోకి తీసుకురానుంది. రాష్ట్ర విభజన తర్వాత 2017లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కొనుగోలు చేసిన అత్యాధునిక రష్యా పరికరాలకు, తిరిగి ఆయన పాలనలోనే ఊపిరి ఊదనుంది. 2017లో పోలీసు శాఖ రష్యాకు చెందిన ప్యాపిలోన్ అనే సంస్థ నుంచి రూ.10కోట్లతో పరికరాలు కొనుగోలు చేసి.. రాష్ట్రంలోని సుమారు పదిలక్షల మంది దొంగలు, నేరస్థుల వివరాలు సేకరించింది. ఎక్కడ దొంగలు కనిపించినా వెంటనే పట్టుకునేలా పోలీసులకు ఎంఎస్‌సీడీలను అందించింది. ఆ వివరాలు సర్వర్లలో నిక్షిప్తంచేసి ఎప్పుడు ఎవరిపై అనుమానం వచ్చినా, పోలీసు అధికారి మొబైల్‌పై ఫింగర్ పెట్టిస్తే చాలు దొంగ అయితే మొత్తం వివరాలు బయట పడతాయి. వెంటనే అదుపులోకి తీసుకుని నేరం జరగకుండా పోలీసులు లాకప్‌లో వేసేవారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై ప్రతీకార చర్యలు తీసుకోవడం తప్ప టెక్నాలజీతో దొంగల్ని కట్టడి చేయడంపై కనీస దృష్టి సారించలేదు. అయితే, ఐదేళ్లపాటు ఉన్న నిర్వహణ ఒప్పందం 2022లో ముగియడంతో రష్యా సంస్థ సర్వీసు పొడిగింపునకు డబ్బులు అడిగింది. జగన్ ప్రభుత్వం.. ఆ సంస్థ అడిగిన రూ.రెండు కోట్లు చెల్లించేందుకు అయిష్టత చూపింది. ఈ క్రమంలో నిర్వహణ లేక వాటిలో కొన్ని పాడయ్యాయి. దీంతో నేరాల కట్టడిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న ఏపీ.. అథమస్థానంలోకి దిగజారింది. కేంద్ర హోంశాఖ పోలీసు ఆధునీకరణ కోసం రూ.పది కోట్లు ఇచ్చేందుకు సమ్మతి తెలిపింది. అందులో4 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉండగా జగన్ ఇవ్వలేదు. దీంతో కేంద్ర నిధులు కూడా విడుదల కాక పోవడంతో నిర్వహణ ఆగిపోయి ఏపీ పోలీసు ఫింగర్ ప్రింట్స్ విభాగం నిర్వీర్యం అయిపోయింది.

పోలీసింగ్‌కు ఊపు...

రాష్ట్రంలో తిరిగి చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టెక్నాలజీ విషయాలపై దృష్టి పెరిగింది. ఆయన దృష్టికి పోలీసు శాఖ ఈ సమస్యను తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. ఇటీవల మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వచ్చారు. అన్ని విభాగాల సమస్యలపై మంత్రి సమీక్షించినప్పుడు ఈ సమస్య ప్రస్తావనకు వచ్చింది. ఆమె వెంటనే దానిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో రష్యాకు చెందిన ప్యాపిలోన్ సంస్థ ప్రతినిధులు.. అప్పటి పరికరాలకు తిరిగి ప్రాణం పోసేందుకు వస్తున్నారు. ఏడేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం ప్రతి పోలీసు సబ్ డివిజన్‌కు ఒకటి చొప్పున 98 లైవ్ స్కానర్లు కొనుగోలు చేసింది. పదమూడు జిల్లాల్లో 26వర్క్ స్టేషన్లు ఏర్పాటుచేసింది. బస్టాండ్లు ఇతర రద్దీ ప్రాంతాల్లో 580ఎంఎస్‌సీడీలను నెలకొల్పింది. రష్యా బృందం వీటన్నింటినీ తనిఖీ చేయనుంది.

శ్వేతపత్రమా.. రహస్య పత్రమా?

» పెండింగ్ బిల్లులపై ఆర్థిక శాఖ డ్రామాలు!

» అడిగినా శాఖలు స్పందించడం లేదని వాదన

» సీఎఫ్ఎంఎస్‌లో సమాచారం కనపడడం లేదా?

అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో ఆర్థిక శాఖలో విపరీతమైన అరాచకాలు. రాజ్యాంగం, చట్టాలు, నిబంధనల ఉల్లంఘనలకు లెక్కేలేదు. వీటితో పాటు పెండింగ్ బిల్లులు పే..ద్ద ప్రహసనం. టీడీపీ కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టినా.. అది విడుదల చేసే శ్వేతపత్రంలో ఇవేవీ బయటకు వచ్చే అవకాశాలు కనిపించడంలేదు. పెండింగ్ బిల్లులకు సంబంధించి సరైన సమాచారం లేకుండా శ్వేతపత్రం ఇస్తే అది రహస్య పత్రమే అవుతుంది. శ్వేతపత్రం కసరత్తులో భాగంగా.. గత ప్రభుత్వం వదిలిపెట్టి వెళ్లిన పెండింగ్ బిల్లుల భారం ఎంతో తెలుసుకోవడం కోసం తమ తమ శాఖల్లోని పెండింగ్ బిల్లులు, మెజర్‌మెంట్ బుక్‌లోని వివరాలు చెప్పాలంటూ ఆర్థిక శాఖ మూడ్రోజుల కిందట అన్ని ప్రభుత్వ శాఖలనూ కోరింది. వాటి నుంచి ఇంతవరకు సమాచారం రాలేదు. గట్టిగా అడిగితే రూ.10,000 కోట్లకంటే ఎక్కువ బిల్లులు పెండింగ్‌లో లేవని సమాధానం వస్తోంది. రూ.లక్షల కోట్ల విలువ చేసే బిల్లులు పెండింగ్‌లో ఉన్నా.. అవి అధికారులకు ఎందుకు కనిపించడం లేదు? కేవలం పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసమే హైకోర్టులో 4 లక్షల పిటిషన్లు దాఖలయ్యాయి. వాస్తవానికి.. పెండింగ్ బిల్లులు ఎన్ని ఉన్నాయో తెలుసుకోవడానికి సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (సీఎఫ్ఎంఎస్) ఉంది. ఏ సంవత్సరంలో ఎన్ని బిల్లులు రద్దు చేశారో.. ఎన్ని బిల్లులను తదుపరి ఆర్థిక సంవత్సరానికి మైగ్రేట్ చేశారో రికార్డు ఉంటుంది. ఇది తెప్పించుకోవడం ఆర్థిక శాఖ చేతిలో పని. గంటల్లోనే తెలిసిపోతుంది. శాఖలు పంపినా, పంపకపోయినా పెండింగ్ బిల్లులపై ఒక అంచనా వస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో మార్చి 31న కూడా రూ.60,000 కోట్ల బిల్లులు రద్దు చేశారు. ఇందులో రూ.7,700 కోట్ల బిల్లులే మైగ్రేట్ చేశారు. ప్రస్తుతం సీఎఫ్ఎంఎస్‌లో దాదాపు రూ.25,000 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ వాస్తవాలను అధికారులు ఎందుకు దాస్తున్నారనేది ప్రశ్న. పెండింగ్ బిల్లుల బాధితుల్లో కాంట్రాక్టర్లు, సప్లయర్లు, వెండర్లు లక్షల్లో ఉన్నారు. రోజూ కోర్టుల చుట్టూ, ఆర్థిక శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పెండింగ్ బిల్లులు ఎన్ని ఉన్నాయో చెప్పాలంటూ శాఖలను అడిగే బదులు ఏపీసీఎఫ్ఎస్ఎస్ సహకారంలో ఒక యాప్ డెవలప్ చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తే.. బిల్లుల బాధితులంతా వాటి సమాచారాన్ని అందులో అప్‌లోడ్ చేస్తారు. కానీ శాఖలను బూచిగా చూపి పెండింగ్ బిల్లుల సమాచారం రావడం లేదని చెప్పడం వాస్తవాలను తొక్కిపెట్టడమే అవుతుంది. ఈ యాప్ డెవలప్ చేయడానికి రెండ్రోజుల కంటే ఎక్కువ సమయం పట్టదు.

మరోసారి లేఖ రాస్తాం: ఆర్థిక మంత్రి

పెండింగ్ బిల్లుల వివరాలు చెప్పాలంటూ అన్ని ప్రభుత్వ శాఖలకు మరోసారి లేఖ రాస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సమగ్రంగా పెండింగ్ బిల్లుల వివరాలు పంపకపోతే ఆయా శాఖల అధికారులపైనే ఆ భారం మోపుతామని, వారినే బాధ్యులను చేస్తామని స్పష్టం చేశారు. శ్వేతపత్రంపై కసరత్తు మొదలుపెట్టామని, సమగ్ర వివరాలతో విడుదల చేస్తామని వెల్లడించారు.



స్కిల్ డెవలప్‌మెంట్‌పై సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్, అధికారులు

మెగా డీఎస్సీ పూర్తి పారదర్శకంగా ఉండాలి

» టెట్, డీఎస్సీ మధ్య వ్యవధిపై అభిప్రాయ సేకరణ: మంత్రి లోకేశ్

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ పూర్తి పారదర్శకంగా ఉండాలి. ఎలాంటి విమర్శలూ రాకూడదు' అని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ అధికారులకు స్పష్టం చేశారు. టెట్, మెగా డీఎస్సీపై మంగళవారం సచివాలయంలో సమీక్షించారు. టెట్, డీఎస్సీల మధ్య ఎక్కువ సమయం కావాలని అభ్యర్థులు అడుగుతున్నారని, దీనిపై అభ్యర్థులు, విద్యార్థుల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. టెట్ సిలబస్‌లో ఎలాంటి మార్పులు చేయలేదనే విషయాన్ని అభ్యర్థులకు స్పష్టం చేయాలన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117పై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మెగా డీఎస్సీలో వయోపరిమితి సడలింపులపై తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ డీఎస్సీలో ఫీజు మినహాయింపు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలకు అనుమతుల రెన్యువల్‌లో అనవసర ఆంక్షలు విధించవద్దన్నారు. యువత నైపుణ్యాలను గుర్తించేందుకు స్కిల్ సెన్సెస్ చేపడుతున్నట్లు మరో సమీక్షలో లోకేశ్ చెప్పారు. విదేశాల్లో డిమాండ్ ఉన్న కోర్సులకు శిక్షణ ఇచ్చే అంశాన్నీ పరిశీలించాలన్నారు. ఎన్నికలకు ముందు జరిగిన బదిలీల గురించి ఇకపై అడగొద్దని మంగళవారం ఎస్టీయూ నేతలు కలిసిన సందర్భంలో మంత్రి అన్నారు. కావలి సమీపంలో జరిగిన స్కూల్ బస్సు ఘటనపై స్పందించారు. బస్సులన్నింటినీ కండిషన్‌లో ఉంచుకోవాలని యాజమాన్యాలకు ఎక్స్ వేదికగా సూచించారు.

డిగ్రీ కాంట్రాక్టు అధ్యాపకులకు రెన్యువల్

ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న 703 మంది కాంట్రాక్టు అధ్యాపకులకు సర్వీసును రెన్యువల్ చేస్తూ ఉన్నత విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు 11 నెలల కాలానికి ఈ కాంట్రాక్టును పునరుద్ధరించారు.

నేరస్థుడికి, నేతకు తేడా కనిపిస్తోంది: జవహర్

చంద్రబాబు మార్క్ మళ్లీ ఏపీలో కనిపించిందని మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. నేరస్థుడికి, నాయకుడికి తేడా ఎలా ఉంటుందో ఏపీలో ఇప్పుడు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.

'రిజిస్ట్రేషన్ల' సమూల ప్రక్షాళన: మంత్రి అనగాని

రిజిస్ట్రేషన్ల శాఖను సమూలంగా ప్రక్షాళన చేయాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన ఆ శాఖపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అవసరమైన సేవలు సులభతరంగా, సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

ఏపీఎండీసీలో 400 మంది పాగా!

» జగన్ అండ్‌కో సిఫారసులతో కాంట్రాక్టు నియామకాలు

» కీలక స్థానాల్లో పెద్దిరెడ్డి మనుషులు

» కొమ్ముకాసేవారికి ఏరికోరి పోస్టింగ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) సర్కారుకు సిరులు తీసుకొచ్చే బంగారు బాతు. ఏటా మైనింగ్ రూపంలో కనీసం రూ.5 వేలకోట్ల ఆదాయం సమకూరుతోంది. దీంతో జగన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, వారి సొంత మనిషి వెంకటరెడ్డి తదితరులు దీన్ని ఒడిసిపట్టారు. ఇటు సొంత అవసరాలు, గనుల లీజులు, టెండర్లలో ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకున్నారు. తమ నిర్ణయాలను నిర్భీతిగా అమలు చేసేందుకు 400 మంది సొంత మనుషులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఏపీఎండీసీలో నియమించుకున్నారు. ప్రభుత్వం మారి కూటమి సర్కారు కొలువు తీరినా ఇంకా వారు దర్జాగా ఆ ఉద్యోగాల్లోనే కొనసాగుతున్నారు. తమ అడ్డగోలు చర్యలు, అడ్డూఅదుపులేని దోపిడీ దందాలు, ఫైళ్ల గురించి ప్రశ్నించేవారిని ఆఫీసుకురావొద్దంటూ హుకుం జారీ చేశారు. ఇంట్లోనే ఉండాలని, నెలనెలా జీతం పంపిస్తామని, ఆఫీసు వ్యవహారాల్లో వేలుపెట్టవద్దని ఆదేశించారు. తర్వాత విచ్చలవిడిగా ఏపీఎండీసీని సొంతానికి వాడేసుకున్నారు. మేనేజర్లు, డిప్యూటీ మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు అనే మూడు కేటగిరీల్లో మొత్తం వైసీపీ సైన్యమే ఉంది. సర్కారు దృష్టిపెట్టకపోతే తర్వాత ఏ ఆధారమూ దొరక్కపోవచ్చని సీనియర్ అధికారులే చెబుతున్నారు.

సొంత మనుషుల పునరావాస కేంద్రం..

గనుల శాఖ పరిధిలో ఒక కార్పొరేషన్‌గా ఏపీఎండీసీ ఉంది. భారీ, చిన్న తరహా ఖనిజాల తవ్వకాలు, లీజులు, కాంట్రాక్టులు, వేలం తదితర వ్యవహారాలను ఈ సంస్థ పర్యవేక్షిస్తోంది. బొగ్గు, ఇసుక, బీచ్‌శాండ్, ఐరన్‌ఓర్, మాంగనీస్, క్వార్ట్జ్, బెరైటీస్ తదితర ఖనిజాల వ్యవహారాలు జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని సులియారీలో కేంద్రం ఏపీఎండీసీకి బొగ్గు బ్లాక్‌లను కేటాయించింది. జార్ఖండ్‌లోని గిరిధ్‌లోని బ్రహ్మదీయ కోల్‌మైన్ ఉంది. దీంతోపాటు మంగంపేటలోని బెరైటీస్ ప్రాజెక్టు ఆసియాలోనే అతిపెద్దది. ప్రపంచంలోనే అతి విలువైన బీచ్ శాండ్ కూడా ఏపీలోని శ్రీకాకుళం, విశాఖ బీమిలీలో లభిస్తోంది. క్వార్ట్జ్, ఐరన్‌ఓర్, గ్రానైట్ వ్యాపారంలో మన రాష్ట్రం టాప్‌లో ఉంది. వీటి నిర్వహణకు సహజంగానే మానవ వనరులు చాలా అవసరం. ఈ మేరకు ఏపీఎండీసీలో ఉద్యోగులు ఉన్నారు. జగన్ సర్కారు వచ్చాక దీన్ని సొంత మనుషుల పునరావాస కేంద్రంగా మార్చుకున్నారు. వివిధ మైనింగ్ ప్రాజెక్టులు, ఎండీసీ ప్రధాన కార్యాలయం, ఇతర ఆఫీసుల్లో పలు హోదాల్లో 400 మంది ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించారు. జగన్ కార్యాలయంలోని ధనుంజయరెడ్డి, ముత్యాలరాజు, నాటి గనుల మంత్రి పెద్దిరెడ్డి, ఆయన తనయుడు ఎంపీ మిథున్‌రెడ్డి, గనుల డైరెక్టర్, ఏపీఎండీసీ ఎండీగా వ్యవహరించిన వెంకటరెడ్డి సొంత మనుషుల లిఖితపూర్వక, మౌఖిక సిఫారసులతో ఆ 400 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. వీరు కాకుండా, అదానీ కంపెనీ, ఇతర కార్పొరేట్లలో పనిచేసిన వారిని, రిటైరై ఇక ఎందుకూ పనికిరారు అనుకున్న మరి కొందరిని తీసుకొచ్చి కీలక పోస్టుల్లో కూర్చోబెట్టి లక్షల రూపాయల వేతనాలు చెల్లిస్తున్నారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి సిఫారసుతో ఏపీఎండీసీతో పాటు గనుల శాఖ డైరెక్టరేట్‌లోనూ 32 మందికి కాంట్రాక్ట్ కొలువులు ఇచ్చారు. ఇలా వచ్చినవారిలో రాజశేఖరెడ్డి అనే వ్యక్తి మాంగనీస్ కాంట్రాక్టర్ సెక్యూరిటీ డిపాజిట్ సొమ్మును దారి మళ్లించారు. పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి సిఫారసులతో ఉద్యోగాలు పొందిన వారు మార్కెటింగ్, ప్రొక్యూర్‌మెంట్, మానవ వనరులు, ఫైనాన్స్ వంటి ఆయువుపట్టు విభాగాల్లోనే పనిచేస్తున్నారు. దీంతో ఉన్నతస్థాయిలో ఏ నిర్ణయం తీసుకున్నా వీరికి వెంటనే తెలిసిపోతోంది. వీరికి తెలియకుండా ఫైలు కదిలే పరిస్థితి లేనంతగా ఏర్పాట్లు చేశారు. ఇసుక, బీచ్ శాండ్ టెండర్లలో అడ్డగోలుగా నిబంధనలు చేర్చారు. బొగ్గు టెండర్లలో అదానీకే మేలు చేయడానికి ఏపీఎండీసీ వడ్డీలు చెల్లించేలా నిబంధనలు తీసుకొచ్చిపెట్టారు. బీచ్‌శాండ్‌లోనూ కేంద్ర మార్గదర్శకాలకు విరుద్ధంగా టెండర్ డాక్యుమెంట్లు రూపొందించారు. చివరకు హైకోర్టు జోక్యంతో వీరి బండారం బయటికొచ్చింది.

అసిస్టెంట్ మేనేజర్‌గా జగన్ పత్రిక ఉద్యోగి..

జగన్ పత్రికలో పనిచేసే ఓ వ్యక్తికి ఏపీఎండీసీలో అసిస్టెంట్ మేనేజర్ పోస్టు ఇచ్చి సకల మర్యాదలు కల్పించారు. ఆయన పెద్దిరెడ్డి, గనుల వెంకటరెడ్డి సేవలోనే తరించిపోయారు. గనుల శాఖ పరిధిలో ఏం జరిగినా వెంటనే తాడేపల్లికి సమాచారం మోసుకెళ్లడమే ఈయన అసలు పని. ఆయనను అసిస్టెంట్ మేనేజర్ పోస్టులో రెగ్యులరైజ్ చేసేందుకు అన్ని ప్రయత్నాలూ చేశారు. ప్రభుత్వం మారినా ఆయన్ను ఇంకా కొనసాగిస్తున్నారు.

ప్రశ్నించేవారు ఇంటికే పరిమితం..

ఇసుక, బొగ్గు, బెరైటీస్ వ్యవహారంలో పెద్దిరెడ్డి, వెంకటరెడ్డి విధానాలను ప్రశ్నించిన రెగ్యులర్ ఉద్యోగులపై ఉక్కుపాదం మోపారు. తమను ప్రశ్నించేవారు కీలక హోదాల్లో ఉండటానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. ఇలా ఇద్దరు అధికారులను డ్యూటీ నుంచి తప్పించి బలవంతంగా ఇంటికి పంపించారు. ఇంట్లోనే ఉండాలని, ఆఫీసుకు రావొద్దని మౌఖికంగా ఆదేశించారు. వారు కోర్టులకు వెళ్లకుండా ఉండేందుకు నెలనెలా జీతాలు చెల్లించారు. అంటే విధులకు దూరంగా ఉన్నా డ్యూటీలో ఉన్నట్టు రికార్డులు రూపొందించి నాలుగేళ్ల పాటు జీతాలు చెల్లించారు. ప్రభుత్వం మారడంతో ప్రస్తుతం వారిద్దరూ తిరిగి విధులకు హాజరవుతున్నారు.

ఇతర శాఖల నుంచి వలసలు..

ఏపీఎండీసీలో వేలకోట్ల ఆదాయం ఉండటంతో ఇతర శాఖల్లో ఉన్న కొందరు ఇక్కడ పనిచేసి దండుకునేందుకు ఆసక్తి చూపారు. కడప జిల్లాకు చెందిన ఓ వ్యవసాయ అధికారి డిప్యూటేషన్‌పై వచ్చి బెరైటీస్‌పై వాలిపోయారు. వెంకటరెడ్డితో ఉన్న పరిచయాలను అడ్డంపెట్టుకొని భర్తతో ఓ బినామీ కంపెనీ ఏర్పాటుచేసి బెరైటీస్ వ్యాపారం చేశారు. అందులో తేడాలు రావడంతో అక్రమాలు బయటికొచ్చాయి. దీంతో అధికారులు ఆమెను సొంత శాఖకు పంపించారు. ఇక విశాఖ ఉక్కులో పనిచేస్తోన్న బోస్ అనే అధికారిని తీసుకొచ్చి ఏపీఎండీసీలో బొగ్గు, ఇతర కీలక వనరుల కాంట్రాక్టులు చూసే బాధ్యత అప్పగించారు. ఆయన వ్యవహారమూ రచ్చకెక్కడంతో ప్రభుత్వం వెంటనే వెనక్కి పంపించింది. ఇలా ఇతర విభాగాలు, శాఖల నుంచి వచ్చిన వారి వ్యవహారాలకు అంతేలేకుండా పోయింది. ఇదంతా వెంకటరెడ్డి చలవేనని సీనియర్ అధికారులు చెబుతున్నారు.

గంజాయి కేసుల్లో అసలు దోషులు బయటే ఉన్నారు

» వదిలిపెట్టే ప్రసక్తి లేదు: మంత్రి అనిత



విశాఖపట్నం, జూలై 2(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసుల్లో అరెస్టయి జైలులో మగ్గుతున్న వారిలో ఎక్కువమంది అమాయకులేనని రాష్ట్ర హోం మంత్రి మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అసలు దోషులు తప్పించుకుని బయట తిరుగుతున్నారని, వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం విశాఖలోని కేంద్ర కారాగారాన్ని సందర్శించిన మంత్రి గంజాయి కేసుల్లో అరెస్టయ్యి రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారితో మాట్లాడారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడారు. 'గంజాయి స్మగ్లర్లు తెలివిగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు, మైదాన ప్రాంతాల్లోని ఆర్థిక ఇబ్బందుల్లో ఉండే యువకులకు రూ.5,000, రూ.పది వేలు ఇచ్చి రవాణా కోసం వాడుకుంటున్నారు. పోలీసుల తనిఖీల్లో ఇలాంటివారే పట్టుబడి జైలులో మగ్గుతున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత చర్యలు ఉంటాయి. ఖైదీల్లో సత్ప్రవర్తన కలిగిన వారిని ప్రత్యేక కేటగిరీగా గుర్తించి విడుదల చేసేందుకు న్యాయ నిపుణులతో చర్చిస్తాం' అని అనిత ప్రకటించారు. మంత్రి వెంట జైలు అధికారులు ఉన్నారు.

మూడో వారంలో అసెంబ్లీ

▸▸ పూర్తిస్థాయి బడ్జెట్‌కు సన్నాహాలు..!

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల మూడో వారంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సమావేశాల్లో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు నాలుగు నెలల కాలానికి బడ్జెట్ ప్రవేశపెట్టి అసెంబ్లీ ఆమోదం తీసుకొంది. ఆ గడువు జూలై నెలాఖరుకు పూర్తవుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఎనిమిది నెలల కాలానికి మళ్లీ అసెంబ్లీ ఆమోదం తీసుకోవాల్సి ఉంది. ఒక రెండు నెలల వరకూ ఆర్డినెన్స్ జారీ చేసి దాని ద్వారా ఆర్థిక వ్యవహారాలు నిర్వహించే అవకాశం ఉంది. ఆర్థిక శాఖ అధికారులు దానికే మొగ్గు చూపిస్తున్నారు. కానీ సీఎం చంద్రబాబు మాత్రం ఈ నెలలో పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదం తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నెల నాలుగు, ఐదు తేదీల్లో ఆయన ఢిల్లీలో ప్రధానిని, కేంద్ర ఆర్థిక మంత్రిని కలుస్తున్నారు. కేంద్రం నుంచి రాగల సాయంపై ఈ పర్యటనలో ఆయనకు కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీని ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించి ఆమోదం తీసుకోవాలని అనుకొంటున్నారు.

అమరావతికి ఔటర్, ఇన్నర్ రింగ్‌రోడ్లు

▸▸ కేంద్రానికి చంద్రబాబు ప్రతిపాదనలు... గడ్కరీని కోరనున్న సీఎం

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి ఔటర్, ఇన్నర్ రింగ్‌రోడ్లు నిర్మించాలని చంద్రబాబు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది ఈ రెండింటినీ పూర్తిగా కేంద్ర నిధులతోనే చేపట్టాలనుకుంటోంది. సంబంధిత ప్రాజెక్టులను ఆమోదించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ పెద్దలను కోరనున్నారు. గురు, శుక్రవారాల్లో ఆయన ఢిల్లీలో పర్యటించనున్న సంగతి తెలిసిందే. అక్కడ కేంద్రరహదారుల మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఈ ప్రతిపాదనలు అందిస్తారు. మంగళవారం సాయంత్రం సచివాలయంలో ఇదే అంశంపై రోడ్లు భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జాతీయ రహదారుల చీఫ్ ఇంజనీర్ రామచంద్ర, ఇతర శాఖల అధికారులతో ఆయన చర్చించారు. బుధవారం కూడా చర్చ జరిగే అవకాశముంది.

మత్స్య రైతులతో ఉత్పత్తిదారుల సంఘాలు

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి):వ్యవసాయ, ఉద్యాన రైతుల తరహాలో మత్స్య రంగంలోనూ రైతు ఉత్పత్తి సంఘాలు(ఎఫ్ఎఫ్‌పీవో) ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ నిర్ణయించింది. వీటి ద్వారా మత్స్యకార సంఘాలను బలోపేతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలోని 182 ప్రాథమిక మత్స్యసహకార సంఘాల సభ్యులకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపై మత్స్యశాఖ అవగాహన కార్యక్రమాలు చేపట్టింది.

బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు అనుమతించండి

▸▸ వాసుదేవరెడ్డి అభ్యర్థన.. అనుమతించిన హైకోర్టు

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి కీలక దస్త్రాలు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు చోరీ చేశారనే ఆరోపణలతో సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆ సంస్థ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌లో అదనపు సెక్షన్లు చేర్చారని ఆయన తరపు న్యాయవాది వాదించారు. ప్రస్తుత ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకొని సెషన్స్ కోర్టును ఆశ్రయించేందుకు అనుమతించాలని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి వ్యాజ్యం ఉపసంహరణకు అనుమతించారు.

మరో100 కోట్ల పెట్టుబడికి 'వెర్మీరియన్' రెడీ

▸▸ కంపెనీ ప్రతినిధులతో మంత్రి భరత్ భేటీ

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో పారిశ్రామికవేత్తల్లో కొత్త ఉత్సాహం వచ్చిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శ్రీ సిటీలో యూనిట్‌ను నిర్వహిస్తున్న వెర్మీరియన్ కంపెనీ రాష్ట్రంలో మరో రూ.100 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. మంగళవారం ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో ఆ కంపెనీ ప్రతినిధులు, మంత్రితో సమావేశమయ్యారు. శ్రీసిటీలోని తమ యూనిట్ విస్తరణపై చర్చలు జరిపారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా రామచంద్రయ్య, హరిప్రసాద్ నామినేషన్

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో శాసనమండలిలో ఏర్పడిన రెండు ఖాళీలకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మంగళవారం శాసనసభ కమిటీ హాలులో మొదలైంది. టీడీపీ కూటమి అభ్యర్థులుగా సి.రామచంద్రయ్య, పి.హరిప్రసాద్ తమ నామినేషన్లు దాఖలు చేశారు. జనసేన పార్టీ అభ్యర్థిగా హరిప్రసాద్, టీడీపీ తరఫున రామచంద్రయ్య పోటీలో ఉన్నారు. నామినేషన్లు దాఖలు చేసి బయటకువచ్చిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ రాక్షస పాలన నచ్చక రాజీనామా చేశానని రామచంద్రయ్య తెలిపారు. "నాపై గత ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరించింది. దీంతో పదవి కాలం మూడేళ్లు ఉన్నా ముందుగానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశాను" అని రామచంద్రయ్య తెలిపారు. తాను మీడియా రంగంలో పని చేసినందువల్ల ప్రజల సమస్యలను దగ్గరగా చూసే అవకాశం కలిగిందని హరిప్రసాద్ తెలిపారు. మండలిలో అర్థవంతమైన చర్చలు జరగడానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన చెప్పారు.

పేదలకు ఇసుక ఉచితం!



ఇసుక లభ్యత, నూతన విధానంపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

▸▸ విధివిధానాల తయారీకి సీఎం ఆదేశం

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): పేదల గృహ నిర్మాణం కోసం ఉచితంగా ఇసుక ఇవ్వాలని సర్కారు భావిస్తోంది. ఇందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. 2014-19 కాలంలో ఇసుక విధానం ఎలా ఉంది.. పేదలకు ఎలాంటి మేలు జరిగింది.. 2019-24(మే) వరకు ఇసుక అమ్మకాల విధానం ఎలా ఉంది.. ఎవరు లబ్ధిపొందారు.. ప్రభుత్వానికి జరిగిన నష్టం.. పేదలు, గృహ నిర్మాణరంగానికి జరిగిన నష్టమెంతో అంచనా వేయాలని ఆదేశించారు. మంగళవారమిక్కడ సచివాలయంలో గనుల శాఖ ఉన్నతాధికారులతో ఆయన ఇసుకపై సమీక్ష జరిపారు. జగన్ పాలనలో ఇసుక పాలసీ వల్ల పేదలు తీవ్రంగా నష్టపోయారని, గృహనిర్మాణ రంగం కుదేలైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక డంప్‌లు వైసీపీ నేతలు, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయన్న సమాచారం ఉందని, ధరలను భారీగా పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీఎం పేర్కొన్నట్లు తెలిసింది. తక్షణమే ఇసుక ధరలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా రీచ్‌లు, స్టాక్‌పాయింట్లు, డంప్‌ల పరిధిలో ఎంత ఇసుక అందుబాటులో ఉందని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతానికి దాదాపు 40 లక్షల టన్నులు అందుబాటులో ఉందని అధికారులు నివేదించినట్లు తెలిసింది. ఈ ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలని గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను సీఎం ఆరా తీశారు 'ఆ ఇసుకను ఎవరు క్లెయిమ్ చేస్తున్నారు? భారీ కొండలను తలపించే డంప్‌లు ఎవరి అధీనంలో ఉన్నాయి? వాటిని ఇంకా ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదా' అని అడిగారు. ఉచిత ఇసుక విధానంతోపాటు, గతంలో జరిగిన పొరపాట్లు, ఇతర అంశాలపై ముఖ్యమంత్రి బుధవారం మరోసారి గనులశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు సమగ్ర నివేదికలు సిద్ధం చేసుకుని రావాలని ఆదేశించారు. ఇకపై ఆఫ్‌లైన్ ఇసుక అమ్మకాలు జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఉచిత ఇసుకతోపాటు ఇతర అమ్మకాల ద్వారా సరఫరా చేసే ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకునే విధానం తీసుకురావాలని తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఇందుకు అనుగుణంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి బుధవారం సీఎంకు సమర్పించనున్నారు. సమీక్షలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కార్యదర్శి యువరాజ్, ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు.

ఏపీలో పెట్టుబడులకు ఆహ్వానం

▸▸ బెల్జియం బృందం భేటీలో సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఏపీలో వ్యాపార అనుకూల వాతావరణం కల్పించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. భారత్‌లోని బెల్జియం రాయబారి వాండెర్ హసెల్ట్ నేతృత్వంలోని వాణిజ్య, పరిశ్రమల ప్రతినిధుల బృందం మంగళవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసింది. వారి భేటీ ఫోటోను సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, 'మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపారవేత్తలను ఆహ్వానిస్తున్నాం' అని పేర్కొన్నారు.

రోడ్లపై గుంతలు.. బూడిదతో పూడ్చండి!

▸▸ థర్మల్ కేంద్రాల నుంచి తెప్పించుకోండి

▸▸ తారు వేస్తే వానలకు కొట్టుకుపోవచ్చు

▸▸ ప్రయోగాత్మకంగా బూడిద మిక్స్ చేసి వాడండి

▸▸ తక్కువ ఖర్చుతోనే పనవుతుంది: సీఎం

అమరావతి, జూలై 2 (ఆంధ్ర జ్యోతి): వర్షాకాలమైనా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు చేపట్టాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారమిక్కడ సచివాలయంలో రాష్ట్రంలో రహదారుల పరిస్థితిపై ఆయన సమీక్ష నిర్వహించారు. సాధారణంగా వానాకాలంలో రోడ్ల మరమ్మతులు సాంకేతికంగా ఆచరణ సాధ్యంకాదు. రహదారులపై గుంతలు పూడ్చినా వర్షాలకు అవి మళ్లీ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. దీంతో గుంతలు పూడ్చే కార్యక్రమం వర్షాకాలం రాక ముందే చేపట్టాలి. అయితే జగన్ సర్కారు గత ఐదేళ్లుగా రహదారుల నిర్వహణను గాలికొదిలేసింది. ఫలితంగా రహదారులు దారుణంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలమైనా సరే.. గుంతలు పూడ్చాలని చంద్రబాబు ఆదేశించారు. ఇందుకు కనీసం రూ.284 కోట్లు అవసరమని అధికారులు ఆయనకు తెలియజేశారు. అయితే తొలుత బిట్‌మెన్(తారు)తో కాకుండా థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి వచ్చే బూడిదను ఉపయోగించాలని సీఎం ఆదేశించినట్లు తెలిసింది. ప్రయోగాత్మకంగా ఈ విధానంలో గుంతలు పూడ్చాలని, తక్కువ ఖర్చుతోనే పనవుతుందని ఆయన చెప్పినట్లు సమాచారం. వర్షాకాలంలో తారుతో గుంతలు పూడ్చినా వెంటనే మరో పెద్ద వర్షానికి అది దెబ్బతినే అవకాశం ఉంటుందని, అందుకే థర్మల్ ప్రాజెక్టుల నుంచి వచ్చే బూడిదతో మిక్సింగ్ చేసి గుంతలు పూడ్చాలని ఆదేశించినట్లు తెలిసింది. మరోసారి దీనిపై సమగ్ర సమీక్ష చేస్తానని చెప్పినట్లు తెలిసింది. సమీక్షలో రోడ్లు-భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి ప్రద్యుమ్న, ఈఎన్‌సీ కె.వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డీసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, జాతీయ రహదారుల చీఫ్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానంతరం అధికారులు జిల్లాల ఆర్అండ్‌బీ ఎస్ఈలతో మాట్లాడారు. రహదారులపై గుంతలు పూడ్చేందుకు ఆ నాలుగు ప్రాంతాల్లోని థర్మల్ ప్రాజెక్టుల నుంచి బూడిద తెప్పించుకుని ఉపయోగించుకోవాలని మార్గదర్శకాలు జారీ చేశారు. రహదారులపై బూడిద మిక్సింగ్ బేస్ గట్టిగా ఉంటే.. మిగతా ప్రాంతాల్లో కూడా వెంటనే గుంతలు పూడ్చే పనులు చేపట్టాలని ఆదేశాలిచ్చారు.

ఆచరణ సాధ్యమేనా?

రోడ్లపై గుంతలు పూడ్చేందుకు.. రోడ్ల నిర్మాణానికి ఇప్పటి దాకా బొగ్గు నుంచి వచ్చే బూడిదను వాడిన దాఖలాల్లేవు. పైగా ఆ బూడిద చాలా ప్రమాదకరమైనది. రహదారులపై గుంతల వినియోగంలో దానిని వినియోగించాలని సీఎం ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. దెబ్బతిన్న రోడ్లకు బూడిద మిక్సింగ్ కలిపితే అది సరిగ్గా ఉండకపోతే వర్షానికి నీళ్లలో కలిసిపోయే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత రహదారులపై ట్రాఫిక్ తిరిగే సమయంలో గాల్లోకి లేచి వాహనదారులకు ఇబ్బంది ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. వాహనాల వేగానికి బూడిద గాల్లోకి లేచి ద్విచక్రవాహనదారులు, రహదారిపై నడిచేవారి కళ్లలో పడితే కంటిచూపు సమస్యలు తలెత్తుతాయని ఇంజనీరింగ్ అధికారులే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బూడిద వినియోగం అనేది సత్ఫలితాలు ఇస్తుందా అని వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

9 నెలల క్రితం మిస్సింగ్.. జమ్మూకశ్మీర్‌లో ప్రత్యక్షం..

▸▸ ఎట్టకేలకు దొరికిన జంగారెడ్డిగూడెం యువతి

▸▸ డిప్యూటీ సీఎం చొరవతో 48 గంటల్లో ఆచూకీ

విజయవాడ, కాకినాడ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది నెలల క్రితం ఓ యువకుడితో కలిసి విజయవాడలో అదృశ్యమైన హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థిని ఆచూకీ ఎట్టకేలకు లభించింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో రంగంలోకి దిగిన పోలీసులు 48 గంటల్లోనే వారిద్దరూ జమ్మూకశ్మీర్‌లో ఉన్నట్టు గుర్తించారు. దీంతో వెంటనే అక్కడకు చేరుకున్న మాచవరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని మంగళవారం రాత్రి విజయవాడకు తీసుకొచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన ఓ యువతి విజయవాడ మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతోంది. ఎనికేపాడుకు చెందిన షణ్ను అనే యువకుడు అదే కళాశాలలో చదువుతున్నాడు. వారిద్దరూ గతేడాది నవంబరులో అదృశ్యమయ్యారు. దీనిపై యువతి తల్లి మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు యువతి ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో ఆమె గత నెల 22న డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసి కేసు విషయాన్ని విన్నవించుకుంది. పవన్ ఆదేశాల మేరకు దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు వారు జమ్మూకశ్మీర్‌లో ఉన్నట్టు గుర్తించారు. ఈ కేసులో 48 గంటల్లోనే ఆచూకీని కనిపెట్టి పోలీసులను పవన్ అభినందించారు.

ఆ యువతుల ఆచూకీ కనిపెడతాం

▸▸ అదృశ్యమైన వారిని గుర్తించేందుకు ప్రత్యేక సెల్: పవన్

▸▸ 48 గంటల్లో ఓ యువతి కేసు ఛేదించాం

▸▸ పారిశుధ్య పనులకూ చిల్లిగవ్వ లేదు

▸▸ కాకినాడలో ఉపముఖ్యమంత్రి ఆవేదన

కాకినాడ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అదృశ్యమైన యువతుల ఆచూకీని గుర్తించేందుకు ప్రత్యేక పోలీసు సెల్ ఏర్పాటు ఆలోచన చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. వారందరినీ కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గత ఐదేళ్లలో ఏపీలో 30వేల మంది యువతులు అదృశ్యమయ్యారని తాను ఎంత మొత్తుకున్నా వైసీపీ ప్రభుత్వం కనీసం సమీక్ష కూడా చేయలేదని ధ్వజమెత్తారు. కానీ 9నెలల కిందట అదృశ్యమైన యువతిని తమ ప్రభుత్వ హయాంలో 48 గంటల్లో పోలీసులు ఛేదించారని చెప్పారు. ఇదే తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని తెలిపారు. మంగళవారమిక్కడ కాకినాడ కలెక్టర్‌లో పంచాయతీరాజ్, అటవీ, పర్యావరణ, కాలుష్య నియంత్రణ శాఖలపై జిల్లా అధికారులతో పవన్ సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత ఐదేళ్లలో రూ.5 వేల కోట్లకుపైగా ఇసుక వ్యాపారం జరిగినా పంచాయతీలకు మాత్రం సీనరేజీ డబ్బులు ఒక్క పైసా కూడా చెల్లించకుండా గత ప్రభుత్వం గండి కొట్టిందన్నారు. ఇదేకాకుండా గనుల సీనరేజీ, రిజిస్ట్రేషన్ పన్నుల వాటా, లేబర్ పన్నుల వాటా ఏపీ పంచాయతీలకు రాలేదన్నారు. దీనిపై కేబినెట్ కమిటీ ఏర్పాటుచేసి నిధులు రాబట్టేలా చూస్తామని చెప్పారు. గడచిన ఐదేళ్లలో కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను వైసీపీ సర్కారు దారిమళ్లించిందని, దీనివల్ల గ్రామాల్లో పారిశుధ్య పనులు చేసేందుకు కూడా ఖజానాలో చిల్లిగవ్వ లేదన్నారు. కాకినాడ జిల్లాలో ఉప్పాడ సముద్ర తీరం కోతకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బుధవారం చెన్నై నుంచి వచ్చే నిపుణుల బృందం ఉప్పాడ తీరాన్ని పరిశీలించబోతోందన్నారు. ఏడాదిన్నరలో ఒక ఎకరం భూభాగమంత సముద్రం ముందుకు వచ్చిందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో సేవారంగంలో 20 లక్షల ఉద్యోగాలిచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.



కాకినాడ జిల్లా సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీ కాలుష్యం కనిపించడం లేదా?

వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి చెందిన రొయ్యల ఫ్యాక్టరీ కాలుష్యంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ బోర్డు అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. కంపెనీ ఆక్వా వ్యర్థ జలాలను పక్కనే పంట డ్రెయిన్లలో కలిపేస్తోందని.. ఒక్కసారైనా తనిఖీ చేశారా అని ప్రశ్నించగా అధికారులు ఏమీ మాట్లాడలేదు. దీంతో పవన్‌లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీనిపై 24గంటల్లోగా తనకు నివేదిక ఇవ్వాలని కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ సందీప్‌రెడ్డిని ఆదేశించారు.

అదానీ కహానీ!

(మొదటి పేజీ తరువాయి)

పైసా పెట్టుబడి రాలేదు. కొత్తగా యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలూ అందలేదు. కొత్త ప్రభుత్వం ఈ కాంట్రాక్టుల వ్యవహారంపై ఏం చర్య తీసుకుంటుంది? ఏ ప్రాతిపదికన అన్ని వందల ఎకరాలు అదానీకి గత ప్రభుత్వం కేటాయించిందనేదీ చంద్రబాబు ప్రభుత్వం నిగ్గు తేల్చి ప్రజల ముందు నిజాలు ఉంచుతుందా లేదా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

డేటా లేదు... ఉపాధీ లేదు..

అదానీ గ్రూపునకు డేటా సెంటర్ పేరుతో మధురవాడలో ఏకంగా ఒక కొండను కట్టబెట్టారు. ఆ కొండపై మొత్తం 270 ఎకరాలు ఉండగా...దశలవారీగా మొత్తం అదానీకి ఇచ్చేశారు. రూ.22 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి, ఏడేళ్లలో 40 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి అదానీ ఒప్పందం చేసింది. 200 మెగావాట్ల సామర్థ్యంతో ఒక డేటా సెంటర్ కాగా, 100 మెగావాట్ల సామర్థ్యంతో మరో డేటా సెంటర్ నిర్మించాల్సి ఉంది. సింగపూర్ నుంచి విశాఖపట్నం వరకు సముద్ర మార్గం గుండా సబ్‌మెరైన్ కేబుల్ వేస్తారని, ఇంటర్నెట్ వేగం పుంజుకుంటుందని, విశాఖపట్నం ఎక్కడికో వెళ్లిపోతుందని శంకుస్థాపన సమయంలో జగన్మోహన్‌రెడ్డి మాటలు కోటలు దాటించారు. కానీ, డేటా సెంటర్ల ఊసే లేదు. ఇలా రాష్ట్ర ప్రయోజనాలను సొంత ప్రయోజనాల కోసం అదానీకి జగన్ తాకట్టు పెట్టేశారు.

అదానీ చేతికి పోర్టులు

విశాఖ ఉక్కుకు అనుసంధానంగా ప్రైవేటు ఆధ్వర్యంలో ఏర్పాటైన గంగవరం పోర్టులో మేజరు వాటాను నయానో భయానో అదానీ లాక్కుంది. ఇక అందులో విగిలిన ఏపీ ప్రభుత్వ వాటా 10.39 శాతాన్ని కూడా జగన్ సర్కారు అదానీకి కట్టబెట్టింది. అది కూడా కేవలం రూ.645 కోట్లకు. మరోవైపు కృష్ణపట్నం పోర్టు అదానీకి ఇచ్చేసింది. ఆ పోర్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ జనరేషన్ ప్రాజెక్టును కూడా కట్టబెట్టాలని అప్పట్లో జగన్ భావించారు. థర్మల్ యూనిట్ ఉద్యోగుల పోరు, వారికి అందిన "ఆంధ్రజ్యోతి" సహకారంతో .. కృష్ణపట్నం థర్మల్ యూనిట్‌ను అదానీకి అప్పగించడం జగన్‌కు వీలు కాలేదు.

కన్ను పడితే అంతే...

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రిజర్వాయర్లను అదానీకి జగన్ ధారాదత్తం చేసేశారు. జగన్ సొంత జిల్లా కడపలో గండికోట రిజర్వాయరుపై 1000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్తు ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు అదానీకి అప్పటి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. దీనికోసం ఎకరం రూ.5 లక్షలు చొప్పున 36వేల ఎకరాలను అందించేందుకు సిద్ధమయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లాలో చిత్రావతిపై నిర్మించిన రిజర్వాయర్‌ను ఆధారం చేసుకుని 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు ప్రాజెక్టు కోసం మూడువేల ఎకరాలను ఎకరా ఐదు రూ.లక్షలు చొప్పున అప్పగించేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని కరుకుర్తిలో 1200 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు ప్రాజెక్టు కోసం ఎకరా రూ.ఐదు లక్షలు చొప్పున 7200 ఎకరాలను రాసిచ్చేశారు. పార్వతీపురం మన్యంలోని కర్రివలసలో 1000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు ప్రాజెక్టుకు కూడా ఎకరా రూ.ఐదు లక్షలు చొప్పున ఆరువేల ఎకరాలు ఇచ్చేశారు. ఇక్కడ పనులు ఇప్పటిదాకా ముందుకు సాగలేదు.

కారుచౌకగా మధ్యప్రదేశ్ బొగ్గు బ్లాక్

మధ్యప్రదేశ్‌లోని సింగ్రోలి జిల్లా సులియారిలోని ఏపీఎండీసీ కోల్‌మైన్స్‌లో అత్యంత కీలకమైన బొగ్గు నిక్షేపాలు లభ్యమయ్యాయి. కేంద్ర ప్రభుత్వ విధానం ప్రకారం ..నేరుగా బొగ్గు నిక్షేపాలను విక్రయించకుండా వేలం ద్వారా అమ్మాల్సి ఉంది. ఈ వేలంలో రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (ఏపీ జెన్కో) పాల్గొనాల్సి ఉంది. కానీ ఆ సంస్థ పాల్గొనేందుకు అప్పట్లో జగన్ ప్రభుత్వం అంగీకరించలేదు. అదానీకి మేలు చేసేలా ఆయన వ్యవహరించారు. విదేశీ బొగ్గుతో సమానమైంది మధ్యప్రదేశ్ బొగ్గు. దీనిని అదానీకి మెట్రిక్ టన్నుకు రూ.2300కే కట్టబెట్టారు. రాష్ట్ర అవసరాల కోసం విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న ఏపీజెన్కో మాత్రం .. అదానీ నుంచి టన్ను బొగ్గు రూ.8వేలునుంచి రూ.15వేలు దాకా చెల్లించి కొనుగోలు చేస్తోంది.

రూ. లక్ష కోట్ల విద్యుత్ భారం

రాజస్థాన్‌లోని అదానీ సోలార్ విద్యుత్తు ప్లాంటు నుంచి సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ద్వారా ఏడువేల మెగావాట్ల విద్యుత్తును యూనిట్‌కు రూ.2.49 చొప్పున కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో ఒప్పందం చేసుకుంది. దీనివల్ల రాష్ట్ర ప్రజలపై 25 ఏళ్లలో లక్ష కోట్ల రూపాయల పెను భారం పడే ప్రమాదం ఉంది.

సిమెంట్ ఫ్యాక్టరీల జాడేదీ?

కడప, నడికుడిలో పది మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన సిమెంట్ ఫ్యాక్టరీలను అదానీ సంస్థ ఏర్పాటు చేస్తుందని అప్పట్లో జగన్ వెల్లడించారు. 2022లో ఒప్పందాలు చేసుకున్నా.. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

అదానీ కా బాత్...

కమీషన్ల కోసమే పోర్టు ఇచ్చేశారు

"కమీషన్ల కోసం జగన్.. అదానీకి గంగవరం పోర్టు ధారాదత్తం చేశారు. పోర్టు నిర్మించిన పొలాల్లో రైతుల డిమాండ్లను అదానీ గ్రూపు పట్టించుకోలేదు."

- ఏప్రిల్ 22, 2024న టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి

టెర్మినల్ తరలింపు రాష్ట్రానికి నష్టదాయకం

"ప్రతిష్ఠాత్మకమైన కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ తమిళనాడుకు తరలిపోవడం రాష్ట్రానికి నష్టదాయకం. దీనివల్ల కృష్ణపట్నం పోర్టుపై ఆధారపడిన లక్షమంది ఉపాధి కోల్పోతారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు ఆదాయం కోల్పోతుంది."

- జనవరి 21, 2024న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

జేపీ వెంచర్స్ నోట్‌ఫైల్ గల్లంతు?

(మొదటి పేజీ తరువాయి)

'ఆంధ్రజ్యోతి' వార్తను ప్రచురించింది. గనుల శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సమీక్ష ఉంటుంద ని అధికారులకు మూడురోజుల ముందే సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఫైళ్ల గల్లంతు వ్యవహారం చర్చకొస్తుందని, సీఎం ప్రశ్నించే అవకాశం ఉందని అధికారులు ముందు జాగ్రత్తగానే కొన్ని ఫైళ్ల ఆనవాళ్లను వెతికారు. ఇందులో ఇసుక కాంట్రాక్టు ఫైళ్లను గుర్తించారు. 2021 మే నుంచి 2023 మే వరకు రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలకు సంబంధించిన కాంట్రాక్టును జేపీ వెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు కట్టబెట్టిన సంగతి తెలిసిందే. ఈ కాంట్రాక్టు తీసుకున్నందుకు ఆ సంస్థ ఏపీఎండీసీకి రూ.120 కోట్ల విలువైన బ్యాంక్ గ్యారంటీ సమర్పించింది. అలాగే, ఆ సంస్థ నికరంగా ఇంకా ఎండీసీకి రూ.289 కోట్ల మేర బకాయి ఉంది. ఎన్నికల ఫలితాలు రావడానికి కొద్ది రోజుల ముందే అత్యంత కీలకమైన ఇసుక ఫైళ్లలో ఉన్నతస్థాయిలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన నోట్‌ఫైల్స్‌ను తొలగించినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఎండీ స్థాయిలో తీసుకున్న నిర్ణయాల ఫైల్స్ కనిపించడం లేదని నిర్ధారణకు వచ్చారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్నతాధికారులు నివేదించినట్లు తెలిసింది. అయితే, ఈ విషయాన్ని ఎలా డీల్ చేయాలి...అన్న అంశంపై అధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు.

జేపీ వెంచర్స్‌కు నోటీసులు..: ఎన్నికల ఫలితాలు రావడానికి ముందే జేపీ వెంచర్స్‌కు రూ.120 కోట్ల బ్యాంకు గ్యారంటీలు చెల్లించాలని ఏపీఎండీసీ ఎండీ హోదాలో వెంకటరెడ్డి బ్యాంకుకు లేఖ రాసినట్లు తెలిసింది. ఆ తర్వాత ఆ సంస్థకు బకాయిలు లేవని (నో డ్యూ) సర్టిఫికెట్, నిరభ్యంతర పత్రం జారీ చేసినట్లు తెలిసింది. వీటి జారీకి అవసరమైన నోట్‌ఫైల్స్ కూడా లేవని గుర్తించారు. ఈ నేపథ్యంలో, పాత లెక్కల ప్రకారమే జేపీ వెంచర్స్‌కు బకాయిలు రూ.289 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీ చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఆ సమయంలో, ఆ సంస్థ ఎలా స్పందిస్తుందన్నదానిపై తదుపరి నిర్ణయాలు తీసుకోవాలనుకుంటున్నారు. ఒకవేళ ఆ సంస్థ తాను ఎండీసీకి రూపాయి బకాయి లేనంటూ...నో డ్యూ సర్టిఫికెట్, నిభ్యంతర పత్రం చూపిస్తే వాటి ని రద్దుచేసి, వెంకటరెడ్డిపై చట్టపరమైన చర్యలకు సిఫారసు చేసే అవకాశం ఉంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

పంటపొలాల్లో కాలుష్య పరిశ్రమ

సాగుభూముల మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై రైతుల ఆగ్రహం

- గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులపై అనుమానాలు
- సంబంధం లేదని తప్పించుకుంటున్న అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఏడాదికి రెండు పంటలు పండే పచ్చని పంటపొలాల మధ్యలో ఇథనాల్ ఉత్పత్తిచేసే భారీ పరిశ్రమ ఏర్పాటు పట్ల రైతుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఆరుగొలనులో గత వైసీపీ ప్రభుత్వంలోని ఒక ప్రజాప్రతినిధి అండతో స్థానిక నేతలు కొందరు తమ స్వంత పొలంలో రూ.కోట్ల వ్యయంతో భారీ ఇథనాల్ పరిశ్రమ పెట్టేందుకు అనుమతులు తీసుకున్నారని సమాచారం. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా ఫ్యాక్టరీకి అనుమతులు ఎలా ఇచ్చారనేది అధికారులకే తెలియాలి. ఫ్యాక్టరీకి వెళ్లేందుకు రహదారి సౌకర్యం గానీ, ఫ్యాక్టరీ ఉత్పత్తులను తరలించేందుకు గానీ సరైన రహదారి లేకపోవడంతో పంటపొలాలకు నీరందించే కాలువలను, మురుగునీరు బయటకు ప్రవహించే కాలువలను అనధికారికంగా అక్రమించి రహదారి ఏర్పాటు చేసుకున్నారంటూ స్థానిక రైతులు తెలిపారు. తాము అభ్యంతరాలను లేవనెత్తినా పట్టించుకోకుండా ఫ్యాక్టరీని స్థాపించేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని నుంచి వెలువడే వ్యర్థాలతో సుమారు 256 ఎకరాలకు పైగా సాగుభూములు ఎందుకూ పనికిరాకుండా పోతాయని చిన్న, సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగుభూమిలో పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే రెవెన్యూ అధికారులు భూమిని మార్పుచేయాలి. భారీ పరిశ్రమ ఏర్పాటుకు సదుపాయాలు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి కానీ ఇవేం జరగలేదని రైతులు మొవ్వా సీతారాంజనేయప్రసాద్, కోయ ఈశ్వరి, శివరామకృష్ణ, రత్నకుమారి, కిరణ్‌కుమార్, లబ్బా శంకరం తెలిపారు. ఇదే విషయాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా అడిగితే తమకు తెలియదని ఉన్నతాధికారులు అనమతులిచ్చారని సమాధానం చెప్పడమే తప్ప అధికారికంగా ఎలాంటి పత్రాలను ఇవ్వడం లేదని స్థానిక రైతులు తెలుపుతున్నారు.



కోట్లాది రూపాయల వ్యయంతో సాగుభూముల్లో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ పరిశ్రమ



రాకపోకలకు వీలుగా పోరంబోకు భూముల్లో ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు

వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి అండతో..

జిల్లాకు చెందిన మాజీ నేత అండదండలతోనే కనీస సౌకర్యాలు లేని ప్రాంతంలో ఫ్యాక్టరీకి అనుమతులిచ్చారని స్థానికుల అభియోగం. క్షేత్రస్థాయిలోనూ అలాగే ఉంది. తిప్పనగుంట వెళ్లే రహదారి చిన్నపాటి రహదారి నుంచి సుమారు 1.5 కిలోమీటరు దూరంలో పంటచేల మధ్య ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం, ఉత్పత్తి ప్రారంభిస్తే ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలు సాగునీటి కాలువల్లో కలిసేలా ఉన్నాయి. దీంతో సాగునీటి కలుషితమవడంతో పాటు సాగుభూములు బీడుగా మారుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట కాలువలను పూడ్చివేయడం అమానుషం

రైతు మూల్పూరి వెంకటరత్నం, మునసబు

వందలాది ఎకరాలకు సాగునీరందించే పంట కాలువలను, మురుగునీటి బోదెలను ఆక్రమించి రహదారి నిర్మాణం చేయడం అమానుషం. వందల ఎకరాల సాగు భూముల మధ్యలో భారీ పరిశ్రమ ఏర్పాటుపై గతంలోనే అభ్యంతర తెలిపా. రైతుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా పరిశ్రమ ఏర్పాటు చేయడం ఎంత వరకూ సమంజసమో అధికారులు సమాధానం చెప్పాలి. చుట్టుపక్కల రైతుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.



ఫ్యాక్టరీ రహదారి కోసం పూడ్చివేసిన సాగునీటి కాలువ

డ్రైవింగ్ నైపుణ్యం మెరుగుపరిచేందుకే ఇన్‌స్టిట్యూట్

- దేశంలోనే పెద్దదైన డ్రైవింగ్ ఇనిస్టిట్యూట్ సందర్శించాలని కలెక్టర్‌కు ఆహ్వానం

హనుమాన్‌జంక్షన్ రూరల్, జూలై 2: రహదారి భద్రత పాటిస్తూ సాంకేతికతతో కూడిన హెవీ వెహికిల్స్‌ను సురక్షితంగా నడిపేలా ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంపాపురంలో ఏర్పాటు చేసిన డ్రైవింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటరులో శిక్షణ ఇవ్వబడుతుందని పాలకవర్గ సభ్యులు కలెక్టర్ సృజనకు వివరించారు. లారీ ఓనర్స్ పాలకవర్గ సభ్యులు మంగళవారం కలెక్టర్ సృజనను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పర్యావరణహితంగా మొక్కను అందజేశారు. అత్యాధునిక సాంకేతికతో అన్ని రకాల వాహనాలు నడిపేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. అంపాపురంలోని 20 ఎకరాల విస్తీర్ణంలో అన్ని వసతులతో దేశంలోనే అతి పెద్దదైన మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటరును 2005లో ప్రారంభించామన్నారు. దికృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ఉపాధ్యక్షుడు కాజ వెంకట చలపతిరావు, కుచ్చర్లపాటి సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యన్నారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టర్ సృజనతో లారీ ఓనర్స్ పాలకవర్గ సభ్యులు నాగుమోతు రాజా, కాజ వెంకట చలపతిరావు, కుచ్చర్లపాటి సత్యనారాయణరాజు

దుర్గగుడి చీరల వేలంలో అవకతవకలు

- దేవస్థానానికి భారీగా నష్టం జరిగినట్టు ఆడిట్ నివేదిక
- మాజీ ఈవో భ్రమరాంబ నుంచి రికవరీకి ఉత్తర్వులు

వన్‌టౌన్, జూలై 2: దుర్గగుడిలో 2021-2022 మధ్యన చీరల వేలం విషయంలో అవకతవకలు జరిగిన కారణంగా దేవస్థానానికి సుమారు రూ.2కోట్లు నష్టం వాటిల్లిందని ఈ నష్టాన్ని మాజీ ఈవో దర్భముళ్ల భ్రమరాంబ నుంచి వసూలు చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. ఆడిట్ నివేదిక ప్రకారం 2015లో వచ్చిన జీవో మేరకు చీరల వేలం విషయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. అయితే దర్భముళ్ల భ్రమరాంబ కొవిడ్ సమయంలో చీరలకు నిర్ణయించిన అప్‌సెట్ ధర తక్కువగా ఉందని ఆడిట్ నివేదిక స్పష్టం చేసింది. అప్పట్లో 2017, 2018 నుంచి 2021 ఆగస్టు 31 వరకు చీరల వేలానికి సంబధించి రూ.15,26,061 ధర నిర్ణయించారని దీంతో పాటు వేలం నిర్వహించే ఉద్యోగుల నిర్వహణకు ఏడాదికి రూ.55,80,000 ఖర్చయిందన్నారు. ఉద్యోగుల నిర్వహణకు ఇంత మొత్తం వ్యయం చేయడంపై ఆడిట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు గొడౌన్ అద్దె అంటూ రూ.9,24,00 వ్యయమైనట్టు చూపించారని ఆడిట్ నివేదిక అభ్యంతరం వ్యక్తం చేసింది. 2018-2019, 2019-2020లో చీరల వేలం వేస్తే దాదాపుగా రూ.4.82 కోట్లు రూ.4.97 కోట్ల దాకా వచ్చిన సందర్భంలో ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు సంబంధిత పీరియడ్‌లో రూ.3కోట్లు మాత్రమే అప్‌సెట్ ధరను నిర్ణయించడం వాస్తవానికి దగ్గరగా లేదని ఆడిట్ నివేదిక పేర్కొంది. ఓపెన్ టెండర్ లేదా ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా రూ.5కోట్లు వచ్చే అవకాశం ఉందని, దీంతో దేవస్థానానికి రూ.2కోట్ల మేరకు ఆదాయం కుంటుపడిందని, దీన్ని రికవరీ చేయాలని ఆడిట్ నివేదిక పేర్కొంది. పట్టుచీరల వేలం విషయంలో, బార్‌కోడ్ ట్యాగింగ్‌లో అవకతవకలు జరిగాయని స్పష్టం చేశారు. ఈ మేరకు మాజీ ఈవో భ్రమరాంబ నుంచి ఏడాదికి రూ.2కోట్లు చొప్పున రికవరీ చేయాలని ఆదేశాలు వచ్చినట్టు సమాచారం.



అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

అక్రమ నిర్మాణం తొలగింపులో అధికారుల పక్షపాతం..!

పాతరాజరాజేశ్వరి పేట, జూలై 2: అక్రమ కట్టడాల నిర్మాణం తొలగింపులో టౌన్ ప్లానింగ్ అధికారులు పక్షపాతం ప్రదర్శిస్తున్నారు. కేదారేశ్వరపేట రైతుబజారు పక్కనే దోబీఖానాకు ఆనుకుని ఉన్న స్థలంలో అక్రమ నిర్మాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. ముందుగా కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించుకుని పండ్ల వ్యాపారాలు చేపట్టారు. త ర్వాత స్థలానికి చుట్టుపక్కల బాదులతో ప్రహరీ ఏర్పాటు చేసి శాశ్వత ని ర్మాణాలకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు హుటాహుటిన చేరుకుని అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. ఈ చర్యలో అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరించారు. కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించుకుని రెండు షాపులు వెలిశాయి. కానీ టౌన్‌ప్లానింగ్ అధికారు లు మాత్రం ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన రెండు షాపులు తొలగించకుం డా పక్షపాతంగా ఒక షాపు మాత్రమే తొలగించారు. తొలగించని షాపులు వైసీపీకి చెందిన నేతది కావడంతో, గత ప్రభుత్వంలోని నేతలకు అనుగుణంగా అధికారులు పనులు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ నేతల హవా ఇంకా కొనసాగుతుందని ఈ ఒక్క సీన్‌తో తెలిసిపోయింది. ఇంకా అధికారులు వైసీపీ నేతల ఆదేశాలకు కట్టుబడి ఉన్నారని అర్థమవుతోంది. కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌లో వేల రూపాయలు అద్దెలు కట్టుకుని వ్యాపారాలు చేస్తుంటే, ఇక్కడ మాత్రం ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్న అధికారులు, నేతలు చోద్యం చూస్తున్నారని తోటి వ్యాపారస్తులు మండిపడుతున్నారు. లక్షలు విలువైన స్థలం ఆక్రమించి వ్యాపారం చేస్తుంటే అధికారులు వారికి చేదోడు ఉంటుంటే ఆక్రమణలు మితిమీరుతాయని వారు విమర్శిస్తున్నారు.

ఫుడ్‌కోర్టు వ్యాపారుల బరితెగింపు

- సమయంతో సంబంధం లేకుండా వ్యాపారం
- సమయానికి ముందొచ్చిన బండ్లను డంపింగ్‌యార్డుకు తరలించిన అధికారులు



డంపింగ్‌యార్డుకు తరలించిన బండ్లు

చిట్టినగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఐజీఎంసీ స్టేడియం వద్ద ఉన్న ఈట్‌స్ట్రీట్‌లో బండ్ల వ్యాపారులు హద్దులు దాటుతున్నారు. నిర్ణయించిన సమయాని కంటే ముందుగా వచ్చి వ్యాపారం ముగించాల్సిన సమయం దాటి అమ్మకాలు సాగిస్తున్నారు. దీనిపై పలువురు వాహనదారులు, స్టేడియంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లోని వ్యాపారులు పలుమార్లు వీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. తీరు మార్చుకోవాలని అధికారులు ఈట్‌స్ట్రీట్‌లో వ్యాపారులను హెచ్చరించినా పట్టించుకోలేదు. దీంతో సమయానికి కంటే ముందుగా వచ్చిన బండ్లను డంపింగ్ యార్డుకు తరలించారు. ఈట్‌స్ట్రీట్ ఫుడ్‌కోర్టులో రాత్రి 10 నుంచి 12.30 గంటల వరకు వ్యాపారం చేసుకోవడానికి అధికారులు అనుమతిచ్చారు. అయితే ఇక్కడ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రాత్రి ఏడెనిమిది గంటలకు బండ్లను తెచ్చి వ్యాపారం చేస్తున్నారు. దీంతో స్టేడియం షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారులకు ఇబ్బందిగా మారుతోంది. సరిగ్గా షాపుల ముందు బండ్లను ఏర్పాటు చేయడంతో తామెలా వ్యాపారం చేసుకుంటామని మండిపడుతున్నారు. వేలల్లో అద్దెలు వసూలు చేస్తున్న అధికారులు బండ్లను పెడుతున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. ఇక తాము అద్దెలు చెల్లించబోమని అల్టిమేటం ఇచ్చారు. దీంతో అధికారులు స్పందించారు. వీఎంసీ నిర్ణయించిన సమయానికి కంటే ముందుగా వచ్చి వ్యాపారాలు చేస్తే ఆ బండ్లను డంపింగ్ యార్డుకు తరలించడంతోపాటు అనుమతిని రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఇక్కడ వ్యాపారాలు చేసుకునేవారికి అధికారులు కార్డులిచ్చారు. ఈ కార్డులు ఉన్నవారే వ్యాపారం చేసుకోవాలి. అయితే ఈ కార్డులను కొంతమంది అద్దెకిచ్చుకుంటున్నారు. ఎస్టేట్ అధికారులు కొద్దిరోజుల క్రితం ఈట్‌స్ట్రీట్‌లో హడావుడి చేశారు. కార్డులున్న వారి బండ్లను మాత్రమే ఫుడ్‌కోర్టులోకి అనుమతిస్తామన్నారు. ఇటు ఎంజీ రోడ్డు వైపు, అటు ఈ-సేవాకేంద్రం వైపు సిబ్బంది నిలబడి కార్డులున్న వారిని తనిఖీ చేసి లోపలకు పంపేవారు. తర్వాత పట్టించుకోవడం మానేశారు. వైసీపీకి అనుకూలంగా ఉండే ఓ వ్యాపారి తనకు తానే నాయకుడిగా ప్రకటించుకుని అనధికార అసోసియేషన్ నిర్వహిస్తూ వాట్సాప్ గ్రూపులను నడుపుతున్నాడు. అనుకూలంగా ఉన్నవారికి చోటు కల్పిస్తున్నాడు. మహిళా వ్యాపారులు అతడి అండ చూసుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆయా బండ్ల వద్ద పనిచేసే యువకులు దారినపోయే మహిళలు, యువతులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. ఒక అధికారి కుమార్తెను ఆయన ఎదురుగానే చేయి పట్టుకున్న ఘటనలు ఇక్కడ జరిగింది. ఫుడ్‌కోర్టు వ్యాపారుల ఆగడాలు పెరిగిపోతుండడంతో కాంప్లెక్స్ వ్యాపారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతె సమయానికి కంటే ముందొచ్చిన మూడు బండ్లను అధికారులు డంపింగ్ యార్డుకు తరలించారు.



భవానీపురం-గొల్లపూడి నాలుగు కూడలి రోడ్డుపై కానరాని స్పీడ్ బ్రేకర్

స్పీడ్ బ్రేకర్లు ఎక్కడ?

- స్కూల్ రద్దీ ప్రాంతాల్లో కానరాని స్పీడ్‌బ్రేకర్లు
- ప్రమాదాల బారిన పడుతున్న విద్యార్థులు

భవానీపురం: వందలాది మంది విద్యార్థులు స్కూళ్లకు వెళ్లే ప్రధాన కూడలి రహదారులు, స్కూళ్ల సమీపంలో స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎవరికి వారే తొందరగా గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఆత్రుతతో ఎడాపెడా స్పీడ్‌గా ద్విచక్రవాహనాలు, లారీలను నడుతుండటంతో అభం శుభం తెలియని చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొద్దినెలలు క్రితం భవానీపురం- గొల్లపూడి ప్రధాన రహదారి ప్రాంతంలో ఆటోబోల్తా కొట్టడంతో ఓ విద్యార్థిని మృత్యువు పాలైంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిందే. హెచ్‌బీకాలనీ, భవానీపురం, గొల్లపూడి, అట్కిన్‌స్కన్ స్కూల్‌కు వెళ్లే నాలుగు కూడలి ప్రధాన రహదారి, భవానీపురం- జోజినగర్ లోను ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు లేక తమ పిల్లలకు ఏ రూపంలో ప్రమాదాలు ముంచుకొస్తాయోనన్న ఆందోళనతో తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటున్నారు. భవానీపురంలోని కీలకమైన స్కూళ్ల బ్రాంచీలు ఇటీవల గొల్లపూడిలోనే ఏర్పాటయ్యాయి. ఇటువైపుగా చదువుకునేందుకు భవానీపురం,హెచ్‌బీ కాలనీ, సితార, 4 స్తంభాల సెంటర్, క్రాంబ్వే రోడ్డు, జోజినగర్, ఊర్మిళానగర్ నుంచి పెద్ద సంఖ్యలో ఆటోల్లో విద్యార్థులు స్కూళ్లకు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. పదుల సంఖ్యలో సైకిళ్లల్లోను వెళుతుంటారు. ఈ నాలుగు కూడళ్లు ఉండే ప్రధాన రహదారులపై ఎక్కడా మచ్చుకి కూడా స్పీడ్ బ్రేకర్లు లేవు. దీనికి తోడు ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రతీ రోడ్డు తీవ్ర ధ్వంసమై అధ్వాన్నంగా ఉన్నాయి. వీఎంసీ, ఆర్‌అండ్‌బీ శాఖల పరిధిలోని రోడ్లపై యుద్ధప్రాతిపదికన జనసమ్మర్దం, వాహనాలు భారీగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అంతర్గత రోడ్లు ధ్వంసం

వీఎంసీ పరిధిలో ఇటీవల సితార, మసీదువీధి, అంబేద్కర్ వీధి, అరవింద వీధి తదితర ప్రాంతాల్లో ఫైబర్‌తో నలుపు, పసుపు రంగుల కలయికతో కూడిన స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అయితే ఆర్నెళ్లు తిరగక ముందే భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. అధికారులు మేలుకుని ఇటీవల అక్కడక్కడ బీటీ రోడ్డుకు వేసే మెటల్‌తోనే రోడ్డు ఎత్తు పెంచి స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారు. ఇక్కడ కూడా సరైన సూచికలు లేదా బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల జరుగుతున్నాయి. అధికారులు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు విషయంలో నాణ్యత పాటిస్తూ, అందరికీ మెరుగ్గా ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బిస్మిల్లా మినీ లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సుంకర దుర్గాప్రసాద్

ఏ సమస్య వచ్చినా ముందుంటా.!

- ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఆటోనగర్, జూలై 2: ఆటోనగర్‌లోని కార్మికులకు ఎలాంటి సమస్య వచ్చినా తానున్నాననే విషయాన్ని మరువక వచ్చి కలవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆటోనగర్‌లో బిస్మిల్లా మినీలారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆటోనగర్‌లోని కార్మికులందరూ తన స్వంత కుటుంబసభ్యులతో సమానమని, ఎవరికేకష్టం వచ్చినా కలవాలన్నారు. ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆటోనగర్ కార్మిక సోదరులను అన్ని విధాలా ప్రోత్సహించి అభివృద్ధి పథంలోకి తీసుకువస్తున్నామని, గత ప్రభుత్వంలో కుదేలైన కార్మికుల దయనీయ స్థితిని కొత్త ప్రభుత్వంలో మెరుగుపరచేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే గద్దెను కోరారు. తొలుత ఇటీవలి ఎన్నికల్లో మంచి మెజారిటీతో గెలుపొందిన గద్దె రామ్మోహన్‌ను దుశ్శాలువాతో సన్మానించారు. న్యూ హెచ్‌ఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, కత్తిక నాగేశ్వరరావు, బెవర నాగేశ్వరరావు, డాక్టర్ అబ్దుల్ కలాం, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి, నూతన లారీ ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులు సయ్యద్ అస్గర్, అబ్దుల్ హుస్సేన్, రియాజ్, నాగరాజు, రిజ్వాన్ పాల్గొన్నారు.

పెదవుటపల్లి- గన్నవరం వద్ద రైళ్ల దారి మళ్లింపు

వన్‌టౌన్, జూలై 2: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో ట్రాఫిక్ మెయింటెనెన్స్ కారణంగా పెద అవుటపల్లి- గన్నవరం సెక్షన్ వద్ద కొన్ని రైళ్లను దారి మళ్లిస్తున్నట్టు విజయవాడ డివిజన్ పీఆర్‌ఓ నుస్రత్ ఎం మండ్రుపకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 08539 విశాఖపట్నం-కొల్లం, 06066 ధన్‌బాద్-తాంబరం, 06094 బరౌనీ - మంగుళూరుసెంట్రల్ రైళ్లను ఈనెల 3న నిడదవోలు-గుడివాడ-విజయవాడ మీదుగా నడుపుతారు. ప్రస్తుతం ఈ రైళ్లు నిడదవోలు- ఏలూరు- తాడేపల్లి గూడెం- విజయవాడ మీదుగా నడుస్తున్నాయి. విశాఖపట్నం- కొల్లం రైలు ఏలూరులో, ధన్‌బాద్-తాంబరం బరౌని- మంగుళూరుసెంట్రల్ రైళ్లు తాడేపల్లిగూడెం- ఏలూరులో ఆగవన్నారు.

మంత్రి నారాయణను కలిసిన మాజీ ఎమ్మెల్సీ బుద్దా



వన్‌టౌన్, జూలై 2: మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పొంగూరు నారాయణను ఆయన నివాసంలో మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రికి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఆయనకు బుద్దా వెంకన్న శుభాకాంక్షలు తెలిపారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మానికొండ శ్రీధర్

7న మాదిగల జనజాతర సభను జయప్రదం చేయండి

- మానికొండ శ్రీధర్ మాదిగ

ధర్నాచౌక్, జూలై 2: ఎమ్మార్పీఎస్ 30ఏళ్ల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న మాదిగల జనజాత సభ నిర్వహిస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ తెలిపారు. గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయంలో కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ పురిటిగడ్డ ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం ఈద్ ముడి గ్రామంలో జరిగే ఈ సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ భవిష్యత్ కార్యచరణ ఈ సభలోనే నిర్ణయించడం జరుగుతుందన్నారు. అర్బన్ నేతలు మాతంగి సంజయ్ మాదిగ, దుద్దుల ప్రభువు, మాదిగ, వీర్ల అన్వేష్ మాదిగ పాల్గొన్నారు.



దుర్గమ్మను దర్శించుకున్న కార్తికేయ మిశ్రాకు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మ సన్నిధిలో సీఎం అదనపు కార్యదర్శి

వన్‌టౌన్, జూలై 2: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను మంగళవారం సీఎం అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా దర్శించుకున్నారు. ఈవో రామారావు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దుర్గమ్మ దర్శనానంతరం అధికారులు ఆయనకు ప్రసాదం, వేద ఆశీర్వచనం, శేషవస్త్రం, చిత్రపటం అందచేశారు.

పరిశోధన రంగంలో మహిళల భాగస్వామ్యం పెరగాలి

- నాగాలాండ్ కేంద్రీయ వర్సిటీ అధ్యాపకురాలు ఉపాసనా



వన్‌టౌన్, జూలై 2: పరిశోధన రంగంలో మహిళల భాగస్వామ్యం పెరగాలని నాగాల్యాండ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు ఉపాసనా బోరా సిన్హా అన్నారు. కేబీఎన్ కాలేజీలో మంగళవారం పీజీ రసాయన శాస్త్ర విభాగ ం ఆధ్వర్యంలో పరిశోధనలలో మహిళల భాగస్వామ్యం పెంచే వ్యూహాలపై మంగళవారం జరిగిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రంగాల్లో పరిశోధనలు చేసేవారిలో మహిళలు తక్కువ సంఖ్యలో కనిపిస్తున్నారన్నారు. విద్యలో మహిళల సంఖ్య బాగానే ఉన్నా పరిశోధనల్లో ఆ భాగస్వామ్యం కనిపించడం లేదన్నారు. ప్రభుత్వ విభాగాలు అనేకం పరిశోధనలకు మంచి అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. సామాజిక చైతన్యానికి మానవ వికాసానికి సైన్స్ సాంకేతిక రంగంలో మరిన్ని ఆవిష్కరణలు రావాల్సిన అవసరముందన్నారు సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ పరిశోధనా రంగంలో మహిళల భాగస్వామ్యం పెరిగితే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. విభాగాధిపతి జి కృష్ణవేణి పాల్గొన్నారు.

గోతులు పూడ్చిన టీడీపీ నేతలు

జి.కొండూరు, జూలై 2: కందులపాడు - గంగినేనిపాలెం - ఎర్రుపాలెం (కేజీవై) రహదారిపై గడ్డమణుగు, చెర్వుమాధవరం మధ్య భారీ గోతులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాలతో స్థానిక టీడీపీ నేతలు నూతక్కి రాజారావు (రాజ), చెర్వుమాధవరం సర్పంచ్ భర్త బాణావతు రాము మంగళవారం పూడ్చించారు. రహదారిపై గోతులు - ఆర్టీసీ సేవలకు బ్రేకులు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈనెల ఒకటిన ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. గుంతలు పూడ్చటంపై ప్రజలు ఆనందం వ్యక్తంచేశారు.

అమరావతికి విరాళం



రాజధాని అమరావతికి విజయవాడ కృష్ణలంకకు చెందిన మోరి మహేశ్ రూ. లక్ష విరాళంగా సీఎం చంద్రబాబుకు అందించారు.

క్యాచ్‌అప్ రూల్ ప్రకారమే పదోన్నతులు

▸▸ ఏపీ విద్యుత్తు ఓసీ ఉద్యోగుల సంఘం డిమాండ్

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు క్యాచ్ అప్ రూల్‌ను అనుసరిస్తూ విద్యుత్తు సంస్థల్లో పదోన్నతులు ఇవ్వాలని రాష్ట్ర విద్యుత్తు సంస్థల ఓసీ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. పదోన్నతుల్లో తప్పిదాలు జరుగుతున్నాయంటూ నాగరాజు, కర్నాల్ సింగ్ కేసుల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన క్యాచ్‌అప్ రూల్‌ను పాటించడం లేదని విద్యుత్తు సంస్థల రాష్ట్ర ఓసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తప్పుబట్టారు. న్యాయస్థానం స్టే విధించినా.. ట్రాన్స్‌కోలో పదోన్నతులు కల్పిస్తూ యాజమాన్య ఉత్తర్వును జారీ చేసిందని, ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని తెలిపారు. పదోన్నతులపై ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని, 2011 నుంచి పదోన్నతులపై సమీక్షించాకే కొత్తగా పదోన్నతులపై నిర్ణయం తీసుకోవాలని శ్రీనివాస్ కోరారు.

6న కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జూలై 6న రాష్ట్రవ్యాప్తంగా కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. అన్ని ప్రాంతీయ పశువైద్యశాలలు, వెటర్నరీ పాలీక్లినిక్‌లు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో కుక్కలకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 1962ను సంప్రదించాలని సూచించారు.

4నుంచి అగ్రి కోర్సులకు దరఖాస్తులు

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, కమ్యూనిటీసైన్స్ కళాశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రవేశానికి ఎన్నారై కోటా కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ రామచంద్రరావు తెలిపారు. 4నుంచి వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు అందుబాటులో ఉంటుందని, పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని మంగళవారం తెలిపారు.

డిప్యుటేషన్ అధికారులను రిలీవ్ చేసిన ఈసీ

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో భాగంగా సీఈవో కార్యాలయానికి రాష్ట్ర సచివాలయంలోని వివిధశాఖల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఎస్వో, ఏఎస్వోలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా రిలీవ్ చేశారు. మొత్తం 27 మంది అధికారులను మంగళవారం నుంచి రిలీవ్ చేస్తున్నట్లు ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హిందువులపై విషం చిమ్మడం కాంగ్రెస్‌కు అలవాటు: బీజేపీ

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): పరమత సహనానికి మారుపేరైన హిందువులపై విషం చిమ్మడం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు అలవాటుగా మారిందని రాష్ట్ర బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశాన్ని విభజించి పాలించే తత్వం పార్లమెంటు ప్రతిపక్ష నేతలో కనిపిస్తోందని ఆ పార్టీ అధికార ప్రతినిధి లంకా దినకర్ విజయవాడలో విమర్శించారు.

ప్రజాస్వామ్యం గురించి వైసీపీ మాట్లాడటమా: యామినీ శర్మ

ఐదేళ్ల రాష్ట్రాన్ని లూటీ చేసి అదే సొమ్ముతో అనుమతుల్లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాలను ప్రభుత్వం కూల్చేస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదమా? అంటూ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీ శర్మ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రజల కోసం ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రజా వేదికను కూల్చేసిన వైసీపీ నేతలు.. ఎలాంటి అనుమతుల్లేకుండా, అవినీతి సొమ్ముతో అక్రమంగా నిర్మించిన పార్టీ కార్యాలయాల భవనాల్ని కూల్చేస్తే ప్రజాస్వామ్యానికి ముప్పు వచ్చిందని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

రేవంత్‌కు మా సమస్య చెప్పండి

▸▸ లోకేశ్‌కు క్యాబ్ డ్రైవర్ల వినతి

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో తమ సమస్యను టీ-సీఎం రేవంత్ రెడ్డికి చెప్పాలని మంత్రి లోకేశ్‌కు హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ క్యాబ్ డ్రైవర్లు విజ్ఞప్తి చేశారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వీరు మంగళవారం పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యను విన్నవించారు. ఉమ్మడి రాజధానిగా పదేళ్ల గడువు పూర్తి కాగానే హైదరాబాద్‌లో తమపై వేధింపులు పెరిగిపోయాయని, తాము ఇప్పటికే లైఫ్ ట్యాక్స్ చెల్లిస్తే ఇప్పుడు మరోసారి తెలంగాణ రాష్ట్రానికి చెల్లించాలని అధికారులు విపరీతంగా ఒత్తిడి తెస్తున్నారని వారు వాపోయారు.

సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటాపై విధాన నిర్ణయం

▸▸ సమయం కోరిన ప్రభుత్వం.. అంగీకరించిన హైకోర్టు

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 50శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్సింగ్(35 శాతం కేటగిరీ బి), ఎన్ఆర్ఐ(15శాతం కేటగిరీ సీ) కోటా కింద భర్తీ చేసేందుకు వీలుగా వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యం మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, అందుకు సమయం ఇవ్వాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఈ వివరాలు నమోదు చేసిన ధర్మాసనం అందుకు అంగీకరించి, తదుపరి విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎస్.జయసూర్యతో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలిచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఠాగూర్ యాదవ్ వాదనలు వినిపించారు. రాష్ట్ర కోటా ఎంబీబీఎస్ సీట్ల భర్తీ 15నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని, వ్యాజ్యాలను సాధ్యమైనంత త్వరగా విచారించాలని కోరారు.

డిగ్రీ కాంట్రాక్టు అధ్యాపకులకు రెన్యువల్

ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న 703 మంది కాంట్రాక్టు అధ్యాపకులకు సర్వీసును రెన్యువల్ చేస్తూ ఉన్నత విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు 11నెలల కాలానికి ఈ కాంట్రాక్టును పునరుద్ధరించారు. కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ప్రతినిధులు శ్రీనివాస్ యాదవ్, దాసరి రాజు, సుదర్శన్, రాజేంద్ర ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

'రిజిస్ట్రేషన్ల' సమూల ప్రక్షాళన: మంత్రి అనగాని

రిజిస్ట్రేషన్ల శాఖను సమూలంగా ప్రక్షాళన చేయాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన ఆ శాఖపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అవసరమైన సేవలు సులభతరంగా, సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆరు రోజుల ముందే 'నైరుతి' విస్తరణ పూర్తి

విశాఖపట్నం, జూలై 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి తోడ్పాటును అందించే నైరుతి రుతుపవనాలు మంగళవారం నాటికి దేశవ్యాప్తంగా విస్తరించాయి. సాధారణంగా జూలై 8నాటికి పశ్చిమ రాజస్థాన్‌లోని శివారు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాల్సి ఉంది. అయితే, ఈ ఏడాది ఆరు రోజులు ముందుగానే ఆ ప్రక్రియ పూర్తయింది. జూలై 2 నాటికి రుతుపవనాల విస్తరణ పూర్తికావడం వరుసగా ఇది మూడో ఏడాది కావడం గమనార్హం. ఈ ఏడాది మే 30న కేరళలో ప్రవేశించిన రుతుపవనాలు జూన్ 10నాటికి పశ్చిమ భారతంలో మహారాష్ట్ర, ఇటు ఉత్తర కోస్తా, అటు ఈశాన్య భారతం వరకు విస్తరించి నిలిచిపోయాయి. తిరిగి జూన్ 24న రుతుపవనాల్లో కదలిక ప్రారంభమై... ఎనిమిది రోజుల్లో మిగిలిన ప్రాంతాలకు విస్తరించాయి. నైరుతి నిలిచిపోయిన సమయంలో ఉత్తర భారతంలో తీవ్రమైన ఎండలు కొనసాగి, వడగాడ్పులు వీచాయి. ఇదే సమయంలో ఈశాన్య భారతంలోని అస్సోం, మణిపూర్, మిజోరాం, మేఘాలయల్లో భారీవర్షాలు కురిసి వరదలు సంభవించాయి. రుతుపవనాల మౌలిక స్వభావం మారుతోంది. ఈ ప్రభావంతో సీజన్‌లో వర్షాలు కురిసే రోజులు తగ్గుతున్నాయి.

ఉన్నత విద్యామండలిలో వైసీపీ పాలన

▸▸ ఇప్పటికీ హేమచంద్రారెడ్డే చక్రధారి

▸▸ బెదిరింపుల నేపథ్యంలో మళ్లీ సెలవులోకి జేడీ

▸▸ మండలి కార్యాలయంలో ఉద్రిక్త పరిస్థితులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

పాలకులు మారారు. పాలనా మారింది. అందుకు అనుగుణంగానే గత ప్రభుత్వ హయాంలో నియమితులై, వారికి అనుకూలంగా అడ్డగోలుగా వ్యవహరించిన వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులూ రాజీనామాలు చేస్తున్నారు. ఆయా యూనివర్సిటీల రిజిస్ట్రార్‌లు బాధ్యతల నుంచి భయంతోనో, గౌరవంతోనో తప్పుకుంటున్నారు. కానీ, విశ్వవిద్యాలయాలకు, ఉన్నత విద్యకు కేంద్ర బిందువైన ఉన్నత విద్యామండలిలో మాత్రం ఎలాంటి మార్పూ లేదు. జగన్ ప్రభుత్వం నియమించిన చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి రాజీనామా చేసినా ఆయన నియమించిన అధికారులే చక్రం తిప్పుతున్నారు. వైస్ చైర్మన్ల నుంచి కార్యదర్శి వరకూ.. ఇద్దరు వైస్ చైర్మన్లు, కార్యదర్శి, అకడమిక్ అధికారులు, సెట్స్ అధికారులు, యూనివర్సిటీల క్వాలిటీ సెల్ అధికారులు 10 మంది.. అంతా వైసీపీ ప్రభుత్వం నియమించిన వారే. ఇంజనీరింగ్, డిగ్రీ అడ్మిషన్లు, ఎడ్‌సెట్, లాసెట్, ఈసెట్, ఐసెట్, పీజీసెట్.. అన్ని సెట్లపై పర్యవేక్షణ, ఉన్నత విద్యా కోర్సుల కరిక్యులమ్‌లో మార్పులు చేర్పుల వ్యవహారం అంతా వారి చేతుల్లోనే ఉంటుంది. అధికారిక సమావేశాలకూ హాజరయ్యేదీ వాళ్లే. అంటే అక్కడ.. ఆ కార్యాలయంలో ఇంకా వైసీపీ పాలనే సాగుతోంది. ఇప్పటికీ హేమచంద్రారెడ్డి కనుసన్నల్లోనే మండలి కార్యాలయం నడుస్తోంది.



జేడీకి బెదిరింపులు... కార్యాలయంలో ఉద్రిక్త వాతావరణం

ఉన్నత విద్యామండలిలో ఒక్క జేడీ తప్ప మిగిలిన వాళ్లంతా వివిధ యూనివర్సిటీల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చేవారే. గత ప్రభుత్వంలో మండలి నిర్ణయాలను తప్పుపట్టడంతో జాయింట్ డైరెక్టర్ కృష్ణమూర్తిపై 'చైర్మన్‌కు వ్యతిరేకం' అని ముద్ర వేశారు. ఆయనపై బెదిరింపులకు దిగారు. ఎన్నికల వేళ అవి సద్దుమణిగినట్లు కనిపించినా.. మళ్లీ హేమచంద్రారెడ్డి వర్గీయులు రెచ్చిపోతున్నారు. ఎలా పనిచేస్తాడో చూస్తామంటూ జేడీపై మళ్లీ బెదిరింపులకు దిగుతున్నారు. డిప్యూటేషన్ ముగియడంతో ఇటీవల మండలి నుంచి రిలీవ్ అయిన ఓ మహిళా అధికారి కూడా జేడీని బెదిరిస్తున్నారు. గతంలోనూ జేడీపై ఆమె పలు ఫిర్యాదులు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. తన డిప్యూటేషన్ కొనసాగకపోవడానికి జేడీనే కారణమన్న అపోహతో ఆమె ఈ దారుణానికి పాల్పడుతున్నట్లు సమాచారం. మండలి కార్యాలయం పక్కనే నివాసం ఉండే ఆమె... జేడీ రాకపోకలపై ఓ కన్నేశారు. ఆయన ఆఫీసుకు రాగానే 'నా స్టైల్‌లో గొడవ పెట్టుకుంటానంటూ ఉద్యోగులకు ఫోన్ చేసి మరీ చెపుతున్నారు. ఆమె చెప్పినట్లే చేశారు. గత కొద్ది రోజులుగా సెలవులో ఉన్న జేడీ సోమవారం ఆఫీసుకు వచ్చారు. వెంటనే ఆమె, జేడీ పీఏకు ఫోన్ చేశారు. ఆయన అప్పాయింట్‌మెంట్ కావాలని అడిగారు. ఇవ్వకపోతే నేరుగా చాంబర్‌లోకి వెళ్లానని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జేడీ మళ్లీ సెలవులపై వెళ్లిపోయారు. కాగా, ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు కూడా జేడీ పీఏకు ఫోన్ చేసిన సదరు ఉద్యోగిని.. 'మావాళ్లను తీసుకెళ్లి జేడీ ఇంటి ముందు ధర్నా చేస్తా' అంటూ బెదిరించారు. దీనిపై కార్యదర్శికి జేడీ ఫిర్యాదు చేశారు. ఆఫీసులో ప్రశాంతంగా పనిచేసుకునే వాతావరణం కల్పించాలని కోరారు. అయితే ఫిర్యాదు తీసుకున్న కార్యదర్శి కూడా నాటి చైర్మన్ నియమించిన వ్యక్తే కావడంతో అదే చైర్మన్ నియమించిన మహిళా అధికారిపై చర్య తీసుకుంటారా? అన్నదే అనుమానం.

లోకేశ్ సమావేశాలకూ వారే...

ఉన్నత విద్యాశాఖపై మంత్రి లోకేశ్ నిర్వహిస్తున్న కీలక సమావేశాలకు ఇప్పటికీ వైసీపీ నియమించిన అధికారులే హాజరవుతుండటంపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఒకవేళ గత ప్రభుత్వం నియమించిన అధికారులకు రాజీనామా చేసే యోచన లేకపోతే తాత్కాలికంగా అయినా కొత్తవారికి బాధ్యతలు అప్పగించాలని, అప్పుడే గతంలో జరిగిన అక్రమాలు కొనసాగకుండా ఉంటాయన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. మరోవైపు మండలి చైర్మన్ పదవికి రాజీనామా చేసి వెళ్లిపోయిన హేమచంద్రారెడ్డి సోమవారం పోలీసుల రక్షణ మధ్య మళ్లీ కార్యాలయానికి వచ్చారు. సెలవుకు దరఖాస్తు చేసుకొని వెళ్లిపోయారు. వాస్తవానికి ఎన్నికల ఫలితాలు వచ్చినరోజే... అంటే జూన్ 4న పలు కీలక ఫైళ్లను ధ్వంసం చేసిన హేమచంద్రారెడ్డి... తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను అప్పటి ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శికి వాట్సాప్‌లో పంపించారు.

వైసీపీ నేతలు మేసిన సొమ్మును కక్కించాలి

▸▸ అందుకు ఆర్ఆర్ చట్టం లేదా ప్రత్యేక చట్టం తేవాలి

▸▸ 15 సూచనలతో చంద్రబాబుకు యనమల లేఖ

అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రత్యేక చట్టం తెచ్చి లేదా రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించి అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ నేతలు మేసిన సొమ్మును కక్కించాలని శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడానికి 15 సూచనలతో మంగళవారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఒక లేఖ రాశారు. ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఆర్థిక ప్రగతి లోపించడంతోపాటు ప్రభుత్వ ఆదాయం పడిపోవడం, దుబారా పెరిగిపోవడం, మౌలిక వసతుల కల్పనపై ఖర్చు తగ్గించివేయడం వల్ల రాష్ట్రం ఆర్థికంగా వెనకబడిపోయిందని తెలిపారు. ఈ పరిస్థితి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి తనకున్న అనుభవంతో కొన్ని సూచనలు చేస్తున్నానని ఆయన ఈ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ఆదాయం నుంచి రాష్ట్రాలకు ఇచ్చే వాటాను 41 లేదా 42 శాతానికి పెంచేలా ప్రయత్నించడం, పన్ను ఆదాయ మార్గాలను మెరుగుపర్చడం, రాష్ట్రానికి గ్రాంటు రూపంలో మరింత సాయం ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించడం, రాష్ట్రానికి ఉన్న కేంద్ర ప్రభుత్వ రుణాలను ఇప్పటివరకూ ఉన్నవి మాఫీ చేసేలా అభ్యర్థించి తద్వారా రాష్ట్రం కొత్త రుణాలు తెచ్చుకోవడానికి మార్గం సుగమం చేసుకోవడం, రెవెన్యూ ఖర్చును వీలైనంతవరకూ తగ్గించుకోవడం, సంక్షేమ పథకాలను నిజమైన లబ్ధిదారులకు మాత్రమే అందేలా చూడటం, మౌలిక వసతుల కల్పనకు చేసే ఖర్చులో లీకేజీలను నివారించడం, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులను పెంచడం ద్వారా రాష్ట్రాన్ని పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా తీర్చిదిద్దడం, ప్రభుత్వానికి అధికాదాయం రాబట్టే అవకాశం ఉన్న సహజ వనరులను జాగ్రత్తగా కాపాడటం, ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి అనుగుణంగా ఆర్థిక క్రమ శిక్షణ నెలకొనేలా ఇప్పటి నుంచే తగు చర్యలు తీసుకోవడం వంటివి చేయాలని ఆయన కోరారు. వైసీపీ హయాంలో విపరీతంగా పెరిగిపోయిన అవినీతిని అరికట్టడానికి నిర్దిష్ట చర్యలు తీసుకోవడం ద్వారా ప్రగతిశీల ఆంధ్ర ప్రదేశ్‌ను ఆవిష్కరించాలని, ప్రభుత్వ ఖజానా నుంచి చేసే బిల్లుల చెల్లింపును సీఎఫ్ఎంఎస్ విధానం ద్వారానే చేయాలని, కొత్త రుణాలు తెచ్చే సమయంలో అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని జాగురూకతతో అడుగు వేయాలని ఆయన సూచించారు. సుపరిపాలన అందించడంలో చంద్రబాబుకు ఉన్న అంకిత భావం, దార్శనికత వల్ల రాష్ట్రం కచ్చితంగా ముందడుగు వేస్తుందన్న నమ్మకం తనకు ఉందని యనమల పేర్కొన్నారు.

'ఇగ్నో'లో ఎంఏ భగవద్గీత

న్యూఢిల్లీ, జూలై 2: ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ వర్సిటీ(ఇగ్నో)లో 2024-25 నుంచి ఎంఏ భగవద్గీత అధ్యయనం కోర్సును ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 2024 జూలై నుంచి ఈ కోర్సు అందుబాటులోకి తీసుకువచ్చామని, ఓపెన్, దూరవిద్య ద్వారా విద్యార్థులు కోర్సును పూర్తిచేయవచ్చని చెప్పారు. డిగ్రీ అర్హతతో మొత్తం 500 మంది విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. రెండు సంవత్సరాల కోర్సుకు రూ. 12,600లుగా ఫీజు నిర్ణయించారు.

జనరల్ బోగీలను పెంచనున్న రైల్వే



చెన్నై, జూలై 2: జనరల్ బోగీల ప్రయాణికులు ఏసీ బోగీలను ఆక్రమించేస్తున్న ఘటనలు పదేపదే పునరావృతమవుతున్న నేపథ్యంలో జనరల్, సెకండ్ క్లాస్ బోగీల తయారీని పెంచాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ మేరకు తమ వార్షిక ఉత్పత్తి ప్రణాళికను రైల్వేశాఖ సవరించుకుంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో మరిన్ని థర్డ్ ఏసీ కోచ్‌లు అందుబాటులోకి తీసుకొచ్చే ప్రణాళికలో భాగంగా దశలవారీగా జనరల్, స్లీపర్ కోచ్‌లు తొలగించాలని ఇటీవల ప్రణాళిక రూపొందించిన రైల్వేశాఖ ఇప్పుడా ప్రణాళికను మార్చుకుంది. గత కొద్ది సంవత్సరాలుగా ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వలస కార్మికులు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు తరలుతుండటంతో ఈ మార్గాల్లో అన్‌రిజర్వుడు బోగీలకు గణనీయంగా డిమాండ్ పెరిగింది. ఈ మూడు రాష్ట్రాలకు షాలిమార్(హౌవ్‌డా), గువాహటీ, సిల్చార్, పట్నా, బొకారో, లఖ్‌నవూ, ముజఫర్‌పూర్, ధన్‌పూర్ ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటున్నాయి. దీంతో పరిష్కారానికి చర్యలు చేపట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి చేయాల్సిన 6,325 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో జనరల్, స్లీపర్ కోచ్‌లే 4,075 వరకు ఉండనున్నాయి. రైల్వే బోర్డు ఈనెల 27న సవరించిన ప్రణాళిక ప్రకారం 2024-25 సంవత్సరంలో జనరల్ క్లాస్(సెకండ్ సిట్టింగ్) కోచ్‌లు 1,171 నుంచి 2 వేలకు పెరగనున్నాయి. ఈ కోచ్‌లను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ(ఐఎఫ్‌సీ), కపుర్తలాలోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ(ఆర్‌సీఎఫ్), రాయ్‌బరేలీలోని మోడరన్ కోచ్ ఫ్యాక్టరీ(ఎంసీఎఫ్)లలో తయారు చేయనున్నారు. అలాగే, ఈ ఏడాది 1,030 స్లీపర్ కోచ్‌లనూ రైల్వేశాఖ ఉత్పత్తి చేయనుంది.

చెన్నై విమానాశ్రయ అధికారుల

నివాసాల్లో కస్టమ్స్ తనిఖీలు

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై మీనంబాక్కం లోని విమానాశ్రయంలో పనిచేస్తున్న అధికారులు బంగారం స్మగ్లింగ్‌కు సహకరించారని ఆరోపణలు రావటంతో కస్టమ్స్ అధికారులు మంగళవారం వారి నివాసగృహాలలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. 267 కిలోల బంగారం అక్రమంగా తరలించిన స్మగ్లర్‌లకు కొంతమంది సీనియర్ విమానాశ్రయ అధికారులు సహకరించినట్టు వెల్లడైంది. విమానాశ్రయంలో చెన్నై నగరానికి చెందిన సబీర్‌అలీ అనే యూట్యూబర్ నడుపుతున్న ఎయిర్ హబ్ గిఫ్ట్ దుకాణంలో చేపట్టిన తనిఖీల్లో స్మగ్లింగ్‌కు సంబంధించి కీలక ఆధారాలను కూడా కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సబీర్‌అలీకి విమానాశ్రయ డైరెక్టర్ సెల్వవినాయగం సహకరించినట్టు ఆరోపణలు రావటంతో కాంచీపురం జిల్లాలో ఉన్న ఆయన ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. అదే విధంగా, చెన్నై నగరంలో ఉన్న మరో ఇద్దరు ఉన్నతాధికారుల నివాసగృహాలు, కార్యాలయాల్లో కూడా తనిఖీలు చేపట్టినట్టు కస్టమ్స్ అధికారులు తెలిపారు.

ఏపీ అభివృద్ధికి సహకరించండి

▸▸ ప్రధానిని కోరిన జనసేన ఎంపీలు

▸▸ పార్లమెంట్‌లో మోదీని కలిసిన బాలశౌరి, ఉదయ్

▸▸ ప్రజాసేవ పట్ల పవన్‌కున్న పట్టుదల చూసి ఆశ్చర్యమేసింది

▸▸ ఎక్స్‌లో పోస్ట్ చేసిన పీఎం... ధన్యవాదాలు తెలిపిన జనసేనాని

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు ఏపీకి ఉండాలని జనసేన పార్టీ ఎంపీలు ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీని ఆ పార్టీ మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఉదయం పార్లమెంట్ భవనంలోని ప్రధాని కార్యాలయంలో వారు సమావేశమయ్యారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుండి నడిపించాలని విన్నవించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు రాష్ట్ర విభజన అంశాలు, కేంద్ర నుంచి రావాల్సిన గ్రాంట్లు అంశాలను నరేంద్ర మోదీ దృష్టికి తీసుకువెళ్లారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో టూరిజం అభివృద్ధికి, జాతీయ విద్యా సంస్థ నెలకొల్పడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని ప్రధాని హామీ ఇచ్చినట్లు ఎంపీలు తెలిపారు.

పవన్‌కు మోదీ ప్రశంసలు

జనసేన పార్టీకి చెందిన ఎంపీలను కలిసినట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'నేను జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి ఎంతో కాలంగా పని చేస్తున్నా. ఆయనకు ప్రజాసేవ పట్ల ఉన్న పట్టుదల, మక్కువ చూసి ఆశ్చర్యం కలుగుతుంది. సమాజానికి సేవ చేయడంలో, భారత దేశ ప్రగతికి దోహదపడటంతో జనసేన పార్టీ ఎప్పుడూ ముందుంటుందని నేను భావిస్తున్నా' అని ప్రధాని పేర్కొన్నారు. ఆ పోస్టుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. 'మీ విలువైన సమయాన్ని మా పార్టీ ఎంపీలకు కేటాయించినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రజా సేవలపై మా పార్టీ ఎంపీలకు మీరు ఇచ్చిన అత్యంత విలువైన సలహాలు ఎంపీలతో పాటు జనసేన పార్టీకి కూడా గొప్పగా ఉపయోగపడతాయి. ధన్యవాదాలు" అని పవన్ బదులిచ్చారు.



ప్రధాని మోదీతో జనసేన ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, బాలశౌరి

'విశాఖ ఉక్కు'పై కౌంటర్లు వేయండి

▸▸ పిటిషనర్లకు, కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

▸▸ పోలీసులు అడ్డుకుంటే ఫిర్యాదు చేయాలని కేఏ పాల్‌కు సూచన

▸▸ విచారణ 8కి వాయిదా

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం భూములు, ఇతర ఆస్తుల విషయంలో యథాతథ స్థితి పాటించాలని కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై స్పష్టత ఇవ్వాలని, ఆర్ఐఎన్ఎల్ తన సొంత నిధులతో కొనుగోలు చేసిన ఆస్తులను విక్రయించుకొనేందుకు వీలుగా ఉత్తర్వులను సవరించాలని కోరుతూ విశాఖ స్టీల్ ప్లాంట్(ఆర్ఐఎన్ఎల్) వేసిన అనుబంధ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లను, కేంద్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం మరోసారి ఆదేశించింది. విచారణను ఈనెల 8వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలిచ్చింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విశ్రాంత ఐపీఎస్ అధికారి వి.లక్ష్మీనారాయణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఇదే వ్యవహారంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, సువర్ణరాజు అనే వ్యక్తి కూడా వేర్వేరుగా పిల్‌లు వేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు ఇటీవల విచారణకు రాగా.. విశాఖ ఉక్కు భూములు, ఇతర ఆస్తుల విషయంలో యథతథ స్థితిని పాటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తాజాగా మంగళవారం ఈ వ్యాజ్యాలు విచారణకు రాగా ఒకరు తప్ప మిగిలిన పిటిషనర్లు కౌంటర్లు దాఖలు చేయకపోవడంతో వారిని కూడా కౌంటర్ వేయాలంటూ విచారణను సోమవారానికి వాయిదా వేసింది. కాగా, తనను కోర్టులోకి రాకుండా పోలీసులు అడ్డుకుంటూ నిత్యం వేధిస్తున్నారని పార్టీ ఇన్ పర్సన్ కేఏ పాల్ హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించాలని కోరారు. ఈ ప్రభుత్వం వచ్చాకే ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నానన్నారు. స్పందించిన ధర్మాసనం.. పోలీసులు అడ్డుకుంటే రిజిస్ట్రార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కేఏ పాల్‌కు సూచించింది. పోలీసులపై చేసిన ఆరోపణలు తప్పని తేలితే 'మీపై చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేసింది.

రమణ దీక్షితులుకు హైకోర్టులో ఊరట

▸▸ వాయిస్ పరీక్షకు ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు నిలిపివేత

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులుకు హైకోర్టులో ఊరట లభించింది. సామాజిక మాధ్యమాలలో శ్రీవారి ఆలయం, అధికారుల ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో నమోదైన కేసులో రమణ దీక్షితులు వాయిస్‌ను రికార్డు చేసి పరీక్షలకు పంపాలని ఈ ఏడాది మే 24న తిరుపతి కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల అమలును హైకోర్టు నిలిపివేసింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. టీటీడీ ఐటీశాఖ జీఎం సందీప్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రమణదీక్షితులుపై తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన తిరుపతి కోర్టు ఆడియోలో ఉన్నది రమణదీక్షితులు గొంతేనా అని నిర్ధారించేందుకు ఆయన వాయిస్‌ను రికార్డు చేసి పరీక్షలకు పంపాలని ఈ ఏడాది మే 24న ఆదేశాలు ఇచ్చింది. ఆ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని కోరుతూ రమణదీక్షితులు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు.



టౌన్‌ప్లానింగ్ అధికారులపైకి దూసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

అక్రమ నిర్మాణాలకు 'ద్వారంపూడి' అండ!

▸▸ అధికారులపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే వీరంగం

▸▸ అనుచరులతో దాడి.. ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 2: ఇటీవల ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలైనా వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తీరు మారలేదు. ఇంకా అధికారంలో ఉన్నట్టుగానే ప్రజలపైనా, అధికారులపైనా వీరంగం వేస్తున్నారు. తాజాగా కాకినాడలోని గొడారిగుంట ప్రాంతం రాజ్యలక్ష్మినగర్‌లో మంగళవారం ఆయన అధికారులపై వీరంగం వేశారు. ఆయన అనుచరుడొకరు ఇక్కడ అక్రమంగా భవంతిని నిర్మించాడు. మొదటి ఫ్లోర్ వరకే అనుమతులుండగా, అడ్డగోలుగా రెండో ఫ్లోర్ కూడా నిర్మించేశారు. అనుమతులు లేకుండా నిర్మించిన రెండో ఫ్లోర్‌ను కూల్చివేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు వారం కిందటే నోటీసులు ఇచ్చినా, కనీసం జవాబివ్వలేదు. దీంతో అధికారులు రెండో అంతస్తును కూల్చేందుకు ప్రయత్నించారు. ఇంతలో మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి వచ్చి అధికారులను బెదిరించారు. అనుచరులతో వీరంగం సృష్టించారు. రెండో ఫ్లోర్ కూల్చడానికి అధికారులు తీసుకొచ్చిన కూలీలపై ఆయన అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఇటుకలతో ఇద్దరిని తీవ్రంగా గాయపరిచారు. దీంతో కూలీలందరూ పక్క భవనంపైకి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులనూ ద్వారంపూడి దూర్భాషలాడారు. పై అధికారులకు ఫిర్యాదు చేస్తానంటూ ఫోన్లో ప్రయత్నించారు. నిబంధన ప్రకారమే చర్యలకు దిగామని, అక్రమ నిర్మాణాలపై చర్యలను అడ్డుకోరాదంటూ ఉన్నతాధికారులు స్పష్టం చేయడంతో చేసేదిలేక ద్వారంపూడి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

▸▸ ఐదుగురు మావోయిస్టుల మృతి.. కొనసాగుతున్న కూంబింగ్

చర్ల, జూలై 2: దండకారణ్యంలో ఎన్‌కౌంటర్ల పరంపర కొనసాగుతూనే ఉంది. వరుస ఘటనల్లో భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణిస్తున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనా స్థలంలో మావోయిస్టులకు చెందిన తుపాకులు, మందుపాతరలు, ఇతర సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజన్ తెలిపారు. నారాయణపూర్ జిల్లా ఘమడి, కుర్రేవాయి గ్రామాల పరిధిలో అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టుల సంచారం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో నారాయణపూర్, కొండెగావ్, కాంకేర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ బెటాలియన్ల నుంచి మొత్తం 1,400 మంది జవాన్లు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. నాలుగు జిల్లాల సరిహద్దుల నుంచి అబూజ్‌మడ్‌లోకి ప్రవేశించారు. ఈ క్రమంలో ఘమడి, కుర్రేవాయి గ్రామాల మధ్య మావోయిస్టులు తారసపడడంతో ఇరు పక్షాల నడుమ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని ఐజీ తెలిపారు. పోలీసులకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. కాగా, తప్పించుకున్న మావోయిస్టులు అడపాదడపా కాల్పులు జరుపుతున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం గుట్టల్లో ఉండడంతో మృతదేహాల తరలింపు ఆసల్యమవుతున్నట్లు సమాచారం.

జనవరి నుంచి 9 ఎన్‌కౌంటర్లు... 136 మంది మావోయిస్టుల మృతి

ఈ ఏడాది జనవరి నుంచి బస్తర్ డివిజన్‌లోని 7 జిల్లాల్లో తుపాకుల మోత మోగుతోంది. వరుస ఘటనలతో బస్తర్.. వార్ జోన్‌గా మారింది. ఇప్పటి వరకు జరిగిన 9 ఎన్‌కౌంటర్లలో 136 మంది మావోయిస్టులు మృతిచెందారు. కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మృతిచెందగా, అదే దేశ చరిత్రలో అతిపెద్ద ఎన్‌కౌంటర్‌గా నిలిచింది. బీజాపూర్, నారాయణపూర్, సుకుమా జిల్లాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతిచెందారు.

'స్పా'లో కొత్త కోర్సులు

▸▸ ఈ ఏడాది నుంచి ఎం డిజైన్ కోర్సు ప్రారంభం

విజయవాడ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా)లో కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నట్టు డైరెక్టర్ శ్రీకొండ రమేష్ తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఎం డిజైన్ కోర్సును ప్రారంభిస్తున్నామన్నారు. విజయవాడలోని స్పాలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఆర్కిటెక్చర్, ప్లానింగ్ కోర్సుల్లో సీట్లను జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు వచ్చిన విద్యార్థులకు కేటాయిస్తామన్నారు. ఇది కాకుండా స్థానికంగా కొన్ని కోర్సులను ప్రవేశపెట్టే అకాశం ఉందని చెప్పారు. ఇందులో భాగంగా ఎంఏ, ఎమ్మెస్సీ చేసిన విద్యార్థుల కోసం ల్యాండ్ స్కేపింగ్, కన్జర్వేషన్ ఆర్కిటెక్చర్, బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మెయింటెనెన్స్, అర్బన్ డిజైన్, సస్టెయినబుల్ ఆర్కిటెక్చర్, ప్రొడక్ట్ డిజైన్, ప్లాస్టిక్ డిజైన్, ఇండస్ట్రియల్ డిజైన్, జువెలరీ డిజైన్ కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. ఈ ఏడాది కొత్తగా ఎం డిజైన్ కోర్సును విద్యార్థుల కోసం తీసుకొచ్చామన్నారు. ఈ కోర్సులో మొత్తం 25 సీట్లు ఉన్నాయన్నారు. వాటిలో 13 సీట్లను సెంట్రల్ కౌన్సెలింగ్ మాస్టర్ అండ్ టెక్నాలజీ విభాగం ద్వారా భర్తీ చేస్తామన్నారు. మిగిలిన 12 సీట్లను స్పా ఆధ్వర్యంలో నిర్వహించే ప్రవేశపరీక్ష ద్వారా భర్తీ చేస్తామని వెల్లడించారు.

ఏపీ టెట్ నోటిఫికేషన్

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

విజయవాడ ● బుధవారం 3 జూలై 2024

diksuchi@andhrajyothy.com

మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్య విభాగం- 'ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఏపీ టెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ పాఠశాలలు సహా ఆదర్శ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, సంక్షేమ పాఠశాలలు, ప్రైవేట్ ఎయిడెడ్/అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటోతరగతి నుంచి ఎనిమిదోతరగతి ఉపాధ్యాయుల ఎంపికకు టెట్ అర్హత తప్పనిసరి. రాష్ట్రంలో మెగా డీఎస్సీ నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నోటిఫికేషన్ వెలువడింది.



టెట్ వివరాలు

- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 1ఎ, 1బి, 2ఎ, 2బి అనే నాలుగు పేపర్లు ఉంటాయి. రెగ్యులర్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి వరకు బోధించాలనుకునేవారు 1ఎ పేపర్‌ను, ఆరోతరగతి నుంచి ఎనిమిదోతరగతి వరకు బోధించాలనుకునేవారు 2ఎ పేపర్‌ను రాయాలి. స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూళ్లలో ఒకటోతరగతి నుంచి అయిదోతరగతి వరకు బోధించాలనుకునేవారు 1బి పేపర్‌ను, ఆరోతరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించాలనుకునేవారు 2బి పేపర్‌ను రాయాలి. టెట్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 60 శాతం మార్కులు; బీసీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు రావాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే టీచర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో ఏపీ టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. ఒక అభ్యర్థి ఎన్నిసార్లయినా టెట్ రాయవచ్చు. టెట్ స్కోర్ వ్యాలిడిటీ జీవితకాలం ఉంటుంది.
- ప్రతి పేపర్లో 150 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లీష్, అభ్యర్థి ఎంచుకొన్న లాంగ్వేజ్‌లలో ఉంటుంది.
- 1ఎ పేపర్లో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి, లాంగ్వేజ్-1, ఇంగ్లీష్‌లాంగ్వేజ్, మేథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు అడుగుతారు.
- 1బి పేపర్లో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి-స్పెషల్ ఎడ్యుకేషన్, లాంగ్వేజ్-1, ఇంగ్లీష్ లాంగ్వేజ్, మేథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు ఇస్తారు.
- 2ఎ పేపర్లో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి, లాంగ్వేజ్-1, ఇంగ్లీష్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్, బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ అంశాలు లేదా సోషల్ స్టడీస్ లేదా లాంగ్వేజ్ నుంచి 60 ప్రశ్నలు ఇస్తారు.
- 2బి పేపర్లో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి-స్పెషల్ ఎడ్యుకేషన్, లాంగ్వేజ్-1, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు; డిజెబిలిటీ స్పెషలైజేషన్ అండ్ పెడగాగి నుంచి 60 ప్రశ్నలు ఇస్తారు.
- లాంగ్వేజ్-1 కింద తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్, కన్నడ, తమిళం, ఒడియా, సంస్కృతం భాషల్లో ఒకదాన్ని ఎంచుకోవాలి.

ముఖ్య సమాచారం

దరఖాస్తు ఫీజు:	రూ.750
ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:	జూలై 16
దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ:	జూలై 17
ఆన్‌లైన్ మాక్ టెస్ట్‌లు:	జూలై 16 నుంచి
హాల్ టికెట్ డౌన్‌లోడింగ్:	జూలై 25 నుంచి
ఏపీ టెట్ 2024 తేదీలు:	ఆగస్టు 5 నుంచి 20 వరకు
ప్రాథమిక 'కీ'ల విడుదల:	ఆగస్టు 10 నుంచి
'కీ'పై అభ్యంతరాల స్వీకరణ:	ఆగస్టు 11 నుంచి 21 వరకు
ఫైనల్ కీ విడుదల:	ఆగస్టు 25
ఫలితాలు విడుదల:	ఆగస్టు 30
వెబ్‌సైట్:	http://cse.ap.gov.in

ఎవరు రాయొచ్చంటే..

- 1ఎ పేపర్ రాయాలంటే ఏపీ బీఐఈ నుంచి 50 శాతం మార్కులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల 'డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్'(డీఈఎల్ఈడీ)/నాలుగేళ్ల 'బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్'(బీఈఎల్ఈడీ)/రెండేళ్ల 'డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్-స్పెషల్ ఎడ్యుకేషన్' పూర్తిచేసి ఉండాలి. ద్వితీయశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) పూర్తిచేసినవారు కూడా అర్హులే.
- 1బి పేపర్ రాయాలంటే ఏపీ బీఐఈ నుంచి 50 శాతం మార్కులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల 'డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్'(డీఈడీ)-'స్పెషల్ ఎడ్యుకేషన్' పూర్తిచేసి ఉండాలి. ఏడాది 'డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్'(డీఎస్ ఈ) ఉత్తీర్ణులు; 'డిప్లొమా ఇన్ కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్'(డీసీబీఆర్)/'డిప్లొమా ఇన్ మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్'(ఎంఆర్‌డబ్ల్యూ)/'డిప్లొమా ఇన్ హియరింగ్ లాంగ్వేజ్ అండ్ స్పీచ్'(డీహెచ్ఎల్ఎస్)/'డిప్లొమా ఇన్ ఒకేషనల్ రిహాబిలిటేషన్-మెంటల్ రిటార్డేషన్'(డీవీఆర్-ఎంఆర్)/'డిప్లొమా ఇన్ ఒకేషనల్ ట్రెయినింగ్ అండ్ ఎంప్లాయిమెంట్-మెంటల్ రిటార్డేషన్'(డీవీటీఈ-ఎంఆర్)/పీజీ డిప్లొమా ఇన్ కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్(పీజీడీసీబీఆర్) ఉత్తీర్ణతతోపాటు ఆర్నెల్ల సర్టిఫికెట్ కోర్సు(ఎడ్యుకేషన్ ఆఫ్ చిల్డ్రన్-స్పెషల్ నీడ్స్) పూర్తిచేసినవారు; జూనియర్ డిప్లొమా ఇన్ టీచింగ్ డెఫ్ ఉత్తీర్ణులు; ప్రైమరీ లెవెల్ టీచర్ ట్రెయినింగ్ కోర్స్ ఇన్ విజువల్ ఇంపైర్‌మెంట్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.
- 2ఎ పేపర్ రాయాలంటే డిగ్రీ/పీజీతోపాటు బీఈడీ పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు నాలుగేళ్ల బీఈఎల్ఈడీ ఉత్తీర్ణులు; ఏదేని డిగ్రీతోపాటు ఏడాది వ్యవధి గల బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్) పూర్తిచేసినవారు; 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ-ఎంఈడీ పూర్తిచేసినవారు కూడా అర్హులే.
- 2బి పేపర్ రాయాలంటే డిగ్రీ/పీజీతోపాటు బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పూర్తిచేసి ఉండాలి. బీఈడీ(జనరల్)తోపాటు ఏడాది డిప్లొమా-స్పెషల్ ఎడ్యుకేషన్/పీజీ డిప్లొమా-స్పెషల్ ఎడ్యుకేషన్ ఉత్తీర్ణులు; బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌తోపాటు పీజీ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉత్తీర్ణులు; పీజీ డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్-మెంటల్ రిటార్డేషన్ ఉత్తీర్ణులు; సెకండరీ లెవెల్ టీచర్ ట్రెయినింగ్ కోర్స్ ఇన్ విజువల్ ఇం పైర్‌మెంట్ పూర్తిచేసినవారు; సీనియర్ డిప్లొమా ఇన్ టీచింగ్ డెఫ్ ఉత్తీర్ణులు; బీఏ-బీఈడీ ఇన్ విజువల్ ఇంపైర్‌మెంట్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.
- లాంగ్వేజ్ టీచర్లు మాత్రం లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లో డిగ్రీ లేదా బ్యాచిలర్ ఆఫ్ ఓరియంటల్ లాంగ్వేజ్ పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ ఇన్ లిటరేచర్; పీజీ(లాంగ్వేజ్ సబ్జెక్ట్)తోపాటు లాంగ్వేజ్ పండిట్ ట్రెయినింగ్ సర్టిఫికెట్ ఉత్తీర్ణులు; బీఈడీ (లాంగ్వేజ్) పూర్తిచేసినవారు కూడా అర్హులే.

SCHOLARSHIP ALERT

Kotak Junior Scholarship

Description: Under the CSR initiative on Education & Livelihood by the Kotak Mahindra Group Companies, Kotak Education Foundation invites applications for Kotak Junior Scholarship 2024-25 from Class 10 passed students within the Mumbai Metropolitan Region.

Eligibility: Applicants must have obtained over 85% marks in their Class 10 board examination (SSC/CBSE/ICSE) in 2024.

- They must have secured admission in Class 11 at junior colleges/schools for Arts, Commerce or Science streams in the Mumbai Metropolitan Region (MMR) for the academic year 2024-25.
- The annual family income of applicants must be INR 3,20,000 or below.
- Students must reside within the Mumbai Metropolitan Region (MMR).

Prizes & Rewards: Scholarship of INR 3,500 per month along with mentorship support, academic assistance, career guidance, and exposure visits.

Last Date to Apply: 15-07-2024 ***Application mode:*** Online only

Short Url: www.b4s.in/aj/KJSP2

Swami Vivekanand Scholarship for Academic Excellence Scheme 2024

Description: Swami Vivekanand Scholarship for Academic Excellence Scheme 2024 (formerly Rajiv Gandhi Scholarship) is an initiative of the Government of Rajasthan, for students planning to pursue undergraduate, postgraduate, Ph.D., and post-doctoral research programs abroad.

Eligibility: Applicants must be Indian citizens residing in Rajasthan, pursuing a UG, PG, Ph.D. or postdoctoral program, and be under 35 years old on July 1st of the financial year. Applicants must meet the specified income criteria to be eligible for the scholarship.

Prizes & Rewards: A monthly living expenses of up to 1,00,000 and other benefits

Last Date to Apply: 15-01-2025

Application mode: Online Applications

Short Url: www.b4s.in/ aj/RGAE1



Description: An initiative of ETS India Private Limited to help undergraduate students and working professionals pursue their dream of studying abroad.

TOEFL India Championship

Eligibility: Participants must currently be enrolled in the 3rd or 4th year of undergraduate studies at an accredited Indian higher education institution (college or university). Additionally, applicants who have completed their undergraduate or graduate studies in India and are seeking higher education abroad, or those with up to two years of verifiable professional work experience, are also eligible to apply.

Prizes & Rewards: Total prize money of 15 lacs

Last Date to Apply:31-07-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/TOIC1

buddy4study.com

ప్రభుత్వ బ్యాంకుల్లో ఉద్యోగాలు

ఖాళీలు 6128

దేశవ్యాప్తంగా పదకొండు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 6,128 క్లర్క్ ఉద్యోగాల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025-26 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్(సీఆర్‌పీ)-14 నిర్వహించనుంది. ఆంధ్రప్రదేశ్‌లో 105, తెలంగాణలో 104 ఖాళీలున్నాయి. తగిన విద్యార్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

వయసు: 20-28 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక: ప్రిలిమినరీ, మెయిన్స్ రాతపరీక్షల ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మన్ అభ్యర్థులకు రూ.175, ఇతరులకు రూ.850

ఉద్యోగాలు కల్పిస్తున్న బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరాబ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంక్.

దరఖాస్తు స్వీకరణ: జూలై 21 వరకు

ప్రీ-ఎగ్జామ్ ట్రెనింగ్ నిర్వహణ తేదీలు: ఆగస్టు 12 నుంచి 17 వరకు.

ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేదీలు: ఆగస్టు 24, 25, 31

ప్రిలిమినరీ పరీక్ష ఫలితాల విడుదల: సెప్టెంబరులో

మెయిన్ పరీక్ష: అక్టోబరు 13

తెలుగు రాష్ట్రాల పరీక్ష కేంద్రాలు:

తెలంగాణ: హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్.

ఆంధ్రప్రదేశ్: గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం.

వెబ్‌సైట్: https://www.ibps.in/

Institute of Banking Personnel Selection



జాబ్ కార్నర్

ఐడీబీఐలో స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్లు

ఖాళీలు 31

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ)... కింద పేర్కొన్న స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. డిప్యూటీ జనరల్ మేనేజర్ గ్రేడ్-డి: 3
2. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గ్రేడ్-సి: 15
3. మేనేజర్ గ్రేడ్-బి: 13

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

విభాగాలు: ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, ఆడిట్- ఇన్ఫర్మేషన్ సిస్టమ్, డిజిటల్ బ్యాంకింగ్ అండ్ ఎమర్జింగ్ పేమెంట్స్, రిస్క్ మేనేజ్‌మెంట్- ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గ్రూప్, సెక్యూరిటీ, ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ గ్రూప్.

గరిష్ఠ వయోపరిమితి: 2024 జూన్ 1 నాటికి జనరల్ డిప్యూటీ మేనేజర్ పోస్టుకు 45 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, మేనేజర్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: పోస్టును అనుసరించి దరఖాస్తుల ప్రిలిమినరీ స్ర్కీనింగ్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 15

వెబ్‌సైట్: www.idbi bank.in/

IDBI BANK

ఐహెచ్‌ఎంసీఎల్‌లో ఇంజనీర్లు

గుజరాత్ ద్వారకలోని ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్(ఐహెచ్‌ఎంసీఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ఖాళీలు

1. ఇంజనీర్(ఐటీఎస్): 30 పోస్టులు
2. ఆఫీసర్(ఫైనాన్స్): 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, సీఏ, సీఎంఏ ఉత్తీర్ణతతోపాటు 2022, 2023, 2024 గేట్ స్కోరు తప్పనిసరిగా ఉండాలి.

విభాగాలు: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్.

వయసు: ఇంజనీర్ పోస్టుకు 21-30 ఏళ్లు, ఆఫీసర్ పోస్టుకు 30 ఏళ్లు మించకూడదు.

జీతం: నెలకు రూ.40,000 - రూ.1,40,000

ఎంపిక: ఇంజనీర్(ఐటీఎస్) పోస్టుకు గేట్ స్కోరు, ఇంటర్వ్యూ, ఆఫీసర్(ఫైనాన్స్ పోస్టుకు సీఏ మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరితేదీ: జూలై 16

వెబ్‌సైట్: https://ihmcl.co.in/

IHMCL

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌లు

మహారాష్ట్ర, భండారాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ భండారా గ్రాడ్యుయేట్స్/ టెక్నీషియన్స్ అప్రెంటిస్‌షిప్ శిక్షణలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్
2. టెక్నీషియన్ అప్రెంటిస్
3. జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్

మొత్తం ఖాళీలు: 49

విభాగాలు: కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీహెచ్ఎం.

అర్హతలు: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం

స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్/ జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9,000, టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.8,000

వయసు: 14-18 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక: విద్యార్హతలతో సాధించిన మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను చీఫ్ జనరల్ మేనేజర్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ భండారా, భండారా, మహారాష్ట్ర చిరునామాకు పంపాలి.

దరఖాస్తులకు చివరి తేదీ: జూలై 13

వెబ్‌సైట్: munitionsindia.in/

లిటిల్స్


గుర్రం- గాడిద

ఒక ఊరిలో వ్యాపారి దగ్గర ఒక గుర్రం, ఒక గాడిద ఉండేవి. అతను ఒకరోజు అంగడికి వెళ్లి చాలా సరుకులు కొనుగోలు చేసి, ఆ మూటలన్నిటినీ గాడిద మీద వేసి తాను గుర్రం మీద కూర్చుని తిరుగు ప్రయాణం అయ్యాడు. మధ్యలో గుర్రం గాడిదను చూసి ఏమిటో నీ చాకిరీ బతుకు అంటూ హేళనగా నవ్వింది., దానికి గాడిద నామీద ఉన్న బరువులో కొంత నువ్వుతీసుకుని నాకు సాయం చేయవచ్చు కదా అని అడిగింది. గుర్రం మరలా నవ్వి నాది బండ చాకిరీ చేసి, బరువులు మోసే పని కాదు అన్నది. మరి కొంచెం సేపటి తర్వాత గాడిద ఆ బరువులు మోయలేక మొత్తానికే కూలబడిపోయింది, అపుడు వ్యాపారి గాడిద మీది మొత్తం బరువులను గుర్రం మీదికి మార్చి తాను కూడా గుర్రం మీదనే కూర్చున్నాడు. అందుకే ' ఎవరినైనా వారు ఇబ్బంది పడుతూ ఉంటే హేళన చేయకూడదు' అన్నది గాడిద.



దారి కనుక్కోండి





12 తేడాలు గుర్తించండి!



పందులు ఎన్ని?

సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 348

		5					9	
1			7			2		3
	3			2		8		
8					2	9		
		7	5		6	1		
		2	9					4
		3		7			6	
6		1			8			2
	2					3		

సుడోకు - 347 సమాధానం

8	9	5	1	6	4	2	7	3
3	4	2	7	8	9	6	1	5
1	7	6	2	5	3	4	9	8
5	6	3	4	9	7	1	8	2
9	8	4	5	2	1	7	3	6
7	2	1	6	3	8	9	5	4
2	1	8	9	4	5	3	6	7
4	3	7	8	1	6	5	2	9
6	5	9	3	7	2	8	4	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.